# కోనేటిలో పున్నమి వెన్నెల



పి. ఎన్. మూర్తి

# కోనేటిలో పున్నమి వెన్నెల

రచన

## పి. ఎన్. మూర్తి

# కోనేటిలో పున్నమి వెన్నెల

## 1

ప్రశాంతంగా కోనేరు చిక్కగా నవ్వులు చిందుతున్నట్లుంది. దానిలో వెన్నెల వెలుగు, నిండు చంద్రుడు. ఆకాశం కోనేటి పైన, కోనేటి లోపల చంద్రుడు కోనేటి పైన  ఆకాశంలో, నీటిలోని ఆకాశంలో.

ఆ ప్రశాంతమయిన నీటిమీద ఒక రెక్కల పురుగు వాలింది. పిల్ల అలలుగా బయలుదేరిన నీళ్ళు కిలకిల నవ్వినట్లుంది– ఆకాశం ముడతలు పడ్డది–

కుమారి ఆశ్చర్యంగా అన్నది.

'ఆకాశం ముడుచుకుంటోంది బాబూ ! ప్రక్కనే కూర్చుని వున్న రాజారావు అన్నాడు. 'అవును' కాసేపు ఆగు, ఆకాశంలో మళ్ళీ పరుచుకుంటుంది–

'అవును – ఆకాశం తిరిగి పరుచుకుంటున్నది. పరుచుకున్న నీరు పట్టులా వున్నది కదూ!

'మంచి కవిలా మాట్లాడావ్ కుమారీ !

నవ్వింది కుమారి.

'ముడుచుకోటం, పరుచుకోటం – మళ్ళీముడుచుకుంటున్నది'

'మరో పురుగు నానింది కదూ– గుండ్రటి చంద్రుడు కూడ ముడుచుకుంటున్నాడు  చూడు.

రాజారావు యీ మాటలంటూండగా వచ్చాడు విష్ణుమూర్తి –

'ఇందులో ఏది నిజం రాజుగారు !

విష్ణుమూర్తి ప్రశ్నకు రాజారావు వెంటనే జవాబు చెప్పకుండా కొలను

లోని నీళ్ళు, పరుచుకుంటున్న పండు వెన్నెల, కొలనులోని గుండ్రటి చంద్రుడు– వీటిని పరికిస్తున్నాడు.

విష్ణుమూర్తి కుర్చీలాక్కుని కూర్చున్నాడు.

'ఏమో– నిజమేమిటో, వాస్తవమేమిటో తెలిసినవాడు అందరూ దేవుళ్ళే– ముసి ముసిగా నవ్వాడు.

ఉన్నట్లుండి కొలను మాసి మసిబారినట్లు ఆకాశంలో మేఘాలు క్రమ్ముకున్నట్లు కొలను లోపల చంద్రుడు, వెన్నెలా అన్నీ మాయమయినాయి. నల్లటి నీళ్ళు కొలని నిండినట్లున్నది. అదటుగా చినుకులు, నీటిబిందువులు– తరువాత ధారలు– ఆకాశం చిల్లుపడినట్లు, ఎవరో కుండ ఒలక పోస్తున్నట్లు– వర్షం పడడం మొదలుపెట్టింది. రాజారావు, విష్ణుమూర్తి లేచి యింటిలోపలికి వచ్చారు– వీరి వెంటనే కుమారి –

ఇప్పుడేగా అంతా అందం మయమయినట్లు మనచుట్టూ అందంగా వుంది. యింతలో యీ భయంకరమైన నలుపు పులుముకుంది'– విష్ణుమూర్తి ఆశ్చర్యం ప్రకటించాడు.

'వెన్నెల ఏమయింది – చీకట్లో దాక్కుందా–?

'అలాగే వుంది' అంటూ రాగిణి లోపలికి వచ్చింది.

ఆమె నల్లటి జుట్టు పూర్తిగా తెల్లబడింది. అంటే పండిపోయింది.

రాజారావు ఏమీ మాట్లాడకుండా వింటున్నాడు. అతనిలో యీ హటాత్తు పరిణామానికి ఆశ్చర్యం వేసింది. మౌనంగా లోపల వువ్వెత్తుగా లేస్తున్న ప్రశ్నలను దృశ్యంతో పాటు గమనిస్తున్నాడు. ఆశ్చర్యం ! ఎంతలో ఎంత మార్పు–

గబ గబా వర్షాన్ని తప్పించుకుంటూ, నెత్తిన చెంగు కప్పుకుని పావని లోపలికి వచ్చింది–

గేటు నుంచి లోపలికి వచ్చేలోపలే తడిసిపోయాను – కుమారి తువ్వాలు యిస్తే, దానితో తల తుడుచుకుంటున్నది–

'అమ్మా, చీర మార్చుకోండి– అంతా తడిసిపోయింది–' కుమారి మాట

మన్నించి పావని లోపలికి వెళ్ళింది.

ఆమె వెనుకనే ఎవరో ఒకాయన  ప్యాంటూ, షర్టూ, చేతిలో కర్రా - ఇప్పుడే ముసలితనంలోకి అడుగు పెడుతున్నట్లున్నాడు. లోపలికి వస్తూ వరండా చివర నిల్చున్నాడు.

'ఏమిటీ వర్షం - తప్పించుకునే టైమ్ కూడా లేకుండా కుండపోత'- అని సణుగుతూ అన్నాడు.

'ఇలా వచ్చి కూర్చోండి.' అని రాజారావు కుర్చీ చూపించాడు.

అందరి మనసులోనూ ఆ కుండపోత వర్షమే-

వచ్చినాయనా అన్నాడు-

'ఏమిటి అర్ధాంతరపు కుండపోతలు- దీనితో రోడ్లు నిండటం - గుంతలు పడటం, ట్రాఫిక్ జాములూ, అంతా అతలా కుతలం, అస్తవ్యస్తం- ఎవరైనా వింటున్నారా లేదా అన్నది ఆయనకు పట్టినట్లు లేదు.

'కుమారీ, అందరికీ కాస్త టీ యివ్వగలవా' రాజారావు అడిగాడు.

'నీళ్ళు పెట్టానయ్యా - రెండు నిమిషాలు' కుమారి అన్నది -

'కుమారికి అన్నీ తెలుసునల్లే వుంది- ఎవరికి ఏం కావాలో యిట్టే సమకూరుస్తుంది' రాగిణి నవ్వుతూ అంది.

విష్ణుమూర్తి యింకా తేరుకున్నట్లు లేదు. అతడికి యీ ప్రవృత్తి ప్రకోపం అర్థం కాలేదు- 'అందం తనదే - కోపం తనదే - ప్రకోపం తనదే- మరిఆ ప్రకృతి ఎవరిది' అతని మనసులో ప్రశ్నల పరంపర ఆగటం లేదు- అవి అప్పుడప్పుడూ బయటికి వస్తున్నాయి. అందరూ మౌనంగాను, గొణుక్కుంటా వర్షాన్ని గమనిస్తున్నారు-

కుమారి టీ తీసుకువచ్చి అందరికీ ఇస్తున్నది- ఆ పెద్దాయనకు కూడ యిచ్చింది -

'ఎందుకమ్మా - వర్షం నుంచి తప్పించుకోటానికి లోపలికి వచ్చాను- యీ మర్యాద ఎందుకమ్మా' అంటూనే టీ కప్పు అందుకున్నాడు.

టీ త్రాగుతూ పైకి అన్నాడు.

‘పిల్లలు ఎలా వస్తారో – ఫ్లైట్స్ అన్నీ సరిగ్గా నడుస్తున్నాయో లేదో–’

‘మీ పిల్లలు ఎక్కడినుండి వస్తున్నారు’ రాగిణి అడిగింది.

‘అమెరికా నుంచి ఒకరు, ఆస్ట్రేలియా నుండి ఒకరు–ఇంగ్లండు నుంచి ఒకరు–’ ఆయన జవాబిచ్చాడు.

‘మీ వాళ్ళు గ్లోబల్ సిటిజెన్స్’ అని మెల్లగా నవ్వింది రాగిణి–

‘మంచి వాళ్ళమ్మా – అందరూ మా యిద్దర్నీ చూడటానికి వస్తున్నారు’– అన్నాడు. ఇంతలో పావని బయటికి వచ్చింది. వస్తూ’

ఓ మీరా– ఆనందరావుగారు వీరు– ఛీఫ్ యింజనీరుగా రిటైరు అయినారు. ఈ మధ్య మన హాస్పిటల్‌లోనే వీరి భార్యకు కాన్సర్ ట్రీట్‌మెంట్ ఇచ్చాను.’ అన్నది–.

వాన వెలిసింది– ఆనందరావు వెళ్ళిపోయాడు. విష్ణుమూర్తి, పావని – రాజారావు, రాగిణి మిగిలారు–

కొలను తిరిగి తెల్లబడింది. చంద్రుడు కనిపిస్తున్నాడు – ఆకాశం, అందులో చిన్న మబ్బులు మెరుస్తున్నాయి. అన్నీ కొలనులో దాగినట్లున్నాయి.

******

## 2

అందరికీ సందేహాలు వస్తయి, కాని విష్ణుమూర్తికి రాని సందేహం లేదు– అన్నీ సందేహాలే – వానవెలిసిన తరువాత యింటికి వెళదామని లేచాడు– లేస్తూ, నడుస్తూ గొణుక్కుంటున్నాడు.

‘ఇంతకీ యీ కొలను వున్నట్టా, లేనట్టా,వున్నట్టుండిమాయమైపోయింది. మళ్ళీ కంటికి కనిపించింది – ఈ కొలను రాజారాం ఫార్మ్‌హౌస్‌లో వున్నది– అది చెట్లకు నీళ్ళు పోయటానికి వుపయోగిస్తుంది. అందుకోసమే దానిని తయారుచేశారు– అందులో నీళ్ళు చేరినయి. ఆ నీళ్ళు అందుకుని యీ తోటలో చెట్లన్నీ పెరిగి నిసుస్తున్నయి–

ఇదంతా నిజం కదా– ఇంతకీ ఇదంతా చూస్తున్న కన్ను చూస్తున్న చిత్రం– అంటే యింద్రియాలు యీ ప్రపంచాన్ని నిజం చేస్తున్నాయి, మరి నన్నెవరు నిజం చేస్తున్నారు? కన్ను వున్నా లేకపోయినా నేను వున్నాను కదా! నన్ను చూస్తున్నది ఎవరు?

సందేహాలతో తల పగిలిపోతున్నది– సందేహాలు లేకపోతే సుఖం–

ఒకసారి పావని అన్నది –

'అవును విష్ణుమూర్తి గారు – సందేహాలుంటే చాల నష్టం జరుగుతుందని భగవద్గీతలో చెప్పారుగా– 'సంశయాత్మా వినశ్యతి' అని –

అయితే నిజం తెలుసుకోడం ఎలా – తెలిసింది నిజమని ఎలా' అసలు నేనున్నానా లేదా–

ఒకరోజున యిది విన్న నీహార్‌సింగ్ అన్నాడు నవ్వుతూ–

బాబూ యిన్ని సందేహాలయితే ఎలా బ్రతకడం–

మనమున్నాం కదా అందుకే కదా యీ కష్టపడటం బ్రతకటానికి– అందరూ బ్రతకాలి – పనిచేయాలి – తక్కినవన్నీ ఆ దేవుడు చూసుకుంటాడు–

చాల తేలికగా సమస్యను తేల్చేసావ్ సింగ్' పావని అన్నది –

నీహార్‌సింగ్, అతని భార్య అలోజను చూసుకుంటూ ఆ ఫార్మ్‌హౌస్‌లో ఒక గదిలో వుంటారు–

'పుట్టటం – వెళ్ళిపోవటం, బ్రతకటం – అన్నీ జరగాల్సినవేగా – చాలా నిరాసక్తంగా అన్నాడు సింగ్–

పావని అన్నది–

' ఈ ప్రశ్నలన్నిటికీ జవాబు తత్త్వశాస్త్రంలో దొరుకుతాయి. కాని అది చాలినట్లుగా లేదు – ఎవరికి వారు యీ సందేహాలు నివృత్తి చేసుకోవలసిందే–

విష్ణుమూర్తి యింటికి చేరేటప్పటికి బాగా చీకటి పడ్డది. భార్య సత్యవతి ఎదురు చూస్తోంది. యీ ముసలాయన యీ వానలో ఎక్కడ యిరుక్కుపోయాడోనని ఆదుర్దాగా ఎదురుచూస్తోంది– విష్ణుమూర్తి యింటి మిద్దెక్కుతూంటే అన్నది.

'ఎక్కడ ఆగిపోయారు'–

'వాన భళ్ళున కురిసింది – ఆ పావనిగారి ఫార్మ్‌హౌస్ దగ్గర ఆగిపోవలసి వచ్చింది – వాదనలో పడ్డాం –

'రండి తల తుడుచుకోండి – తువాలు యిచ్చింది–

'ఈ బోడి తల మీద యింకా నీళ్ళెక్కడుంటాయి –

వుండండి, వెచ్చగా టీ తీసుకువస్తా –

'అక్కర్లేదు– అక్కడ తాగాను, నా ప్రశ్నల పరంపర అక్కడ కూడా సాగింది–

'ఎక్కడికెళ్ళినా యిదొక్కటి – నిజమేమిటి – అబద్ధమేమిటి – ఎవరికి తెలుస్తయి జవాబులు' ఆమె విసురుగా అన్నది–

'ప్రశ్నలు వేస్తేనే గదా తెలిసేది–

'అలాంటి ప్రశ్నలకు జవాబు చెప్పగలవారెంత మంది వున్నారు? ఏ రామకృష్ణ పరమహంసో, రమణ మహర్షియో తప్ప ఎవరు నిజం తెలియజేయగలరు' –

మరి దీనికి పరిష్కారమెలా?

మహా మహా వాళ్ళకే జన్మలు గడిచినా సత్యం తెలియదు.

మనలాంటి వాళ్ళకు ఒకటే మార్గం – మనకు తెలియని ఒక మహత్తర శక్తి వున్నదని నమ్మి సాగిపోవటమే!

దేవుడున్నాడని నమ్మి నడచుకోవటమే – అప్పుడు జీవితం సవ్యంగా సాగిపోతుంది– సత్యవతి చాల నమ్మకంతో ధీమాతో యీ మాట చెప్పింది–

'అంతే నంటారా'

'చూడండి ఆ నమ్మకంతో నడుచుకోండి – మీకే తెసుస్తుంది – అన్ని సమస్యలకు మనకు సమాధానం తెలుయాలంటే మనం రుషులం కావాలి– ఇప్పటి విధంగా జీవిస్తూ నాకు సత్యం తెలియాలంటే, అదేదో సామాన్య విషయమైనట్లు మీరు మాట్లాడుతున్నారు. అంత తేలిక విషయమయితే అందరూ దేవతలయిపోయి వుండేవాళ్ళం– కాస్త వినయంగా, అణకువతో నడచుకోవాలి–

ఆమె మాటల్లో శ్రద్ధాభక్తులు చాల కనిపించినయి. విష్ణుమూర్తి మౌనంగా వుండిపోయాడు– అతని మనసుకు అనిపిస్తున్నది–

'సత్యం ఎంత నింపాదిగా సంతోషంగా బ్రతకగలుగుతోంది – తీరని సమస్య నాలో మిగిలిపోయి, యిన్నాళ్ళూ తల పగిలిపోతుంది – 35 సంవత్సరాల వుద్యోగం చేసినా నా మనసు వుద్యోగానికే అంకితమయిపోయి సందేహాలు తిరిగి తిరిగి వస్తున్నాయ్యేగాని, కొంచమయినా మనసును వదిలి తనకు స్వేచ్ఛ నివ్వలేదు. రిటైర్ అయిన తర్వాత కూడా యీ సమస్య యిలాగే వుండిపోయింది. సత్యవతి తెలివయింది – ఏ బాధా లేకుండా నా వెనకనే వుండి, నవ్వుతూ సంసారాన్ని నడుపుకు వచ్చింది– ఎన్నో యిబ్బందులొచ్చినయి. పిల్లలూ, వాళ్ళ చదువులూ, పెళ్ళిళ్ళూ, ఖర్చులూ – ఒకటా అన్నీ సమస్యలే! – చాల సంపాదించాను – హోదాలోనే బ్రతికాడు తను. కాని ఏ నాడు సంపూర్ణంగా, తృప్తిగా నవ్వలేదు – సత్యవతి చెప్పింది నా స్థాయి పరిష్కారం – మునులూ, మహర్షులూ, గొప్ప గొప్ప తత్త్వవేత్తలూ జీవితాలు గడిపితే వ్యక్తమయిన సత్యాన్ని తను తనకున్న మిడి మిడి జ్ఞానంతో తెలుసుకోవాలనుకున్నాడు. ఒక్కొక్కసారి సమస్యలతో సతమత మవుతూన్నప్పుడు అనిపించేది – నేను ఎందుకు పుట్టాను – ఎందుకు బ్రతుకుతున్నాను – ఏం జరిగినా, ఎంతటి వాడైనా, రాముడూ, కృష్ణుడూ అయినా మరణించాల్సిందే– ఆ తరువాత ఏమిటి – అంతా కలిపితే పుట్టుకకూ గిట్టటానికి మధ్యవున్న ఆరేడు దశాబ్దాలే –

ఈ కాస్త కోసమా, యింత అవస్థ. పేరు, ప్రతిష్టా, ఆస్తులూ, అంతస్తులూ ఏవీ మిగలవు – పోయేటప్పుడు ఎవరికీ తెలియదు. ఎక్కడికో పోయాం – అంతే !

'రండి – ఉప్మా చేశాను – తినేస్తే యిప్పటికి యిద్దరం బయటపడదాం– ఆ తరువాత ఒళ్ళు వాల్చవచ్చు.' సత్యవతి పిలిచింది.

విష్ణుమూర్తికి ఆ పిలుపు గమనంలో లేదు –

సత్యవతి వచ్చి పక్కన నిల్చుని అన్నది–

'ఏదో పెద్ద ఆలోచనలో పడ్డట్లుంది పెద్దమనిషి' నవ్వింది –

ఆలోచన ఆపి టిఫినుకు రండి. మళ్ళీ రేపు మీ నాన్నగారి ఆబ్ధికం, మరచిపోయారా – బ్రాహ్మడికి చెప్పారా?

'కనువిప్పు కలిగినట్లుందే సత్యం – యింతకాలం నీ లోకజ్ఞానం గుర్తించలేదు. మంచి సలహా యిచ్చావు – పద ఉప్మా తృప్తిగా తిందాం !

'నేనేం చెప్పాను, మీకు కలిగిన కనువిప్పేమిటి'?

దేవుడున్నాడని నమ్మమన్నావు – అది గొప్ప పరిష్కారం

'అంతేకాక మనలాంటి సామాన్యులకి – జ్ఞానానికై చేయవలసిన తపన, తపస్సు చేయటానికి శక్తిలేనివారికి – యిల్లూ, ఒళ్ళూ, చూసుకుంటూ కాలం గడిపేవేళ్ళకి – రాత్రి అయితే యిప్పటికీ, యీ వయస్సులో కూడ ప్రక్కన పడుకొని, వారానికొకసారైనా ఆటాడుకునేవారికి అంత ఎత్తునవున్న ఆ మహా సత్యాన్ని ఎగిరి పట్టుకోగలమా – అందుకే సూక్ష్మంలో మోక్షం అన్నట్లు మహాత్ములు, సాయిబాబా లాంటి అవతార పురుషులూ చెప్పిన, అందించిన, మనకు అందని సత్యాన్ని నమ్మి కాలం గడిపాను – గడపాలి – అలా చేస్తే అప్పటికి, ఎప్పటికీ ఆ నిజం మనకు అవగతమవుతుంది– లేవండి – పోనీ అలానే కూర్చొండి – యిక్కడికే రెండు ప్లేట్ల ఉప్మా తెస్తాను' అని వెళ్తున్న సత్యవతి చేతిని గోముగా స్పృశించి

'సత్యం' – ఆ గొంతులో ఏదో అనూహ్యమైన అభిమానం, కృతజ్ఞత, ఆదరణా వున్నాయి. అతని కళ్ళు చెమర్చినయి. గొప్ప సత్యం ఆవిష్కృతం అయినట్లయింది– ఆమె కూడా అతని భుజం మీద చెయ్యివేసింది.

ఆ రాత్రి ముసలి దంపతులు మురిపెంగా గడిపారు.

మరునాడు సాయంత్రం ఎప్పుడొస్తుందా, అని ఎదురు చూస్తూ ఆరింటికల్లా రాజారావు ఫార్మ్‌హౌస్ చేరుకున్నాడు. రాజారాం మమూలుచోట అరుగు మీద కూర్చొని వున్నాడు.

'ఏమిటి విష్ణుమూర్తి గారు చాల సంతోషంగా వున్నారు'–

'సంతోషమే – ఏదో పెద్ద బరువు తీరినట్లున్నది– నా భార్య నాకు ఆత్మ

బోధ చేసింది – నా సందేహాలన్నిటినీ తన శైలిలో ఛేదించింది–

'అలాగా – ఆశ్చర్యంగా అన్నాడు.

'అవును' దేవుడున్నాడని నమ్మటమే నా లాంటి అల్ప జ్ఞానికి సత్యావిష్కరణ – అందులో చాల కామన్ సెన్స్ వున్నదనిపించింది. నా మనస్సు కూడ అందుకు తయారుగా వున్నట్లు దానిని అంగీకరించింది – మనసు తేలిక పడ్డది.'

'మీ ఆవిడగారు చెప్పింది చాల చాల నిజం, మనలాంటి వారికి అదే పరిష్కారం– అన్నాడు రాజారాం – తరువాత మామూలు సంభాషణ జరిగింది.

******

## 3

మరునాడు విష్ణుమూర్తి తండ్రిగారి ఆబ్దికం –

అంతా అయిపోయిన తరువాత పురోహితుడిని అడిగాడు.

'అయ్యా, యీ పిండప్రదానాలు, తర్పణాలు అన్నీ పితృదేవతలకు అందుతాయా– అసలు వారెక్కడున్నారో తెలియకుండా యివన్నీ చేస్తే ప్రయోజనమేముంది'?

'నిజం చెప్పాలంటే, నాకు తెలియదు. పెద్దలు చెప్పింది కాబట్టి దానిని పారంపర్యంగా చేయటం, దానికి కావలసినవేవో శాస్త్రాలుగ చెప్పినది నమ్మి చేయటం – అన్నాడు పురోహితుడు –అని

'శాస్త్రాలను నమ్మాలి సరే – అలాకాకపోతే మనం బ్రతకలేం – తెలిసింది శూన్యమయినపుడు శాస్త్రాలను నమ్మాలి. అవి పెద్దలు చెప్పిన మాటలు'

ఆ తరువాత పురోహితుడన్నాడు –

'అయ్యా, ఈ పిండాలను తీసుకుని వెళ్ళి గోవుకు పెట్టండి. లేకపోతే ఏ చెరువులోనో కలపండి. ఆ పని మీకు వీలున్నప్పుడు చెయ్యవచ్చు.' అని మరో

ప్రశ్నకు అవకాశం యివ్వకుండా ఆయన వెళ్ళిపోయాడు.

'ఇవన్నీ ప్రతి సంవత్సరం చేస్తున్నదేగా ! ఇంకా అనుమానాలెందుకు. లేవండి భోజనాలు కానిద్దాం' అన్నది సత్యవతి – విష్ణుమూర్తి మారు మాటాడకుండా లేచాడు.

'అంతా విచిత్రం . పూర్తిగా నమ్మకాల మీద నడుస్తున్నది. చెయ్యకపోతే ఏమవుతుందోనన్న భయం' – తనలో అనుకున్నాడు. ఇన్నాళ్ళూ మరో ప్రపంచంలో వున్నట్లనిపించింది. తన వుద్యోగంలోనో, యితరత్రానో వ్యాపకం వుండటంతో మరో విషయం గుర్తుకు రాలేదు. సాంఘికంగా చేయవలసిన పనులను అలవాటుగా చేసుకుపోయాడు. ఇప్పుడన్నీ ప్రశ్నలే–

'పిండాలను ఆవుకు పెట్టడం దేనికో – ఏ జంతువుకైనా ఎందుకు పెట్టకూడదు.'

'ఆవు అన్నిజంతువుల్లోనూ సాధుజంతువు, అది యిచ్చే పాలు, విసర్జించే పేడ, అన్నీ ఔషధంగా వాడతారు. అందుకే అలా చెప్పారేమో'.

'కావచ్చు. అయినా ఇప్పుడెందుకో అన్నిటికి కారణాలు తెలుసుకోవాలనిపిస్తోంది – చివరి రోజులు దగ్గరికి రావడం వల్లనేమో గడుపుతున్న, గడిచిన జీవితానికి అర్థం ఏమిటో తెలుసుకోవాలనిపిస్తున్నది– తెలుసుకుని చేసేదేమిటి అని సర్దుకుంటే పోలా – కాని తలపులు బుర్రను ఆక్రమించుకుని బుర్రలో యుద్ధం జరుగుతున్నది–

సాయంకాలం నేనట్లా గుడికి వెళ్ళొస్తాను. అక్కడ ఉపన్యాసాలు జరుగుతున్నాయట ! సరస్వతి నడుం వాలుస్తూ అన్నది–

'గుడికి వెళ్ళటం దేనికి అని అడగకండి, నేను ఎప్పుడూ గుడికి వెళు తూనే వున్నాను. మీరు మాత్రం టైము లేదని యింట్లో దేవుళ్ళకి నమస్కారాలు పెట్టేస్తున్నారు.'

'అసలీ దేవాలయాలెందుకో – ఈ జనం మూగటం ఏమిటో' –

విష్ణుమూర్తికి జవాబిచ్చింది.

'ఊళ్ళో గుడివుంటే అందరికీ అందుబాటులో వుంటుంది. వెళ్ళి దేవుడికి

నమస్కారం చేసుకోవచ్చు. నిత్యం పూజలు జరుగుతూ వుంటయి. అది అందరికీ అందుబాటులో వున్న పూజామందిరం.'

బాగా వుంది నీ వివరణ, బహుశా అందుకే దేవాలయం కట్టేది–

ఇక విష్ణుమూర్తి మౌనం లోకి జారిపోయాడు.

ఏమిటి ఈ రోజు సంశయాలు తీరిపోతున్నట్లున్నాయి.

******

## 4

కుండపోత వర్షం వచ్చిన రోజున ఒక ఆసక్తికరమైన సంఘటన జరిగింది. దానిని ఎవ్వరూ గమనించలేదు. ఒక్క కుమారి మాత్రం గమనించింది. రాగిణి దృశ్యం చూస్తూ తన లోకి వెళ్ళిపోయింది. ఒక్కసారిగా బయట తన చుట్టూ జరుగుతున్న విశాల ప్రకృతిలో మమేకమయింది.

ఆ దృశ్యమంతా ఉరికి వచ్చి రాగిణిలో ఒదిగిపోయినట్లయింది. అంతా నిశ్శబ్దంగా ఆమెలో దూరింది. ఒక చిత్సముద్రం రంగులు మారుస్తూ తనలో నిశ్శబ్దంగా, నీరవంగా, విస్ఫోటనంలా వివిధంగా ధారలా వచ్చి దాగిపోతున్నది.

మహా విస్ఫోటనం
చైతన్యం చిందులేసి బిందువులూ
విస్తృతంలో, బ్రహ్మాండంలో
అణువుల్లా పరమాణువుల్లా
ఎగిసి ఎగిరి చెదిరి
విస్తృతంగా చెదురుగా ఒదిగినయి.

మనస్సు స్తంభించినట్లయింది. ఒక్క క్షణంలో శూన్యం, నల్లటి వెన్నెలలా వుంది– ఒకసారి వెన్నెల నలుపంతా చీల్చుకుని వెలుగుచిందిస్తున్నట్లుంది.ఏది నిశ్చయంగా లేని స్థితి–

మనసు బరువెక్కిందోన్నట్లు కుర్చీలోనే ఒరిగిపోయింది. యిదంతా కుమారి గమనిస్తున్నది. వెంటనే వచ్చి ఆమెను పట్టుకున్నది. తక్కిన వాళ్ళు వాళ్ళ వాళ్ళ మనసులో మునిగిపోయి ఏదో ధ్యానముద్రలో వున్నట్లు, ఆ

దృశ్యం తమ దృష్టి ఏకమైనట్లు ఆ వాతావరణం మీద గీసిన చిత్రాల్లా వున్నారు.

ఎలా వచ్చిందో అలాగే వర్షం నిలిచిపోయింది. మేఘాలు విచ్చుకున్నాయి. ఆకాశం మళ్ళీ వెన్నెల వశమయింది. కుమారి మెల్లగా రాగిణిని లేపి రంగమంటపం వైపు నడిపించి మంటపంలోకి తీసుకెళ్ళి నటరాజ విగ్రహం ముందున్న పరుపు మీద పడుకోబెట్టింది. రాగిణి కళ్ళు అలానే మూతపడి వున్నాయి. కుమారి ప్రక్కన కూర్చున్నది. ఇలా రెండు మూడు గంటలున్న తరువాత రాగిణికి మెలకువ వచ్చినట్లయింది. లేచి కూర్చున్నది. ఆమెకు తన స్థితి ఏమిటో తెలియటం లేదు. జరిగిందేమీ గుర్తుకు రావటంలేదు. సమాధి స్థితినుండి మేలుకున్నట్లు విరుసుకున్న నేత్రాలతో నటరాజ విగ్రహాన్ని చూస్తూ కూర్చున్నది. ఇలా వుండగా కుమారి వెచ్చటి టీ తీసుకువచ్చి యిచ్చింది. దానినందుకుంటూ 'నా కేమయింది' కుమారీ అని అడిగింది.

'ఏమో గాని మీరు మాత్రం యీ ప్రపంచంలో లేనట్లు కుర్చీలో వాలిపోయారు. అన్నది.

రాగిణి దానికి జవాబివ్వలేదు.

నీవు వెళ్ళు కుమారీ, నీ పని చూసుకో' అని అక్కడి నుండి లేచి తన గది లోకి వెళ్ళి సోఫాలో వాలిపోయింది. కిటికీ గుండా ఆకాశం కనిపిస్తోంది. ఒక కవి యిటువంటి స్థితిని వర్ణిస్తూ వ్రాసినది ఆమెకు గుర్తు వచ్చింది. అతడామె ప్రస్తుత పరిస్థితిని వర్ణించినట్లున్నది.

నా గుండెలో రవం
శాంతి రసం సన్నని మృదుల రవమై
అఇతటా, నాలో అంతటా విస్తరిస్తోంది
శరీరాన్ని దాటి విస్తరిస్తోంది
పరుచుకుంటోంది
ఆకాశం వంగి గుండెను తాకి
తన వెంట తనలోకి నడిపిస్తోంది
ఆకాశం అంచులు దాటిన హృదయరవం

తారలనల్లుకుంటోంది
ఆకాశం అంచును తాకిన గుండె పిడికిడై
తిరిగి నాలో ప్రవేశించింది
తారలు నిండిన గుండె
మినుకు మినుకు మంటూ
సన్న చిన్న మెరుపులు
వెదజల్లుతోంది
ఆకాశం తిరిగి తన చోటికి వెళ్ళిపోయింది
సన్నని రవం, మృదుల శాంతిరవం
నా కన్నుల్లో కాంతిలా మారింది
ఆకాశం, అంతర్యం తారాపథమైంది
గుండె గుబులు తీరి
చల్లగా,మెల్లగా, తీరుగా, తీపిగా
శరీరాన్ని కమ్మేసింది
తారలు తరళంగా
నా కన్నుల్లో మెరుస్తున్నాయి
నా చూపుల్లో సంగీతంగా
సన్నగా అంతటినీ ఆవరిస్తోంది
ఈ దృశ్యం దేనికో స్మృతిలా వుంది

ఒక్కసారి తన జీవితచిత్రం తన ముందుకు వచ్చినట్లయింది. సన్నని నవ్వు ఆమె పెదవుల్ని దాటింది.

తన జీవితం ! నవ్వు పెదవుల్ని విప్పింది. చక్కని దంతాలు వెన్నెల్లో వెలుగు చిమ్మినయి.

నా జీవితం – పుట్టినరోజు, చిన్నతనం. నాట్యం, రంగస్థలం, రంగమంటపం, తన వాళ్ళు అంతా గిర్రున ముదుకు వస్తున్నది.

అంతా – జీవితమంతా ఒక అనుభూతిలా తోచింది. కవి చెప్పిన కవిత

గుర్తుకు వచ్చింది.

తర్కానికి అందని
మాటలకి లొంగని
అనుభూతి అక్షరాల్లోకి దించటమెలా
బహుశా
అది నా నాట్య జీవితంలో
ఒక నర్తనశాలగా మారిందనుకుంటా
మాటకు జోడించాలి అభినయం
మాయావి అక్షరాలకు రంగులు
భంగిమల్లో పొదగాలి భావం
ఆలాపించాలి అనుభూతిని
రాగంగా
అన్నీ కలిస్తేనే అనుభూతి
అక్షరాల్లోకి దించి కుదిస్తే గీతం
ఆ గీతాన్ని ఆలపిస్తే భావం
ఆ భావాన్ని అనుభవిస్తే అనుభూతి
అనుభూతి కావాలి యిలా
అప్పుడే అవుతుంది అనుభూతి
అనుభవం నిజం.
చిన్నతనం గుర్తుకొచ్చింది
చిన్నతనపు చిత్రం చిగురుటాకులా
చెదిరి ఎగిరి పోయింది
పెద్దతనం పేదవాడి ఆశలా పరుగెత్తుకుంటూ
వచ్చి శరీరం మీద వాలిపోయింది
మరణం జఠరాగ్ని లేచి
ఎప్పుడు చల్లారుతుందో

ఎప్పుడు కుంపటి రేపుతుందో
ఈ తెలియని స్థితి
రణంలా, వ్రణంలా తెలియకుండా
వెంటాడుతూ వెంటవుంటుంది
అలానే జీవితమనే కాలంలో
గంతులేస్తూ నడుస్తూనే వున్నా
ఏది నిజమో, కాదో, ఏదివుందో, లేదో
యిదమిత్థంగా తెలియడం లేదు
అంతటినీ చూస్తూ
పక్కవాడి మీద చేతులేస్తూ
బరువంతా వారి మీద పెట్టి
తేలికగా'జీవితం' గేమ్‌ని వీక్షించాలి'

మరునాడు ఉదయం నిద్రలేచేసరికి ఆలస్యమయింది. అప్పటికే సూర్యుడి లేత కిరణాలు నటరాజ విగ్రహం మీద పడుతూ విగ్రహాన్ని రాగరంజితం చేస్తున్నాయి. ఏదో తప్పు చేసినట్లనిపించింది. అప్పటికే కుమారి అలవాటు ప్రకారం పూలు తెచ్చి చక్కగా పూలగిన్నెల్లో అమర్చింది. విగ్రహాన్ని, విగ్రహపీఠాన్ని చక్కగా శుభ్రం చేసింది– ఇంతలో ఉడిపి పురుషోత్తమరావు వచ్చి నటరాజుకి నమస్కారం చేస్తున్నాడు. తరువాత రాగిణిని చూసి–

ఏమిటమ్మా కులాసాగా వున్నారా? ఈ రోజు ఉప్మా బాగా వచ్చింది. అందుకని మీ కోసం కొంచం పట్టుకొచ్చాను. రాజారాం గారికి, పావనికి యిచ్చి వచ్చాను. అన్నాడు.

'ఆలస్యం అయింది పురుషోత్తం గారూ – అంటే నేను బాగానే వున్నాను. రాత్రి కుండపోతకి కొంచం సుస్తీ చేసినట్లయింది. అంతే– ఇప్పుడే వెళ్ళి స్నానం చేసి వస్తాను.' అని లోపలికి వెళ్ళిపోయింది.

పురుషోత్తమరావు ఫార్మ్‌హౌస్‌కి ఎదురుగా రోడ్డుకి అవతల ఒక 'ఉడిపి టిఫిన్ రూమ్' అని ఒక ఫాస్ట్ పుడ్ రెస్టారెంట్ నడుపుతాడు. ఆ చుట్టు

పక్కల అది చాల ప్రఖ్యాతిగాంచింది. అక్కడి టిఫిన్లు బాగుంటాయని వూళ్ళో జనం కార్లలో కూడ వస్తూవుంటారు. పురుషోత్తమరావు ఆ హొటల్ వెనుకనే వుంటాడు. రాజారావు, పావని, వీళ్ళంటే అతడికి ఎనలేని అభిమానం. 'రోజూ యిది బాగా వచ్చింది, అది బాగా వచ్చింది' అని చెప్పి టిఫిన్లు తెచ్చియిస్తూ వుంటాడు. వాళ్ళకు భోజనానికి యిబ్బంది రానివ్వడు. రాజారాం కూడా అతని దగ్గర వూరికే తీసుకోకుండా ఎప్పటికప్పుడు కాకపోయినా, యిచ్చిన దానికి ఖరీదు యిచ్చేస్తూవుంటాడు. అలా పురుషోత్తమరావు ఆ ఫార్మ్‌హౌస్ (వ్యవసాయ క్షేత్రం) కుటుంబంలో భాగమయ్యాడు. తమాషా ఏమిటంటే ఎప్పుడూ అతడి కుటుంబాన్ని గురించి మాట్లాడడు.

రాగిణి స్నానం చేసి వచ్చి తన నిత్య కార్యక్రమానికి వుపక్రమించింది– నటరాజపూజ ఆమె నిత్య కార్యక్రమం. ఆ రోజు చాల నీరసమనిపించింది. అనుకున్నదంతా దీక్షలో నిర్వహించలేకపోయింది– మరో గంటలో శిష్యురాళ్ళ నృత్య అభ్యాసం కోసం వస్తారు. మనసులో ఏదో కదుల్తోంది. కాలంలో తను కలిసి పోయినట్లనిపిస్తోంది –

మనసెందుకో మెలి తిరుగుతోంది
ఊహలు ఎటకోపోయి దాగినట్లుంది
నాలో అవి నలిగిపోయాయి కాబోలు
మౌనాన్ని పరిసరాలు సహించవు
మౌనాన్ని మ్రింగి స్వరం నొక్కుకుపోయింది
శరీరం సలసలమని సన్నగా నొక్కుతోంది
తలలో ఏదీ నిలవటం లేదు
కన్నుల్లో ఏదీ నిలిచి ఆనటం లేదు
ఏమిటీ స్థితి – పరిస్థితి !
ఇది పరిమళమా, మనసు పట్టే పంతమా
తెలియడం లేదు –
నటరాజ పూజ ముగించి లేచింది

విద్యార్థినులు వస్తున్నారు. అందులో సీనియర్‌ని 'ఈనాడు తరగతిని నీవు నిర్వహించు' అని తన గదిలోకి వెళ్ళిపోయింది.

వకుళతో మాట్లాడాలనిపించింది – అదీ స్పష్టంగా లేదు. అయినా 'కాల్' చేసింది. వకుళ ఎంతో సంతోషంగా ఆ కాల్ అందుకుంది.

'అమ్మా, ఎన్నాళ్ళకి నేను గుర్తుకు వచ్చాను'

'అదేం లేదమ్మా – ఇవాళ నీతో మాట్లాడాలనిపించింది. అందుకోసం కాల్ చేశాను. కాలం కదిలిపోతోంది కదా వకుళా, నేను గృహ ముఖద్వారానికి దగ్గరగా వస్తున్నాను కదా–

కాలం !

కాలం కదుల్తూ

కొలిమిలా కాల్చేస్తుంది

వనంలో దారిలో

పూలు పరిచి నడిపిస్తుందో

కాగడాలు వెలిగించి

వెసులుగా దారిని వెలువరిస్తుందో

ఏదయినా, ఏదారయినా

కాలంతో చేయికలిపి నడవాల్సిందే –

నిన్నరాత్రి ఒక విచిత్రం జరిగింది

ఉన్నట్లుండి మనక్షేత్రం మీది ఆకాశం వెన్నెలను కమ్మేస్తూ కాలమేఘం ఆవరించింది. మేమంతా చూస్తూ వున్నాం. కొలనులో చంద్రుడు, ఆకాశంలో చీకటి చాటున మరుగైపోయాడు. నేనూ చూస్తున్నాను. నా కళ్ళలోకి ఒక కిరణం కాల మేఘాన్ని దూసుకు వచ్చి వెలుగు బిందువుగా వెన్నెల నిండింది. నా మనస్సు మూసుకుపోయినట్లయింది. గుండెపై వురుములకు స్పందించింది. అంతా నిశ్శబ్దం

ఏ పరమ నిశ్శబ్దంలో ఓంకారం లేచి కాహళ, భేహళ ధ్వనిగా వినిపిస్తున్నదో, ఏ మహా గంధర్వ గళం విడిచిన స్వరం గర్జనగా దీనుల్లో

వినిపిస్తున్నదో ఏ సప్తస్వరాలు ఆకాశంలో తేలి ఉఋములుగా భూమిని బ్రద్ధలు చేస్తున్నాయో, ఏ మంత్రపుష్పాల పరమళం నాసికల్లో దూరి నసాళాన్ని కాల్చేస్తుందో, ఏ ఆనంద నటన భంగిమ మనిషి రెక్కలు విరిచేస్తోందో అలా స్తంభించిపోయాను. ఎరిగి మెలకువ వచ్చేసరికి నా మంచం మీద నేను పక్కన కుమారి కూర్చొని నిద్రపోతోంది.

ఇంతకాలం నేననుకున్నాను
శాంతి నా సొగసు
ప్రేమ నా అభినయం, నా భంగిమ
ధర్మం నా హక్కు
సత్యం నా చరిత్ర
అహింస నా ఆహార్యం
నియది నా నట్టువాంగం, నాట్యం

అంతా ఆ చైతన్యం చెక్కిన శిల్పాన్ని నేను అని అనుకున్నాను. కాని నా మనసు తడబడుతున్నది. అస్థిమితంగా వూగిసలాడుతున్నది.

కూర్చుంటే కళ్ళు మూతలు పడుతున్నయి
తెరిస్తే కనిపించేదానిమీద
మనసు పొర్లుతున్నది
అంటకుండా పొర్లుతున్నది
ఆగకుండా తిరిగి నా కళ్ళలోకి వచ్చి
రెప్పలను మూసేస్తోంది
వినపడుతున్నదేదీ
వినపడుతున్నట్లు లేదు
వీనులు విన్న దానిని ఒల్లటం లేదు
పాపం ! ధ్వని పరుగెత్తి
వెనుదిరుగుతోంది
చెవుల గొప్పల్లో దాక్కుంటున్నదేమో

కడుపు కాల్తున్నట్లుంది

కాని కాదంటోంది ఆహారాన్ని

ఆహరించుకుపోతోంది

ఆహారం నోట్లోకి వెళ్ళకుండానే

విచిత్రం ! మరి ఏమిటిది

ఏమిటీ స్థితి

స్థిమితం లేని స్థితి ఎలావున్నా

అస్థిమితం చేయటం లేదు నన్ను

విచిత్రం–

చాల సేపు మాట్లాడాను కదూ వకుళా?

భయపడకు – బాగానే వున్నాను, నాస్థితిని నీవు అర్థం చేసుకోగలవని అంతా వెళ్ళగక్కాను. తేరుకుంటాను.

మళ్ళీ కాలానికి ఆహారమవుతాను. ముంచుకొచ్చే ముదిమిని ఆనందంగా ఆహ్వానిస్తాను. ఎప్పుడయినా వీలుచూసుకుని ఇండియా కి రా!

నీ పాప, భర్త అందరూ కులాసాయే కదా–

నాట్య కేంద్రం ఎలావుంది – పెట్టేస్తున్నాను– అని నవ్వింది.

ఇదంతా విన్న వకుళ కన్నీటి పర్యంతమయింది – రాగిణీదేవి– ఎందరికో తన నాట్యంతో ఆనందాన్నిచ్చిన రాగిణీ దేవి ఒక్కసారిగా బేలగా మారిందేమిటి – ఆమెను చూడాలి–

ఫోన్ పెట్టేసి లేచింది –

ఇదంతా వింటున్న వకుళకేదో తెలియని భయం వేసింది. 'ఏమయింది తన అమ్మలాంటి నాట్యగురువుకు' మనసు స్తంభించింది. ఆమెను ఆలింగనం చేసుకుంటున్నట్లు అమెరికా నుండి ఆమె చేతులు చాచినట్లనిపించింది.

******

## 5

విష్ణుమూర్తి తనలో తను మాట్లాడుకుంటూ యింటిని చేరాడు. ఫార్మ్‌హౌస్‌లో బయలుదేరినప్పుడు ఆగిన వర్షం మళ్ళీ రాలేదు. కొంచెం తుంపరలు పడ్డాయి. అయినా అతడు ఇంటికి చేరేటప్పటికి తల, ఒళ్ళు బట్టలు తడిసిపోయాయి. అతడి కోసం ఎదురు చూస్తున్న భార్య సుమతి ఎదురువస్తూ,

'ఏమిటిలా తడిసి ముద్దయిపోయారు? ఉండండి, ఈ కొంగుతో తల తుడుచుకోండి, తరువాత బట్టలు మార్చుకోవచ్చు' అని తన చీరెకొంగు అందించింది. విష్ణుమూర్తి తల తుడుచుకుని, లోపలికి వెళ్ళాడు. తను బట్టలు మార్చుకుని మళ్ళీ హాలులోకి వచ్చేలోగా సుమతి మంచి వేడి 'టీ' కాచి తెచ్చింది.

'పెద్దవాన కురిసింది. కాని ముంచుకొచ్చినట్లు వచ్చి, యిట్టే ఆగిపోయింది. ఆకాశమంతా ఒక్కసారి వూడిపడ్డట్లనిపించింది' ఆమెకు. ఆమె అమ్మగారి కవిత్వ వాసన కొంచెం అంటుకుంది. అందుకే కొన్ని గీతాలు కూడా వ్రాసింది. కాని వాటిని ప్రచురించలేదు. కొందరికి తమ భావ వ్యక్తీకరణతో తృప్తి కలుగుతుంది. వారి జీవితం దాని వల్ల ప్రభావితం కాదు. ఆమె అన్నది.

'నేను ఒకసారి ఎప్పుడో వ్రాసి వినిపించినట్లు,
అగస్త్యుడిలా ఆకాశం
సముద్రాన్ని ఆపోశనపట్టి
అవని మీదికి పూసినట్లుంది
వరదలే వరదలు
పల్లెలు, పొలాలు, ప్రజలూ, పంటలూ
పట్టణాలూ, పర్వతాలూ
అన్నిటినీ తనలో దాచుకుంటూ
ప్రవహించేస్తోంది నీకు
కవిభాషలో
'పరవళ్ళు తొక్కుతోంది'
వయ్యారంగా, వ్యవధి లేకుండా

ముందుకు సాగుతూ
భీభత్సాన్ని వెనక వదిలేస్తోంది
ఆకాశానికి నీళ్ళని మోసిన అగ్ని
అవనీ తలాన్ని మండించి
ఆర్తితో వదిలేస్తే
ఆ నీటిని అబగా పీల్చి
తన కడుపులోకి తోస్తోంది పుడమి తల్లి
అవని ఆర్తిని తీర్చాలన్న వరుణుడి కరుణ
అవనీవాసుల కష్టాలను లెక్కచేయక
ఈనాటి భీభత్సం మరునాటి వుత్పన్నమవుతోంది
ధరణి కడుపున నిలిచిన నీళ్ళను
తవ్వుకుని బతకవచ్చు
ఏమిటి యీ విచిత్రం
ప్రకృతి చూపే యీ పెడసరమేమిటో
జీవితాన్నిచెదరగొట్టె
జనులను బెదరగొట్టె
వారికి సంపద పంచడమేమిటో
వున్నప్పుడు వూడ్చుకుతినే
ప్రజలకు ప్రకృతి చెప్పే పాఠాలేమో యివి?
పండగ బహుమతులివ్వడం తప్ప
వేరే రూటు లేదేమో ఆమెకు
ప్రజలీ రూటును గ్రహించి
బాగు పడగలరా? పడుతున్నారా?
మతి తప్పి కాళ్ళు కాలుతుంటే
విలవిలలాడుతూ, గిలగిలమంటూ
దాని రాక ఎన్‌రోల్ అనుకుంటూ

పిశాచాల్లా తలలూగిస్తూ
రేగిన శిరోజాల బుట్టను
అందంగా వుందనుకొని
అదే ఆహార్యం అనుకుని మెలిగే
తన పిల్లలనెలా యీతరంగా
ప్రకృతి మందలిస్తుంది
అంతా స్తబ్దుగా వున్న
కదలని, మెదలని కల్లోలం కలవరం !

ఈ కవిత సుమతికి గుర్తు వచ్చింది. మనసులో మెదిలింది. ఆమె పైకి దానిని అనకుండా

"ఇదిగో యీ మాత్ర కూడా వేసుకోండి. జలుబు చేస్తే మీకు అది వదలదు" అని మాత్ర ఇచ్చింది. విష్ణుమూర్తి, సుమతివైపు అనునంగా చూశాడు. ఇలాంటి వర్షం మీద నీవేదో కవిత రాసినట్లున్నావ్' అన్నాడు.

'గుర్తుకొచ్చిందా –మీకు కవిత్వం మీద అభిమానం పుట్టుకొస్తున్నట్లుంది' అని నవ్వింది.

'నీతో కాపురం, స్నేహం ఎప్పుడో ఒకప్పుడు ప్రభావితం చేయదా– నాక్కూడా కొంచెం కొంచెం కవిత్వం వస్తున్నట్లున్నది – అవును నాకిప్పుడు సందేహాలూ, సంశయాలు ఎక్కువయినాయి. మన జీవితాలు నిజంగా మనవనీ– మన బ్రతుకులు మనం బ్రతికినవనా – అనుమానం వస్తోంది' అన్నాడు కొంచెం సీరియస్‌గా.

ఏమో అంత దూరం నేను వెళ్ళలేదు. నాకా ప్రశ్న ఎప్పుడూ కలగలేదు– ఎంతసేపటికి దైనందిన కార్యక్రమమే–

'ఏమో, రిటైరు అయిన తరువాత నాకే అనుమానం వస్తోంది –కొంచం కొంచం కవిత్వం కూడ వస్తోంది.' అని

'సుమతీ –యిన్నాళ్ళూ లేని సంశయాలు, సందేహాలు భయాలు కలుగుతున్నాయి. ఇంత కాలం నేనేమో నా ఉద్యోగవిధులేమో– వాటిలో

మునిగిపోయి, జీవితమంతా అదేననుకుని గడిపేసాను. నీవు ఇల్లూ, పిల్లలూ, సంసారం– అంత భారం నీమీద వేసుకుని గడిపేశావా – ఇప్పుడు రిటైర్ అయిన తర్వాత మన పెళ్ళి మొదటి రోజుల్లా యిద్దరం మిగిలాం. తిండికీ, ఉండటానికీ ఏ యిబ్బందీ లేదు. అబ్బాయి అమెరికాలో సెటిల్ అయినాడు. అమ్మాయి ఢిల్లీలో సంసారంలో మునిగి బ్రతుకుతోంది.

కాని ఒకటే డిఫరెన్స్ – కాలం చాలా గడిచిపోయింది. జీవితపు చివరి రోజులు దగ్గరికి వస్తున్నాయి. కాలంలో కదిలి పోతున్నాం

కాలం కదుల్తూ
కొలిమిలా కాల్చేస్తుందా
లేక
వనంలో దారిలో
పూలు పరిచి నడిపిస్తోందా –
అర్థం కావటం లేదు. అసలీ జీవితానికి అర్థమున్నదా?

సుమతి పక్కున నవ్వింది –

'ఇప్పుడు మథన మొదలయిందా? ఇంతకాలం లేనిది, యిప్పుడెందుకు వచ్చింది'–

'ఈ మధ్య ఒక ప్రముఖ నటుడు తన స్థితిని గురించి చెపుతూ, అప్పుడప్పుడూ నాకనిపిస్తుంది– నేను ఎవరిని – నా జీవితానికి అర్థం ఏమిటి' అన్నాడు. నాకూ అదే పదే పదే మనసులో తిరుగుతోంది, నీ కలా అనిపించడం లేదా?

'ఏమి నేను మామూలు మనిషిని. నాకిలాంటి ప్రశ్నలు రావడం లేదు. సంతోషంగా బ్రతికేయడం అలవాటు చేసుకున్నాను. మనకందని జవాబులూ, సంశయాల మధ్య బ్రతకటం చాల కష్టం– ఎక్కడో చదివా – కొంచం గుర్తుంది. కవి అంటాడు.

'బతికేస్తా ధీరుడిలా
కల్పనలూ కోరికలూ

నా అస్త్రాలు,దస్త్రాలాగ

వేదనలే నా కవచం

కల్పనలే నాకభయం

నా ముళ్ళూ, నా గమనం

సహజం – ఎందుకు పరితాపం’

ఈ పద్ధతి సరి అయినదో కాదో నాకు తెలియదు. నవ్వుతూ బతకడానికి, సహజంగా బ్రతకటానికి సహాయం చేసింది. ఎప్పుడో ఒకసారి మీరు నాతో అన్నారు.‘ఎప్పుడూ నవ్వుతూ వుంటావు – ఎలా సాధించగలిగావు’ అంటే నేను చెప్పాను.

నా నవ్వు ఒక పువ్వు

ఆ పువ్వుకు గుచ్చుకుంటున్నాయి ముళ్ళు

నువ్వు నీళ్ళుగా మారి

కళ్ళు నిండి పోతున్నాయి

నీళ్ళు జారి చెక్కిళ్ళు

ముతకబారి పోతున్నాయి

ముసలితనం ముందుకొచ్చింది

మనిషి కుదింపు చేస్తున్నది

నిద్ర వచ్చి రెప్పలు కాలిపోతున్నాయి

ఎప్పుడు అవి తెరుచుకుంటాయి.

ఆ భావనే మీతో నా జీవితం గడప నిచ్చింది. అంతా ఆ భగవంతుడి రచన అని నా నమ్మకం. మీకు ఆ నమ్మకం లేక యిప్పుడిలా సందేహాలు వస్తున్నాయి. ఒక రకంగా ముసలితనంలో కవిగా మారిపోతున్నారు. భయమో, సంశయమో మిమ్మల్ని కదిలిస్తున్నాయి. దాని నుంచి బయటపడితే గాని ‘బ్రతకలేం’ అని పదండి’ డిన్నర్ చేద్దాం. మీ కిష్టమని మంచి మినపరొట్టె చేసాను’ అని తేలికగా నవ్వుతూ లేచింది. ఆమె చెవులకున్న రవ్వల దిద్దులు తళుక్కున మెరిసినయి.

'అదృష్టవంతురాలు' అనుకున్నాడు విష్ణుమూర్తి. వెళుతున్న ఆమె వైపు చూస్తూవుండి పోయాడు.

6

మరునాడు నిద్రలేచేసరికి తలంతా భారంగా వుండి, ఒళ్ళంతా బిగిసినట్లనిపించింది. జ్వరం వచ్చినట్లుంది. సుమతిని పిలిచాడు.

'సుమతీ, చూడు ఒళ్ళు వెచ్చగా వున్నట్లుంది. చలి చలిగా కూడా వున్నది. ముక్కు బిగిసింది.'

సుమతి వచ్చి చూచింది.ఒళ్ళు వెచ్చగా వుంది. 'నిన్నటి వర్షంలో తడవటం వల్ల కొంచం జలుబు చేసినట్లుంది. లేచి ముఖం కడుక్కోండి. వేడి కాఫీ తెస్తాను – కోల్డరిన్ వేసుకుంటే అంతా చక్కబడుతుంది.

లేచి ముఖం కడుక్కొని, సుమతి తెచ్చిన వేడి కాఫీ త్రాగుతూ

'జలుబేనంటావా' అన్నాడు సందేహంగా

సుమతి పక్కున నవ్వింది.

'ఏమిటి అంత భయపడి పోతున్నారు'–

" ఏమో, వృద్ధాప్యం. శరీరానికివ్యాధిని తట్టుకునే శక్తి తగ్గుతంది–'

మీకు భయం ఎక్కువయింది. ఎప్పుడూ లేని భయం యీ వయస్సులో మిమ్మల్ని పట్టుకున్నట్లుంది. అవసరమయితే డాక్టర్ని కలిస్తేసరి!"

అతడు భయపడ్డట్లే సాయంత్రానికి

జ్వరం ఎక్కువయింది– సుమతి తన చిన్నకొడుకు భాస్కర్‌ని పిలిచింది. భాస్కర్ వారి చిన్న కొడుకు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ లో సర్వీస్ చేస్తున్నాడు. ఉద్యోగం చేయడం కంటే, యిలా సర్వీసు చేయడం అతడికి బాగా నచ్చింది. విష్ణుమూర్తి, సుమతి మొదట్లో అతడు ఎంచుకున్న మార్గానికి ఖంగు తిన్నా,అతడి నిర్ణయం మార్చుకోడని తెలిసినతరువాత వాడిష్టం వచ్చినట్లు చేయనీ, వాడి జీవితం వాడిది. మంచి చెడ్డలు వాడికి తెలీదా – యింత చదువుకున్నాడు. అయినా తను మంచి మార్గాన్నే ఎంచుకున్నాడు. గొప్ప గురువు అధ్వర్యంలో ప్రజలకు సేవ చేస్తున్నాడు.' అని సరిపెట్టుకున్నారు.

భాస్కర్ మరో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సేవకుడితో కలిసి విడిగా ఒక గదిలో ఉంటారు. అమ్మ పిలవగానే వచ్చాడు. ఆ రాత్రి నాన్నదగ్గరే పడుకున్నాడు

'భాస్కర్, ఈ జ్వరం తగ్గుతుందంటావా'?

భాస్కర్ కూడా సుమతి లాగే నవ్వాడు.

'ఏంటి నాన్నా, కాస్త జ్వరానికి యింత భయపడుతున్నావ్–

భాస్కర్‌కి ఆశ్చర్యమేసింది. 40 సంవత్సరాల గవర్నమెంట్ సర్వీసు చేసి, మంచి పొజిషన్‌లో మంచి పేరు తెచ్చుకుని రిటైరయిన నాన్నగారు, ఎన్నడూ దేనికీ భయపడనట్లు కనిపించిన నాన్నగారు ఎందుకిలా భయపడుతున్నారు? భయం బహుశా మానవనైజమేమో! ఇప్పుడాయన్ని ఒకరకమయిన ఒంటరితనం ఆక్రమించుకున్నట్లువుంది– తన స్నేహితుడి తండ్రి తల్లి యిలాగే భయం చూపిస్తూ వుంటారట. బహుశా ఒంటరితనం మరణాన్ని గుర్తు చేస్తుందని గురువుగారెక్కడో చెప్పినట్లు గుర్తు. ఉద్యోగం పూర్తికాగానే అసలు జీవితమయిపోయినట్లనిపిస్తుందేమో–

ఆ మరునాడు కూడా జ్వరం తగ్గకపోయేసరికి విష్ణుమూర్తిని పావని హాస్పిటల్ తీసుకువెళ్ళాడు భాస్కర్. డాక్టరు పరీక్షించి "లంగ్స్ ఇన్‌ఫెక్షన్ అయినట్లు ఇన్‌పేషెంట్‌గా చేర్పించండి" అన్నాడు. విష్ణుమూర్తి కాదన్నా, భాస్కర్ తండ్రిని ఇన్‌పేషెంట్‌గా చేర్పించి అమ్మ సుమతికి టెలిఫోన్ చేశాడు. వెంటనే సుమతి బయలుదేరి వచ్చింది. విష్ణుమూర్తి బాల్య స్నేహితుడు, సహోద్యోగి అయిన మధుమూర్తికి కబురు పంపింది. మధుమూర్తి కూడా వచ్చాడు. కావలసిన వారంతా దగ్గరవుంటే విష్ణు మూర్తికి ధైర్యం వచ్చింది.–

'ఒరేయ్, మెర్రీ మూర్తీ (మధుమూర్తి ఎప్పుడూ సరదాగా నవ్వుతూ వుండటం వల్ల అతన్ని కొలీగ్స్ అందరూ అలా పిలుస్తారు.) ఇదేం పెద్ద జ్వరం కాదుకదా– ఏ న్యుమోనియాలోకో దించదుకదా?' విష్ణుమూర్తి ఆర్తిని చూసి మధుమూర్తి నవ్వాడు.

ఎప్పుడూ ఏదో భయంకరమయింది జరుగుతందని ఊహించుకుంటావేమిటి?

'ఏమో – వయస్సలాంటిది–' విష్ణుమూర్తి గొంతులో భయం కనిపించింది.

'ఏమిటో యీయన యిన్నాళ్ళు వుద్యోగం ఎలా చేసారో, ప్రతిదానికీ భయపడి అందరినీ అదరగొడతారు' అన్నది నవ్వుతూ సుమతి.

'వాడు భయానికి అలవాటు పడ్డాడు. మంచివాడు కాబట్టి ఎవ్వరినీ యిబ్బంది పెట్టకుండా వుద్యోగం ముగించుకు వచ్చాడు–'

భయం కాదురా ఇది. ముందుచూపు.

'దానికి డాక్టర్లు వున్నారుగా నాన్నా' భాస్కర్ అందుకున్నాడు.

ఇన్ని కబుర్లు చెప్పుతారు కదా – నా కేమయినా అయితే నా భార్య సంగతేమిటి – విష్ణుమూర్తి మాటకి సుమతి కంట్లో నీళ్ళు తిరిగాయి.

'అమాయకత్వం, భయం రెండూ కలిసినయి యీయనలో' అనుకున్నది మనసులో.

కాసేపు అంతా నిశ్శబ్దమయింది –

ఇంతలో నర్సు వచ్చింది, బి.పి. టెంపరేచర్ అన్నీ మెజర్ చేసి వెళ్ళిపోయింది. –

డాక్టరు వచ్చి పరీక్షించాడు–

'డాక్టరు గారూ, నేను ఇంటి దగ్గర ఉండి ట్రీట్‌మెంట్ తీసుకోవచ్చా' విష్ణుమూర్తి అడిగాడు.

'రెండు రోజులు చూసి అంతా బాగుందనుకుంటే ఇంటికి పంపించేస్తాం' అన్నాడు డాక్టరు– విష్ణుమూర్తికి కొంచం ఊరట కలిగింది – ఇప్పుడీ ఖర్చులేమిటో – అనుకున్నాడు.

ఇంటికెళ్ళి భోజనం తయారుచేసి తీసుకువస్తానని సుమతి వెళ్ళిపోయింది. మధుమూర్తి సాయంత్రం వస్తానన్నాడు. భాస్కర్ తండ్రి దగ్గర వున్నాడు.

భాస్కర్, నీకు యీ సేవ చేయాలనే భావం ఎలాకలిగింది? – దీని వలన నీ జీవితం సరిగా జరుగుతుందా? విష్ణుమూర్తి ప్రశ్నకు భాస్కర్

సమాధానమిచ్చాడు.

'ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో సేవ చేస్తే చాలా తృప్తిగా వుంటోంది– యోగా నేర్పడం, గురువుగారి మాటలు వినడం, నలుగురితో బతకటం మనసుకు చాలా హాయిగా వుంటున్నది.'

'అలా ఎంతకాలం మంచి సంపాదన, నీ కంటూ ఒక సంసారం లేకుండా ఎలా బ్రతుకగలవు. కొంత నీకు ఆస్తిని పంచియివ్వగలను గాని అది నీకు హాయిగా జీవితం గడపటానికి సరిపోదు.'

'ఆసక్తి వున్నంతకాలం యీ సేవ చేస్తాను. ఎప్పుడు కాదనుకుంటే అప్పుడే మరో త్రోవ చూసుకుంటా'

'అలా అన్నీ గాలికొదిలేస్తే ఎలా'

'ఒక మాట అడుగుతాను నాన్నగారూ– ఏమీ అనుకోకుండా జవాబు చెప్పగలరా? –

'అడుగు'

'అసలు జీవితమంటే ఏమిటి? జీవించటమంటే ఏమిటి– అసలు మీరు జీవించినది అంతా మీకు నచ్చినదేనా'

'పెద్దప్రశ్న వేశావు. నేనెప్పుడూ యింత లోతుగా ఆలోచించలేదు. (...)సాంప్రదాయం నడిపినట్లు నడిచాను' అంతే'

కొంచెం సేపాగి –

'ఇప్పుడనిపిస్తున్నది – ఈ జీవితం ఏమిటి– ఎందుకీ బ్రతుకులు, సృష్టి– వీటి అర్థమేమిటి – ఏం చేసినా, ఎంత చేసినా, చివరకు వెళ్ళిపోవాల్సిందే కదా అనిపిస్తోంది, యిప్పుడు నా స్నేహితుడొకడు చెప్పినట్లు...

'మనజీవితాలు, మన బలహీనతలు
మనతో మన మాడుకునే జలక్రీడలు–
ఎవరైనా మనకు అందని, తెలియని వాడంటూ వుంటే
అతడు మనవాడు ఆడుకునే జలక్రీడలు
మన బలహీనతలు

మనవాడు మనకు పెట్టిన స్వర్ణకిరీటాలు
మనవాడు మనకు తొడిగిన మెరిసిన ఆహార్యాలు
మన బలహీనతల నుండి పూసిన నవ్వులు
మన మనుగడనే మనకవి
శత్రువులు తొడిగిన విషాదాలు'

చాలా గంభీరంగా విష్ణుమూర్తి అన్నాడు కవిత్వ ధోరణిలో-

ఇంతలో కాఫీ తీసుకొచ్చి సర్వర్ యిచ్చాడు.

ఇద్దరూ తాగారు.

'బహుశా నేను కాలంతో కాలం నడిపించినట్లు నడిచానేమో - మీ అమ్మ దేనికి అభ్యంతరం చెప్పకుండా నాతో సహకరించింది- అయినా యిప్పటికీ యీ జీవితం నా కర్థం కాలేదు. బహుశా నీకు గీతలో చెప్పినట్లు 'కర్మణ్యేవా ధినారస్తే' అన్నది తెలియకుండా అనుసరించానేమో -

సుఖమనిపిస్తే సుఖపడుతూ
దుఃఖమనిపిస్తే దుఃఖపడుతూ
కాలంతో కలిసి నడచాకేమో - ఇప్పుడు మొదలయినయి
ప్రశ్నలు- జీవిత చరమకాలం వచ్చింది- అన్నిటికీ
అర్థం వెతకాలని అనిపిస్తున్నది- ఒకటి మాత్రం తెలిసింది-
జీవితం సాగాలంటే
జీవితం మీద మమత పెంచుకోవాలి
ప్రతిక్షణం జీవితమంతం కావాలి
ప్రతిక్షణాన్ని గౌరవించాలి
జన్మలూ, మరణాలూ వుంటే
అవి సహజమని, ప్రతిజన్మ
అదొక్కటే వున్నదన్నట్లు
దాన్ని అంటుకుని అనుసరించి బ్రతకాలి.

నీవు చాలా స్పష్టంగా ఆలోచించి నీ దారిని నిర్ణయించుకున్నావు– తెలివైన వాడివి. సమస్యలన్నీ తేలికగా పరిష్కరించుకున్నావు.

'ఏవెూ నేను నా సేవా జీవితం ఎంచుకున్నప్పుడు యింత ఆలోచించాననుకోను. అది నాకు ఆనందాన్నిస్తుందనుకున్నాను– అంతే– కాని ఒకటి మాత్రం తెలుసుకున్నాను.

నా జీవితం ఒక నిప్పుల మంట అనుకుంటే

ఏవుతుంది కాల్చిన కట్టె

నా జీవితం ఒక వెలుగుల మంట

అనుకుంటే అవుతుంది ఒక దీపశిఖ

నిజానికి నేను యింతవరకు నేను చేసింది

ముందు కాలంలో మంచి అనిపిస్తుందో, లేక నీ నిర్ణయం

తప్పంటుందో తెలియదు. నాకు నచ్చిన మార్గాన్ని

ఎంచుకున్నాను. –

' ధన్యుడివిరా భాస్కర్, నీ అన్నకూ నీకూ ఎంత బేధం?

కొంచం సేపాగి

'ఇప్పుడు నాకు జీవితం, సృష్టి యీ రహస్యాలను గురించి

చాల ప్రశ్నలు వస్తున్నాయి' కారణం

నా జీవితం చరమ దశలో వుండటం వల్లనో ఏమో–

ఒక్క విషయం భాస్కర్ – నాకేదయినా అయితే మీ అమ్మను జాగ్రత్తగా చూసుకోండి– అని చేయి పట్టుకున్నాడు.

భాస్కర్ నవ్వాడు.

'నాన్నగారూ, పిరికితనంగా మాట్లాడద్దు. అమ్మ చాలా ధైర్యస్తురాలు. ఆమె సహజంగా వేదాంతి'–

విష్ణుమూర్తికి భోజనం తీసుకువచ్చింది సుమతి–

'హాయిగా, భయపడకుండా భోజనం చేయండి అని ముద్దలు కలిపి పెట్టింది.

## 7

ఆ మరునాడు విష్ణుమూర్తిని డిస్చార్జ్ చేశారు. 'ఒక్కరోజు హాస్పిటల్‌లో వున్నందుకే భయపడిపోయానేమిటి' అని విష్ణుమూర్తి అనుకున్నాడు. అతడికి ఎవరో ఆత్మగీతాలు పుస్తకం యిచ్చారు. దానిని తిరగేస్తుంటే అందులో కొన్ని శీర్షికలు తన స్థితికి సరిపోతాయనిపించింది– తనలో తలెత్తుతున్న సంశయాలన్నిటినీ ఎక్కడో ఒకచోట ఆ గీతాల్లో కనిపిస్తున్నది– ఒక గీతం 'ప్రపంచం ఓ దృశ్య కావ్యం' అతణ్ణి ఆకర్షించింది.

ఈ ప్రపంచం పరమాత్ముడి
            లీలామయ దృశ్యకావ్యం
ఈ కావ్యంలోని కవితను నేను
            పదాన్ని, పదబంధ పరిమళాన్ని
శైలిని, శయ్యను, సరళభావాన్ని
            నడకల పొందులును
నాదవినోదాన్ని, కీర్ణాన్ని, సంకీర్ణాన్ని
            పరదేశ సంతులనాన్ని
సూత్రాన్ని, సూత్రధారిని
            పాత్రలను, అపాత్రల
సన్నివేశ సంరంభాన్ని
            అవనికనూ, అమరికనూ
స్థలాన్ని, రంగస్థలాన్ని
            వీక్షణను వీక్షించే ప్రేక్షకుణ్ణి
కావ్యరసాన్ని, రసికుణ్ణి
            నవరసాల రాగాన్ని
పాత్రలు, రసాలు పొంగించి
            పండించే పరదేశాన్ని
పరవశించిన ప్రేక్షక ప్రజను

తెరలుతెరలుగా, సౌరబ, పొరలుగా
ప్రసరించి ప్రవహించే
వాహినిని నేను
ఆనంద రావానికి,
కావ్యానందం నా కన్నులరెప్పల
క్రింద ఒరిగి నాలో దూరి
గుండేలోకి జారి
నరాల నాక్రమించుకుంటోంది.
ఆనందం చెమర్చింది
నరాలు నాట్యం చేస్తుంటే
ఆనందం పొంచెపుతోంది
నీవేనేను-నేనునీవే
అంతా నేనునీవే
కాదు అంతానేనే
పొందిన ఆనందం స్తంభించి
స్త్రీ నేనుగా నిలిచింది

చదువుతుంటే బాగుంది. కాని అంతా అనుభవం, తన కలాంటి అనుభవం కలుగదు. ఎందుకో- కవులు వేరు-మామూలు మనుషులు వేరు. కవులంతా తమకు వెనుక వున్నది కనిపించినట్లు అనుభవిస్తారు.

ఈ గీతాల్లో చాల తనను గురించి వ్రాసినట్లే అనిపిస్తోంది - తానెవరు యీ ప్రపంచం ఏమిటో, ఈ సంసారం అర్థం ఏమిటో అన్నీ ప్రశ్నలే - ఈ జీవితం మీద మమత పుట్టినట్లుంది - అదేమిటే తెలుసుకోవాలనిపిస్తోంది - నిజానికి 'తానెవరు' ఈ సంశయాలు తనకు భయం కలిగిస్తున్నాయి. సుమతికి లేవా యివన్నీ- ఎప్పుడూ నవ్వుతూ హాయిగా బ్రతుకునట్లనిపిస్తుంది.

'సుమతీ' ఏమిటీ జీవితం అన్నప్రశ్న నీకు కలగలేదా'

'ఎన్నిసార్లో అనిపించింది. కాని ఎలా తెలుస్తుంది- పెద్దల ప్రవచనాలు

వింటున్నప్పుడు అంతా తెలిసినట్లుంటుంది– కాని తరువాత అంతా అయోమయంగా వుంటుంది– నా చిన్న మనసుకు అర్థం యివన్నీ కావు – సంప్రదాయం చెప్పుతోంది– దేవుడున్నాడని నమ్మి జీవించు' అని– అలా చేస్తే చాల బాధలు తగ్గుతాయి.

అయినా ఒక విషయం నాకు తెలియక అడుగుతాను, మీరు రిటైర్ అయినప్పటి నుంచి ఏదో ఒక ఆందోళన బయలుదేరినట్లు కనిపిస్తుంది–" అడిగింది సుమతి.

"నిజమే అప్పటి ధ్యాస అంతా వుద్యోగం మీద. అంతా బాగా మాట రాకుండా పనిచేసి బాధ్యతను నిర్వహించాలని, కాని యిప్పుడేదో తెలియరాని వెలితి కనిపిస్తున్నది– ఏం చేయాలో నేనే నిర్ణయించుకోవాలి. అంతా కాలక్షేపంగా వున్నది– కాలం గడిచిపోతున్నది. కాని ఒక నిర్థిష్టం, ధ్యేయం ఏవీలేవు. దగ్గరపడుతున్నది చివరి క్షణం అన్న భావన కూడా ఎక్కడో, ఏ మూలో వుండి తరచూ బయటికి వస్తున్నది. అంతా సవ్యంగా, అంటే సాఫీగా సాగిపోతుందా? ఏ క్షణం ఏం జరుగుతుందో అప్పుడు తెలియదు, యిప్పుడూ తెలియదు.కాని అప్పుడు యీక్షణాలని అంతగా పట్టించుకోలేదు. ఇప్పుడలా కాదు. కాలం నా ముందు ప్రత్యక్షంగా తిరుగుతున్నట్లుంది– ఆగమీం కర్త వ్రాసినట్లు ఈ జీవితం – అంటే నా జీవితం సంతోషంగా సాఫీగా సాగిందనుకున్న నా వునికికి మూలాన్నందుకున్నాననుకున్నా (అంటే నేను చేస్తున్నది ఒక పద్ధతిలో వుందనుకున్నా). స్మృతి సంకల్పాల సంకెళ్ళు నన్నరికట్టకుండా గడిచిన క్షణాలన్నీ విశ్వంఖల విశాల ఆరామ విరామాలనుకున్న (అంతా నేను కోరినట్లే జరుగుతున్నదనుకున్నా) తెలియలేదు నాకు (నిజం గానే ఆలోచించలేదు) అవి నా మనసున నిలచిన పై పై పొరలు మాత్రమేనని సఖమూ, సంతోషం (అప్పటి నా దృష్టిలో) నా పెళుసు గుండెల పిన్న పిన్న కిచ కిచలే గాని నిలచి నడిచే కెరటాలు కాదని తెలియలేదు నాకు ఏవి బూరెలద్దిన వెన్నెల మాత్రమేనని అది పొగమంచు పొర మాత్రమేనని– అలా ఆ గౌరవం పొందుతుంది– కాని యిప్పుడు ఆ పదాల అర్థం కొద్ది

కొద్దిగా అర్థమవుతున్నది. ఎందుకో కొంత భయం కూడ కలుగుతున్నది'–

'మీకు మొదటి నుంచి భయం ఎక్కువ –సంకోచం చాల ఎక్కువ' అన్నది సుమతి. అప్పుడే భాస్కర్ లోపలికి వచ్చాడు.

'నిజమే నాన్నగారికి సంకోచం ఎక్కువ' అన్నాడు నవ్వుతూ–

'శ్రీశ్రీ కూడ అంటారు భయం మనిషికి పెద్ద శత్రువని. భయపడకుండా ఎవరి జీవితం వారు సంతోషమయం–నిజమైన సంతోషం, ఇష్టమొచ్చినట్లు విశృంఖలంగా జీవించటం కాదు'.

చేసుకోవాలి, తనకు, తన మానసిక స్థితికి సరి అయిన దారి ఎంచుకుని, అందులో ముందుకు సాగాలని అదే నిజమయిన మనల్ని కలకాలం సంతోషంగా వుంచేది'– భాస్కర్ మాటలు అప్పుడయితే విష్ణుమూర్తికి అర్థమయ్యేవి కావేమో!

సంభాషణ అందుకుంటూ విష్ణుమూర్తి అన్నాడు.

ఆ గీతాల రచయితే అంటాడు–

భయం భయం

ఎవర్ని చూసి భయం

ఏమవుతుందని భయం

భగవంతుణ్ణి ప్రార్థించినా

కోరిక తీరదేమోనన్న భయం

(నిజానికి భగవంతుడున్నాడనిపించటం తప్ప

ఎప్పుడూ నేను అంతగా ఆ భావనను పట్టించుకోలేదు)

ఇక భయం తీరేదెలా

భయపడకుండా వుండటమే

భయం తీరటం

భయపడకుండా

భయం లేకుండా

ఉండటమెలా?

ప్రశ్నలు ప్రశ్నలుగానే వుందీ
జవాబెలాదొరుకుతుందీ
.....
ఎందుకు భయం
నీకేదో అయిపోతుందన్న భయం
నేననుకున్నది కాక
నేను కోరింది కాక
మరేదో అయితే!
అయితే దాన్ని నీవాపగలవా?
ఏమో (అనిపిస్తుంది యిప్పుడు)
(అప్పుడలా అనిపించలేదు)
అప్పుడప్పుడనిపిస్తుంది
బహుశా
సంశయంతో సతమతమవుతూ
సంచరించటమే భయం
ఇదే ననుకుంటా ప్రస్తుత నాభయం

సుమతి సంభాషణ ఆపి 'లేవండి భోజనాలు చేద్దాం' అన్నది సుమతి. 'ఇంతసేపు యిక్కడే కూర్చున్నావ్! ఎప్పుడు తయారు చేసావమ్మా డిన్నర్' ఆశ్చర్యంతో భాస్కర్ అన్నాడు.

భోజనాలయినయి. కూర్చున్నవాడు కూర్చున్నట్లు విష్ణుమూర్తి వణకటం మొదలుపెట్టాడు.

'సుమతీ వెన్నులోంచి చలి తన్నుకుంటూ వస్తున్నదే.

కొంచం వెన్నునానుకుని కూర్చో' భాస్కర్ దుప్పటి కప్పాడు.

మరునాడు డాక్టర్ దగ్గరకెళితే, ఆయన అంతా పరీక్ష చేసి

ఏం లేదు ..........' అని మందులు వ్రాసి యిచ్చాడు.

ఇంటికొచ్చిన తరువాత భాస్కర్ తన పనిమీద వెళతానన్నాడు. కొన్ని

రోజులు రాత్రిళ్ళు యింట్లో వుండమని తల్లి సుమతి అడిగింది. విష్ణుమూర్తి యిదివరకు యిటువంటి జ్వరాలకు, సంఘటనలకూ చలించేవాడు కాదు. ఇప్పుడంతా ఒక మాయాజాలమనిపిసప్తన్నది– ఏమిటీ జీవితం, ఏమిటీ ప్రపంచం ఏమిటిదంతా– అన్నీ సంశయాలూ, ప్రశ్నలూ మనసులో తరచూ లేస్తూనే వున్నాయి.

ఆరోజు ఆత్మగీతాలు తిరగేస్తుంటే ఒకచోట కనిపించింది.

నా జీవితమయింది
 మొదట చిట్టి చిట్టి మాటల
పొట్టి పొట్టి పొడి పొడి
 వాక్యాల కథల సంపుటిగా
పిమ్మట
 పెద్ద పెద్ద కథల సమాహారమై
మది మెచ్చిన గుచ్చిన
 నవలికా హారమయి
పెద్ద నవలలా రూపొందింది
 ఇందులో దేని
అంతర్యమూ తెలియలేదు
 అర్థమూ అవగాహన కాలేదు
నవల అద్యంతాలూ
 ప్రస్తావనా వుపసంహారాలేనా
ఇదమిత్థంగానైనా తెలియదు
 అసంపూర్ణమేమో తెలియదు
వికటించిన హాస్యం
 వలపన్నిన మమతా
కాటేసిన మోహం
 వీడని, విడివడని తలంపుల సంకెలలూ

అంతా

ఒక సీరియస్ హాస్య మాలిక

తపన, ఆశల మునిగిన

మాటల మూటలు నా జీవితం

నేననుకుంటా

రూపుతీరని రంగుల రంగవల్లికయని

విష్ణుమూర్తి యిది చదివి తీవ్రమయిన ఆలోచనలో పడి కుర్చీలో వెనక్కి వాలాడు. అలా ఎంతసేపయిందో, కొడుకు భాస్కర్ వచ్చి 'నాన్న' అనేదాక తెలియదు. 'నాన్న' ఒక సలహా లేక మీరు ఆర్ట్ ఆఫ్ లివింగ్ తరగతులకు వచ్చి ధ్యానం నేర్చుకోకూడదూ!

భాస్కర్ వైపు సాలోచనగా చూసి 'రేపే మొదలెడదాం'– అన్నాడు.

## 8

ఆ రోజు, కారుమేఘాలు కడవల వర్షం కురిసిన సాయంత్రం ఆనందరావు యింటికి – యిల్లు అనటం కంటే భవనం అంటే మంచిది– చేరేసరికి అంతా హడావుడిగా వుంది– భయమయినదేదో జరిగినట్లుంది– ఆ రోజున (......) బృందం వచ్చింది వాళ్ళయింటికి – ఆనందమూర్తి ఉద్యోగంలో – ఒక పెద్ద పరిశ్రమలో ఆయన (...)గా వున్నప్పుడు ఏదో మోసం జరిగిందట. ప్రభుత్వంలో జరిగిన ఒక మోసం ఆనందరావు టయిములో జరిగిందట.

ఆ రోజు వుదయమే వాళ్ళింట్లో వరలక్ష్మీ వ్రతం జరిగింది. ఆనందరావు భార్య అంతగా చదువుకోక పోయినా సాంప్రదాయానికి పెద్ద పీట వేసే మనిషి. ఆమెపేరు వరలక్ష్మియే.

ఆమెకు యిల్లు, సంసారం, భర్త తప్ప సామాన్యంగా పెద్ద వుద్యోగస్థుల భార్యలకుండవలసిన డాంబికం పోజు ఏమీ అలవడలేదు. ఆనందరావు కూడ తన భార్య అలా వుండాలని ఆమెను యిబ్బంది పెట్టలేదు. సామాన్యంగా పరిశ్రమల్లో (....)లదాకా ఎదిగిన భార్యలు సోషల్ గా వుండటం,

కొంచమయినా క్లబ్ వాతావరణానికి అలవాటు పడటం, గొప్పగా కనపడటం, ఆ తరహాలో మాట్లాడటం వుంటుంది. ఆనందరావుకు యిదంతా తన వుద్యోగ వాతావరణంలో కొంత యిబ్బంది అయినా, ఆమెను ఎపుడూ పార్టీలకు రమ్మని (...) గా వుండమని అనకపోవటానికి కారణం, అతడి నమ్మకం– ఆమెతో వివాహమయిన తరువాత తనకు అన్నివిధాలా కలిసి వచ్చిందని అతడి నమ్మకం.

ఆమె ఎదురుగా వచ్చి

'ఏమిటండీ యిదీ – (.....) వాళ్ళు ఎందుకు వచ్చారు? అని చేతులు పట్టుకుని అడిగింది–

"ఏదో సమాచారం కోసం వచ్చి వుంటారులే"

అని తనలోని భయాన్ని దాచుకున్నాడు. ఇంతలోనే ఆనాటి వుదయమే అమెరికా నుండి వచ్చిన పెద్దకొడుకు కల్యాణ్ బయటికి వస్తూ

'భయపడకండి నాన్నా – వాళ్ళని నేను మాట్లాడాను – మీరు వుద్యోగంలో వున్నప్పుడు ఏదో లాండ్ డీల్ జరిగిందట – అందులో పెద్ద స్కామ్ జరిగిందట. అది మీ టైమ్‌లో జరిగింది కాబట్టి మిమ్మల్ని ప్రశ్నించి కొంత (..........) తీసుకోవాలని వచ్చారట– (అంతా ఇంగ్లీషులోనే మాట్లాడాడు. అతడు సామాన్యంగా తెలుగులో మాట్లాడడు.)

'అవును. (....) జరిగింది– మేము ప్రారంబిద్ధామనుకున్న ఒక (.....) కి స్థలం కావలసి వచ్చింది. దానికి మేము మాకు ప్రభుత్వం (,,,) చేసింది.దానికి దాని (...) ప్రకారం డబ్బు చెల్లించాము'– అని మెల్లగా అన్నాడు.

బహుశా (....) ఏదయినా (.....) చేసి ప్రభుత్వం నుండి (...) తీసుకున్నారేమో

కల్యాణ్ మాటలు నిజమేనేమో అనిపించింది. 'నాకందులో ఏ ప్రమేయమూ లేదు. (......) దొరికిన తరువాత (........)కట్టి (......) మొదలుపెట్టటం వరకే నా బాధ్యత– అదే చేశాను.'

'బహుశా దాని విషయంలోనే వాళ్ళ అనుమానం అయివుంటుంది. ఆ (....) లో మీకేమయినా భాగం వుందేమో, దానిలో మీకు(....)వుందేమో అని

తేల్చుకోటానికి వచ్చివుంటారు. భయపడకండి.

డాడ్, నేనున్నానుగా మేనుచూసుకుంటాను.

కల్యాణ్ మాటలతో కొంత వుపశమనం కలిగింది. కాని పిల్లల దగ్గర 'లంచగొండి'గా అక్రమ వ్యాపారవేత్తగా కనపడతానేమోనని ఆనందరావు కృంగిపోయాడు. కొడుకు మాటలు కొంత రిలీఫ్ యిచ్చాయి.

కాని ఆ రాత్రి నిద్రపట్టలేదు. పట్టినా దీనిగురించి కలత. తన (....) కి యిలాంటి అక్రమవ్యాపారాలు, మంత్రులతో, రాజకీయనేతలతో సత్సంభంధాలు వుండటం అందరికీ తెలిసిన విషయమే. అయినా ఎక్కడన్నా వాళ్ళ (....)లో తనను యిరికించారేమో, తెలియకుండా తను ఎక్కడయినా సంతకం చేశాడేమో–

ఇక (......) కేసులు, ఖైదులు– ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది. తన జీవితంలో తనకు కలిగిన తృప్తి చక్కగా 40 ఏళ్ళు, చక్కగా తన జీవితం గడిపానన్న సంతృప్తి, సక్రమంగా సంపాదించిన సంపద– అంతా పేకమేడల్లా తోచినయి. అందరూ తనలాంటి (...)ని చూచి తాము కూడా అలా ఎదిగివుంటే బాగుండునని తమ పిల్లలు ఎదగాలని అనుకొంటూవుంటారు. అలాగే తనను ప్రశంసలతో ముంచుతారు.

ఇక తను రేపు (....)ఆడటానికి ఎలా వెళ్ళగలడు? క్లబ్బుల్లో ఎలా సంచరించగలడు. తనను ఓదార్చటానికి కల్యాణ్ అలా మాట్లాడేమోకాని రేపు వాడు మాత్రం తనను తక్కువగా చూడడా?

ఓడిపోయాను నేను ఓడిపోయాను

మనిషిగా ఓడిపోయాను.

మానవుడిగా గెలిచినా–

ఏమో ఎవరిని సుఖపెట్టాను – పాపం వరలక్ష్మి

ప్రక్కన పడుకున్న వరలక్ష్మి చేయి అతని ఛాతీ మీద పడ్డది– పాపం వరలక్ష్మి తనను యింక గౌరవిస్తుందా–

ఆమె చేతిమీద చేయి వేశాడు. కంట్లోంచి నీరు ధారగా కారుతోంది. ఆ ధారను తుడుచుకోవాలని కూడ అనిపించలేదు.

మనుషులూ, మనస్తత్వాలూ అన్నీ తెలుసుకున్నాను.

అందరూ అన్నీ తెలుసనుకున్నాను. ఒకసారి మెరుపులా మెరుస్తోంది నాలో నాకేమీ తెలియదని

మనుషులూ, మనసులూ

తత్వాలూ, భావాలూ

వర్తనా, ప్రవర్తనా వారివి

నాకేమీ తెలియదని

అంతా నాకగమ్యమని

తెలిసింది–

వరలక్ష్మి కొంచం కదిలింది– తనలాగే పైకిచూస్తూ, మూసుకోని కళ్ళతో పైకప్పు చూస్తున్నాడు.

గెలుపు ఓటమిలలో

నన్నేది వరించిందో

నాకు తెలియదు

నా జీవితాన్ని నేను సంపన్నం

చేసుకున్నాననుకున్నాను.

ఆ దానికే నమ్మాను–

ముందుకు సాగాను

ఈ సంఘటన నన్ను వదులుతుందా

బయటపడతానా?

అలాగే ధారలుగా కన్నీరు కారుతోంది–

ఇంత భయపడుతున్నానేమిటి–

నిజాయితీగా జీవితం గడిపాను

అదంతా అబద్ధమా–

నాలో ఎవరో నన్ను చూసి
నవ్వుతున్నట్లనిపిస్తోంది
మరో గొంతు వినిపిస్తోంది
ఎందుకీ కలవరం నీకు
అంతా నీవే చేస్తున్నట్లు
ఎందుకీ కలవరం నీకు
నీ వెవరు నేనుండగా?
నీవు చేసేది నీకు చేయించేదని
తెలియదా నీకు
ఎందుకీ కలవరం –

ఈ చివరి మాటలు ఎక్కడో విన్నట్లుంది. ఎవరో ప్రవచనకర్త అన్నట్లుంది– బహుశా ఆ నీవు ఎవరో నేను తెలుసుకోవాలేమో–

'మెల్లగా కనురెప్పలు కళ్ళని మూసినయి.

మరునాడు తన పుట్టినరోజని వరలక్ష్మి లేపి చెప్పేదాకా తనకు తెలియదు. కాదు మరచిపోయాడు.

కల్యాణ్ (............) అని (..........) చేశాడు.

నిన్న జరిగింది వీళ్ళు మరిచిపోయారా?

లేక వీళ్ళకి ఏ మాత్రం భయం లేదా–

వరలక్ష్మి వచ్చి

'ఇంకా పడుకున్నారేం– లేవండి. స్నానం చేసి కొత్త బట్టలు కట్టుకుని దేవుడికి నమస్కారం చేసుకోవాలి. అప్పుడు నన్నాశీర్వదించాలి'. చాల కాజువల్‌గా చెప్పి వెళ్ళిపోయింది. మనసులో భయంగా వున్నా యింకా అలజడి తగ్గకపోయినా లేచి వరలక్ష్మి చెప్పినట్లు చేయటానికి వెళ్ళాడు.

స్నానం చేసి కొత్తబట్టలు – వరలక్ష్మి తనకి చెప్పకుండా, తెలియకుండా కొన్నది కాబోలు అనుకున్నాడు– వేసుకుని హాల్లోకి వచ్చాడు. వరలక్ష్మి వచ్చి కాళ్ళకు నమస్కారం చేసింది–

'పిచ్చిది –ఏమని దీవించేది. నాకేమయినా అయితే అనుకుంటూ తల మీద చేయి పెట్టి అనునయంగా తాకాడు.

వరలక్ష్మి కల్యాణ్‌ని పిలిచి,

నాన్నకు నమస్కారం చేసుకో– పెద్దవాళ్ళ దీవెనలు సౌభాగ్యం అందిస్తాయి' అన్నది. అమ్మ చెపితే, ఆ పని చేసేదాకా వదలదు అని వచ్చి నమస్కారం చేసాడు.

'రండి దేవుడికి నమస్కారం చేసుకుందురు గాని. దేవుడి దయవల్ల 70 సంవత్సరాలు చక్కగా గడిపారు. సంసారం బాగా నడిపారు. అందరూ మిమ్మల్ని మెచ్చుకున్నారు. నా సౌభాగ్యం కూడ ఆయన దయే!

'ఏమిటో నిన్నటి సంఘటన తరువాత కూడ యింకా యీపిచ్చిదానికి నా మీద గౌరవం తగ్గలేదు. దాని అదృష్టమనుకో నాకు అంటింది.– అనుకుంటూ దేవుడి మందిరం వైపు వెళ్ళటానికి లేచాడు. కాలింగ్ బెల్ మోగింది– కాళ్ళు తడబడ్డాయి. (........) వాళ్ళేమో అని నిలబడి పోయాడు. కల్యాణ్ వెళ్ళి తలుపు తీశాడు.

'ఆనందరావు గారెవరు' అని ఆ వచ్చినతను అడిగాడు. చేతిలో పూల (.....) వుంది.

'నేనే' – అని ఆనందరావు ముందుకు వచ్చాడు.

'సర్, మీకు యీ బొకే అందజేయమని మాకు మెసేజ్ వచ్చింది' అని చక్కటి గులాబీల పూలగుత్తి చేతికిచ్చి

'ఇక్కడ సంతకం చేయండి' అని కల్యాణ్ చేత సంతకం చేయించుకుని వెళ్ళిపోయాడు.

'(......) ఎవరు పంపారు' అని

'ఓ యిది చైర్మన్‌గారు పంపారు' సంతోషంగా అన్నాడు.

ఆయనకు బహుశా నిన్నటి సంఘటన తెలియలేదేమో అనుకుంటూ, బొకే అందుకున్నాడు. ఇంతలో అతని సెల్ మోగింది–

'ఆనందరావ్' చైర్మన్ గొంతు

‘సర్, మీరా’ ఆనందరావు గొంతు తడబడింది–

(............)

‘సర్ చాల థాంక్స్.

నీవు కంపెనీకి చేసిన మేలు యింతా అంతా కాదు– ఇంకా మరో (..) మామిడిపండ్లు వస్తుంది– ఎంజాయ్, నేను వూళ్ళోవుంటే నేనే స్వయంగా వచ్చేవాణ్ణి.”

సర్, నిన్న (....) వాళ్ళు మా ఇంటికి వచ్చారు మీకు తెలీదా’ గొంతులో తడబాటు కనిపించింది.

“తెలుసు, ఆ డీల్‌తో నీకేం సంబంధం లేదని వాళ్ళకి తెలియక వచ్చారు. ఇక వాళ్ళు రారు. ఇంత పిరికివాడివి ఎలా నిభాయించుకు వచ్చావయ్యా” అని నవ్వుతూ

‘భయపడకు నీ మీద ఈగ కూడ వాలదు’.

“(...) మీరు వచ్చిన తరువాత వచ్చి కలుస్తాను.’ సంతోషంతో భారమంతా దిగిపోయింది– దేవుడి గదివైపు నడిచాడు.

కల్యాణ్ అన్నాడు.

“డాడ్, వాళ్ళకు నీమీద ఎంతో నమ్మకం!’

‘మీ నాన్న కష్టమే యీనాడా కంపెనీ అంత పెద్దది కావటానికి కారణం’ అన్నది వరలక్ష్మి. “అంతా దైవకృప” అన్నది.

“అయితే నాన్నగారి వ్యక్తిత్వం, తెలివితేటలు, సామర్థ్యం కాదంటావ్– కల్యాణ్ అన్నాడు.

‘ఎవరికి ఎన్ని వున్నా దేవుడు చేస్తేనే మేలు జరుగుతుంది’ వరలక్ష్మి నమ్మకానికి ఆశ్చర్యపోయినారు తండ్రీకొడుకులు.

కల్యాణ్, దేవుడున్నాడని నమ్మడు. తను ఈనాడు అమెరికాలో సాధించిందంతా మంచి డాక్టరుగా పేరు పొందటానికి తన సమర్థతే కారణమని అతని గట్టి నమ్మకం. ఆనందరావుకి అసలీవిషయంలో పెద్ద అభిప్రాయాలేమీ లేవు.

దేవుడికి నమస్కారం చేసిన తరువాత వరలక్ష్మి ఆనందరావుని

" ఈ కుంకం స్వామిజీ యిచ్చారు. నిన్న వెళ్ళి మీ కోసం వారి ఆశీర్వాదాలు తీసుకొచ్చాను' అని ఆనందరావు నుదిటి మీద కుంకుమ అద్దింది. మౌనంగా కుంకుమ దిద్దించుకున్నాడు ఆనందరావు–

నీకిన్ని పిచ్చి నమ్మకాలుండడం వల్లే నీలోని ............పూర్తిగా బయటికి రాలేదు. సాంప్రదాయం, సాంప్రదాయం అంటూ పూజలూ, పునస్కారాలూ చేస్తూ కుటుంబం నిర్వహించాం– మాకు మంచే జరిగిందనుకో– కాని నీవు ఎప్పటి మాదిరిగానే యింటికి అతుక్కుపోయావ్' అన్నాడు కల్యాణం.

'పోనీలే, ఇప్పుడు నాకేం తక్కువయింది. పండంటి పిల్లలు, మంచిభర్త, సంపద అన్నీ వున్నాయి. ఇది చాలదా– నేను యింతకంటే ఏమీ కోరుకోలేదు. నేను చాలా పేదకుటుంబం కాకపోయినా, ఒక మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చాను.తల్లిదండ్రులు ఎంచిన మీ నాన్నతో వివాహం జరిగింది– ఆయన పని ఆయన నాపని నేను చేసుకుని మీకందరికీ మీరు చేరుకోగలిగినంత స్థాయికి చేరనిచ్చాం.

మంచో చెడో నేనెంచుకున్న దారిలో ఏలోపం కనపడలేదు. నాకు తెలిసిందల్లా సంసారం, సాంప్రదాయం అలాగే యీ జన్మా గడిచిపోయింది. ఇలా గడిస్తే చాలు.

అమ్మ మాటలు కొడుక్కి నచ్చలేదు. 'అమ్మ తన ఆటిట్యూడ్‌లో (.....) ఎన్నో కోల్పోయింది' అనుకున్నాడు.

'ఈ సాంప్రదాయం నిన్ను కట్టిపడేసింది– దేవుడు, స్వాములు, దేవాలయాలు అంటూ జీవితంలో నీ ............వుపయోగించుకోలేదు.

'అవును సాంప్రదాయం నన్ను కట్టిపడేసింది. కాని అదే నన్ను ఒక పద్ధతిలో, ఒక మార్గంలో నడిపింది. నేను తీవ్రంగా ఆలోచించవలసిన అవసరం నుంచి నన్ను తప్పించింది. నాకు ప్రపంచాన్ని ఎదిరించి బ్రతకగల సమర్థత లేదు'.

'ఆలోచిస్తే నీ లాంటి తెలివిగల దానికి నీ జీవితం ఎలా వుండాలో

నిర్ణయించుకునే శక్తి నీకు వుంది. కాని నీవు నీ బుద్ధిని వుపయోగించలేదు'–

'నిజమే ! నాకల్లా ఒకటే ఆశ, నేను సంతోషంగా, నాకుటుంబం సంతోషంగా వుండాలి. సంప్రదాయం ప్రకారం బ్రతికితే సరిపోతుంది. అందుకని నా కోరికల్ని,యిష్టాన్ని వెనక్కి పెట్టేసాను. నా చిన్నతనంలో నా వెంట ఒక నీలాంటి కుర్రవాడు వెంబడి పడ్డాడు. కాని అతణ్ణి ఎలా తప్పించు కోవాలో తెలియక మా అమ్మతో చెప్పాను. హాయిగా మా అమ్మ నా సమస్య తీర్చింది. మీ నాన్న సంబంధం  మా నాన్న తెచ్చి చక్కగా పెళ్ళి చేసాడు. ఇద్దరం 50 సంవత్సరాలు కలసివున్నాం. మాకంటె మీరేం సుఖంగా వున్నారు? దేవుడి మీద నమ్మకం, కర్మ, జన్మలు– యివన్నీ మన సంప్రదాయాలు పంచిన నమ్మకాలు. వాటిని అనుసరించటం వల్ల నాకు ఏబాధా కలగలేదు. పైపెచ్చు అది పెద్ద కవచంలా నన్ను, నాసంసారాన్ని కాపాడుతున్నది–

ఇప్పుడు సాంప్రదాయం మీద నాకు పూర్తి నమ్మకం కుదిరింది. వేదాలూ, శాస్త్రాలూ, ఉపనిషత్తులు, పురాణాలు యివన్నీ మహామహులయిన మహర్షులు చెప్పినవి. ఏర్పాటు చేసినవి. వారు పెట్టిన కట్టుబాట్లు మన నడవడికను, ధర్మం తప్పకుండా చేస్తయి. తప్పటడుగులు వేయకుండా నివారిస్తయి.

ఇప్పుడు  మీరు నడుస్తున్న మార్గంలో ప్రతిదీ ఆలోచించి, మన కనుగుణంగా, అన్నీ మీకే లాభం, సుఖం, కూర్చాలని చేస్తున్నారు. ఎదుటి వాడిని గురించి బంధుత్వాలనీ, సంసారాన్ని దానిని లెక్కలోకి తీసుకోరు. దాని వలన నా లాంటి దానికంటే మీ కెక్కువ ఏం ఒరిగిందో నాకు తెలియటం లేదు.

సంప్రదాయాన్ని కాదని, పట్టించుకోకుండా వుండడం, నేల విడిచి సాము చేయటమే– నా లోకం చాల చిన్నది– నేను నా కుటుంబం, నా పరిసరాలు వీటితో సంతోషంగా బ్రతకటమే నాకు కావలసింది.

మానవజన్మ చాల గొప్పదని చెపుతారు. కాని అది మనకు తెలిసి చాల కొద్దికాలమే– జనన మరణాల మధ్య– ఆ తరువాత మహర్షులు చెప్పినమాటే తప్ప నాకింకేమీ తెలియదు.

ప్రతిదీ సమస్యగా బ్రతకగల శక్తి నాకు లేదు. నా సమస్యలకు సంప్రదాయం చిన్న చిన్న సమాధానాలు కూరుస్తుంది–

‘ నాలాంటి తెలివయిన మనిషి చదువుకునివుంటే నాన్నగారికి ఎంతో సహాయంగా ఆయన కెరీర్‌కి కూడ (.....)గా వుండేదానిని.’

‘నేను చక్కగా ఇంగ్లీషు మాట్లాడగలను. ఆయనతో అవసరమయినచోటికి వెళ్తూ వుండేదానిని. ఆయన రమ్మంటే రానని ఎన్నడూ అనలేదు. ఆయన బయట ఎదిగారు. ఆయనకు దన్నుగా నేను సంసారం చూసుకున్నాను. నీవు నీ తమ్ముడూ చక్కగా చదువుకుని, పెళ్ళిళ్ళు చేసుకుని మీకు కావలసిన చోట్ల బతుకుతున్నారు– హాయిగానే వున్నారుగా– యింక నా సంప్రదాయం వల్ల వచ్చిన అడ్డేమిటి?’ – అన్నది నవ్వుతూ.

నీవు చెప్పింది నిజమేననుకో– నీ నమ్మకాలు నీవి– మా నమ్మకాలు నీకు అడ్డురాలేదు– అది గొప్ప విషయమే’–

ఈ సంభాషణలో కల్యాణ్ చాలసేపు ఇంగ్లీషులోనే మాట్లాడాడు. వరలక్ష్మి కూడ అప్పుడప్పుడు ఇంగ్లీషులో మాట్లాడింది–

ఆరోజు సాయంకాలం వరలక్ష్మి ఆనందరావు గుడికి వెళ్ళి వచ్చారు. కల్యాణ్ రానన్నాడు. గుళ్ళూ గోపురాలు– యిదంతా మూఢనమ్మకం– అంతా స్వయంకృషి– అని కల్యాణ్ గొప్ప నమ్మకం– ఒకసారి ఆనందరావు అన్నాడు.

‘నీ (,,,,) నీవు ఏర్పరచుకోవాలి. అందులో ఎవ్వరూ సహాయం చేయలేరు. సలహా చెప్పగలం, చెయ్యందించగలం–’ ఆనందరావుకి లోలోపల ఒక గట్టి నమ్మకం వుంది– ఈ నాడు తనస్థాయి, స్థితి, ఎదిగిన ఎత్తు, సంపాదించిన సంపాదన అంతా స్వయంకృషి– అతనంతగా కర్మ సిద్ధాంతాన్ని పట్టించుకోలేదు. మంచి జరిగితే ఎగిరి గంతేసి కాలరెత్తుకోటం, లేకపోతే బాధపడటం యివే అతను చేసినవి– అసలు జన్మలంటూ వున్నయని అతను అనుకోడు. అసలతడు ఎప్పుడూ వాటిని గురించి అంతగా పట్టించుకోలేదు. వీలయినప్పుడు సంప్రదాయం– దానికి వరలక్ష్మి వున్నది.లేకపోతే లోక వ్యవహారం, అంతే’. ఇలా ఒక సమస్య సుత్తిలా వచ్చి తన్ను కొడుతుందన్న

భావనే కలుగలేదు యిప్పటిదాకా– ఇప్పుడనిపిస్తున్నది– ఏమో కర్మ అనేది వున్నదేమో– లేకపోతే తన మీద ఈ పిడుగేమిటి?– ఛైర్మన్ తనకు బాగా ధైర్యం చెప్పినా గుండెల్లో ఎక్కడో ఒకచోట 'ఏమో ఏం జరుగుతుందో నన్న భయం వుండిపోయింది– అది చిన్న చిన్నగా కెలుకుతూనేవున్నది.– అన్ని పనులూ మెకానికల్‌గా చేస్తున్నాడు. – కల్యాణ్ అన్నాడు.

'నాన్నా కొన్నాళ్ళు మీరు అమ్మా నాదగ్గరకు వచ్చి అక్కడ వుండండి.–

అలా అమెరికాలో కొంతకాలం వుండి వద్దామా అనిపించింది–

ఈ రోజున తన పుట్టిన రోజు– ఎంత హడావుడి చేస్తోందో వరలక్ష్మి– గుడిలో వున్న స్వామిజీ దగ్గరకు తీసుకెళ్ళి నమస్కారం చేయించింది.

ఆయన దీవించి అక్షతలు వేసాడు.

'ఇది మీ 70వ పుట్టిన రోజని అమ్మ చెప్పింది– చాల సంతోషం– యిలానే మీరు శతమానం అనాలి! అన్నాడు నవ్వుతూ,

'అంతకాలం ఎందుకులెండి స్వామి– బ్రతికినంతకాలం సరిగా బ్రతికితే చాలు'.

'మనచేతిలో ఏమున్నది– కర్మ మీద ఆధారపడి వున్నది – కర్మను తప్పించటం దైవానికి కూడ సాధ్యం కాదు– ఆయన మనను చేయిపట్టి నడిపించగలడు– సుఖంగా వుండే మనసును మనం పెంచుకోవాలి!

'అది ఎలా' ఆనందరావు ప్రశ్నకు స్వామీజీ స్పందించారు–

'ధ్యానం, పూజ, దైవారాధన చేసుకోండి!

తానిప్పుడు తన వుద్యోగం, పని తప్ప యింక దేనిని పట్టించుకోలేదు. ఇప్పుడు ఇవన్నీ ఎలా అలవడలేదు. ప్రపంచంలో తను ఏకాకి అయినట్లనిపించింది –

## 9

తన పుట్టినరోజు సాయంకాలమ్– ఆస్ట్రేలియా నుండి ముకుందం, ఇంగ్లండ్ నుండి రమణ్ వచ్చారు– రమణ్ ఇంగ్లండులో డాక్టరుగా (.......) చేస్తున్నాడు. ముకుందం ఆస్ట్రేలియాలో ఒక జోర్న యూనివర్శిటీలో (.....)

గా పనిచేస్తున్నాడు. అంతా వంటరిగానే వచ్చారు. వరలక్ష్మి చాల సంతోషించింది– ముగ్గురు పిల్లలు చాల కాలం తరువాత యిలా ఇంటికి వచ్చారు. భార్య, పిల్లలు కూడా వస్తే బాగుండేది– కాని పిల్లల చదువులని వాళ్ళు రాలేదు.

ఆనందరావు బయటికి సంతోషం చూపించినా లోలోపల భయంగా వున్నది– యీ పిల్లలిద్దరూ తనను దోషిగా చూస్తారేమోనని– వాళ్ళేమీ అనకపోయినా తనకు ముఖం చెల్లటం లేదు. నిజానికి వాళ్ళు తన పిల్లలకు తనంటే మంచి అభిప్రాయమే– అయినా ఏమో –

మాటల సందర్భంలో అన్నాడు.

'అసలు నాకా (......) తో సంబంధం లేదు. అంతా (......) చేసుకున్నదే– వాళ్ళు స్థలం ఏర్పాటు చేసి నాకిచ్చినపుడు (.......) కట్టటం అంతా నేను చేసాను. దానికి (..........) వచ్చి ప్రారంభించారు కూడాను!

నాన్నగారూ మీరంత (..........) గా వుండకూడదు. (.......) చెప్పారు కదా– మీకు ఆ (.....)తో ఏ సంబంధమూ లేదని–

అని వాళ్ళు వుత్సాహపరిచినా ఆనందరావుకు భయం వదల్లేదు. ఏమో– ఎప్పుడొచ్చిమీదపడుతుందో–.

బహుశా స్వామిజీ చెప్పినట్లు, వరలక్ష్మి నమ్మినట్లు కర్మ అంటూ వున్నదేమో– తనకెందుకు పూర్తి నమ్మకం కుదరటం లేదు. జీవితాన్ని సుఖంగా వుండాలని (.......) చేసుకుంటాం– కర్మ అనేది వుంటే యిక (......)ఎందుకు?

ఈ కర్మ ఏమిటి– వరలక్ష్మి జవాబు చెప్పింది. 'కర్మ మనం జన్మ జన్మల్లో చేసుకున్న కర్మల ఫలితం యీ జన్మలో అనుభవించాలి– అందుకే యీ జన్మలో మంచి పనులు చేసి మంచిగా బ్రతకాలంటారు'.

'కర్మలున్నాయని నీ కెలా తెలుసు' రమణ్ అడిగాడు.

'ప్రతి మనిషి తన జీవితం సుఖంగా వుండాలని కోరుకుంటాడు. కాని అట్లా జరగదే– మరి అట్లా జరగకపోవటానికి కారణం ఏమిటి? వరలక్ష్మి ప్రశ్నించింది–

‘అంతా యీ జన్మలో మనమీద ఆధారపడి వుంది’– కల్యాణ్ అన్నాడు. ముకుందం యీ సంభాషణను వింటున్నాడు. అతడికి దేవుడు, కర్మలూ వీటన్నిటి మీదా నమ్మకం వుంది– అన్నలిద్దరికీ జవాబు చెప్పటం కష్టమని వూరుకున్నాడు.

‘అసలు సుఖం దుఃఖం ఏమిటి? ముకుందం అన్నాడు. అతనికి కొంత కవిత్వ ధోరణి వున్నది. ఆ మధ్య ఎవరో ఒక కవి మా వూరు వచ్చాడు. ఆయన యిలా అన్నాడు.

దుఃఖంలో నుంచి సుఖాన్ని
పొంగించు కుంటారు కొందరు
సుఖంలో నుండి దుఃఖాన్ని
పిండుకుంటారు కొందరు
దుఃఖం సుఖం సమమే
అనుకొంటారు కొందరు
సుఖమంటే తెలియదు కొందరికి
దుఃఖమంటే ఏమిటో తెలియదు కొందరికి
దుఃఖమొస్తే ఏడుస్తారు
సుఖమొస్తే సంబరపడతారు
అది అంతే అంటారు వారు
అది నైజం అని తెలియనివారు
వారి దృష్టికి పిచ్చివారు
రెంటిలోనూ వున్నది
‘ఖం’ అంటారు కొందరు

ఎవరు ఏ జాతికి చెందినవారో మీరే నిర్ణయించుకోండి.

‘బాగా చెప్పావురా ముకుందం– లేవండి భోజనాలు చేద్దాం’ వరలక్ష్మి వంటవాణ్ణి పిలిచింది. అందరూ నవ్వుకుంటూ భోజనానికి లేచారు.

మరునాడు వరలక్ష్మి చాల బాధపడుతూ నిద్రలేచింది– డాక్టర్లిద్దరూ

ఆమెను పరీక్షించి వెంటనే పావని హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. బయాప్సి పరీక్ష చేసిన తరువాత ఆమెకు (......) అని తేలింది- యీ వయస్సులో యిది (....) కావటానికి కొంత సమయం పడుతుంది.

కల్యాణ్ రెండు రోజులు మాత్రమే వుండగలడు. రమణ్ మరో వారం వుండగలడు. ముకుందం కూడ అంతే- ఎవరెవరు అమ్మ దగ్గర వుండగలరో వాళ్ళలో వాళ్ళు చర్చించుకుంటున్నారు.

ఆనందరావుకి యిదేం పట్టలేదు. ఒక్కసారిగా తన పీఠం కదిలి నట్లనిపించింది. ఒక్కరోజులో కారుమేఘంలా అన్ని ఆపదలూ వచ్చి కడవలుగా కష్టాలు మీదికి కురుస్తున్నట్లనిపించింది. ఇటువంటి పరిస్థితి యింతకు ముందు వచ్చిందేమో గుర్తులేదు. కాని అప్పటి తన స్థితి భరోసా వేరు. తన విషయాల్లో ఏది వచ్చినా ఆ భారాలు మోయడానికి కావలసినంత బలగం వున్నదనిపించింది. ఆ అసరా ఎవరో యిప్పుడనగతమవుతోంది. అతనికి ఎవరితోనూ మాట్లాడాలనిపించలేదు. వరలక్ష్మి బెడ్ ప్రక్కనే కూర్చున్నాడు మౌనంగా. అప్పుడప్పుడు వరలక్ష్మి కన్నుతెరచి భర్త చేయి పట్టుకుంటోంది.

సాయంత్రం అవుతోంది- వున్నట్లుండి ఆనందరావు లేచి బయటికి వచ్చాడు. కారులో ఎక్కి స్వామిజీ ఆశ్రమానికి పోనిమ్మన్నాడు. ఆనందరావు ఆశ్రమం చేరేటప్పటికి యింకా స్వామిజీ బయటికి రాలేదు. శిష్యులు కొందరు ఆయనకోసం బయట కాచుకూర్చొన్నారు. కొంత సేపటికి స్వామిజీ బయటకు వచ్చారు. ఆనందరావును చూచి-

'ఆనందరావుగారూ, ఏమిటిలా వచ్చారు' అని నవ్వుతూ అడిగాడు.

'స్వామీ, వరలక్ష్మికి (.....)అని చెప్పారు. తను యిప్పుడు ఆసుపత్రిలో వున్నది. (.....) లో వున్నది. ఎప్పుడు (.....)చేస్తారో తెలియదు. మీకు యిది చెప్పి మీ ఆశీర్వాదాలు తీసుకువెళదామని వచ్చాను.' అన్నాడు నమ్రతగా.

'అలాగా, వయసు పైబడుతోంది. గాభరా పడకండి. అంతా దైవ నిర్ణయం' అని ప్రక్కన పళ్ళెంలో వున్న విభూది తీసి, కాసేపు కళ్ళు మూసుకుని దైవ ఆశీర్వాదం తీసుకుని, ఆనందరావు చేతిలో పెట్టాడు.

'ఇది ఆమెకు నోటిలో వేయండి. అంతా బాగుంటుంది.

'స్వామీ ఒక్కసారి తాము ఆసుపత్రికి వచ్చి వరలక్ష్మిని ఆశీర్వదించితే ఆమె చాల సంతోషిస్తుంది'.

'అలాగే – టైము చూసుకుని యీ సాయంకాలమో, రేపు వుదయానో రావటానికి ప్రయత్నిస్తాను. ఆమె చాల పవిత్ర హృదయం కలది– అందరికీ పూజ్యురాలు' అన్నాడు స్వామిజీ–

ఆనందరావు విభూతి తీసుకువచ్చి వరలక్ష్మి నుదుట పెట్టాడు. వరలక్ష్మి చేతులు జోడించింది. ఆ విభూతి ఆమెకు ఎంతో సాంత్వన కలిగించినట్లుంది.

కొడుకులెవరూ ఆ పనికి అంత హర్షించినట్లులేదు. పెద్దవాళ్ళు ఏదో నమ్ముతుంటారు. అయినా నాన్నగారికిలాంటి నమ్మకాలున్నయ్యా అని ఆశ్చర్యపోయారు.

ఆ రోజు రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో స్వామిజీ ఆసుపత్రికి వచ్చారు. ఆనందరావుకి కొండంత ధైర్యం వచ్చింది. వరలక్ష్మి బెడ్ దగ్గరకు వచ్చి ఆమె నుదుట విభూతి పెట్టె.

'భయపడకమ్మా, అంతా దైవనిర్ణయం, దానికి లోబడే అన్నీ జరుగుతాయి. దైవప్రార్థన చేయటం మనకు చేతనయిన వైద్యం చేసుకోడం'– అని శిష్యుడితో పాటు తిరిగి వెళ్ళిపోయారు స్వామిజీ–

కల్యాణ్, రమణ్, ముకుందం స్వామిజీని పెద్దమనిషిలా గౌరవించారు. కాని యీ విభూతి వల్ల ప్రయోజనం ఏముంటుంది.

అప్పుడప్పుడు మూఢనమ్మకాలు మనిషికి బ్రతకటానికి, జబ్బు నుండి కోలుకోటానికి చెయ్యందిస్తాయని ఈ మధ్యనే ఒక రీసెర్చిలో తేలింది– యిలా స్వామిజీల మీద నమ్మకం అమ్మ (......) కి సహాయం చేస్తే మంచిదే–

అసలు(.....) లేకుండా విభూతి రోగాన్ని నయం చేస్తుందా? ఈ భావన అందరికంటే ఎక్కువ డాక్టర్ కల్యాణ్ మనసులో వుంది–

'దైవనిర్ణయం ఏమిటి– అంతా మనం చేసుకునే మోసం– అన్నాడు

రమణ్– అతడూ డాక్టరే–

'ఏమో ఎవరికి తెలుసు– అన్నీ (....) అన్నాడు ప్రొఫెసర్ ముకుందం.

ఆనందరావుకి యిప్పుడు కావలసింది ఏదోరకంగా వరలక్ష్మి ఆరోగ్యంగా బయటపడటం– సంశయంతో సతమతమవడం కాదు. అతడు చాల(....) అలాగే వుద్యోగంలో పనిచేసాడు. ఇప్పుడూ అంతే, వరలక్ష్మి ఆరోగ్యానికి ఏది అవసరమో అది చెయ్యటమే–

నిన్న తన పుట్టిన రోజు– ఈ రోజు?

పుట్టినరోజు గిట్టె

తిరిగి మరో రోజుగా పుడుతుందా

పుడుతుందా?

ఎన్ని వేలసార్లో యీ

జనన మరణ భ్రమణమూ

భ్రమా, భ్రాంతి

కల్లోలం, కలవరం

ఏది నిజం

ఏదీ రాదేమో

మళ్ళీ పుట్టినరోజు వచ్చేదాకా

అంతా నిజమేనా?

తనలో కవిత్వం! తనలో ఎవరో నవ్వుతున్నట్లుంది. నన్నుచూచి నేనే నవ్వుకుంటున్నానా?

పిల్లలు వచ్చారు. కల్యాణ్ అన్నాడు.

'నాన్నగారు మీరు యింటికి వెళ్ళండి. మేం వంతులవారిగా అమ్మ దగ్గర వుంటాం–'

మౌనంగా అతడు చెప్పింది చేసాడు. లేచి యింటికి బయలుదేరాడు నిన్న పుట్టిన ఆనందరావు?

–IIIIIIII–

## 10

మరునాడు పావని హాస్పిటల్ రౌండ్స్‌కి వచ్చింది. వరలక్ష్మి రూముకి వచ్చింది– ఆమె (.........) ఆనందరావు అక్కడే వున్నాడు–

‘ఆనందరావు గారూ– ఏమిటి మీరిక్కడ’? అని అడిగింది–

‘మా ఆవిడని మీ హాస్పిటల్‌లో (....) చేశాం’

‘అలాగా’

కల్యాణ్ వచ్చాడు. ఆనందరావు పరిచయం చేశాడు.

‘మా అబ్బాయి, కల్యాణ్ యితను, మా కోడలు (..........)

‘నమస్కారం’ మా హాస్పిటల్ ఎలావుంది– మీ (......) కి వస్తుందో అంది పావని నవ్వుతూ–

‘(.....) చాల బాగుంది– నేను నా భార్య ఇండియాలో ఒక మంచి (....) ప్రారంభిద్దామని చూస్తున్నాం – అది యింకా ప్రథమదశలోనే వున్నది.– (అంతా యింగ్లీషులోనే అన్నాడు–)

‘ఇటువంటి హాస్పిటల్ కట్టడానికి (.....) చేయటానికి ఎంతో పెట్టుబడి కావాలి’.

కల్యాణ్ ప్రశ్నకు పావని సమాధానమిచ్చింది.

‘ఏమో చెప్పలేను. ఎప్పుడో 25 సంవత్సరాల క్రిందట ఒక నర్శింగ్‌హోమ్‌ను ప్రారంభించాం. అంచెలంచెలుగా పెంచుకుంటూ వచ్చాం– ఎప్పుడూ దేనికి ధర కట్టలేదు. బహుశా అది యీనాటిలో.......పద్దతుల్లో సరి అయినది కాదేమో’–

మరి ఛార్జ్ చేయటం ఏ (......) మీద చేస్తారు? ఆశ్చర్యంగా అడిగాడు.

‘అంతా (.......) ఇంతవరకు ఏ ఇబ్బంది రాలేదు–’ అంది పావని నవ్వుతూ–

‘మా ఆస్పత్రికి వచ్చే పేషెంట్సు ఎక్కువయ్యారు గాని ఎప్పుడూ తగ్గలేదు. డబ్బుకి కొరత కూడ రాలేదు. (.....................) –

'వుంటారా కొన్నాళ్ళు–' అని కల్యాణ్‌ని ప్రశ్నించింది–

' మా అమ్మ (......) బట్టి వుంటుంది– ఏమయినా నేను వచ్చేవారం వెళ్లిపోవాలి. నా పేషెంట్సు ఎదురు చూస్తూవుంటారు.(...............)

మీరు మా అమ్మని బాగా చూసుకుంటారని నాకు నమ్మకముంది– అన్నాడు కల్యాణ్.

పావని నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

'(..........) ఈ వూళ్ళో పేరున్న (.......) ఆమెకు 70 ఏళ్ళుంటాయి. కాని చాల చలాకీగా వైద్యం చేస్తుందని ప్రతీతి' ఆనందరావు అన్నాడు.

' మీ ప్లాన్‌లు ఏమిటి– ఒక వారంలో అందరూ వెళ్ళిపోతే, అమ్మకు సహాయంగా ఎవరినైనా ఏర్పాటు చేసుకోవాలి' ఆనందరావు నిర్లిప్తంగా అన్నాడు.

ఎలాగయినా, ముసలితనంలో భార్యాభర్తలిద్దరూ ఒకరికొకరుగా బ్రతకాల్సిందే! ఎంతమంది సంతానం వున్నా, ఎవరిలోకం, ఎవరి వ్యాపకం వారిది– వాళ్ళంతా వాళ్ళ కెరీర్ పీక్ (.......) లో వుంటారు! ఆనందరావు నిట్టూర్పు విడిచాడు. కాని అతని మనస్సుకు ఒక్కరోజులో రెండు షాక్స్(...)– ఒక్కసారిగా అతనిలో ఒక బేలతనం బయటపడింది–

ఆ రోజు రాత్రి కొడుకుల బలవంతం మీద యింటికి వెళ్ళాడు. కాని మనసులో కలత ఏ మాత్రమూ అతన్ని వదలలేదు–

తల్లి వరలక్ష్మి వ్యాధి, ఆ ముసలితనంలో కలిగే స్థితిగా కొడుకులు భావించటం అతడి మనసుకు నచ్చలేదు. ఎలాగో ఒక పేషెంటుని జాగ్రత్తగా చూడటం అవుతుంది కాని తల్లిని సేవించడంగా కనపడటంలేదు. ఏమయితేనేం వున్న పరిస్థితిని (..........) చేయాల్సిందే–

రమణ్, కల్యాణ్ అనుకున్నారు యీ హాస్పిటల్ కనుక అమ్మితే మనం కొని బాగా (.......) చేయచ్చు– ' ఆ మాట పావనితో ఎత్తారు. పావని ఆ (...) ప్రపోసల్ (....) విని ఒక నవ్వు నవ్వేసింది.

'మీరు కొనగలరని నాకు తెలుసు. కాని నేను అమ్మటానికి సిద్ధంగా లేను.'

అన్నది కాని పావని మనసులో ఒక మాట తిరుగుతోంది- ఒక విధంగా 30 సంవత్సరాలుగా యీ హాస్పిటల్ నడుపుతూ చాల అలసిపోయాను. ఇక దీనిని ఎవరి చేతిలోనైనా పెట్టి నడిపించాలి-'

ఈ తలంపు ఆమెకు అంతగా నచ్చలేదు. హాస్పిటల్ ఆమె జీవితంలో ఒక భాగమయ్యింది- నిజానికి రాజారాం, పావని యిద్దరి శ్రమ యీ హాస్పిటల్. పబ్లిక్ కూడ దీనికి చాల వూతమిచ్చారు.(..........) ' అనుకున్నది మనసులో-

ఆ రోజు యింటికి(..........) వెళ్ళినప్పుడు రాజారాంతో అన్నది-

'రాజూ, మనిద్దరం పెద్దవాళ్ళమయ్యాం, యీ హాస్పిటల్ భారాన్ని మోయగల శక్తి మనకున్నదనుకోను. కాని బాగా నడుస్తూ ఎంతమందికో గొప్ప రిలీఫ్ యిస్తూ ప్రశంసలందుకుంటున్న యీ సంస్థను ఎలా యింకొకరికి తగిన వారికి ఒప్పజెప్పడం?

'అవును పావని నీవు చెప్పినది నిజం- కానీ యీ వారసత్వాన్ని ఎవరు సక్రమంగా నిలపగలరు?

కుమారి యిద్దరికీ టీ తెచ్చియిచ్చింది- పావని టీ కప్పు అందపకుంటూ-

'కుమారీ, హాస్పిటల్ నడుపుతావా? అని నవ్వుతూ అడిగింది-

'తమాషా కన్నాను ఏమనుకోకు'.

'అమ్మా, మీరు కాకపోతే యింకెవరు ఆ చక్కటి హాస్పిటల్‌ను నడపలేరమ్మా- అది హాస్పిటల్ అని పేరేకాని, అది ఒక శరణాలయం-

అక్కడ చూపే ఆదరణ, ప్రేమ ఎవరు చూపగలరు!

'అంతేనంటావా ! కుమారి మాటలకు పావని కళ్ళు చెమర్చినయి.

ఈ విషయంలో ప్రభావతిని సంప్రదిస్తే మంచిదేమో- ఆపిల్లకు మంచి హృదయం, సమర్థతా వున్నాయి. ఆలోచనపరురాలు -' రాజారాం అన్నాడు.

ప్రభావతి, పావని తమ్ముడు శివరాం భార్య- అమెరికాలో సెటిల్ అయినారు. దానికి కారణం శివరాం- అతడికి పైపైకి మెట్లు ఎక్కాలని మహా తొందర, ఆశ. అందుకు కావలసిన ప్రయత్నాల్ని శ్రమ అనుకోకుండా, ఏ దారి అన్న విచక్షణ లేకుండా, నిర్విరామంగా ఎదిగే పనిలోనే వుంటాడు.

ఇప్పుడతను న్యూజెర్సీ ఎసెంబ్లీలో మెంబరు కావటానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఒక కంప్యూటర్ కంపెనీ నడుపుతూ, దానితో పాటూ (.....) యివన్నీ (....)లో ఎప్పుడూ తీరిక లేకుండా వుంటాడు. ప్రభావతికి యిదంతా యిష్టం లేదు అయినా భర్త కోసం భరిస్తూ తను ఒక (......) గా మంచి పేరు తెచ్చుకున్నది.– కూతురు (.....) చేస్తున్నది.

'నిజమే, ఇప్పుడే ప్రభావతిని పిలిచి ఒక్కసారి యిక్కడికి రమ్మని అడుగుతాను.'

'ఇప్పుడు వాళ్ళకి(.....) మరో రెండు గంటలు ఆగాలి'– అని

'అయినా, ఆస్పత్రి భారాన్ని యిక్కడే వున్న మంచి ఇద్దరు ముగ్గురు డాక్టర్లని ఒక కమిటీగా ఏర్పాటు చేసి వాళ్ళకు ఆస్పత్రి భారం అప్పజెపితే మంచిదనుకుంటాను'. అన్నాడు రాజారాం.

'అదీ బాగానేవుంది. ప్రభావతి మాత్రం అంతకంటే ఏం చేస్తుంది. తను మాత్రం ఎప్పుడూ యిక్కడ వుండగలదా–'

'అయినా సంస్థలు కూడ మనుషుల మాదిరే– మనిషి పోయిన తరువాత అతని ఆస్తిపాస్తులు, పితృకార్యాలు అన్నీ ఎవరెవరు చేయాలో శాస్త్రాలు, సంప్రదాయాలు నిర్ణయించినయి. అలాగే సంస్థలు కూడ– ఏదో ఒక కమిటీ చేతిలో పెట్టి ఆ కమిటీ మీద విశ్వాసముంచాలి. సంస్థలూ మానవుల మాదిరే– ఎప్పుడూ ఒకే స్థాయిలో వుండవు– అందు వలన స్థాయి తగ్గకుండా వుండే ప్రయత్నం చేయకూడదనికాదు–

ఇద్దరూ మౌనంగా వుండిపోయారు– ఎవరి ఆలోచనల్లో వారు వుండిపోయారు.

కోనేరు ప్రశాంతంగా వున్నది– ఆకాశం అందులో ప్రతిబింబిస్తున్నది– కోనేరు చుట్టూ పెంచిన పూల పొదలు మెల్లగా కంటిచూపుల నుండి అదృశ్య మవుతున్నాయి. కోనేటిలో చంద్రుడు పైకి వస్తూ కనిపించాడు. తారకలు మినుకుమంటున్నాయి.

కుమారి వచ్చి భోజనానికి రమ్మనేదాకా ఎవరూ మన లోకంలో వున్నట్లు

కనిపించలేదు– పావని, రాజారాంలు లోగడవున్న శక్తి తగ్గిపోతూ, కొంతవరకు ఆలోచన కూడ భారమవుతున్నట్లుంది. వాళ్ళకి సహజమయిన సంతోషం, చలాకీ వుండటం యివన్నీ పూర్తిగా వాళ్ళని వదల్లేదు– జీవితంలో ఇదివరకున్న ఆసక్తి, ఏదో చేయాలన్న తపన యిప్పుడున్నట్లుగా తోచదు. ఇది వారికి తెలుస్తున్నట్లే వుంది.

కాలంలో యిన్ని దశాబ్దాలు గడిచినయి. ఏమిటిచేశాం ఏమి మిగిలింది– ఇదే ప్రశ్న. ఒక రకంగా ఆనందరావుకీ వస్తున్నది– విష్ణుమూర్తికీ వస్తున్నది– ఏమిటా ప్రశ్న అంటే ఎవరూ స్పష్టంగా చెప్పలేరు.(..............)

ఎవరికీ అర్థం కానిది–'కాలం'

కాలం – ఆ కాలంలో యిప్పుడు పావని

రాజారాం మనసులో పాటలా కదిలిపోతున్నది–

'రాజా, ఏమిటి యీ కాలం – కనపడదు

వినపడదు– కాని మనవెంట వుంటుంది– మనపై

మరకలు వేసినట్లుంటుంది–

రాజారాం,

కాలం కదిలిపోతుంది

పావని :

అది దాని లక్షణం

రాజారాం :

కనపడని కాలం

ఎవరికీ కనపడని కాలం

ఎవరికీ అందని కాలం

సూక్ష్మాతి సూక్ష్మం కాలం

అందరినీ చూసి ఆవహిస్తుంది.

పా:

ఆ కాలం– అయితే

ఆ కాలం మనలో వుందా
మనం ఆ కాలంలో వున్నామా
రాః
మనలో కాలం వుంటే
మనం మానవులమే
మనం కాలంలో వుంటే
మనం మానవులం
పాః కాలానికి గొళ్ళెం వేస్తే
రాః మనం మానవులం
పాః కాలానికి కళ్ళెం వేస్తే
రాః మనం మంచి మానవులం
పాః కాలం వెనక్కి మళ్ళీ
రాః మనసులో నిలిస్తే స్మృతి
పాః కాలం ముందుకు సాగి మనల్ని దాటేస్తే
రాః అది భవిష్యత్తు స్వప్నం
పాః మధ్య లోది?
రాః నిలకడలేని, పరుగిడుతూ, నిలిచే యిప్పటి క్షణం
పాః స్మృతులా, స్వప్నాలా నిలకడలేని క్షణాలు, ఇవన్నీ ఎక్కడ దాగున్నాయి

రాః అన్నీ మన మనసులోనే, మనది అనుకున్న మనల్ని ముంచేస్తూ ఆవరించి అల్లుకున్న మనస్సులోనే ఉనికి తెలియని మనస్సులోనే

పాః ఈ మనసును ఎలా పట్టుకోటం, మనచుట్టూ వున్న మనసు, మనకందకుండా వుంటే మనకెలా తెలుస్తుంది?

రాః తలపులనే నా చెవి ముందుకు త్రోసి, తన వునికి తెలుపుతుంది. అందకే తలపుని తరిమేస్తే, కాలం లేదు మనసూ లేదు

పాః వున్నది మాత్రం వుండాల్సిందే, వుండాల్సిన దానికి యింత మరుగెందుకు, ఆ మరుగు తను వేసుకున్నదేనా నేనునేనేది అదేనా, తెర తీస్తే

యిక నేనూ మీయమా

రాః ఇక ఆ తెర మాయమయితే

పాః అంతే, ఆ నేనే కరిగిపోతే

రాః అమ్మో నేనిక వుండనా

పాః వుండవు– నేనుగా వుండను, అందరుగా అంతాగా వుంటాన్ అంతా నీవేగా వుంటావ్

రాః మరి నేనెలా వుంటాను

పాః వుంటావు మౌనంగా, ఆనందంగా, విస్తృతంగా

నీతో నీవే ఆడుకుంటూ, కలలూ, స్వప్నాలూ, క్షణాలూ, అన్నీ కలసి కలబోతగా బ్రతుకుతావు, ఆ బ్రతుకు నీవే

రాః అంటే

కాలం, తలపులూ, మనసూ, అహం, ఆత్మా, పరమాత్మా, యిలా సాగితే పరమాత్మా, పరంధాముని, అలా సాగితే కాలంలోకి తిరుగు ప్రయాణం

పాః బహుశా–

నీవూ, నేనూ యీ ప్రపంచం, ఇదంతా తెలిసి బ్రతికితే

రాః తెలియటమంటే'అది' దా

అవటమే– అంటే అస్తి

పాః 'అస్తి'గా, 'నాస్తి' లో నడుస్తూ

'నా' ను కొట్టివేయి

యిదీ యీ ప్రపంచ ప్రస్థానం

రాః రాయటానికి, అనుకోటానికి తీరిక కాని–

ప్రస్థానానికి గులాబీ ముళ్ళ తీరు

పాః రెక్కల పొద, గులాబీ రెక్కలమీద

నడక సుతి మెత్తన

ముళ్ళమీద నడక

రక్త స్రావమే

రెండూ బొమ్మా బొరుసూ
రాః సుఖం పూర్వ రూపం
దుఃఖం వుత్తరరూపం
నవ్వు పూర్వ రూపమయితే
ఏడుపు వుత్తరరూపం
పాః రెండూ
యీ యుగ పరిభాషలో
కాలంలో పరిణామాలు
ఒకటి ముడుచుకొని
మరొకటి ఆవిష్కారమవుతుంది
ఇదే-యిదే-
యిది తెలిస్తే
రాః అంతా మందస్మితమే
మధురమ్-మధురాలాపమే
పాః అంటే కాలంలో
దేహం,మనస్సు, ఆత్మ, అనం
అంతా చిల్లర చిల్లర బొమ్మలా?
ఆటబొమ్మలు-
రాః ఏమిటిది-యిదేదో డ్యూయట్‌లా
జరిగింది- బహుశా మనిద్దరం మనకు
తెలియకుండా, ఒక్కటిగా బతికాము కాబోలు
అప్పటికి చాలా పొద్దుపోయింది-
భోజనాలకు వచారు-
వాళ్ళ మాటలు, పాటల్లావుంటే వింటూ
కుమారి నివ్వెరపోయింది - చకితురాలయింది.
ఇదే కాబోలు సతీపతి,అర్థనారీశ్వరతత్త్వం అంటే

## 11

మరునాడు వుదయం పావని, రాజారాం యిద్దరూ లేచి, స్నానం చేసి, వరండాలో వచ్చి కూర్చున్నారు– ముందు కోనేటిలో నీళ్ళు మెరుస్తున్నాయి. బాల సూర్యుని కిరణాలు చాల ఆకర్షణీయంగా ఆ నీటిలో మెరుస్తున్నాయి. అలా అనటం కంటె ఆ నీటికి మెరుగులద్దుతున్నయ్యనటం సరిగా వుంటుంది.

రాజారాం కాఫీ త్రాగుతూ పేపరు విప్పాడు– పావనీ కాఫీ సిప్ చేస్తున్నది.

పేపరు నిండా రేప్‌లు,ఉగ్రవాదం, హత్యలు, దొంగతనాలు– రాజారాంకు యిదంతా ఏవగింపనిపించింది– ఈ హింసకు అంతం లేదా– ప్రపంచంలో ఎటు తిరిగినా వుగ్రవాదమే– హింసేనా–

అప్పుడే పురుషోత్తమరావు వస్తూ,

'సర్, యీ రోజు వుప్మా బాగా కుదిరింది. మీరు చాల ఎంజాయ్ చేస్తారు' అని రెండు ప్లేట్లలో వుప్మా వాళ్ళిద్దరి ముందు వుంచాడు.

'ఏ రోజున మీ హెూటల్ టిఫిన్లు బాగుఃండలేదూ!

'నిజానికి ఒకసారి మీ టిఫిన్‌లకు అలవాటు పడితే యింక ఏదీ సయించదు' అన్నది పావని.

'అది మీ అభిమానం' అని తిరిగి వెళ్ళబోతుంటే

'పురుషోత్తమరావూ, యీ మధ్య వారం రోజులుగా అసలు కనపడటం లేదు. వూళ్ళో లేవా? లేక మీకేమయినా పెద్ద పనా? రాజారాం అడిగాడు.

'అదీగాక మీ హెూటల్ దగ్గర పోలీసులు తరచూ కనపడ్డారు'

'అది మా మూడవవాడి ఘనత. వాడు నక్సలైట్ వుద్యమంలో చేరాడు.'

మీ యిద్దరు పిల్లలు యీవూళ్ళోనే హెూటల్ నడుపుతున్నారుగా'

'అవును యీ చిన్నవాడు బాగా చదువుకున్నాడగా, వాడికి ప్రపంచంలో అన్యాయం, పరపీడనా, కసి యివి బాగా అర్థమయినయి. మంచితనాన్ని హింసద్వారా పెంచాలనీ, సమసమాజం ఎలాగైనా, అవసరమైతే తుపాకి ఉపయోగించి సాధించాలని నమ్మడం మొదలుపెట్టిన నక్సలైట్ వుద్యమం వైపు ఆకర్షితుడయ్యాడు. వాడిలోని ఒక బలహీనత వాళ్ళమ్మను ఒక్కసారయినా

చూడనిది వుండలేదు. అదేమిటో ఆవేశాలు ఆవహించినవాడికి, యీ మమత ఏమిటో– వాడి వుద్దేశ్యంలో వాళ్ళమ్మ వాళ్ళనాన్న బాధితులు. ఆమె కూడ వాడంటే విపరీతమైన మమత, ప్రేమ. వాడు కనపడ్డరోజు ఆవిడకు పండగ. వాడు వస్తున్నట్లు పసిగట్టి పోలీసులు మా యింటి చుట్టూ పహరా కాస్తూ వుంటారు. వాళ్ళకూ నా ఫలహారాలంటే యిష్టం లెండి'– అని నవ్వాడు–

' అదేమిటి పురుషోత్తమరావు– నీ కొడుకు నక్సలైట్ అన్న విషయాన్ని చాలా యదాలాపంగా, తేలికగా తీసుకొని చెపుతున్నావ్! రాజారాం ఆశ్చర్యపోయాడు.

'ఒక్క మాట రాజారాం గారూ, ప్రజలందరూ సంఘాన్ని పీడిస్తున్నారనటం ఎంత సబబు. చవకబారు తత్త్వం కాకపోతే, సంఘంలో మంచివారూ యింకొకరికి మంచిచేసేవారూ లేరా? వాళ్ళున్నారు కాబట్టే కదా ! యింకా మనందరం బ్రతకగలుగుతున్నాం– చీమ చిటుక్కుమన్నా అది పీడించడమని , తుపాకీ పేలిస్తే ఎలా?'

'నీవు చెప్పేది అక్షరాలా నిజం. కాని అటువంటి నీ కొడుకుల్లో ఒకడిని చాల సహజంగా, నెమ్మదిగా చెపుతున్నావ్– ఆశ్చర్యంగా వుంది– అయ్యో అని నీకెప్పుడూ అనిపించలేదా'?

'అనిపించకేం– కాని చేసేదేముంది– మొండిపట్టువాడితో వాదించడం నాకు చేతకాదు– యింటికి వచ్చినప్పుడు, రహస్యంగా వచ్చి, రహస్యంగా వెళ్ళిపోతాడు. వాళ్ళమ్మకు వూరట–

'నీవు నిజంగా పెద్ద ఫిలాసఫర్‌వి– ఉగ్రవాదం నీ కాళ్ళ దగ్గర వున్నా, దానివల్ల నీకే పెద్ద ప్రమాదం వుందని తెలిసినా యింత ప్రశాంతంగా వుండగలిగావంటే హాట్స్ ఆఫ్'

' ఏమో ఇది చేతకానితనం కూడ కావచ్చుగా సర్! ఇక వెళతాను – మళ్ళీ పోలీసులు – నా రెగులర్ కస్టమర్స్– వస్తారు. వాళ్ళకి నా జవాబు కానీ నమ్మదగినవిగా వుండవు'– అని నవ్వుతూ వెళ్ళిపోయాడు.

రాజారాం, పావని, అలా వెళ్ళిన పురుషోత్తమరావు వైపే చూస్తూ

వుండిపోయారు. ఇద్దరు పురుషోత్తమరావు తెచ్చి యిచ్చిన వుప్మా తిని

'నిజంగానే అమోఘంగా వుంది- ఎందుకో యితగాడికి మన మీద యింత అభిమానం!' రాజారాం మళ్ళీ పేపర్లోకి దూరిపోయాడు.

ప్రపంచంలో ఏ దేశంలో చూసినా, ఏదో ఒక రకమయిన హింసా గాథలే. వందలాది ప్రజలు బాంబు ప్రేలుళ్ళకు చిదిమి చెదిరి పోతున్నారు. రెండు రోజులపాటు వార్తలు దానిమీదనే. మళ్ళీ మరో రెండు రోజుల విరామం తర్వాత మరో దేశంలో హింసాకాండ. ఇదేదో అగ్నిపర్వతాలు, తుఫాన్లు, భూకంపాలులాగ ఒక ఫార్ములా ననుసరించి వస్తున్నయ్యేమో ననిపిస్తుంది- ఇలా అంతర్యుద్ధాలు, మతపరమైన దాడులూ, పరస్పర శతృత్వాలు, రాజకీయ హత్యలు- దేశాలమధ్య ఎడతెగని టెన్షన్స్ యింకా హ్యూమన్ అటాక్స్-ఏమిటిది- యీ హింసాకాండకు ఏ దేశమూ, ఏ ఖండమూ, ఏ మానవ సంఘం తప్పించుకుంటున్నట్లు లేదు.

ఇదో రకమయిన మూడో ప్రపంచయుద్ధమా- ఎందుకో కసి, ఒక రసంలా అందరినీ ప్రమింగేస్తున్నది. రాజారాంకి తను చదివిన ఒక గీతం గుర్తుకు వచ్చింది-

ఇది మూడో ప్రపంచయుద్ధం
ప్రపంచమంతటా పరుచుకున్న యుద్ధం
వేర్పాటువాదుల యుద్ధం
మతం, ధనం జాతి
రంగు, లింగాల బేధం
కల్పించిన వేర్పాట్లు
పోషించిన ముఠాల యుద్ధం
రాజ్యాల్లో ముఠాలు
ముఠాల్లో ముఠాలు
మఠాల్లో ముఠాలు
శ్రీమంతు ముఠాలు

సిరిసంపదల ముఠాలు
గిరిశృంగపులీనపైన
కొలువైన కబేరుల ముఠాలు
అవని మీద వనసీమల
నడుమ నిలిచి ఆకలితో
అరచి అరచి అలిసిపోయి
కసి నిండిన కసి మ్రింగిన
బీదల సమూహాలు
అందరూ ఆవేశంతో
ఆయుధాలు పట్టి పట్టి
తమ శత్రువులెవరో తెలియక
ఎక్కడ వున్నారంటూ
వెదకి తుదముట్టించాలంటూ
దొంగ చాటు దొంగదెబ్బ
కసిగా తీసి నవ్వాలని
తహ తహలాడుతూ నవ్వుతున్న
విస్తృత విహారం
దొంగల విహారం
వీరుల దొంగ వ్యవహారం
యీ తీరున నడుస్తున్నదీ
నాటి మూడవ ప్రపంచరణం
ఇప్పుడు అక్కడా ఇక్కడా
అంతటా అలుపెరగక
నడుస్తోంది నడుస్తోంది
మూడవ ప్రపంచరణం
ఎలా దీన్ని చేయటమంతం

యీ మూడవ ప్రపంచరణం
ఎప్పటికప్పుడు ఆది
ఎప్పటికప్పుడు అంతం
విరామాల నడుమన
విలాసంగా, వికృతంగా
అందరినీ అదిలిస్తూ
విశ్రాంతిగ నడుస్తున్న
చిన్న చిన్న రక్త సిక్త
యుద్ధాల పెను సమాహారం
ఎలా దీనిని చేయటమంతం?
మారాలి మనసులు
కలగాలి మనస్సుల్లో
మనమంతా మనుజులం
అన్న మంచి భావన
అసమానవారే ఆశల బీజాలు
వాటిని తగ్గించి
దయను పెంచి దాక్షిణ్యం
వాహినిలా ముంచేస్తే
మారుతుంది ప్రపంచం
ప్రజాస్వామ్య ప్రపంచం
ప్రజలే ప్రభువులన్న
మేలిమి సిద్ధాంతం
మసి తరిగి పసిడి కళలు తేలుచుండ
తమ బ్రతుకుల పోరుబాట
విడిచి గడప వలెనని
సలపాలి పోరు మనసున

ఏనాడూ వీగిపోవు
నీవుంటే నీ అండన
అని యీ నా వూహలు
మనసున ముళ్ళు గుచ్చి
ముక్కలుగా చేసేస్తూ
బుజ్జగించి ఒంటిమీద
సాపాకేస్తూ సలుపుతుంది
ఏమనాలి ఈవూహల
ముళ్ళకండనేమనవలె
ఏమనవలె నేమనవలె

రాజారాం మనసులో మెదిలిన ఈ గీతం అతన్ని చలింప జేసింది– పేపరు క్రిందబెట్టె.

'పావనీ, ఎందుకో యీ మనుషులు, నాయకుల దేశాలు– వీరికి ఒకరి మీద ఒకరికి ఏదో ఒక కసి వాళ్ళ మనసును తొలిచేస్తుందనిపిస్తుంది'–

'అవును అలాగే వుంది. నిజమే నీవు చెప్పింది. నిత్యం మన జీవితాల్లో యిది చూస్తూనే వున్నది– ఒకడు కసిగా డబ్బు సంపాదిస్తాడు– ఒకడు కసిగా ఇతరులను లొల్లి చేస్తూవుంటాడు. తిడతాడు, కొడతాడు– అర్థం లేని కసి'– పావని స్పందించింది.

'కసి మనిషిని తొలిచేస్తుంది'

కసి కాటేస్తుంది. విషం ప్రాకి వివశం చేస్తుంది–

'మాంసం కుళ్ళి
వళ్ళంతా కలబోస్తుంది
వివేకం, వివేచనా
విమోచనం పొంది
విషం మాత్రం మిగులుతుంది–

పావనిలో చాల ..........వచ్చినట్లు అన్నది.

రాజారాం అన్నాడు. కవిత్వంలో చెప్పాలంటే
‘విషక్షేత్రం బుగబుగలాడుతూ
బుడగలా విరజిమ్ముతుంది
పగరేపిన సెగకు
మనసు పొగబారి పోతుంది
పొగపొరలు దట్టమై
కనుచూపు కరవై
చూపున్న గుడ్డివాడిలా
అంధుడవుతాడు మనిషి
వెర్రివాడయినా వేసారి పోకుండా
పొగ పీల్చి పరవశిస్తాడు
అప్పుడు’ పావని అందుకుంది
కనిపించినదే మార్గం
నడిచిందే నడవతగిన త్రోవ
అవుతుందా మానవుడికి
ఆసూ పాసూ నన్నూ లేన్నూ
కానని ఆ అంధ జీవికి
అతడికి అదే మోదం
సంతోషం సంతృప్తి
పొగజారితే అతడి మనసు
వెలవెలబోయి వెట్టిగా చూస్తాడు.
రాజారాం తేరుకుంటూ అన్నాడు.
‘మనిషిలో యింత కసి ఎందుకు పుడుతుంది?

ఈ భావాన్ని శ్రీ కృష్ణ భగవానుడు భగవద్గీతలో చాల క్లుప్తంగా రెండు శ్లోకాల్లో చెప్పుతాడు.

మనిషి ఒక దానిమీద యిష్టం పెంచుకుంటాడు. దానిని తనకు కావాలని కోరతాడు. ఆ కోరికతోనే మోహితుడవుతాడు– దానితో బుద్ధిని కోల్పోతాడు.కోల్పోయి నష్టపోతాడు.

కుమారి వచ్చి చెరి ఒక గులాబీ యిచ్చేదాకా యిద్దరూ యీ లోకంలో లేరు.

## 12

ఆ రోజు పావని హాస్పిటల్ వెళ్ళేసరికి వరలక్ష్మి టెస్ట్ రిపోర్ట్స్ అన్నీ వచ్చాయి.

............... లో వున్నదని తేలింది. ఇది ....... రెండు మూడు రోజులు అబ్జర్వేషన్‌లో వుంచి డిస్చార్జ్ చేస్తామని డాక్టర్లు చెప్పారు. ఆమెకు ఇంటిదగ్గర తగిన సహాయం పోషణ వుండాలన్నారు.

అక్కడ వున్న రెండు రోజులూ కల్యాణ్, రమణ్ యిద్ధరూ హాస్పిటల్ ఎలా నడుస్తున్నదీ క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఆస్పత్రి చాలా శుభ్రంగా దాదాపు ,,,,,,,,,,,,కి అనుగుణంగా నడుస్తుంది.

విశేషమేమిటంటే, యీ హాస్పిటల్‌లో పేదలకు ఉచితంగా వైద్యం చేసే వింగ్ ఒకటి వుంది. అది కూడా పేమెంట్ వార్డ్స్ లాగే ఎంతో శుభ్రంగా వుంది. చాలా బాగా నడుస్తోంది.

'అంటే పావనికి, రాజారాం గారికి సేవాభావం ఎక్కువన్నమాట– అది యీనాటి కార్పొరేట్ సోషియల్ రెస్పాన్స్‌బిలిటీ లాంటిది. (....) బయటికి యిచ్చే బదులు యిక్కడే ఆ పని చేస్తున్నారు.' అని యిద్ధరూ సర్దిచెప్పుకున్నారు. కాని వారికి తెలియనిది ఏమిటంటే, యీ పద్దతి గత 30 ఏళ్ళుగా నడుస్తోంది. వాళ్ళకి ఆశ్చర్యమేసింది–

'పావని గారికి సేవాభావం ఎక్కువన్నమాట. నిజానికి డాక్టరు చేసేదంతా నేనే– ఎన్ని విధాలుగానో పెయిన్ రిమూవ్ చేస్తారు. అంత కంటే యింకా ఏం సేవ కావాలి'–

సోదరులిద్ధరూ అనుకున్నారు.

'మనం ఇండియాలో............ఎందుకు ప్రారంభించకూడదు? ఎంతకాలం మరొకరి ఆస్పత్రిలోనే సేవలు చేస్తాం. కల్యాణ్ దంపతులు, రమణ్ దంపతులు కలిస్తే మంచి పానెల్. రమణ్ భార్య సునీత హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌లో గ్రాడ్యుయేట్.

ఈ ఆలోచనకు కార్యరూపం యివ్వాలని నిశ్చయించుకున్నారు. పావని హాస్పిటల్స్ ఎందుకు కొనివెయ్యకూడదు? ఆ ఆలోచన రాగానే మరునాడు పావని దగ్గర ఆమెతో అన్నారు.

'పావనిగారూ, మీ హాస్పిటల్ చాలా బాగా నడుస్తున్నది. బెస్ట్ ప్రాక్టీసెస్ అన్నీ మీరు ఫాలో అవుతున్నారు. మీకు ఫండింగ్ ప్రాబ్లెమ్ రాకుండా మేము కూడా దీనిలో పెట్టుబడి పెడదామనుకుంటున్నాం.

'నేను, రాజు పెద్దవాళ్ళమయినమాట నిజమే కాని మాకు చేతనయినంత వరకూ, వయస్సు అనుమతించినంత కాలం దీనిని మా అధ్వర్యంలో నడపాలని అనుకుంటున్నాం. దీనిని ఇంకా విస్తరించాలన్న వుద్దేశ్యం మాకు లేదు– అయినా మాకు యిది భారమనిపించినపుడు తప్పకుండా మీ ఆఫర్ విషయం ఆలోచిస్తాం'– చిరునవ్వుతో జవాబిచ్చింది పావని–

కరడు కట్టిన ఆధునిక వ్యాపారవేత్తలయిన ఆ యిద్దరు డాక్టర్లూ ఏ విధంగానూ నిరాశ చెందలేదు– రెండు రోజుల తరువాత వరలక్ష్మి డిశ్చార్జి అయి యింటికి వెళ్ళింది–

కాని పావని మనసులో ఒక బీజం పడ్డది–

'రాజూ, నీవూ నేనూ పెద్దవాళ్ళమయ్యాం. ఇది వరకులా యీ ఆస్పత్రి నిర్వహించగల సమర్థత నానాటికి తరిగిపోతుంది – కొంతవరకు యిప్పటికే అది జరుగుతోంది–'

'అవును యీ విషయంలో మనం ప్రభావతిని శివరాంని సంప్రదించటం బాగుంటుంది' అన్నాడు రాజారాం.

ఆరోజు రాత్రి పావని ప్రభావతికి టెలిఫోన్ చేసి ఒకసారి ఇండియా రమ్మని అడిగింది.

'వదినగారూ, తప్పకుండా వస్తాను. కాదు వస్తాం. ఇప్పుడు మీ తమ్ముడు శివరాం చాల బిజీగా వున్నారు. తాను నానా తంటాలుపడి యిక్కడి రాజకీయాల్లో తలదూర్చి సతమతమవుతున్నారు. బహుశా యీ స్టేట్ అసెంబ్లీ త్వరలోనే డెలిగేట్‌గా, అంటే మెంబరుగా ఎన్నిక అయ్యే అవకాశాలున్నాయి. అదుగో మాటల్లోనే వచ్చారు. మీ అక్క ఆన్ ది లైన్' అని ఫోన్ చేతికిచ్చింది.

'అక్కా , నేనే చేద్దామనుకుంటున్నాను. నీవు బావ యిక్కడికి రావాలి. నేను యిక్కడి అసెంబ్లీకి ఎన్నికయ్యాను. ఆ సమయంలో నీవూ బావా మాదగ్గర వుండాలి.'

'ఆస్పత్రి వదిలేసి ఎలా రావటం'- డాక్టర్లు చూసుకుంటారులే. నీవు లేకుండా అక్కడ ఏదీ జరగదా- నీవు , బావ వస్తున్నారు- అంతే! రేపే మీ యిద్దరికీ టికెట్లు పంపుతున్నాను.' అని ఫోను పెట్టేశాడు.

ఇదీ ఒకందుకు మంచిదే- అక్కడే యీ ఆస్పత్రి భవిష్యత్తు కూడ ఆలోచించవచ్చు- అని రాజారాం అన్నాడు.

వారం రోజుల తరువాత యిద్దరూ బయలుదేరి వెళ్ళారు. తోట చూసుకోటానికి కుమారి, నీహార్‌సింగ్ వున్నారు. వాళ్ళను అజమాయిషీ రాగిణి చేస్తుంది. హాస్పిటల్‌ని తన తరువాత సీనియర్ డాక్టర్లు నడిపేటట్లుగా ఏర్పాటు చేసింది.

ఇద్దరూ బయలుదేరి న్యూజెర్సీకి వెళ్ళారు – శివరాం దంపతులు చాల సంతోషించారు. వీళ్ళు వెళ్ళిన మరో 10 రోజులకి Swearing in of Deligates. శివరాం చేస్తున్న హడావుడి అంతా యింతా కాదు. దానికోసం స్పెషల్‌గా సూటు కుట్టించాడు. ఆ సూట్‌ని ఎలిజబెత్ చూజ్ చేసింది. ఎలిజబెత్ యిప్పుడు శివరాంకి చాల కావలసిన మనిషి. అతడికి డెమోక్రటిక్ పార్టీలో ప్రాభవం రావటానికి కారణం- మంచి ఆస్తిపరురాలు.

శివరాం కంటే 10 సంవత్సరాలు పెద్దది – ఆమెకి భర్తకీ పడక రెండేళ్ళ క్రిందట విడాకులు తీసుకున్నారు. ఎలిజబెత్‌కి ప్రభావతి అంటే చాల ప్రేమ. ప్రభావతికి శివరాం ఆంబిషన్స్ నచ్చవని ఆమెకు తెలుసు. శివరాం ........లో

తప్పేమిటో ఆమెకు అర్థం కాలేదు.

'ప్రభా, శివకి మంచి తెలివితేటలున్నాయి, మంచి బిజినెస్ మాన్, మంచి పొలిటీషియన్ అవుతాడు' అంటుంది.

ఆ దిశలో శివరాం జీవితం మలుపు తిరగటం తనకెందుకు నచ్చటం లేదో ప్రభావతికి స్పష్టంగా తెలియటం లేదు–

'లిజ్ (ఎలిజబెత్ పేరు చిన్నగా) రాజకీయాలంటే నాకు చాల వెగటు, భయం. నిజాయితీ లేని, వుండటానికి అవకాశం లేని ప్రొఫెషన్ అది అని నాఅభిప్రాయం. అది నా మైండ్‌సెట్ అని నీవనుకోవచ్చు'–

వాళ్ళు చెప్పే మాటలకు, చేసే పనులకూ పొంతన వుండదు – ఈ మధ్య ఒక తెలుగు కవి రాజకీయాలెలావుండాలో, యిప్పటి నాయకులు అలా ఎందుకు లేరో– చాల చక్కగా చెప్పాడు– నాయకులు, రాజకీయాలు అనే శీర్షికతో యిలా వ్రాశాడు. 'చదువుతా విను లిజ్' అని చదివి వినిపించింది.ప్రతి లైనూ యింగ్లీషులోకి తర్జుమా చేస్తూ చెప్పింది.

రాజకీయాలు, రంగులు మార్చటానిక్కాదు, రంగులు పులమటానిక్కాదు, హరివిల్లులా రంగులు మార్చటానికి రంగులన్నీ కలిపి, కలిపి ప్రజల కళ్ళలో వెలుగులు నింపటానికి. రాజకీయాలు పదవులు పంచు కొనుటకు కాదు. తమ ధనం పెంచుకొని పబ్బం గడుపు కోవటానికి కాదు. ప్రజల సంపద పెంచి పదవుల పరపతి పెంచటానికి, పదవులు సింహాసనాలు కాదు. పదవులు ప్రజలపై ఆసనాలు కాదు. ప్రజలకు అధికారం వేసే ఆసనాలు.

ప్రజలు నాయకులకు వేయించే పద్మాసనాలు
సంఘమనే సరస్సులో పూచే పద్మాలు
పదవులు, సొగసులు బంధించి
కళ్ళను మురిపించి, ప్రజల జీవితంలో
సంపద పరిమళాలు నింపే పద్మాలు
రాజకీయాలు కావు
ఉద్రేకం పూరించే మాటల తూటాలు

రాజకీయాలు మనసుల నూపించి
సంపద వైపు మళ్ళించె
మధుర గీతాల మలయ వాయువులు
రాజకీయాలు కావు రెచ్చగొట్టే
కుతంత్రాల మహా వ్యూహాలు
పడగొట్టే పద్మ వ్యూహాలు కావు
మంచిని యింపుగా పెంచే జల్లు రచనలు
పదవులు పెంచుకోవాలి
ప్రజల మనసుల్లో మంచిగా నిలిచి
చేసుకోవాలి నాయకులు
తమ జీవితాలను శిల్పారామాల్లా
పదవులు కావాలి నృత్య ఘంటికలుగా
ఘంటికలు మ్రోగాలి ప్రేమ నినాదంగా
రాజకీయాలు రంగుల మార్పులు కావు
కావు రంగుల చేర్పులు
అవి రంగవల్లికలు
సమరాలు కావు, సంక్షోభాలు
అవి సమరసాలు
ప్రజల మనసులందు కలుగు సమన్వయాలు

ఇదంతా విని ఎలిజబెత్ అమాంతం ప్రభావతిని కౌగలించుకుంది– 'ప్రభా, దీన్ని ప్రింట్ చేసి అందరికీ పంపుదాం– వినటానికి హాయిగా వుంది– నిజంగా యిలా వుంటే అందరికీ పండగే'–

'ఇప్పటి నాయకులెలా వున్నారు కూడ చాల అందంగా చెప్పాడు– రెండు పాదాలు వినిపిస్తాను.

పట్టువీడని పిట్లనాయకుడొకడు
తలవంచి, ప్రజల తలవంచి కొట్టాడు.

సొల్లు మాటల పొల్లునాయకులను
మాటల మొనగాళ్ళు, మాఫియాగాళ్ళు
పిచ్చిప్రజలను రెచ్చగొట్టారు.
తీరయిన దేశం తారుమారయ్యింది.
ఇది విన్న ఎలిజబెత్ అన్నది.

'నీవు ........ చేసిన ...... ఎవరో మంచి దార్శనికుడిలా వున్నాడు. స్వార్థం చాలా ఎక్కువయ్యింది– స్వార్థం లేకుండా పని జరగదు. జీవితం సాఫీగా నడవాలంటే మనిషిలో స్వార్థం కొంత వుండాలి. అదే వారు జీవితాన్ని ప్రేమించాలి– You must love life – దాని వలన మన వాతావరణాన్ని చెడగొట్టే దుష్టత్వం మాత్రం వుండకూడదు. అంటే Enlightned selfness which does not deliberately destroy the society around , of which you are a part. కాని చాల సార్లు Religion పేరుతో Development పేరుతో తనకిష్టమయిన పనులు చేసి సమర్థించుకుంటున్నాడు–

ఎలిజబెత్ మాటలకు స్పందిస్తూ

'లోగడ వుటంకించిన కవి మీ జీవితం సాగాలంటే స్వార్థం వున్నా ఎలా వుండాలో చాల నీట్‌గా వర్ణిస్తాడు. Let me read it for you – (తెలుగుకు English Translation చేస్తూ వినిపిస్తుంది.

జీవితం సాగాలంటే
జీవితం మీద మమత పెంచుకోవాలి
ప్రతిక్షణం జీవితమంతం కావాలి
ప్రతిక్షణాన్ని గౌరవించి
కాలానికి పెద్దపీట వేయాలి
జన్మలూ మరణాలూ
అంటూ వుంటే అవి సహజమని
ప్రతి జన్మ అదొక్కటే వున్నదని
దాన్ని అంటుకుని అనుసరించి

జీవించాలి.

భగవంతుణ్ణి అందుకే

ప్రేమించి అర్థించాలి.

అష్టైశ్వర్యాలు, వంశాకురాలు

అన్నీ తన ఉనికిని పెంచి

స్థిరం చేస్తాయనుకోవాలి

అజ్ఞానికి అందమయిన ఆభరణం

జ్ఞానమనుకోవాలి

జ్ఞానానికి సరి అయిన తొడుగు

అజ్ఞాన మనబడేదనుకోవాలి

అప్పుడే జీవితం

జీవితం మనదవుతుంది.

జీవితం మీద మనం

ఆధారపడగలం–

ఇది విని ఎలిజబెత్ ఫక్కున నవ్వింది.

'This holds like a corporate philosophy of action and living his life-great, great- 'Siva perhaps intentively understanding this poet' .

కించమాడి

'ప్రభా, అంతా life అంతా ఒక కాంప్రమైజ్ అర్థమయి కొంత, అర్థం కాక కొంత– ఆలోచించికొంత అనాలోచితంగా కొంత.

ఈ విధంగా చాలాసార్లు ఎలిజబెత్, ప్రభావతి మాట్లాడుకోటం జరుగుతుంది– అందుకే వాళ్ళిద్దరికీ ఒకళ్ళమీద ఒకళ్ళకు గౌరవం– ఎలిజబెత్‌కి శివరాం అంటే ఒక Ambitious Kid –

Swearing in జరిగిన రెండు రోజులకి ఒక ఉదయం పావని శివరాంని పిలిచింది. అతను బయటకు వెళ్ళటానికి తయారవుతున్నాడు.

'శివరాం, నీతో హాస్పిటల్‌ని గురించి మాట్లాడాలి'–

'సరే అక్కా –యీ రోజు రాత్రి మాట్లాడుకుందాం' అని వెళ్ళిపోయాడు.

ఆ రోజు రాత్రి

పావని, రాజారాం, శివరాం, ప్రభావతి కూర్చున్నారు.

'నేను రాజా పెద్దవాళ్ళమవుతున్నాం – అవుతున్నాం ఏమిటి– అయ్యాం ఇక అంత పెద్ద హాస్పిటల్ నడపడం మాకు కష్టమవుతున్నాది' –

'ఎన్ని బెడ్స్ వున్నాయి' –

'50 Beds paid and fifty free' అన్నది పావని–

'ఎవరయినా నీకు సహాయం చేయాలన్నా ............... తో లాభాల ప్రశ్న వస్తుంది.' శివరాం అన్నాడు.

'కాని అది మా ఫిలాసఫీకి సంబంధించినది. అలా దాన్ని నడిపాం. మా అజమాయిషీలో వున్నంతకాలం అలాగే నడుస్తుంది– అలా నడిపే వాళ్ళనే మనం చూసుకోవాలి–

'అది చాలా కష్టమే అక్కా'

'నీవు ప్రభావతి అక్కడికి వచ్చి దాన్ని నడపకూడదూ' రాజారాం అన్నాడు.

'కష్టం బావా– ఇక్కడ నా రాజకీయజీవితం నిజంగా యిప్పుడే మొదలయింది. దానిని కాదని నేను ఎక్కడికీ రాలేను– ఇక్కడనుండి దానిని నడపటం కూడా కష్టమే–'

'అంటే అది నీ వల్ల కాదంటావ్'

'అవునే అక్కా'–

'పోనీ ప్రభావతి దానిని చూసుకోగలదా? –

'ప్రభావతి మాత్రం అక్కడికి రాగలదా–

'మరి ఏం చేస్తే మంచిదో చెప్పు – చాల తెలిసినవాడివి, అనుభవం కలవాడివి' రాజారాం అన్నాడు.

మనమొక Corporate Board ఏర్పాటు చేద్దాం, ఒక Company లా నడుపుదాం– అప్పుడు షేర్లు కూడా యివ్వచ్చు – చాలామంది ముందుకు వచ్చే అవకాశం వుంది– ఆ దిశలో ప్రయత్నం చేద్దాం'–

శివరాం మాటలకు స్పందిస్తూ పావని అన్నది.

'అదే మార్గమయితే అలాగే ఆలోచిద్దాం – కాని

మాత్రం యిప్పటి మాదిరే వుండాలి' –

'అలాగే, నేను ఎలిజబెత్‌ని కూడా కన్సల్ట్ చేస్తాను. అలా అయితే ఎందరో ముందుకు వస్తారు.

'మాతో ప్రభావతిని తీసుకువెళ్ళి అంతా ఆలోచిస్తాం–'

సరేనన్నాడు శివరాం–

********

## 13

పావని, ప్రభావతి, రాజారాం ఇండియా వచ్చారు– రెండు రోజుల తర్వాత ఆస్పత్రికి వెళ్ళారు. అక్కడ వరలక్ష్మి కోసం డాక్టరు కొడుకులు కూడ వున్నారు. ఇక తిరిగి వాళ్ళ వూళ్ళకు వెళ్ళబోతూ అక్కటకి వచ్చారు.

రోజులు గడచిపోతున్నాయి. కాలం తన తెరచాప ఎత్తుతోంది – ఓపలేని కాలం!

ఓపలేని కాలం
ఓపలేక తన గర్భం
బరువెక్కి భారమవుతోందని
కలతజెంది కలవరపడింది
ఏమిటీ మానవులు !
నాతో మెలిగి ఎదిగే మానవులు
మనసునే మభ్యపెట్టి
మనసును మంచిచేసుకుని
అరిషడ్వర్గాల ఆదరణలో
పెరుగుతూ భ్రమిస్తున్నారు
షడ్వర్గాలు శత్రువులె

శ్రమింపజేసి ముంచేస్తున్నా
సంతోషంగా సతమతమవుతూ
అంతా మా అదృష్టం
స్వేచ్ఛా విహాయ సవిహారం
మా స్వంతం
ఈ జీవితంలో మా ఆశలు
పరమార్థం అంటూ
వికసించే వికాస పుష్పాలను
మొగ్గలోనే త్రుంచేసుకుంటున్నారు.
నన్ను బంధించి
నా మూలానికి దూరం చేస్తున్నారా
ఈ భారం నా గర్భంలో మోయాలా
ఈ ప్రశ్నకు ఎవరిస్తారు సమాధానం
నాకూ, వారికీ మూలం అయిన
ఆ చైతన్యమూర్తి యిస్తాడా?

సమాధానాలు అంత తెలిక కావన్న విషయం యిప్పుడు విష్ణుమూర్తికి అర్థం అవుతోంది. ఎన్నిచోట్లకు వెళ్ళినా ఎవరిని అడిగినా, ఎవరో చెప్పింది, వారు విన్నదీ చెపుతారే కానీ వారి స్వానుభవంగా ఎవ్వరూ చెప్పటం లేదు.

నలిగిపోతున్న సమాజంలో వూపిరి పోద్దామని, అందుకని కత్తిని పట్టటానికి సిద్ధమని, తండ్రి వ్యాపారం, చదువూ కాదనుకొని వెళ్ళి నక్సలైటు వుద్యమంలో చేరిన పురుషోత్తమరావు కొడుకు నవీన్‌కి అర్థం కావటం లేదు. తాను నక్సల్ వుద్యమం చేరింది ప్రజలకు మంచి చేద్దామని. నరరూప రాక్షసుల అంటే ప్రజానాయకులనబడే స్వార్థపరులనుండి సంఘాన్ని కాపాడదామని, అయితే ఆ ఆశయం అంత తేలికగా ఫలించేటట్టు లేదు.

కసిగా, కసితో చేరాడు వుద్యమంలో, కాని కసి లక్షణం అర్థమయ్యే టప్పటికి అతడు వుద్యమంలో యిరుక్కున్నట్లనిపించింది. అతనికి అంతగా

ఆలోచనకు తావీయని అతనికి, అంటే నవీన్ క్కూడ అర్థమవుతున్నది. తన సహాధ్యాయితో అన్నాడు.

కసి మనిషిని తొలిచేస్తుంది
కళచి వాటేస్తుంది
విషం ప్రాకి వివశమై
మాంసం కుళ్ళి
ఒళ్ళంతా కలబోస్తుంది
వివేచనా, విచక్షణా
విమోచనమొంది
విషం మాత్రం మిగుల్తుంది
విషక్షేత్రం బుగ బుగ లాడుతూ
బుడగలా విరజిమ్ముతుంది –

లేకపోతే ఏమిటి మిత్రమా – ఎవరో Police informer అని ఒక్కసారిగా Shoot చేయటం – తన మాట వినలేదని ఒక చిన్న రైతుని మట్టుపెట్టటం. అందరూ పీడించే వాళ్ళే అని కొంచెం డబ్బున్న రైతుల దగ్గరనుండి ఒక రివాజుగా చందాలంటూ వసూలు చేయటం– ఇది ఎవరిని మభ్యపెట్టడానికి!

ఈ సంఘటనలన్నీ నవీన్‌లో ఒక అనుమానానికి దారితీసాయి. తను ఎంచుకున్న మార్గం సంఘాన్ని బాగుచేసి అందరినీ సమదృష్టితో బతకనీయటానికి సరియైన మార్గం కాదేమోనని అనుమానం వచ్చింది. తనతోనే యీ వుద్యమంలో చేరిన ఒక పిల్ల కవిని అడిగాడు– ఈ చిక్కుముడికి సమాధానం చెప్పు కామ్రేడ్ అని– ఎవరికీ మనలో అంత సిద్ధాంతబలం వున్నట్లులేదు, కాని అందరూ అన్ని తెలిసినట్లే మాట్లాడతారు – తూటాల మ్రోతల ప్రమోదంలో యీ సంఘవిముక్తి వున్నదని అంటారు– ఏమిటిది – దానికా పిల్లకవి కళ్ళూ జుట్టూ పైకెగరేస్తూ ఆకాశంవైపు చూస్తూ సమాధానం చెప్పాడు.

మసిబారిన అద్దంలో
వెన్నెల ముఖాలు, వెట్టిగా, ఎట్టిగా
ఏడుస్తూ, మందంగా, మురికిగా
కోపంగా, ముడతలుగా
మురికిగా, కుళ్ళుగా
కనిపిస్తయి, జడిపిస్తయి
మురిపిస్తయి, ధూళినిబట్టి
చూచే కంటిని బట్టి
తలచే మనసునుబట్టి
తెలిసిన ఛాయలుబట్టి, రంగులబట్టి
ఏది నిజం ! నేస్తం
వెన్నెలా, వేర్వేరు రంగులా
ఏమో యిది తెలిస్తే
చిక్కుముడి పొడుపుకథా
విడినట్లే – విడినట్లే–

ఈ కవిత వినిపించి తృప్తిగా జుట్టు వెనక్కి తోసి ప్రపంచంలో అన్నిటికి సమాధానం సమకూర్చినట్లు తృప్తిగా సిగరెట్ పొగపీల్చాడు.

నవీన్ సమస్య ఎప్పటి మాదిరే మనసులో తిరుగుతోంది –అలాగే వుద్యమంలో పాల్గొంటూ, శిక్షణా కార్యక్రమాలూ, షూటింగు శిక్షణా కార్యక్రమాలు, సిద్ధాంత ప్రవచనాలూ వింటూ అడవుల్లో వాతావరణానికి మానసికంగా, శారీరకంగా అలవాటు పడటానికి ప్రయత్నిస్తున్నాడు. కాని రోజు రోజుకీ యిది భారమనిపిస్తోంది– ఒకరోజు తన కళ్ళ ఎదుటే పోలీసు యిన్ఫార్మర్ అన్న అనుమానంతో అతణ్ణి కాల్చేసినప్పుడు, ఆ దేహం పడ్డ బాధను భరించలేకపోయాడు. చాల కృంగిపోయాడు.

ఏమిటిది ప్రజాస్వామ్యం
హింసాస్వామ్యంగా మారుతోందా

వీళ్ళంతా నా కామ్రేడ్స్ –
హింసకు ఆయుధాలైనారా?
వీరు హింసా నాథులయినారా?
నా కలాషికోవ్ ఎవరిపై గురిపెట్టను
అంటున్నారా –

మరోసారి ఒక మగ కామ్రేడ్, ఒక మహిళా కామ్రేడ్ని ప్రేమిస్తున్నాడనగానే, వాళ్ళని పిలిచి కమాండర్ అన్నాడు.

ప్రేమ బూర్జువా తత్త్వం
జాగ్రత్త దాని బారిన పడకండి.
మనం సంఘమిత్రులం
సంఘం కోసమే బ్రతకాలి
ఇదంతా అదుపులో వుంచుకోండి'

నవీన్ యువకుడు – యువక రక్తంలో, మనసులో, మమతలు ప్రేమలూ కరుణ యివి కూడా ప్రవహిస్తూవుంటయ్యని అతని భావన. దీనిని గురించి ఎవరితోనైనా అమాయకంగా ప్రశ్నలు వేస్తే రపీమని, తుపాకీగుండులా సమాధానాలు వస్తయి.

కామ్రేడ్, యిది పైసలప్రపంచం
అవినీతి అగ్నిపర్వతం

యీ విషయం నీకు యింకా తెలియడం లేదు. అయితే విప్లవ కవుల దగ్గర కొన్నాళ్ళు శిష్యరికం చేయాలి – వాళ్ళు నీకు అన్నీ విడమరచి చెపుతారు, అని ఒక విప్లవకవికి నవీన్ శిక్షణకు అందజేస్తే అతడీ విధంగా –యిదే మాటల్లో కాకపోయినా, సారాంశమిదే – అన్నాడు. చాలా గంభీరం.

ప్రపంచం పైసల పిశాచంలా
యీనాటి ప్రపంచం–
పూనకంతో వూగిపోతోంది
జూలు విదిలించి, జడలు విసిరి

అగ్ని పర్వతంలా ఆవులిస్తోంది
విరజిమ్ముకుంటున్నాయి పైసలు
నిప్పు రవ్వల్లా
బంగారపు రంగులు తేలి
ఆ రవ్వలు ఆకాశాన్నందుకునే భవనాల్లా
భవనాల్లా భువిపై నిలుస్తున్నాయి
ఒళ్ళంతా కళ్ళు
ముఖమంతా నోరు
కాళ్ళలో కీళ్ళు
కళ్ళు కళ్ళుమని మెలి తిరుగుతూ వుంటే
మెరిసే మర బొమ్మలూ
పైసల పిశాచం నర్తిస్తోంది
పాపం 1
నవీన్ ః ఆ పైసలు మనకూ కావాలి కదా–
విప్లవకవి ఆర్భాటంగా ఒక్క నవ్వు నవ్వాడు.

చిన్న పిల్లవాడివి పాపం! యింకా ప్రపంచంలో నీవు కళ్ళు తెరవలేదు– మనం ఆ అవినీతి అగ్ని పర్వతాన్ని ఒక్కసారిగా ఆర్పివేయటానికి ప్రయత్నం చేస్తున్నాం– అది చాలా కష్టం– అయినా చేయాలి. బహుశా తెలియదేమో – తెలియదులే పసివాడివి–

అవినీతి అగ్నిపర్వతం
ఒక్కసారిగా ఉడికి ఉడికి
తనకు తానే తట్టుకోలేక
లావాను ఎగదోస్తున్నట్లుంది
నిప్పురవ్వలు ఆకాశాన్నంటుతున్నాయి
నిస్సహాయులై ప్రజలు
నిలువ గుడ్లు వేస్తున్నారు

ప్రజాస్వామ్య ప్రజాధిపతుల
నిమ్మకు నీరెత్తినట్లు
నిలకడగా ఫైవ్‌స్టార్ భోజనాలు చేస్తూ
చేసి చేసి పొట్టల సవరించుకుంటూ
ఎక్కడ నడుం వాలుద్దామా అని
తాము కొట్టేసిన భూములు
ఎవడు ఎత్తుకుపోలే
ఎక్కడా చోటు దొరక్క
చెడిపోతూ పరుగెత్తుతున్నారు –

నవీన్ః మనమూ డబ్బుకోసం దందా చేస్తున్నాంగా

విప్లవకవిః మనం మనం కోసం కాదు, ప్రజలకోసం చేస్తున్నాం –

ఈ విషయం నవీన్‌కు చాల కాలం బోధపడలేదు –

నవీన్‌కు మరో విషయం నచ్చటం లేదు.

మనం ఏ మార్గం అక్రమమయిందంటున్నామో దానినే వాడి మన పని చేస్తున్నాం –

ఆ సంశయం సంశయంగానే వుండిపోయింది. రెండు మూడు నెలల్లోనే అసంతృప్తి బయలుదేరింది – ఒక రోజున ఎలాగో తప్పించుకుని వచ్చి పోలీస్ స్టేషన్‌లో సరెండర్ అయిపోయాడు. ఇంకా నవీన్ మీద ఏ కేసులూ నమోదు కాకపోవటం వల్ల అతన్ని ......గా వదిలేసారు. కాని అతడికి ప్రమాదం రాకుండా పోలీసు నిఘా పెట్టారు.

నవీన్‌ను చూచి వాళ్ళమ్మ కళ్ళు కలువసరోవరాలయినాయి. అమాంతం వాటేసుకుంది. తండ్రి పురుషోత్తమరావుకి ఏదో ఒక కొత్త శక్తి వచ్చినట్లయింది.

******

## 14

నవీన్ తండ్రి వ్యాపారంలో సహాయం చేయటం మొదలుపెట్టాడు. ఒక రోజు పురుషోత్తమరావు సాయంకాలం తోటలోకి వెళ్ళాడు. అక్కడ అతడికి చాల విశ్రాంతి లభిస్తుంది. ఇదివరకు అప్పుడప్పుడు వెళ్ళేవాడు. ఇప్పుడు తరచుగా వెళుతున్నాడు. నవీన్ హోటల్ వ్యాపారం రాత్రి 11 గంటల వరకూ చూసుకుంటున్నాడు. అప్పుడప్పుడు అతడిని పోలీసులు, మాజీ సహచరులు యిబ్బంది పెడుతూవుండేవారు. వాళ్ళని ఆప్యాయంగా ఆహ్వానించి, టిఫిన్ వగైరాలు పెట్టించి పంపించేవాడు. గతం అతడిని యీ విధంగా వెంటాడుతూనే వుంది–

ఒకరోజు పావని, రాజారాం కొలను చేరువున వసారాలో కూర్చొని వున్నారు. కొద్ది సేపటికి వకుళ, రాగిణి వచ్చి చేరారు. అలాగే పురుషోత్తమరావు వచ్చి కొంచెం ఎడంగా కూర్చొని కొలనువైపు చూస్తూ, పావని రాజారాంల సంభాషణ వింటున్నారు. రాజారాం చాలా గంభీరంగా, శాంతంగా ఎనలేని పూజాభావంతో అంటున్నాడు.

ఏమిటీ అనంత వైవిధ్యం – సృష్టిలో యీ వైవిధ్యం

బహుశా కవులకూ, రాగిణిలాంటి కళాకారిణులకు యీ వైవిధ్యం భావనా ప్రపంచంలోకి తోసేస్తుందనుకుంటాను. నాలాంటి అతి సామాన్యపు నాగరికుణ్ణే యింతగా ఆకర్షిస్తుంటే యిక వాళ్ళు దానిలో మునిగి తెలుతూ వుంటారనుకుంటా'–

నీ వేమిటి – నేనూ అతి సామాన్యంగా రోజులో ఎన్నో వ్యాధులతో బాధపడే రోగుల మధ్య ఎన్నో రకాల మనుషులను చూసి దిగ్భ్రాంతి చెందుతూ వుంటాను. ఏమిటీ బాధలు – చక్కగా, హాయిగా, సంతోషంగా వ్యాధుల్లేకుండా ఆరోగ్యంగా నవ్వుతూ బ్రతకాల్సిన వారంతా యిలా బాధపడుతున్నారు– అనిపిస్తుంది. నిజంగా యీ సృష్టిలో అనంత వైవిధ్యమే కాదు. అనంత రహస్యంతో కూడినది–

రాజారాం స్పందించాడు–

'పావనీ యిదంతా ఆ సృష్టికర్త ఆనందమయ లీలావిలాసమంటూ – ఆయన వున్నాడో లేడో నాకు తెలియదు. తెలుసుకునే ఆయాస ప్రయత్నం కూడ నాకు చేతకాదు – కాని నా కనిపిస్తుంది.

ఈ అనంతంలోని అంతులేని
అపార వైవిధ్యానికి
ఆశ్చర్యపడి అనుభవించాలేగాని
ఆస్వాదించాలేగాని
అనుకోనిదని అదిరిపడి
గిజగిజలాడి
వణికిపోయి, వడిలిపోయి
శోషించి సడలిపోకూడదు
అనంత వైవిధ్యాన్ని
(మన రాగిణిలా)
అందెల రవళిలా
ఆనందించాలే గాని (అవునా రాగిణీ)
రణగొణ ధ్వని అని
ఆరాటపడి, అశ్రుసంద్రం కాకూడదు
(రాగిణీ, వకుళా యిదిమీకే)
అనంత వైవిధ్యం
విశ్వుని విశ్వ విరాడ్రూపం
(నటరాజ విలాస నృత్యం అన్నది రాగిణి)
చిందులు తొక్కుతూ
తొణికించే రసబిందువులు
ఆస్వాదించి ఆకళింపు చేసుకొని

పావనిః చేదు మ్రింగిన మందు

బిళ్ళలన్నీ అనుకోకూడదు
కష్టమయింది

ఇదంతా పురుషోత్తమరావుకి అంతు పట్టడం లేదు. అయినా యిందులో ఏదో నిజముందనిపిస్తుంది. తనకర్థమయినంత వరకు యిది చాలా సంతోషం కలిగిస్తోంది. నవీన్ పిలుపుతో హెూటల్ దగ్గరకు వెళ్ళిపోయాడు. సాయంత్రం ఆరు గంటలవుతోంది. మునిమాపు చీకట్లు ముసురు కుంటున్నాయి. విష్ణుమూర్తి లోపలికి వచ్చాడు.

'ఏదో చాల సీరియస్ విషయాలు మాట్లాడుకుంటున్నట్లున్నారు'? అన్నాడు కుర్చీలో కూర్చుంటూ –

రాజారాం అన్నాడు –

'ఏమీ లేదు, ప్రతృతిలోని, నిజానికి సృష్టిఅంతటిలోని అనంత వైవిధ్యానికి ముగ్దులమై మాటల్లో ఆ సృష్టికర్తని అభినందిస్తున్నాం.

ఆ వైవిధ్యం వెనుక ఉన్నదేదో తెలుసుకోవాలన్న తపన లేదా' విష్ణుమూర్తి ప్రశ్నించాడు.

రాః అది చాలా క్లిష్టమూ, కష్టమూ
మనసుకందని పొందని యత్నం
అయినా యిది సత్యం తెలియటానికి
బాట మాత్రం అవునని నా అభిప్రాయం

పావనిః నిజానికి
ప్రపంచంలోని ప్రతి
సన్నివేశంలో ప్రతిఘటనలో
అసత్యం వెనుక సత్యం దాగి వున్నది
దీనిని గుర్తు పెట్టుకోవాలి ప్రతిక్షణం
ఇది కష్టమే కాని
ఇది నిష్ఠుర సత్యం
పెద్దలందరూ చెప్పిన మాట అని

నా కనిపిస్తుంది –

సన్నివేశాలు సృష్టించి, నృత్యించే రాగిణికి

యిది బాగా తెలిసి వుంటుంది–

నిజానికి యిది నీవు చెప్పినట్లు తెలుసును

తెలియదు నాకు స్పష్టంగా లేదు. అయినా

అనుభవంలో, నేను నృత్యించే టప్పుడు

నృత్యరచన చేసేటప్పుడు

ప్రతి సన్నివేశంలో, ప్రతి సంఘటనలో వెనుక సత్యం దాగి వున్నదన్న అస్పష్ట భావన మాత్రం వుంటుంది– నాకు వున్నది అని చెప్పగలను.

రాః వున్నదనుకనే

సంసారంలో సాగిపోవాలి

సత్యం నిత్యమయితే

నిత్యం కాలమంతా నిండివుంటే

ఇక సత్యం ఎక్కడికి వెళుతుంది

ఏదో ఒక ముసుగులోనైనా

తానే భావించి ఏర్పరుచుకున్న

(కళాకారుల్లా, రాగిణి లాంటి వారిలా)

పలుముసుగుల్లో నైనా

అసత్యం ప్రపంచంలో మసలుతూనే వుండాలి

ప్రపంచంగా వ్యక్తమవాలి

అసత్యానికి, సత్యంలో మెఋగు

సత్యం సువర్ణమయినా

అసత్యం దాని ఆభరణ రూపం

విష్ణుమూర్తి ః యోగ వాసిష్ఠంలో యిదే మాట అంటాడు వాల్మీకి.

రాజారాం ః అద్వైతం, ద్వైతంగా చీలి అద్వైతానికి ఆభరణమే అవుతుంది. ఆ ఆభరణం కరిగిపోగానే ద్వైతం అవుతుంది అద్వైతం

నవ్వుతూ అన్నాడు రాజారాం.
'రాగిణి ఇక జరిగేది నీ భాషలో ప్రపంచ ప్రకటన–
ఈ ప్రపంచం ద్వైతాద్వైతాలు
రసరమ్యరాధాకృష్ణ కేళి
కనులెరిగిన, వీనులవిన్న
పరుచుకున్న
ప్రకృతీ,పురుషప్రపంచం
అందువల్లనే
ప్రపంచంలో మనం
కాదనకూడదు దేనినీ
పావనిః అంత మాత్రాన
అవుననీ అనకూడదు
కాదన్న మాట నిజం
ఎందుకంటే అది అసత్యం
అవునంటే అసత్యాన్ని ఒప్పుకున్నట్లు
రాజారాంః అయినా అది
ముసుగు వేసిన, వేసుకున్న సత్యం
అసత్యంగా తోస్తున్న సత్యం
విష్ణుమూర్తిః అయితే ప్రపంచంలో శోకమేలేదా?
రాజారాం ః – ప్రపంచంలో బుద్ధుడు చెప్పిన శోకం లేదు
శోకరూపం ధరించిన సంతోషమున్నది.
విష్ణుమూర్తిః అయితో యీ జబ్బులూ, డాక్టర్లూ వీరిమాటేమిటి?
అది శోకం కాదా ?
రాజారాం ః సంతోషాన్ని శోకంలా అనుభవించటం సంసారి లక్షణం, శోకాన్ని సంతోషంగా అనుభవించటం సంసారస్వరూప మెరిగిన వారి లక్షణం
పావని ః మా డాక్టర్లు చేసేదదే – బాధను నివారించి సంతోషం నింపడమే

–రాజారాం ః వూపులో వుండి చివరికి అన్నాడు. వున్నది ఆనందమే కాబట్టి శోకం లేదు. ఆనందాన్ని అలా అనుభవించలేం, కాబట్టి వున్నది శోకమే

రాజారాం, పావని, రాగిణి అందరూ ఫక్కున నవ్వారు. విష్ణుమూర్తి మౌనంగా వుండిపోయాడు.

******

## 15

విష్ణుమూర్తి యింటికి వెళ్ళిపోయాడు. సుమతి నవ్వుతూ–

'ఇవాళ ముఖం వెలిగిపోతున్నదేమిటి' అన్నది –

'ఇవాళ యోగవాసిష్ఠం నాకర్థమయినట్లనిపిస్తుంది – శ్రీశ్రీ చదవమంటే చదివాను. కాని యివాళ అర్థమయినట్లుంది. ఆయన ఎందుకు ఆ గ్రంథాన్ని చదవమన్నాడో యిప్పుడర్థమయినట్లుంది.

'అంతగా మిమ్మల్ని ప్రభావితం చేసిన సంఘటన ఏంజరిగిందివాళ' సుమతి ప్రశ్నించింది.

'ఈ రోజు రాజారాం గారి తోట కెళ్లాను. ఆయన ప్రపంచం, మతం, యోగం, జీవితం వీటిని గురించి బాగా చర్చించారు. ఆయనలోనూ ఆయన భార్యలోనూ యింత జ్ఞానం వున్నదని నేననుకోలేదు. అక్కడ జరిగిన సంభాషణల సమయంలో నీవు గూడవుంటే బాగుండేది. నీ నవ్వుతో వాళ్ళ మాటలన్నీటినీ యిట్టే బోల్తా కొట్టించి వుండేదానివి–'

'నా కంత సీను లేదు లెండి. సామాన్యంగా, సరదాగా వుంటానంటే– .........అర్థమయినదేమిటి?

యోగవాసిష్ఠంలో

ప్రతి శ్లోకంలోనూ

ప్రతి పేజీలోనూ

ప్రతిప్రశ్నలోనూ

ప్రతి ప్రతిపాదనలోనూ

ప్రతి జీవితంలోనూ
ప్రతి కథలోనూ
కనిపిస్తాం మనమే –
ఆవిధంగా యోగవాసిష్ఠం
ప్రతి మానవుడి కథా
అతడి సందేహాలూ,
సంకోచాలూ, ప్రశ్నలూ
సాధనా, సంఘర్షణా, జీవితగాథా
యిహ, పరలోక అస్తిత్వాలూ
అంతా మానవుడి కథ
మహితాత్ముల విశ్లేషణ
వారి అనుభవాలతో
మానవుడి జీవన పరిశీలనా
నిత్య సత్యంతో
అనుసంధానం, సమన్వయం
అవగలా, అవగాహనలకు ప్రయత్నం
ఇదీ
నిజమైన యోగవాసిష్ఠం
పరిపక్వపు స్తుతీకరణ –
అని చాల సంతోషంగా అన్నాడు.

'అయితే అన్ని సందేహాలు తీరినట్లేగా – లేవండి, భోజనం చేద్దురుగాని' ఆమె అలా అని వంటయింట్లోకి వెళ్ళింది.

ఇక్కడ డైనింగ్‌హాలుకి వస్తూ విష్ణుమూర్తి 'అబ్బా' అంటూ ఛాతీ మీద చెయ్యి నొక్కుకుంటున్నాడు. అది విని సుమతి పరుగెత్తుకు వచ్చింది.

'ఈయనకు ఏది వచ్చినా హడావుడే'

'ఏమయింది – అయ్యో గుండె నొప్పిగా వుందా'? అని సోఫాలో

పడుకోబెట్టి వెంటనే కొడుక్కి టెలిఫోను చేసింది. అప్పటికే భాస్కర్ యింటి మెట్లెక్కుతున్నాడు. లోపలికి వచ్చి డాక్టరు Consultation కావాలి' అని కారులో పావని హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాడు. సుమతి ఒళ్ళో తల పెట్టుకుని కారులో పడుకున్నాడు విష్ణుమూర్తి.

వెంటనే Emergency లోకి తీసుకువెళ్ళారు. అతడి ECG తీసిన తరువాత తేలింది ఆయనకు బ్లాక్ వుందని, Angiogram తీయాలి కాబట్టి హాస్పిటల్‌లో admit చేశారు.

మరునాడు అన్ని పరీక్షలు చేసిన తరువాత ఆయనకు ఒక block వున్నదనీ, దానికి Stent వేస్తే సరిపోతుందని తేలింది. అలా మూడు రోజులు Hospital లో వుండిపోయారు. ఒకరోజు పావని తన రౌండ్స్‌లో వచ్చి పలకరించింది. ధైర్యం చెప్పింది.

'అంతగా ............ కావటానికి అక్కడి మాటల్లో ప్రత్యేకత ఏమీ లేదే– రాజారాం తరచూ అలా మాట్లాడుతూ వుంటాడు – అన్నది పావని నవ్వుతూ.

'ఏమో ఆయనకు వచ్చే సంశయాలన్నీ తేలిపోయినట్లు సంతోషించారు'.

'చాలసార్లు నాకు అలానే అనిపిస్తుంది – కాని వాటి అంతరార్థం ఏమిటి అని ఆలోచిస్తే అసలు సమస్య మొదలవుతుంది. జీవితరహస్యం, సృష్టిరహస్యం తెలుసుకోవటం చాల కష్టంతో కూడిన సాధన– ఏమయినా, ఆ సాధనమీద అభిమానం కలగటమే మొదటి మెట్టు'. అని తన రౌండ్స్‌లోకి వెళ్ళిపోయింది.

తరువాత భాస్కర్‌ని పిలిచి

'నాయనా భాస్కర్, యీ గుండె సమస్య ఒక సారి వచ్చిన తరువాత అది ఎటు తీసుకువెళుతుందో చెప్పటం కష్టం. నీవింకా సెటిల్ కాలేదు. అన్నయ్య వదిన అమెరికాలో సెటిల్ అయినట్లే – అన్నట్లు అన్నయ్యకు నా విషయం చెప్పావా? ' – అని అడిగాడు.

'చెప్పాను. రావటానికి ప్రయత్నం చేస్తానన్నాడు.'

'ఎందుకు చెప్పావ్ – వాడు వుద్యోగంలో యింకా బాగా సెటిల్ అయినట్లు లేడూ, తను రాలేకపోతే బాధపడతాడు.'

అప్పుడే అమెరికా నుంచి టెలిఫోను వచ్చింది–

'నాన్న ఎలా వున్నాడు'

భాస్కర్ అంతా వివరంగా చెప్పాడు.

'అయితే వెంటనే రావలసిన అవసరం లేదన్న మాట, ఒక బ్లాకు ఫరవాలేదు. మేమిద్దరం త్వరలో వస్తాం – నాన్నని చూసుకుంటూ వుండు నాన్న కియ్యి ఫోను.

'నాన్న మీకేం ఫరవాలేదు. ఒక బ్లాక్ అంత ప్రమాదకరం కాదు. త్వరలోనే వస్తాను. డాక్టరుతో కూడ మాట్లాడతాను'.

.ఎందుకురా, గాభరా పడకు ముందు నీ వుద్యోగంలో సెటిల్ కండి. ఆ తరువాత చూసుకోవచ్చు– అన్నాడు విష్ణుమూర్తి.

తరువాత అమ్మతో మాట్లాడి ఊరట పరిచాడు–

సుమతి మనసు కొంచం కుదుటపడ్డది. తన భర్తకేం ఫరవాలేదు. పెద్దవాడు కూడా బాగానే వున్నట్లున్నాడు – అయినా ఎవరి కర్మ కెవరు కర్తలు– కోడలు, వాడు ఏ పొరపొచ్చాలు లేకుండా బ్రతికితే చాలు – కోడలికి, కొడుకు మీద అంటే తన భర్తమీద అంత నమ్మకం గాని, ప్రేమగాని లేవన్నది అందరికీ తెలిసిన విషయమే– విచిత్రం తమది చక్కటి కుటుంబం– అయినా తన కోడలికి ఎప్పుడూ అసంతృప్తే.

విష్ణుమూర్తి ఇంటికి వచ్చిన తరువాత అతడికి ఏదో ఒక అనిశ్చితి ఆవహించింది. తనేమయినా అయితే పాపం ఎప్పుడూ నవ్వుతూ బ్రతుకుతన్న యీ సుమతికి భవిష్యత్తు ఏమిటి? ఈ భావనతో ఆమె దగ్గరకు వచ్చినప్పుడల్లా ఆమె చేయి పట్టుకునేవాడు. ఆమె యీ పిచ్చి మానవుడి ఆప్యాయతకు అబ్బురపడుతూ నవ్వేది. వీడు యీ భాస్కర్ వివాహం చేసుకోక పోతే యీ ముసలి సుమతి ఎప్పటికీ వంటయింటికి అంకితమవటమే కాకండా, సమయానికి సహాయం చేసే హస్తం కూడా వుండదు. ఛీఫ్ యింజనీర్ చేసిన తన భార్యకు యిలాంటి అవస్థ రాకూడదు. కావలసినంత ఆస్తి వుంది– ఏం లాభం, అండదండలు లేని జీవితమయిపోతుంది– ఇలాంటి ఆలోచనలతో

అతడి మనసు వ్యధాపూరితమయి, ఆధ్యాత్మిక జ్ఞానం అటుంచి, వ్యవహార జ్ఞానం కూడ లేని అంధ జీవితమవుతుంది. ఎవరేం చేయాలనుకుంటే వాళ్ళని అలా చేయనిచ్చి యీనాడు ఎవరూ లేని ఒంటరితనంతో భార్యను వదిలివేసి వెళతాడేమో– గుండె గుభేల్మన్నంత పనయ్యింది. అసలు తన జీవితం నడిపిన తీరు ఏమిటి? జరిగినంత కాలం బాగానే వుంటుంది. కాస్త గాడి తప్పితే అతలాకుతలం అని ఒకసారి సుమతితో అన్నాడు.

'సుమతీ, భాస్కర్ పెళ్ళి చేయాలి'

నిజమే – పిల్లను వెతకాలి – అసలు వాడు చేసుకోవాలి కదా" –

'అలా అని వదిలేస్తే, నేను పోతే నీవు ఒంటరిదానవవుతావు– నీ మాటవింటాడు వాడు, ఒకసారి పెళ్ళిమాట ఎత్తిచూడు.'

'అలాగే' నని సుమతి ఆ రోజు రాత్రి పెళ్ళి మాట భాస్కర్తో ఎత్తింది.–

'నాన్న గారికి పెళ్ళి దిగులు పట్టుకుంది – నీకిష్టంలేని పని నీ చేత చేయించడం ఆయన కిష్టంలేదు.నీవు కూడ ఒక యింటివాడివయితే మాకు దిగులు తీరినట్లవుతుంది. మీ యిద్దరూ ఒకరికొకరుగా జీవితం గడపవచ్చు. నీలా................వున్న అమ్మాయినే చేసుకో'

ఏ మనసున వున్నాడో భాస్కర్ అన్నాడు.

'నేను కూడ మీతో ఒక విషయం సంప్రదించాలని అనుకుంటున్నాను. నాకు నచ్చిన గుణాలున్న అమ్మాయి యీ శ్రీశ్రీ సేవాసమితిలోనే వున్నది. ఇద్దరం ఒకరికొకరం నచ్చుకున్నాం. కాని ఒక షరతు మాత్రం పెట్టాను. అన్నయ్య అనుభవం చూసిన తర్వాత నేనీ షరతు పెట్టవలసిన అవసరం వున్నట్లనిపించింది. మా అమ్మ నాన్నలు పెద్దవాళ్ళయ్యారు. వాళ్ళు మనదగ్గరే వుంటారు. మనం వాళ్ళను జాగ్రత్తగా చూసుకోవాలి – అన్నాను. అందుకు ఆమె తప్పకుండా' అని అంగీకారం తెలిపింది.

'నాన్న యిలాంటి షరతు సరి అయినది కాదు. మేము ఆ అమ్మాయిని నచ్చుతామో లేదో అడగాలి  అంతే – తక్కినవి ఆమెను బలవంతం చేసినట్లవుతుంది.

‘ఆ అమ్మాయిని మీరు కూడా చూశారు. ఆ అమ్మాయికి నీ వంటే చాల ఆకర్షణా, అభిమానం – పేరు సుగుణ’

‘ఆ అమ్మాయి తల్లిదండ్రులు ఒప్పుకున్నారా?

‘వాళ్ళనాన్నగారు లేరు. అమ్మగారు ఆమె అన్నల దగ్గర వుంటుంది.

‘ సరే ఒకసారి నాన్నగారితో ప్రస్తావించు, అమ్మాయిని తీసుకువచ్చి పరిచయం చేయి. ఆ అమ్మాయి తరపున ఎవరైనా వచ్చి సంప్రదింపులు జరుపుతారా’ ?

‘ఇవన్నీ సాంప్రదాయం ప్రకారం జరుపుతాం – పెళ్ళి ఆశ్రమ గురూజీ ఆశీర్వచనాలతో జరుగుతుంది.’

సమస్య అంత తేలికగా తేలుతుందని సుమతి అనుకోలేదు –హం

నెల రోజుల తర్వాత వివాహం జరిగిపోయింది – ఇప్పుడిక విష్ణుమూర్తికి కొంతవరకూ భయం తీరింది.

ఇప్పుడిదివరకటి సంశయాలు, తనెవరూ అన్న ప్రశ్న ఎలా తెలుసుకోటం అన్నవి ప్రబలమయ్యాయి.

ఒక రోజున సుమతితో అన్నాడు.

అసలీ సంశయాలు నాకెందుకొస్తయి – అసలు నా జీవితాన్ని నేను , నాతో పాటు సరిగా గడిపాము. పిల్లల్ని సరిగా పెంచామా – మనం అంతగా సంప్రదాయాలు పట్టించుకోడం గాని, పూజలూ, పునస్కారాలూ ఒక సాధనగా చేయటం గాని చేయలేదు. ఎందుకిలా జరిగింది –ఇది పొరపాటు కాదు గదా –

ఇప్పుడా ప్రశ్న ఎందుకు గడిచిపోయింది – ఆ స్మృతి ఎలాగూ మనల్ని వదలదు. మనం వాటిని కెలికి కెలికి తీసుకురావటం దేనికి? – చక్కగా జీవితం నడపాలగాబట్టే యీ మాత్రం స్థిరంగా వుండగలుగుతున్నాం–

ఇప్పుడీ సంశయాలెందుకు. సంశయాలు నిద్రపోనియ్యవు– ఆధ్యాత్మికంగా నంటారా? ఎదిగినంత వరకే– యిప్పుడు మనస్సును దారిలో పెట్టడం అనేది అంత సులభం కాదు. ఈ జన్మకు యింతకంటే లేదనుకుని

హాయిగా తప్పులు చేయకుండా  బ్రతకడమే' చాల సులువుగా అనేసింది.

'కానీ నీ వనుకున్నంత సులభం కాదు, తలపులకు అలవాటు పడ్డ మనసును ఆపటం– 'అన్ని సంశయాలు నన్ను వదలటం లేదు ఊ

' నాకనిపించింది చెవులా వినండి. సంశయం, సంకోచం యివన్నీ సంకెళ్ళలాంటివి. ఈ మధ్యనే టి.వి.లో విన్నాను, ఒక కవి అన్నది– ఆయన పడిన చావు.

సంశయం సంశయం
మాటల్లో –
ఇది మాట్లాడాలా వద్దా
చేతల్లో
ఇది చేయాలా వద్దా
ఆలోచనలో
దీనినాలోచించాలా వద్దా
అడుగులు
వెయ్యాలా వద్దా
అంతా సంశయం
సంసారమ్ సంశయం
సంశయ సంసారాన్ని
వూబిలా చేసి,
నిలుచుంటే కాళ్ళు ఇరుక్కుపోయి
కాళ్ళను పీక్కోలేక,
కళ్ళు పీక్కుంటూ
ఒళ్ళు సలసలమంటుంది
కళ్ళముందు కాళికాదేవి
కాహళ నృత్యం కనిపిస్తుంది
కళ్ళముందు పరిసరాలు

కటికముళ్ళులా తోచి
ఒంటిమీద గుచ్చుకుంటూవుంటే
మనసులో ముడులు పడుతూ వుంటాయి
అంతా కల్లోలం, అయోమయం
ఎదురు చూడాలంటే
గుండె అదురుతుంది
మనసు విలవిల్లాడి
కళ్ళలో సుడులు తిరుగుతుంటయి
సంశయం అంతటిది
అందుకే అన్నాడా మహామహుడు
గీతాచార్యుడు
సంశయాత్మా వినశ్యతి

ఎంత చక్కగా చెప్పాడు– ఇక యింకా సంశయాలతో బాధ పడతారా – కొంచం ఆ నవ్వు ముఖంలో గాంభీర్యం కనిపించింది. విష్ణుమూర్తి మౌనంగా వుండిపోయాడు. కొంచెం సేపాగి

'యీ సంశయాన్ని ఆపటం ఎలా – ఒక ప్రశ్న సందేహం, సంశయం లేకపోతే యిక ముందుకు పోవటం ఎలా? చాల సందేహంగా అన్నాడు.

కొంచం సేపటి తర్వాత అన్నాడు.

ఇంతకాలం జీవితం భారమనిపించలేదు. కాలంతో పాటు కలిసి వెళ్ళిపోయాం. జీవితమిదే అనుకున్నాం. కాని యిప్పుడు మిగిలిన జీవితం భారంగా వున్నట్లుంది– ధైర్యం చాలకనో ఏమో – అసలు జీవితమంటే ఏమిటి? మరో ప్రశ్న– 'మనస్సులో ప్రశ్న పుడుతుంది. ఆ మనసే ప్రశ్నకు సమాధానం చెపుతుంది– ఇక ప్రశ్న సమాధానం రెండో మనస్సులా వుంది– ఇది దాటటమెలా?

జీవితమందేకమిటి? – ఈ ప్రశ్నకు మనస్సులో పుట్టి, మనస్సు దానికి సమాధానం చెప్పాలి. – తమాషా –

'మీ ఇంజనీరింగ్ అంతా ముందుకు వస్తున్నది.' అన్నది నవ్వుతూ–

'కాదు దీనికి నీవు సమాధానం చెప్పగలవు జీవితమంటే ఏమిటి – మనం జీవించిన తీరేమిటి' –

'మీకు నామీద చాల నమ్మకమున్నది' అని ఫక్కుమని నవ్వి, లేవండి ఒక సమస్య తీరిందిగా, భాస్కర్ వెళ్ళి 'యిక తక్కినవి భోజనం చేసి తీరికగా మాట్లాడుకుందాం' తనూ లేచింది.

భోజనాలయినాయి.

ఇవాళ నాకు జవాబు రావాలి–' అని విష్ణుమూర్తి.

'జీవితమంటే ఏమిటి?

సుమతి ః ఇది జీవించే వారికే తెలుయాలి.

విః జీవించేవారంటే ఏవరు ?

సుః ఎవరు జీవుస్తున్నామనుకుంటున్నారో వారే

విః అనుకోవటం అంటే ఏమిటి

సుః జీవించే వారంటే –

వ్యక్తి జీవనమా –

ఆ వ్యక్తి వున్న సంఘమా?

ఆ సంఘం వున్న దేశమా

ఆ దేశం వున్న ప్రపంచమా

ఆ ప్రపంచం వున్న సౌరగోళమా

వీటన్నిటిని కదిపే ఏదో సూత్రమా ! ఆ సూత్రం ఏమిటి?

విః ఆత్మ అంటారందరూ తెలిసినవాళ్లు –

సుః ఈ ప్రశ్నకు సమాధానం దొరకదు, ఆలోచనల్లోవి  అదే యోగ వాసిష్ఠ అంటుంది.–

మనసు దాటి ఆలోచనలను అధిగమించి  చైతన్యం లోపలివే స్ఫురణలలీ జవాబులు.

సుః ఇంకేం, మీకు అన్ని సమాధానాలు దొరికాయిగా, యిక

వద్దంయండి – విశ్రమిద్దాం – రాత్రి బాగా పొద్దు పోయింది–

ఆనాడు ఆగి ప్రశ్నలపరంపర మరపనాటికి కూడ ఆగలేదు.

విష్ణుమూర్తి కాఫీ తాగుతూ అన్నాడు.

అన్ని ప్రశ్నలకు మెడిటేషన్‌లో దొరుకుతాయి అంటారు – కాని యీ మనసును ఎలా జయించటం?

సుమతి మళ్ళీ నవ్వింది.

ఆలోచించే దాన్ని ఆపేస్తే యిక అసలు సాధనంనీ ఆపేసినట్లు కదా–?

చిలిపిగా వేసినట్లుంది ఆ ప్రశ్న.

భర్తగారూ, మనసు మనల్ని మనువాడింది సార్.

తలవనీయదు నన్ను తన్నుతప్ప

తనలో తనే మాటాడుకుంటుంది

విరామం లేకుండా మాటాడమంటుంది

మాటల నిప్పుతో మంటలెక్కిస్తుంది

మాటల వంపుతో కలవరమెక్కిస్తుంది

అదీ మనసంటె –

విష్ణుమూర్తి ః నిజమే సుమతీ – మెడిటేషన్ అందుకే కష్టం కాబోలు– ఒకసారి నా స్నేహితుడితో కలిసి శ్రీశైలం వెళ్ళాను.

నా స్నేహితుడికి తెలిసిన స్వామీజీ వుంటే అతని దగ్గరకు వెళ్ళి ముందు గదిలో వెయిట్ చేస్తున్నాం– తటాలున ఆయనే బయటికి వచ్చి

ప్రసాదం, ఏమిటి ఇక్కడకు వచ్చావు, ఎపుడు వచ్చావ్– ' అన్నాడు.

'శ్రీశైలం వచ్చాను కదా, స్వామి దర్శనం చేసుకుని మిమ్మల్ని కూడా చూచిపోదామని వస్తే

'స్వామిజీ ధ్యానంలో వున్నారని' మీ శిష్యులు చెప్పారు. అతడు చెయ్యి పట్టుకుని నా స్నేహితుణ్ణి లోపలికి తీసుకు వెళుతూ

ధ్యానమా పాడా – ధ్యాన ముద్రలో కూర్చోటమే గాని మనసు నిలిచి చావదు గదా'

'నీక్కూడానా ?

'నేనేం గొప్పా' –

అన్నాడూ దానితో నాకర్థమయింది

మనస్సును అదుపులో వుంచటం ఎంత కష్టమో–

ఇక ఎలా ముందుకు వెళ్ళటం

సుః దేవుడంత తేలికగా దొరుకుతాడా–

విః మరి నీవే ఆత్మని – ఆత్మ పరమాత్మ ఒకటే నంటారుగా

సుః అదే దగ్గర్లోవున్నా దూరంగా వుండడమంటే

విః నీవు మంచి జ్ఞానివి సుమతీ–

సుః జ్ఞానమా పాడా– జ్ఞానమంటే ఏమిటో తెలుసుకొని నీకు జ్ఞానిని కాదు. –

అని లేచి వెళ్ళిపోయింది.

నోరు తెరిచి చూస్తుండిపోయాడు విష్ణుమూర్తి.

భాస్కర్, సుగుణల పెళ్ళి రాగిణి నాట్యమందిరంలో జరిగింది– పురుషోత్తం హెూటల్స్ వాళ్ళు భోజనాలు పెట్టారు–

అదే టైములో ముఖ్యమయిన సంఘటనలు జరిగాయి కుమారికి నర్సరీలో హార్టికల్చర్ సర్టిఫికెట్ డిప్లమా వచ్చింది. –

నవీన, అతడి యిద్దరు అన్నలు, కలిసి పురుషోత్తం హెూటల్స్ అనే పేరుతో హెూటల్ వ్యాపారం మొదలుపెట్టారు.

నీహార్‌సింగ్ నేపాల్ వెళ్ళవలసి వచ్చింది– వకుళ వచ్చి రాగిణిని కొంత కాలం అమెరికాలో వుండమని తీసుకువెళ్ళింది.

పావని హాస్పిటల్ యాజమాన్యం గురించి చర్చలు మొదలయినాయి.

అన్నిటిలోనూ, అందరిలోనూ ఒక నూతనాధ్యాయం ప్రారంభించి నట్లనిపించింది.

అంతా వ్యక్తిగత సంస్థలనుండి పెద్ద పెద్ద సంస్థలు, అంతర్జాతీయ పరిధి, వేదికలలో –

ప్రపంచీకరణకు ప్రయత్నం జరుగుచున్నది – ఆ దిశలో ప్రయాణాలు జరుగుతున్నాయి. సంస్కృతి, కళ అన్న వాటిలో కూడ యీ సమన్వయ, సమగ్రతా భావాలు ముంచుకు వస్తున్నాయి. సంస్కృతి అన్నది ఎలా తెలుపుకోటం అంటే అది మన నిత్య జీవనవిధానంలో, ప్రతి సంఘంలోను సజీవంగా ఎప్పుడూ వుంటుంది.

ఈ విషయమే రాగిణికి, వకుళ సంభాషణల్లో చాల సార్లు ముంచుకు వచ్చింది. వకుళ రాగిణి పిలిస్తే రాగిణి కళామండపానికి– అంటే తనకు కూడ పునాది వేసిన సంస్థ – వచ్చింది. దానిని ఎల నిలబెట్టాలి, దాని భవిష్యత్తేమిటి అన్న ఆలోచనలో ఏమీ తేల్చుకోలేక వకుళ దాని బాధ్యత తీసుకుంటుందేమో నన్న ఆశలో వకుళను ఇండియా రమ్మన్నది– అలాగే వకుళ ఇన్నాళ్ళకు వచ్చింది. అమెరికాలో ఆమె సంసారం, పిల్లలు, భర్త వీటిలో మునిగి పోయి, దానికి అనుగుణంగా కళను, తన ప్రావీణ్యతను తన యింటి నుండి అక్కడి వారికి అందజేస్తున్నది.– రాగిణి కళావేదిక అన్న పేరుతో నడుపుతున్నది. ఆ సందర్భంలో రాగిణికి, వకుళకి చాల చర్చలూ, సంభాషణలూ జరిగాయి. అప్పుడు వకుళ చెప్పింది.–

'అమ్మా, నీవు అక్కడికి వచ్చి రాగిణి కళావేదికకు అధిష్ఠానంగా వుండు. నేను తక్కినవన్నీ చూసుకుంటాను. ఇద్దరం కలిసి దానిని నడుపుదాం, యిక్కడ యీ వేదికను నీకు నచ్చిన నీ శిష్యురాలి చేతిలో పెట్టి నడిపించు. అక్కడినుండి నేను కో – ఆర్డినేట్ చేస్తూ వుంటాను– అలాగే నని రాగిణి అమెరికా వెళ్ళింది. వకుళ ఇంట్లోనే ఒక భాగంలో రాగిణి కళావేదిక నడుస్తున్నది– దానికి తక్కిన ఇంటికి ఏ విధంగాను యిబ్బంది వుండదు. అంతా సెపరేట్. అందులో రాగిణికి విడిది ఏర్పాటు చేసింది.

వకుళ భర్త ఒక పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో సీనియర్ డైరెక్టరు. మంచి కళాభిమాని. అయినా అతని ప్రియారిటీ అతని వుద్యోగం కావటం ఎవరికీ ఆశ్చర్యం కలిగించనవసరం లేదు. సామాన్యంగా వకుళ మీదనే ఆధారపడి దానికై కృషి చేసేవారు తక్కువ వుంటారు. నిజమైన కళాపోషకులూ తక్కువే–

కాని కళాకారులు దానినే ఆరాధిస్తూ, దాని మీదే, దానికోసమే బ్రతికేవాళ్ళూ తక్కువ. కాని తమలో వున్న కళాత్మక శక్తిని వుపయోగించి బ్రతికేవాళ్ళు ఎక్కువ. నటులూ, గాయకులూ, నాట్యకారులూ, యీ కోవకు చెందినవారు.

రాగిణి గది నుంచి బయటికి చూస్తే అంతా ఒక పెద్ద వనం. దాని మధ్య ఒక సరస్సు, వకుళ ఇల్లు సిటీ హైట్‌లో వుంది. దానిలో ఒక మిట్టమీద వున్నది. ఇక అక్కడ నుండి చూస్తే ఒక హరితాద్భుతమే – అమెరికన్లు భౌతిక సౌందర్యం గమనించి, యినుమడింప జేయడంలో సిద్ధహస్తులు. మళ్ళీ అటువంటివారే జపనీయులు, ఒక విధంగా యీ రెండు సంస్కృతులూ భౌతిక సౌందర్యానికి భాష్యం చెపుతయ్యనవచ్చు. దానికి అనువైన అవకాశం ఎక్కడ వచ్చినా వాళ్ళు వదులుకోరు. కొత్త కొత్త విధాలుగా, అన్ని డిజైన్లలో చిన్న వస్తువైనా, పెద్ద పట్టణమైనా, భవనాలైనా, ఆకాశ హర్మ్యాలైనా, వొంటరి యిళ్ళయినా, అన్నిట్లోనూ ఏదో కొత్తదనం చూపించాలని అనుకుంటారు. వాళ్ళకు లభించిన వారసత్వ సంపదనూ అలాగే పోషించుకుని నిలుపుకుంటారు.

ఈ విషయమై రాగిణి ఒకసారి వకుళతో అన్నది.

అమెరికన్లు ప్రకృతిని ఆరాధించి చక్కగా అనుభవిస్తారు. బాహ్య సౌందర్యం వారి చేతిలో గొప్ప పరాకాష్ఠ నందుకుంది. ప్రతి పనిలో వారు సౌందర్యం, సౌష్ఠవం పిండుకుంటారు. ఒకసారి యీ విషయమే మాట్లాడుతూ రాజారాం గారన్నారు. బహుశా యీ ప్రపంచం అమెరికన్లకు ఒక దృశ్య కావ్యంలా తోస్తుందేమో – కాని ఆ భావనలోని అంతఃపరిపూర్ణత మాత్రం వారికందినట్లులేదు. అది భారతీయం సంస్కృతిలో అంది వున్నట్లువుంది.

అందుకనే వారు

ఈ ప్రపంచం పరమాత్ముడి

లీలామయ దృశ్యకావ్యం

అంటారు. మహామహులు దానిని విడమరిచి, గొప్ప అనుభవంగా శబ్దంలోనూ, వివిధ కళారీతులలో బంధించారు – బహుశా ఆ మహాత్ములు

అనుభవంలో యిలా అనిపించిందేమో

ఆ వ్యాసంలోని కవితను నేను పదాన్ని. పదబంధపరిమళాన్ని, శైలిని, శయ్యను, సరళ భావాన్ని నడకల హొయలును, నాదవినోదాన్ని, కీర్ణాన్ని, సంకీర్ణాన్ని

పరదేశ సంతులనాన్ని
సూత్రాన్ని, సూత్రధారిని
పాత్రలను, ఆ పాత్రల
సన్నివేశ సంరంభాన్ని
అవనిశమా, అమరికమా
స్థలాన్ని, రంగస్థలాన్ని
వీక్షణనూ, వీక్షించే ప్రేక్షకుణ్ణి
వాద్య రసాన్ని
రసికుణ్ణి
నవరసాల రాగాన్ని
పాత్రలు రసాలు పొంగించి
పండించేపరవశాన్ని
పరవశించిన ప్రేక్షకప్రజను
తెరలు తెరలుగా పొరలు పొరలుగా
ప్రసరించి ప్రవహించే
వాహిని నేను
ఆనందరావానికి
కావ్యానందం నా కన్నుల రెప్పల ఒదిగి
నాలో దూరి, గుండెలోకి జారి
నరాలనాక్రమించుకుంటుంది.
ఆనందం చెమర్చింది
నరాలు నాట్యం చేస్తుంటే

ఆనందం చెపుతోంది
నీవేనేను – నేనేనీవు
అంతా నేనూ నీవే
కాదు అంతా నేనే
పొందిన ఆనందం స్తంభించి
నేనుగా నిలిచింది.

ఇందులో వారు మిస్ అయింది ఆ పరమాత్మ భావన వారికి అందింది మానసిక భావన మాత్రమే. ఇందులో భారతీయ సంస్కృతి చాల గొప్పగా సిద్ధి పొందింది. – కాని ఈనాడది శిథిల దేవాలయమవుతుంది.

కాలం కరడుగట్టి
కట్టడమయింది
మనిషి మస్తిష్కంలో
తలపులా తలెత్తే
తపనగా తొలిచేస్తూ
వుదుటుగా వూపుగా
కలంలోకి జారి కవితగా
ఉలిలోకి జారి శిల్పంగా
వాస్తుశిల్పి గీతల్లోకి జారి
రేఖా శిల్పంగా, భవనంగా
అన్నిటిలోనూ ఉన్నది
ఘనీభవించిన తలపూ తపనా
తాను కదలలేదు
అయినా కదుల్తుంది
కదలి, కరచి, తొలిచేసి
మెలి తిరిగి మురిపించేసి
మనుష్యుల మనసుల్లో

కదలికల్లో కదుల్తూ
వుద్రూత లాడించి
మోదంతో ప్రయోగంలో
నివసించి కదిపి అతడి
స్వప్న శిధిలంగా మిగిలిపోతుంది
ఇది కథ
చరిత్ర కందని భావాల
కట్టడాలు దాచుకున్న
చరిత్ర కథ, వాటి కథ–

ఇది ప్రాచ్య సంస్కృతులలో చాల వరకు నిజం, ప్రత్యేకంగా భారత దేశంలో– అక్కడ ఆ సంస్కృతి భారత, రామాయణాది గ్రంధాల్లో, శిల్పాల్లో. పురాతన దేవాలయాల్లో ఎటు తిరిగినా ఒకనాటి గాథలు వారిని ప్రభోధించిన సంస్కృతి స్పష్టంగా గోచరమవుతుంది. అందుకే అక్కడ గాలిలోనే యీ సంస్కృతీ విపంచికలు వినగలిగిన వారికి వినిపిస్తూవుంటయి.

సంస్కృతి అంటే ఏమిటి అని ఎన్నో ప్రశ్నలు, వివరణలూ వున్నాయి. రాగిణికి తోచిన అర్థం ఏమిటంటే

సంస్కృతి
సంఘానికి సంతకం
మనిషికి ప్రేరణ
దేశానికి దేహం దేహీ
ఇది కాదనగలవారు
మునులూ మహర్షులే
ఇది కాదంటే
కావాలి మహదాలోచన
మార్చగల మహదాలోచన
మహా సంకల్పం.

అమెరికన్ జాతికి అంత చరిత్ర లేదు. మహా అయితే 300 సంవత్సరాలు. ఇప్పుడిప్పుడే అమెరికన్ సంస్కృతి అన్నది ఏర్పడి ప్రపంచాన్నికూడ ప్రభావితం చేస్తున్నది.

ప్రతిదానిని కొత్తగా చూచి, కొత్త కొత్త సమస్యలకు సమాధానం కొత్తగా కన్పించటం యిదీ ప్రధానంగా అమెరికన్ సంస్కృతి. ఒక్క క్షణం కూడ అది నిలకడగా వుండదు. ఎప్పుడూ రగుల్తూనే వుంటది. వ్యక్తి సౌభాగ్యం, సంపదా, దానికి కావలసిన సరంజామా సామగ్రి సంతన చేసుకోటానికి అవకాశం, తామనుకొనే భవిష్యత్తుకు తాము ఎదగటానికి అవకాశం, ప్రజాస్వామ&ంలో పరిణతి చెందటం, యివీ ఆ సంస్కృతీ ప్రచోదకాలు. ఈ ఆదర్శం, ఆశయం విపరీత ధోరణులకు దారి తీస్తుంది. దానిని ఒక కవి యిలా పదబద్ధం చేశాడు. ఈ జాతికి పేరేం పెడదాం అన్న శీర్షికతో వెలువరించాడు.

మనస్సు మాట శరీరం
మూడూ చెయ్యాలి తపస్సు
మూడూ కలిసి తపిస్తేనే
నిలకడగా ఒక సంస్కృతి
కాలంలో నిలిచే సంస్కృతి
లేక
మాటల్లో దేవత
మనసులో దైత్యుడు
దేహంలో జంతువు
అయితే–
ఇలాగే అనిపించి, కనిపిస్తున్నాడు
ఈనాటి మానవుడు
విచిత్రమైన యీ సృష్టిని
పెంచి పోషించే
ఈ జాతికి పేరేం పెడదాం?

కంటిలో కోరిక
కొనతేలిన రోజొకటి
ఒంటిలో ఆవలి
పంటిలో పరపర
మనసులో మంటలు
ఊహలో భుగ భుగ
పొంగారుతున్న పాము విషం
నాసికలో సల సల
ఊపిరిలో విలవిల
దూరలేక ఆగిపోయి
దురుసుగా దూకేస్తే
కసి కసిగా ఒళ్ళు
పేలి పేలి పోతుంటే
కళ్ళు జీరలు పడి
రక్తం చిమ్ముతూంటే
చిట్లిపోతుంది ఒళ్ళు
పట్టు సడలి పోతుంది
నీరసపడి పోతాయి
మనసూ శరీరం
చేతులు చాచినా
చేతికి అందని అందం
నిత్యం ఎగిరి ఎగిరి పడే
ఈ జాతికి పేరేం పెడదాం?
కణ కణ మంటూ
కోరిక కాలిపోతుంటే
లావాలాలేచి

నిప్పులు చెరుగుతంటే
కాలిపోతూ, తనతోపాటు
పరిసరాలను దహించే
యీ జాతిని ఏమనాలి?
ఏమని పిలవాలి?

ఈ విధంగా ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కువ దేశాలు యీ రీతిగ వుండటానికి కారణం, యీ అమెరికన్లు ఆచరించి, ప్రభవించి ప్రచారం చేసిన వ్యక్తి సంస్కృతే !

అయినా ఆ సంస్కృతిలో ఎన్నో అద్భుత లక్షణాలున్నాయి. లోగడ అనుకున్నట్లు యీ లక్షణాలకు ప్రాభవం లోకి రావటానికి, ప్రపంచం మేల్కొని ముందుకు సాగటానికి చాల కాలం పడుతుంది. ప్రస్తుతం మాత్రం వ్యక్తిపూజ, వ్యక్తిసౌభాగ్యం, వ్యక్తి సంపద, వ్యక్తి ఎదగటం (అంటే సంపాదన) యివి ప్రధానంగా ప్రాచుర్యంలో వున్నయి.

ఇటువంటి వాతావరణంలో తాను తన చరమదశలో సంతోషంగా వుండగలనా అని రాగిణి సందేహించింది. దానికి వకుళ భర్త సమాధానం యిచ్చాడు.

'అమ్మా యిక్కడి వాళ్ళకు మాలాంటి వాళ్ళు కావాలి. మీద్వారా ఎంతో ఉత్తమ కళాపోషణ జరగాలి. దానికి మీరిక్కడ వుంటే మంచిది. మన సంస్కృతి వీళ్ళకి నేర్పవచ్చు – ఇక మీ నాట్యాలయం (ఇండియాలోది) అంటారా, అది యిక్కడ యీ మీయింట్లో నడుస్తున్న కేంద్రాన్ని, ఆ స్థాయికి తీసుకువెళ్ళి, ఇండియా కేంద్రాన్ని దానికి అనుబంధ సంస్థగా చేద్దాం. అన్ని రంగాల్లో జరుగుతున్న మాదిరి డాన్స్ అకాడమీ (ఇంటర్నేషనల్) అని పోను పోను నృత్యరీతులు సమన్వయం చేసి కొత్త రీతులకు దారి తీద్దాం. ఇండియాలో మన బ్రాంచికి యిక్కడనుంచి సపోర్టు చేద్దాం.

డబ్బు విషయం నాకు వదిలేయండి. నేనన్నీ ఆర్గనైజ్ చేసి మీకు స్వంత సంపాదన వుండేటట్లు చేస్తాను–

ఈ మాటలు రాగిణికి ఎంతో బలం, ఊరట కలిగించాయి. బాల్కనీలో కూర్చొని ఆనందంగా యీ ప్రణాళికను నెమరువేసుకున్నది–

ఆ ఇంటి బాల్కనీ నుండి చూస్తూ కూర్చుంది–

అస్తమిస్తున్న సూర్యుడి స్వర్ణకిరణాల అడవిలాంటి ఆ హరితమైదానానికి అలంకారంగా రంగులద్దుతున్నాయి. అప్పుడే ఉదయిస్తున్న చంద్రుడు యింటిని ఆనుకుని వున్న సరస్సులో వెన్నెల కురిపిస్తుంటే ఆ సరస్సు వెన్నెల మ్రింగుతున్నది– దూరంగా క్షితిజం– మనసులో వూహలు మెదుల్తున్నాయి.

ఈ క్షితిజాన్ని నేను చేరగలనా
ఎప్పుడు చేరతాను?
అనంత కాలం అలా నడుస్తూవుండాలా
నా క్షితిజం నడిస్తే అందదు

రాగిణి మనసులోని నవ్వు పెదిమలమీద అలవోకగా అల్లుకుంది.

క్షితిజాన్ని చేరాలంటే
నీవే ఆ క్షితిజమవాలి
నీవే అవాలి విశ్వంగా
విశ్వంగా అవాలంటే
విశ్వమంత కావాలి
కావాలి ఆ దేవుణ్ణి, విష్ణువుని
విష్ణువునవాలంటే
ఆ విష్ణువు చేయందించాలి
ఆ హస్తాన్ని నేనందుకోవాలి
కాని ఆ క్షితిజమంత దూరం
హస్తం చాచగలనా?

మళ్ళీ నవ్వుకుంది– ఈ భావాలన్నీ తనవి. ఏ సంస్కృతికీ సంబంధించినవి కావు – అందువలన స్థాన ప్రభావం ఆ భావాలకు అవసరం లేదు. అన్నిచోట్లా, విశ్వమంతటా విస్తరించి వున్న విశ్వపతి– ఆ బావానికి ఆధారం– ఆ ఆధారం

నాలో వుంటే – నేనెక్కడ వుంటే ఏం –

భారం దిగిపోయింది–

యింతకాలం

మనసు నిద్రపోయి

రాయిలా మారింది.

మనసు మేల్కొని

రాళ్ళు రువ్వింది

మనసు కరిగిపోయి

వెలుగులా మారింది –

ఆ వెలుగు పెదవులమీద కదిలింది.

కొడుకు పెళ్ళి, సుమతికి సపోర్టుగా వుంటుదన్న భావన విష్ణుమూర్తి తన గుండె సమస్య వల్ల వెనక్కు తోసింది– పాపం సుమతి – ఎప్పుడూ నవ్వుతూ వుంటుంది.

ఎలా వస్తుంది, ఆ నవ్వు ఎప్పుడూ– దానికి ప్రేరణ ఏమిటంటే– సుమతి అన్నది.

నిజమే– నాకు నవ్వు సహజంగా వున్నది, వస్తుంది. ఎందుకు ఏడవాలో తెలియక నవ్వుతానేమో– నిజానికి

నీటిమీద వ్రాతలా

జరుగుతున్నపుడే

చెరిగిపోయే జీవితంలో

సుఖం ఏమిటి? దుఃఖం ఏమిటి?

దేనికీ అర్థం లేదు

బహుశా అవసరం లేదేమో?

అర్థం అవసరం లేదేమో

అవసరం అయింది అవగాహనేనేమో

యీ మాత్రం దానికి

ఎందుకింత విచారం

నిజానికి

విచారించడం అపచారం

అనుభవిస్తూ పోవటమో

భగవంతుడి అనుగ్రహాన్ని అందుకోటం

అతడి లీలను ఆమోదిస్తూ

అనుగ్రహాన్ని అందుకోటం–

ఈ భావన వల్లనే దేనికీ అంత చలించకుండా నవ్వుతావేమీ– ఒక విధంగా నవ్వకపోవటమే నాకు భారమవుతుంది. లోపలి నవ్వు తోసుకుంటూ పెదవులు తోసుకుని వస్తుంటే ఎలా ఆపటం?

చాలాసార్లు నవ్వు అపార్థాలకు దారితీస్తుంది. నాకనిపిస్తుంది– నా నవ్వస్త్ర నాకు కవచం, మార్గదర్శి, మంచి నేస్తం–చాలసార్లు నేనొక పిచ్చిదాన్నని వదిలేస్తారు. అప్పుడెంత హాయిగా ఉంటుందో తెలుసా– మీరర్థం చేసుకున్నారు అది చాలు నాకు–

'సుమతీ, నాకు నవ్వటం నేర్పించలేదు నీవు– అన్నాడు నవ్వుతూ విష్ణుమూర్తి.

మీరు సంశయంతో, సందేహం, ప్రశ్నలు వేయటం, సమస్యలు పరిష్కరించటం అవసరం– నాకు మీరున్నారుగా'–

చాల సులభంగా అన్నావు తల్లీ– కాని ఆ అలవాటు యిప్పటికీ నన్ను బాధపెడుతున్నది. సుదర్శనయాగం చేసినా, యీప్రపంచాన్ని గురించి, సృష్టిగురించి అనుమానాలు తగ్గలా– ఎలా–

విరగబడి నవ్వుతూ ...

'ఆ సమస్యనే అడగండి–

ఈ మధ్య ఒక కథలో చదివాను. మీలాగే ఒక బాధ పడే ఒక శిష్యుణ్ణి చూసి ఒక స్వామీజీ అన్నాడట–

అడుగు సమస్య నువ్వు

చిరుగాలికి చెదిరేటి
పెళుసు మనసు కలవాడా
నీకు కలిగేవి
రెపరెపలాడిన వేళ
రారా టపటప కన్నీళ్ళు
తహతహ లాడితే
కలిగేది కలవరమే
మొద్దుబారి ముతకబడి
మనస్సు స్తబ్దమయితే
తెలియదు నీ దారి నీకు
జటిలంగా నా సమస్య
ఎవరికీ రాలేదింతవరకూ
అని మాత్రం అనుకోకు
ఈ జగతిలో నీలాగే
సమస్యలున్నవారెందరో
పరిష్కారం కావాలని
నీ సమస్యనే అడుగు.

మిమ్మల్ని సంశయాలు, చెద పురుగులా తొలిచేస్తున్నది– అన్నీ మరచి పోయి దేవుడి మీద భారం వేసి దేవుణ్ణే సమస్యకు పరిష్కారమడగండి. అన్నిటా దేవుడున్నాడనుకుంటే, ఆ నమ్మకమే మిమ్మల్ని ముందుకు తీసుకువెళ్తుంది– మనకు మిగిలిన కాలంలో పెద్ద పెద్ద సాధనలు చేయలేం – చక్కగా దైవ భజన చేయండి – అన్నీ సర్దుకుంటాయి.

'లేవండి, భోజనం చేద్దాం–

విష్ణుమూర్తి మౌనంగా లేచి ఆమె వెనుక నడిచాడు.

*****

## 18

నీహార్ సింగ్ నేపాల్‌నుండి అనుకున్నదాని కంటె ముందే వచ్చాడు. ఉదయం 8 గంటలకు రాజారాం వరండాలో వచ్చి కూర్చున్నాడు. కొలను చుట్టూ పుష్పాలు దండలా కనపడుతూ చాల ఆకర్షణీయంగా వున్నాయి. నీహార్ వాటికి నీళ్ళు చల్లుతున్నాడు.

'ఏం నీహార్, త్వరగా వచ్చేసినట్లున్నావ్. నాన్నగారికి ఎలా వుంది' రాజారాం ప్రశ్నించాడు.

'అవును సార్, త్వరగానే వచ్చాను. మా నాన్న నేను వెళ్ళిన రెండు రోజులకే వెళ్ళిపోయాడు. ఆయన ప్రాణాలు నా కోసమే ఎదురు చూస్తున్నట్లున్నాయి. తరువాత పొలం చూసుకుంటూ, మా తమ్ముళ్ళతోపాటు అక్కడే వుందామనుకున్నాను,కానీ అక్కడ వుండ బుద్ధికాలేదు. తరచూ మన తోట గుర్తుకు వచ్చింది. అక్కడ నేపాలులో అల్లర్లు చాలా ఎక్కువగా వున్నాయి. బస్సులు, లారీలు ఇండియా నుండి రాకుండా అక్కడి గుంపులు ఆపు చేస్తున్నాయి. రోజూ అవసరాలకు కూడ యిబ్బంది అవుతున్నది.

అవును, పేపర్లో చదివాను. మాధేసి పార్టీవాళ్ళు సమ్మెలు చేస్తున్నారట– వాళ్ళకు ప్రభుత్వంలో, రాజ్యాంగంలో సరిఅయిన ప్రాతినిధ్యం లేదట. అందువలన వాళ్ళెపుడూ పరాయివాళ్ళలా బ్రతకాలట– ఎందుకలా జరిగింది?

'సార్, అక్కడ రాజుని దించేసినప్పటినుంచి యిప్పటి వరకు ఎన్ని ప్రభుత్వాలయినయ్యో– ఎందుకో సార్, యీ కమ్యూనిస్టులు రెండుగా విడిపోయి తగాదా పడతారు– కాంగ్రెసు రెండుగా విడిపోయినా ఎలాగో అధికారం కోసం కలుస్తారు. మా ప్రాంతం వాళ్ళు ఎందుకు పరాయి వాళ్ళయిపోయారో నాకు తెలియదు. ప్రతిరోజు కొట్లాటలే– కాల్పులు, చచ్చిపోవటాలు– ఉండబుద్ధివేయలేదు సార్–'

'ఎందుకో యీ పార్టీవాళ్ళకు తగాదాల మీద యింత అభిమానం'–

'ఏం కాదు సార్ దందాలెక్కువ – వాళ్ళు పనిచేయకుండా బ్రతకటానికి

అలవాటు పడ్డారు. తగాదాలు కల్పించి ఆ తగాదాల మీద వాళ్ళు బ్రతుకుతారు. ఎవరెట్టాబోతే వారికేం – మా ప్రాంతం చాల పేదవాళ్ళది సార్. ఇండియా సరిహద్దుల్లో ఉంటుంది– అందుకని వాళ్ళకు కోపం – కాని ఇండియా నుంచి సరుకులు రాకపోతే వాళ్ళు బ్రతకగలరా సార్'–

ఇంతలో పురుషోత్తమరావు వచ్చాడు. వస్తూ...

'సార్, రాజారాం గారూ, ఈ యిడ్లీ తినండి ఎంత రుచిగా వుందో'– అని ఒక ప్లేటు ముందుపెట్టాడు.

'అమ్మగారేరి?'

'ఇంకా లేవలేదు'–

ఇంతలో బయటనుంచి నవీన్ పరిగెత్తుకుంటూ వచ్చి రాజారాం ఇంట్లో దూరాడు. –

'నన్ను చంపటానికి వస్తున్నారు– ఆ మోటారుసైకిల్ మీద వచ్చారు.' వణుకుతూ అన్నాడు.

తోట బయట రోడ్డుమీద చాలమంది గుమికూడారు.

'ఏమయిందిరా, అలా వణుకుచున్నావు? చాల ఆదుర్దాగా అడిగాడు పురుషోత్తమరావు–

'ఇలా కూర్చో, లోపలికి ఎవరూ రాలేదులే–' రాజారావు పక్కన కూర్చోబెట్టుకున్నాడు.

నన్ను చంపాలని నా పూర్వ నక్సలైట్లు ఫ్రండ్స్ మోటారుసైకిలు మీద వచ్చారు– ఎలాగో తప్పించుకుని తోటలోకి వచ్చాను.

'నీహార్ మంచినీళ్ళు తీసుకురా– నవీన్ త్రాగుతాడు' రాజారాం లేచి తోట బయటకు వచ్చాడు. అక్కడ ఎవరో రక్తం స్రవిస్తూ పడివున్నాడు– 108 అంబులెన్సు వచ్చి అతడిని ఆస్పత్రికి తీసుకువెళ్ళటానికి బయులు దేరుతున్నది. –అతనెవరో యింకా తెలియలేదు. తరువాత ఎవరో రోడ్డుమీద పోతుంటే అతడికి ఆ మోటరుసైకిలు మీద వెళ్ళినవారి తుపాకీ తూటా తగిలిందని– వాళ్ళ టార్గెట్ పురుషోత్తం హొటల్ కౌంటర్ వద్ద కూర్చున్న

నవీన్ అని తరువాత పోలీస్ దర్యాప్తులో తేలింది–

‘ ఈ నీ నక్సలైట్ ఫ్రండ్స్‌కి నీవంటే ఎందుకంత కోపం?

రాజారావు ప్రశ్నకు నవీన్ జవాబు చెప్పాడు–

‘నేను పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా మారానని వాళ్ళ అభిప్రాయం– నాకసలు అటువంటి దాని జోలికిపోవటం కూడ యిష్టంలేదు. నేను బయటికి వచ్చింది నాకు వాళ్ళ పంథా నచ్చక అంతేగాని వాళ్ళ వుద్యమాన్ని దెబ్బతీద్దామనికాదు. అది వాళ్ళు నమ్మరు. వాళ్ళకి హింస, చంపటం, గంజాయిదమ్ము కొట్టటం అలవాటు. ఆలోచన తక్కువ– ఏమయితేనేం – వాళ్ళు నేను చేసిన పొరపాటును సరిదిద్దుకుని సామాన్యజీవితం గడపటం యిష్టం లేదు. ఉంటే వాళ్ళతో పాటు వుండాలి, లేకపోతే వాళ్ల తుపాకి గుండుకు బలి కావాలి. పిచ్చి సిద్ధాంతం.’

నవీన్ చెప్పిన దానిని ఆలోచిస్తే, బహుశా యిదే ప్రపంచమంతా ప్రాకిపోయిన టెర్రరిస్టు వుద్యమానికి వాళ్ళ మనస్తత్వానికి ఆయువుపట్టు. ఏదో ఒక ఐడియా పట్టుకుని, అది ఐడియాలజీ అని దానికోసం కత్తి పట్టటానికి రకరకాల మత్తు పదార్థాలు అమ్మటం, డబ్బు సంపాదించి కత్తులు నూరటం, వాళ్ళకు ఎదురు తిరిగిన వాళ్ళని, వాళ్ళను కాని వారిని, నిర్ధాక్షిణ్యంగా చంపటం– రక్తంతో తర్పణం చేయటం–

రాజారాం మనసు వికలమయినట్లయింది– పురుషోత్తమరావుని హొటల్‌కు పంపి, నవీన్‌ని తన దగ్గరే కొంతసేపు వుంచుకున్నాడు.

నీహార్ అన్నాడు–

‘ఇటువంటిదే సార్ నేపాలులో కూడ జరుగుతున్నది. అక్కడ వాటిలో పోలీసులకు కూడ చెయ్యి వుంది–’

తుపాకి చప్పుడు విని పావని వచ్చింది– కుమారి కూడా హడావిడిగా వచ్చింది.

రాజారాం మనసు స్తబ్దమయింది– ఎందుకో క్షణకాలం మనుష్యలంటే అసహ్యం వేసింది– ఈ భావన అతనికే ఆశ్చర్యం వేసింది – మనసు ముద్దయి

రక్తం సలసలా ప్రవహించి గుండెను గొంతులోకి తోసింది.
ఒక సన్నని స్వరంలా మనసంతా పాకింది–
ఆకాశం హింసను వర్షిస్తోందా?
ఇరాన్‌లో హింస
ఇరాక్‌లో హింస
మధ్యధరా సముద్రం ఆవిర్లులేని
తీరాలను మండిస్తున్నట్లుంది
అరబ్ దేశాలు ఆవేశంతో వూగిపోతున్నాయి
నియంతలు నిశ్చేష్టులై
తమ నీడకు దూరంగా వెళ్ళిపోవాలనుకుంటున్నారు.
ప్రజల బాధలు
భావాల హాహాకారాలు
సుళ్ళు తిరిగి వాళ్ళ ఒళ్ళు వొంచేస్తున్నాయి
నీడలను వుసికొల్పుతున్నాయి
నియంతల నీడలు
సాగిసాగి సంకెళ్ళవుతున్నాయి
సంకెళ్ళు నోళ్ళు తెరచి
తరుమూతుంటే ఎక్కడికి వెళ్ళాలి
నీడలు వేడెక్కి
బుర్రలు తినేల్తున్నాయి
ప్రజలు పక్షవాతంలా
వారిమీద వాలుతున్నారు
పెద్ద దేశానికి చిన్న దేశమంటే భయం
చిన్నదేశానికి పెద్ద దేశమంటే భయం
ఆఫ్గనిస్తాన్‌లో హింస
మతం వారి ఆయుధం

మతం వారికిచ్చిన అధికారమని వారి వూహా
కలాష్కినవేలు వారి ఆభరణం
భోజనం,మాట, మనసు-
పాకిస్తాన్‌లో హింస
వారి మీద వారికి కోపం
మతం వారికి మూలాధారం
మతం చుట్టూ తిరుగుతూ
మనుగడ సాగించాలి
మంచికోసం హింస
మంచిని ముంచేస్తువారు మిగులకూడదు
అనేకులు ఆకాశాన్నంటే
మేఘాలై హింసను వర్షిస్తున్నాయి
ఆకాశానిక్కూడ అనేకులు ఘాతాలై
కురుస్తోంది హింస
ఒక కన్నువిచ్చుకుంది ఆ ఘాతాలకు
ఒక్కసారి భళ్ళుమన్నది సన్నని రేఖలా
ఒక్క కాంతి పుంజం- వెలుగు
చల్లగా విస్తరించాలి
అదే ఆశ అదేఆశ.
క్షణమాగి అతని మనస్సు పల్లవించినట్లు
ఒక రాగం అడిగింది.
హింస కాగలదా హంసలా
హంస కాగలదా పరమహంసలా
హంసకు గుడి పెడితే హింస
హింసకు గుడి చేస్తే హంస
హంసను తప్పు పలికితే హింస

హింసను శాసిస్తే హంస

హింసకూ హంసకూ రాణయిందా

ఇదేమానవ మేథ.

పావని బిత్తరపోయి చూస్తున్నది. కుమారికి మనసు వికలమయింది. ఏదో భయం ఆమెను ఆవహించింది.

నీహార్ మనసులో మెదిలింది–

'ఇండియాలో కూడ యీ తుపాకుల శబ్దం వినాల్సిందేనా'–

నవీన్‌లో వణుకు లోపలికి వెళ్ళింది–

నక్సల్‌గా తాను చంపదలచినవారి మనసులో వణుకు ఎలా వుంటుందో యిప్పుడతనికి గమనమయింది. పురుషోత్తమరావు లేచాడు తన హొటల్‌కి వెళదామని. అక్కడ ఎలావుందో– గేటుదాకా వచ్చేటప్పటికి అక్కడ గుంపులుగా మనుషులు గుమిగూడివున్నారు. మెల్లగా రోడ్డుదాటి హొటల్ చేరుకున్నాడు– కొంతసేపటికి భద్రతాదళం వచ్చి అందరినీ చెదరగొట్టింది–

క్షణంలో కావలసిన విధ్వంసం

మరుక్షణంలో విల విల బోయి ఆగిపోయింది.

అందరిలో భయాన్ని నింపేసి వెళ్ళిపోయింది.

అంత గందరగోళంలో కూడ ఏదో ఒక నిశ్శబ్దం

అది గంభీరనీరవం–ఎవరి మనస్సులోకి వాళ్ళు వెళ్ళిపోయారు. ధ్వనిలో నిశ్శబ్దం, నీరవం– ఆశ్చర్యం–కొన్ని క్షణాల తరువాత మామూలు రణగొణధ్వని! భయం చేతబట్టుకుని ఎవరి పనులకు వారు వెళ్ళిపోయారు.

పావని, రాజారాం ఎదురుగా టేబుల్ మీద వున్న కాఫీ చేతిలోకి తీసుకుని పావని అన్నది.

'ఏమిటిది రాజా, ఏం జరుగుతున్నది' అన్నది సాలోచనగా–

'మనం బతికింది ఇందుకోసమా– యిలాంటి సంఘం కోసమా– ఎక్కడ వుంది లోపం'

'అర్థమయితే మన జీవితం మనకర్థమయినట్లే– ఇటువంటి సంఘంలో

మంచి అంటూ బ్రతికాం, చెడు మనకు అర్థం కాలేదు–

అన్నీ తెలుసుననుకున్నాం
మనషులూ మనస్తత్వాలూ
అందరూ అన్నీ తెలుసుననుకున్నాం
ఒక్కసారి మెఱుపులా
ఈ మోటారుసైకిలుమీద మనుషులు
చూపించారు మనకు
మీ కేమీ తెలియదని
మెరిసింది మనసులో
మనకేమీ తెలియదని
అంతా అగమ్యమని
వర్తనా, ప్రవర్తనా
అన్నీ అగమ్యమని
మనకు ప్రత్యేకంగా అగమ్యమని
యతో వాచోని వర్తంతే
అప్రాప్య మనసా సహీ !
ఆ ఆవేదన మళ్ళీ మౌనమయ్యింది–

అందరూ తేరుకునేటప్పటికి కొంత సమయమయ్యింది. కాని ఆ సంఘటన వేసిన ముద్ర మాత్రం ఎక్కడో ఒక స్మృతిగా నిలిచిపోయింది.

బహుశా యీ హింసావాదులకు కూడా ఏనాడో ఎక్కడో జరిగిన ఏ సంఘటన స్మృతిగా ముద్రపడి వారిని వెంటాడుతుందేమో !

అసలు అనుభవం అంటే
భావం మనసున నిలవటమేగా
ఆ భావం ఎలా నిలుస్తుంది మనసులో
మనసులో మరకగానా
మెరుపుగానా, మాటగానేనా

శక్తిగానా, శబ్దంగానా
వినగలిగితే శబ్దం
కదలిక తెలిస్తే శక్తి
చూడగలిగితే మెరుపూ మరకా
మనసును విదిలిస్తే–
మరకలూ, మెఱుపులూ, మాటలూ
అన్ని కదులుతాయి
శక్తినంది నడుస్తయి
కానీ అంతా మనసు గంపలోనే
కలకాలం, కలకాలం శాశ్వతం
యీ మనసు గంప
యీ స్మృతుల గంప
యీ కొంపలు ముంచే గంప

యీ ఆలోచన రాగానే రాజారాంకి ఏదో భారం తగ్గినట్లయింది– లేచాడు తన పనులు చేసుకోటానికి.

## 19

కొద్దిరోజులయిన తర్వాత ప్రభావతి, శివరాం వచ్చారు. ఆస్పత్రి విషయమయిన చర్చకు వచ్చేముందు ఒక ఉదయం అందరూ ఇంటి వరండాలో కూర్చున్నారు. కొలను ప్రశాంతంగా అరుణకిరణాలు, ఆహ్లాదంగా తెల్లగా మారుతున్నాయి పూలచెట్లు అన్నీ ఒకరికొకరు సంభాషించుకున్నట్లుగా ప్రశాంతంగా వున్నాయి. అంతా చల్లగా వున్నది– పేపరు చదువుతూన్న రాజారాం అన్నాడు.

'చూశావా పావనీ, యీ ప్రపంచం ఎంత విచిత్రమయిందో, పేపరులో వున్న ఒక్క షీట్‌లో మూడు రకాలయిన అధికార దాహాలు–

ఉజ్బెకిస్తాన్‌లో 25 సంవత్సరాలుగా ప్రెసిడెంటుగా వున్న వ్యక్తికి బ్రెయిన్ హెమరేజ్ వచ్చింది– అతడిని గురించి వ్రాస్తూ 'ఇతడు అధికారం కోసం

తనకడ్డువచ్చిన వారందరినీ నిర్ధాక్షిణ్యంగా అడ్డుతొలగించుకున్నాడు. కుతంత్రాల ఈ మనిషి ఒక రాజ్యాన్ని యింకొక రాజ్యం మీద ఉసికొల్పి తమాషా చూస్తూ ఆనందించేవాడు. చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నా అది బయటపడకుండా చూసుకున్నాడు. ఇప్పుడతనికి వారసుడంటూ లేకుండా చూశాడు. మరి ఆ దేశం ఏ సంక్షోభంలో పడుతుందో.

ఇక రెండవది చైనాలో ఏక పార్టీ నియంతృత్వం లో ఎవరు, ఏ పదిమంది అధికారం.........అన్ని వచ్చే పార్టీ కాంగ్రెసులో నిర్ధారించుకోవటంకోసం రహస్యంగా ఒకచోట తలుపులు మూసుకుని సమావేశమయినారట– పదిమంది ప్రభుత్వం నడిపితే అందులో ఒకడు ప్రెసిడెంటు తక్కిన వాళ్ళు తక్కిన పదవులు. ఆ పదిమందీ చైనాకు మంచిచేసి ముందుకు తీసుకువెళతారట. దీన్నే ప్రొవింటీరియల్ డిక్టేటర్ షిఫ్ అంటారు. అందరి మంచికోసం పనిచేయడమే యీ నియంత ధ్యేయం– దానికోసం వాళ్ళు పదవులు పంచుకుంటారట.

ఇక మూడవది. LTTE ప్రభాకరన్. చచ్చిపోతాడన్న వాడు యింకా బ్రతికే వున్నాడన్న అనుమానం. మారణకాండ కారణమయినవాడు నిజంగా చచ్చిపోలేదని ప్రచారం చేస్తున్నారు అతని మిత్రులు. నిజమయినా అబద్ధమయినా దీనివెనక యింకా విడిపోవాలన్న వాళ్ళ యిచ్ఛ యింకా మిగిలేవుంది.

శ్రీలంక ఏమయిపోయినా వాళ్ళ భాగమనుకున్నది వాళ్ళకు కావాలి–

మరొకరు బ్రెజిలియన్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన డిల్మా రూసెఫ్. పత్రిక రిపోర్ట్ యిలావుంది–

'సస్పెండు అయిన డిల్మా సెనేట్‌కు చెప్పింది. నన్ను యింపీచ్ చేస్తూ దేశాన్ని అనిశ్చితస్థితిలోకి తీసుకువెళ్ళి, తాను ప్రారంభించిన సోషలిస్టు కార్యక్రమాన్ని సమూలంగా పెరికివేయడమే వారి ధ్యేయం. బ్రెజిల్‌లో గొప్ప ఆర్థిక శాస్త్రవేత్తలు నా గవర్నమెంటును పడత్రోసి, దేశాన్ని అస్థిరస్థితికి తీసుకురావడమే వారి లక్ష్యం. నన్ను యీ విధంగా విచారణకు లోను చేయడం

దేశాన్ని భ్రష్టుపట్టించడానికే !

వీటిలో నిజంగా వెల్లడయ్యేది రాజకీయాల్లో జరుగుతున్న కుతంత్రాలు, కుట్రలు,అధికార దాహం–

మరోవంక మతోన్మాదుల ISIS వారికి చంపడం, అన్నం తనటమంత తేలిక. వారు చెప్పి న కారణం ముస్లిములు తప్ప యింకొకరికి బతికే అధికారం లేదు–

ఘోరమయిన పరస్థితి – ఎక్కడచూచినా అధికారదాహం, ఏదో కారణం చెప్పి ప్రజల మనుషుల మనటం, రాజకీయాలు భ్రష్టుపట్టటమే లేకుండా అవి దేశాలకు మధ్య కార్చిచ్చు రేపుతూ భయానకంగా తయారయినాయి. దీనికి గొప్ప ఆయుధం అవినీతి.

అవినీతి అగ్నిపర్వతం
ఒక్కసారిగా ఉడికి ఉడికి
తనకుతానే తట్టుకోలేక
లావాను ఎగదోస్తున్నట్లుంది
నిప్పురవ్వలు ఆకాశాన్నంటుతున్నాయి
నిస్సహాయులై ప్రజలు
నిలువుగుడ్లు వేసి చూస్తున్నారు
ప్రజాస్వామ్య ప్రతినిధులు
నిమ్మకునీరెత్తినట్లు
నిలకడగా ఫైవ్‌స్టార్
భోజనాలు చేసి చేసి
పొట్టలు సవరించుకుంటూ
ఎక్కడ నడుం వాలుద్దామా అని
కాని
తాము కొట్టేసిన భూములు
ఎవడో ఎత్తుకుపోతే

ఎక్కడా చోటు దొరక్క
ఇక్కడా అక్కడా అంటూ
పరిగెత్తుతున్నారు.

ఉస్సురని ఊపిరి వదిలాడు రాజారాం– ‘ ఈ మధ్య ఒక పుస్తకంలో ప్రపంచరాజ్యాలను గురించి రాస్తూ అంటాడు –

ప్రపంచరాజ్యాలన్నిటిలోనూ
రాజ్యాధీశులు ఠీవి వెలిగిస్తునారు
సర్వసత్తాక ప్రెసిడెంటులా
రాజులో, నామ్‌కేః ప్రభువులో
..........., రకరకాల నామాల్తో
సింహాసనాధీశులై వున్నారు.
దేశంలో రాజు తరహా పాలకుడు
లేనిదే రోజులు గడవ్వనుకుంటాను
రాజ్యాలు దేశాలు నడవ్వనుకుంటాను
అసలు దేశాలెక్కడున్నాయి?
అన్ని దేశాల ముసుగులో రాజ్యాలే
గణతంత్రాలు చక్రవర్తి తరహా రాజ్యాంగాలే
కొందరు రిఫరీలు, ఎదురులేని రిఫరీలు
కొందరు సంపూర్ణ సత్తావంతులు
సర్వం సహాధికారుల
అన్యాయం, న్యాయం
అధర్మం, ధర్మం
అంతా వారిపేరిటే
వారి హస్తాక్షరంతోనే నడుస్తుంది–
ఇదంతా ప్రజాస్వామ్యం
ఎందుకంటే రాజులు

ప్రజలెన్నుకున్నవాళ్ళే
ప్రపంచప్రజలకింకా
రాజుల మీద మోజు పోలేదల్లేవుంది
ప్రతివాడూ రాజు కావచ్చుకదా !
ఇంతసేపూ మాట్లాడకుండా వున్న శివరాం అందుకున్నాడు –

మీరంతా ఒక భ్రమలో వున్నారు. అందరూ అధికారాన్ని చేయలేరు. ధనం సంపాదించలేరు. దానికి ఎంతో చాకచక్యం, నైపుణ్యం కావాలి –

కనకపు సింహాసనమున
శునకము కూర్చుండ బెట్ట
వెనుకటి గుణమేలమాను
వినరా సుమతీ –
అన్నది మనకు తెలిసిందేగా
చేతగాని మనిషి అధ్యక్ష పీఠ మెక్కితే
అంతలోనే అల్లరిమాని
బుద్ధిమంతుడెలా అవుతాడు
అసలు నీకు తెలుసా బావా – నీకు తెలిసేవుంటుందిలే
ప్రజాస్వామ్యంలో
నాయకస్వామ్యం దాగివున్నది
రాచరికంలో ప్రజాస్వామ్యం దాగివున్నది
రెండూ మంచి స్నేహితులు
బొమ్మవుంటే బొరుసుండాలి
ఒకరు పీఠ మెక్కితే
మరొకరు దించుతారు
ఇది సహజం, ప్రజాస్వామ్యంలో పరిపాటి
పరిపాటిగా సహజం
ఎవరికి అవకాశం వస్తేవారు

వాడుకుంటారు – అంతే

అనవసరంగా ఆడిపోసుకోవడం సరికాదు

న్యాయం,అన్యాయం,ధర్మం,అధర్మం

అంటూ కూర్చుంటే అన్ని అవకాశాలు ఎగిరిపోతాయి.

ఎక్కడి వాళ్ళం అక్కడే వుంటాం – ఎక్కడున్నావే

గొంగళీ, వేసినచోటే వున్నాను, అన్నట్లుంటుంది.

ఇలా సంభాషణ జరుగుతూ వుంటే కాషాయరంగు లుంగీ, కుర్తా వేసుకుని ఒకతను లోపలికి వచ్చాడు.అందరూ అతడివైపే చూశారు. అతడు దగ్గరగా వచ్చి

'రాజారాం గారున్నారా' ? అని అడిగాడు.

'వున్నారు, నేనే ఎవరికి ఏం కావాలి' అన్నాడు.

'మా స్వామీజీ మిమ్మల్ని చూడాలని బయట వేచివున్నారు' !

'అలాగా అదేమిటి, వారు బయట నిల్చోవటం ఏమిటి ?' అని రాజారాం లేచి గేటువైపు నడిచాడు. అక్కడ స్వామీజీ నిలుచుని వున్నారు –

'వీరే నా గురుదేవులు – విశ్వానందస్వామి' అని శిష్యుడు పరిచయం చేశాడు.

నేనే రాజారాంని, తమరు యిక్కడ నిలబడ్డారు. లోపలికి విజయం చేస్తే సంతోషిస్తాను.'

'తప్పకుండా, మేము తమకోసమే వచ్చాం

మిమ్మల్ని మా ఆశ్రమానికి ఆహ్వానించటానికి వచ్చాం.

'అయ్యో కబురు పెడితే నేనే వచ్చే వాడిని కదా'

'ఫరవాలేదు, మీకు అనువైన సమయం చెపితే ఆ సమయానికి మా శిష్యుడు వచ్చి మిమ్మల్ని ఆశ్రమానికి తీసుకువస్తాడు !

'మీ ఆశ్రమం పేరు విన్నాను'

'మేము మీ ఆస్పత్రిలో క్రిందటి సంవత్సరం పదిరోజులు గడిపాం. గొప్ప హాస్పిటల్.'

'తమరిక్కడే నిల్చుండిపోయారు. లోపలికి వచ్చి మా తోట చూసి మా ఆతిధ్యం స్వీకరిస్తే సంతోషిస్తాను.'

మాకు అనుష్టానం టైమయింది. మరోసారి వస్తాను. మీకు వీలయిన సమయం చెపితే మా వాణ్ణి పంపుతాను.' అని స్వామీజీ రాజారాంని ఆశీర్వదించి వెళ్ళిపోయారు.

వారం రోజుల తర్వాత స్వామీజీ ఆశ్రమానికి రాజారాం వెళ్లాడు. స్వాగత మర్యాదలయిన తర్వాత స్వామీజీ ప్రారంభించారు.

'నేను మిమ్మల్ని ఒక కోరిక కోరబోతున్నాను'.

'చెప్పండి స్వామీ, మీ కోరిక కోరతగినంత వాడిని కాదు –'

'అటువంటిదేమీ లేదు – నేను కాషాయ వస్త్రాలు ధరించాను. మీరు సాధారణ దుస్తుల్లో వున్నారు. అంతే <u>బేధం</u>. అన్నిటినీ మించింది మనిషి స్వభావ, స్వధర్మ నిర్వహణ ఏలా వున్నయ్యో అదే. నిజానికి మీరు ఆస్పత్రిని నడిపే పద్ధతి చాల శ్లాఘనీయం. మీలోని ఉదారగుణానికి నిదర్శనం. పెద్ద ఆస్పత్రి నడుపుతూ, అందులో పేదలకు పెద్ద పీటవేసి వారిని ఎంతో చక్కగా ఆదరించి, వ్యాధి నుండి రక్షించేవిధంగా చూస్తే ఎంతో ముదావహం. నేను మీ పేదల వార్డులో వున్నాను. అక్కడికీ, డబ్బు చెల్లించే వార్డుకీ ఏ మాత్రం బేధం లేదు – మీరు, మీ భార్య పావని గారు తెల్ల బట్టల సన్యాసులు' అని నవ్వాడు.

అని కొంతసేపాగి శిష్యుడిని రాజారాంకి కాఫీ తెప్పించి చెప్పటం మొదలుపెట్టాడు. –

'ఎక్కడి నుండి మొదలుపెట్టాలో తెలియటం లేదు – అయినా నా .....నుండి మొదలు పెడతాను.

నేను పెద్దవాడినయి పోతున్నాను. ప్రకృతి నన్ను ప్రోత్సహించటం మానేసినట్లున్నది.(నవ్వాడు). ఈ ఆశ్రమ బాగోగులు చక్కగా చూసుకునే శక్తి తగ్గుతోంది. దీని పాలన పోషణలకు నేను సేకరించిన నిధిని ఒక ట్రస్టుగా ఏర్పరచాను. ఇంతవరకూ నేను చైర్మెన్‌గా వున్నాను. ఇక దానిని సరిగా

నిర్వహించే శక్తి తగ్గుతున్నది. ఇక పెరిగే అవకాశం లేదు. ట్రస్టు సభ్యులెవరూ యీ భారాన్ని మోయగలవారుగా నాకు తోచటం లేదు. తగిన మనిషిని వెదుకుతున్నాను. అటువంటి సమయంలో మీరు, మీ భార్య పావని నా దృష్టి ముందుకు వచ్చారు. ఆ విషయంలో మిమ్మల్ని ప్రార్థిద్దామని తమరిని ఇక్కడికి ఆహ్వానించాను.'

'స్వామీ, మీ ఆశయం చాలా గొప్పది, కాని నేను, నా భార్య పావని యిప్పటికే చాల పెద్ద భారాన్ని మోస్తున్నాం, దానిని ఎవరికి ఒప్పచెపుదామా అన్న ఆలోచనలో వున్నాం.

అందువల్ల మీ ఆఫర్ కు సమ్మతించే అవకాశం లేదలే చెప్పాలి. మీ శిష్యుల్లో ఎందరో మహానుభావులుంటారు వారు ఎవరైనా యీబాధ్యత తీసుకోలేరా ? అదీకాక మీ తరువాత మీ పీఠాన్ని అధిరోహించేవారే దీనికి సరియైన వ్యక్తులు.

'నేను వారసుడిగా, ఆధ్యాత్మిక వారసుడిగా ఎవరినీ నామినేట్ చేయదలచలేదు. దానివలన గానీ, అందుకు తగినవారుగానీ నాకు కనిపించలేదు.

అదీగాక మీ ప్రశ్నకు సమాధానం చెప్పటానికి నన్ను గురించి కూడ నేను తమకు చెప్పుకొనాలి. మీకభ్యంతరం లేదు కదా !

'అటువంటిదేం లేదు స్వామీ, మీరు చెప్పింది వినటానికే గాక నేను యిక్కడికి వచ్చింది –' అన్నాడు నవ్వుతూ.

'నా గురువులు నాకు సన్యాస దీక్ష యిచ్చి – కొంత శిక్షణ తర్వాత – ఇక నీకు నీవుగా యోగసాధన చేసుకొని ముందుకు ఫో' అని తన దారిన తాను హిమాలయాలకు వెళ్ళిపోయారు. ఎందుకలా చేశారో తెలియదు– అప్పటి నుండి నేను ఈ చిన్న ఆశ్రమాన్ని స్థాపించుకొని సాధన చేసుకుంటున్నాను. నాతో పాటు వుంటామని వచ్చిన వారిని కాదనలేదు. నాకు తోచిన పద్ధతిలో సాధనా మార్గాలు నేర్పి, గృహస్థులకు ప్రవచనాలు చేస్తూ, యీ ఆశ్రమాన్ని నడుపుకుంటూ, నా సాధన కొనసాగిస్తూ వచ్చాను.–

నాకు భక్తులుగాని, శిష్యులుగానీ, వున్నారన్నా, వుంటానన్నా నేను ఒప్పుకోలేదు. అందరిలోకి కాస్తో కూస్తో మన ఆధ్యాత్మిక గ్రంధాలు పఠించి అర్థం చేసుకుని, అందరికీ అందజేసే ఒక ఆధ్యాత్మిక పాఠశాలగా దీనిని వూహించి రచించుకున్నాను. అలాగే ఎదిగింది ఆశ్రమమనే యీ పాఠశాల అందరికీ బాధ్యత వహించి ముందుకు నడిపించి నన్ను బంధించుకోదలచలేదు. అయినా యీ ప్రపంచ రీతి లోకాన్ని బాధ్యతలుగా మిగిలిపోతాయి. అలా జరిగిందే యీ ఆశ్రమ స్థాపన – ఇప్పుడిక యీ పద్ధతిలో కొనసాగే అవకాశం ఎక్కువగా కనిపిస్తున్నది. –

చాల సార్లు నా యీస్థితిని, ఆశ్రమ స్థితికి నిర్దిష్టరూపమిద్దామనుకున్నాను. కాని నేను గురువుగా నన్ను ఒప్పుకోలేకపోయాను. గురువుగా వుండటం ఒక గురుతర బాధ్యత. శిష్యుడి లౌకిక అలౌకిక స్థితులకు బాధ్యత గురువుదవుతుందని నా అభిప్రాయం. అంతశక్తి నాలో నాకు కనిపించలేదు. మీకు టయిము వుంటే నా ఆధ్యాత్మిక ప్రస్థాలమెలా జరిగిందో కొంత ఆత్మకథలా వివరిస్తాను.

'చెప్పండి స్వామీ, టయిము బాధ వద్దు.' 'నా చిన్నతనం నుండి నా పరిసరాలను గురించి ప్రశ్నలు నాలో లేస్తూనే వుండేవి. – ఏమిటిది ? ఏమిటీ ప్రపంచం ? నా జీవితం అంటే ఏమిటి? యీ అమ్మా, నాన్నలు, కుటుంబం యీ సరంజామా అంతా ఎవరు సృష్టించారు ఒకసారి, నా కప్పుడు పదేళ్ళను కుంటాను. అపుడు నా పుట్టినరోజన్నారు. నేను మాఇంటికి సమీపంలో వున్న ఒక ఇసుక బీడులో వెల్లకిలా పడుకుని ఆకాశం వంక చూస్తున్నాను. వున్నట్లుండి నాకనిపించింది. ఇది నాకు స్పష్టంగా గురుతు, గొప్ప స్మృతిగా మిగిలిపోయింది.

నా క్రింద
ఇసుక రేణువుల బంగారు రంగారు పట్టుపరుపు
నా పైన
ఆకాశం వంగి తన అంచును చుంబిస్తోంది
చీకటి పైకి ప్రాకి

ఆకాశాన్ని పులుముతూ పరుచుకుంటోంది
చీకటి తోపునుంచి
తారకలు తొంగిచూస్తున్నాయి
అవి –
మినుకు మినుకు మంటూ ఏదో చూస్తున్నాయి
నేనొక చూపు విసిరాను ఆకాశం మీదికి
అది చీకటిని చించుకుంటూ పోయి
తారకల మిణుకును మ్రింగి
తిరిగి అదే దారిలో
నా కంటిని చేరి నా కళ్ళలో
నల్లటి వెలుగులా మారిపోయింది
నా రెప్పలు వాలినవి
మెదడు మూలిగింది
మనసులో మాటలు మెదిలినవి
రవ్వంత శబ్దం, అస్పష్టం
ఏదో తెలియని నాదం
'ఎవరు నేను, ఎవరు నేను'
ఎవరికి యీ ప్రశ్న
ఎవరు వేసారు
చల్లటి గాలికి యిసుక రేణువులు లేచి
శరీరంలో చేరినట్లయింది.
వెలుపటి దశ్రీతాలకు చేరినట్లయింది
"నేను కరిగిపోయానా ? నేనున్నానా ?
'వున్నావు'
జవాబు స్పష్టం
నిన్ను వాసనలు మోసుకువచ్చి

ఓ గర్భ శయ్యలో వదిలినయి
ఆ గర్భ శయ్య కొంతకాలం మోసి
మురిసింది, కొన్నాళ్ళకు
భరించలేక ముందుకు తోసింది
ఆనాడే,ఏనాడో నీవు వచ్చిన రోజు
రోదిస్తూ వచ్చిన రోజు
ఏ నాటిదో అయిన
నీ మొదటి పుట్టిన రోజు
నాదం ముగిసి రెప్పల
మీదికి జారి వెళ్ళిపోయింది
మగత వదిలి నా రెప్పలు విడివడినయి
చీకటి జారిపోయింది
ఆకాశం అంచులు వాటిపైకి లేచింది
ఇసుక పరుపు చల్లగా తగిలింది
ఒళ్ళు విరుచుకుంది
మనసు మళ్ళీ మేలుకొంది
మరో పుట్టినరోజు మళ్ళీ ప్రారంభమయింది.

అప్పటి నుండి ప్రారంభమయినయి నా ప్రశ్నలు. జీవితం ఒక ప్రశ్నల పరంపర అయింది. ఒక ప్రశ్నల ప్రవాహం
ఒక ప్రశ్నల సముదాయం
యీ నాటి పరిభాషలో ఒక కొశ్చన్ బాంక్
ఒక్కొక్కసారి అన్నీ ప్రశ్నలే
నన్ను చుట్టుముట్టి
కందిరీగల్లా బొంద కుంటూ
కుట్టి భయపెడతాయి
కుట్టి నొప్పెడతాయి

మా అమ్మకు 13 పురుళ్ళు
నాకు కలిగిన ఒకటే ప్రశ్న
అమ్మకు పిల్లవాడు పుట్టి
వెంటనే వెళ్ళిపోయాడు
ఆ బుల్లి శరీరాన్ని ఒళ్ళో పెట్టమని
అమ్మ ఏడుస్తోంది
తొమ్మిది మాసాలు యిందుకా నేను మోసింది
అప్పుడనిపించింది – నా గాలిట్లు తిరకుండా
వెళ్ళిపోయాడు మంచిదేగా
మరి అమ్మ ఎందుకేడుస్తుంది
నా బుల్లి మనస్సుకు అర్థం కాల
నేను పడేస్తే కోప్పడ్డారు
అమ్మ ఏడిస్తే కోప్పడతారు
నేనే పూడ్చిపెట్టాను
అలా ఎన్నిసార్లో జరిగింది
మరణం అంటే ఏమిటి
నా కప్పుడు పదేళ్ళు

ఒకసారి పెళ్ళికి వెళ్ళాం, అశ్మీ నడిగాను. పెళ్ళంటే ఏంటమ్మా' నీకూ జరుగుతుంది పెళ్ళి – అన్నది నవ్వుతూ, నీకూ ఒక పెళ్ళాం వస్తుంది – మళ్ళీ నవ్వింది –

'పెళ్ళాం అంటే' – ఎలా నాకు అర్థమయ్యేట్లు చెప్పటం

ఆ పెళ్ళిలో అమ్మాయిలూ, అబ్బాయిలూ ఒకళ్ళ చుట్టూ ఒకళ్ళు తిరుగుతూ ఏమిటో మాట్లాడుకుంటూ నవ్వుకోవటం చూశాను.

ఇలాంటి ప్రశ్నలు ముమ్మరమయినయి. మా ఇంటి చుట్టూ ఎప్పుడూ ఏదో ఒక పురాణమో, నాటకమో, భజనో, పూజలో జరుగుతుండేవి – పూజలకు అంతు లేదు – ఇంటా బయటా – నేను స్కూలుకు వెళ్ళి చదువు

కుంటున్నానే కానీ – ఏమిటిదంతా, ఎందుకిదంతా – యీ క్షణం నవ్వుతారు – మరు క్షణం ఏడుస్తారు – కోపాలూ, తాపాలూ,నవ్వులూ, పెడబొబ్బలే అన్నీ ఒకదానికొకటి పొంతన వుండదు – ఏది నిజమో – ఏది లేదో, ఏది వుందో – ఇదమిత్థంగా తెలియటం లేదు – అసలు ఎవరు నేను ?

అప్పటి నా స్థితి యిప్పటి తెలివైన మాటలతో చెప్పాలంటే –
ప్రపంచం నా చుట్టూ తిరిగి
నా లోకి దూకేస్తోంది
ప్రపంచం నీలో వినిపిస్తోంది
వణికిస్తోంది పొలికేకలా ఒకసారి
మలికేకలా మరోసారి
ఎందుకు నా చుట్టూవున్న నా చిన్న ప్రపంచం
నా చుట్టూ తిరిగి
నాలోకి దూకేస్తోంది
నిజానికి ఆనాటి ప్రతిఘటన, సంఘటనా
యీ నాటి మాటల్లో 'నా లో సంచలనం కలిగించింది'
ప్రధానంగా నన్ను కలవర పరచిన ప్రశ్న
జీవితమంటే ఏమిటి ?
అందులోనూ 'నా' జీవితమంటే ఏమిటి
ప్రతిఘటనల సంఘటిత సమాహారమా ?
నా చుట్టూ అల్లిన, కప్పుకొన్న
ఆహార్యమా, అసమాహార ఆహార్యమా
సంఘటనల లయ విన్యాసమా
ఘటనలు పూలై
ఆ పూలను మనసు మునివ్రేళ్ళతో
అల్లిన భ్రాంతి మానస హారమా ?
సూత్ర బంధనమా ?

ఆ పూలను పేర్చి కూర్చిన
సూత్రపు మేవి మలపుల
తీరు తెన్నే జీవితమా ?
ఏది జీవితం ?
బాధలు పూలై, అందంగా
అలరింపుగా సూత్రచందాన అల్లి
కాలం మెడలో వేసిన
హారం జీవితమా?
ఏది జీవితం
ఆ సూత్రం పూల మధ్య తిరిగిన తీరు
త్రిప్పిన పుష్పలావిశ
జీవిత సంచలన చలనమా ?
ఏది ?

ఒక్కొక్కసారి మనసు యీ ప్రశ్నలతో వికలమయినప్పుడు అనిపించేది – మళ్ళీ ఆనాటి బాధ యీనాటి మాటల్లో

ఎందుకు
నా చుట్టూ వున్న నా చిన్న ప్రపంచం
మొనతేలి నన్ను ముట్టుతోంది
నన్ను తాకిన నా చిన్న ప్రపంచం
ప్రిదిలి నన్ను వదిలి పోదెందుకూ ?
మొనతెలి నాలోకి దిగి
నన్ను రక్తసిక్తం ఎందుకు చేస్తోంది ?
నా చుట్టూ ప్రపంచం నన్ను
పంజరంలో బిగించి బంధించేస్తోంది
ఆ ప్రపంచానికి నాలో ఆసనాలు
కనిపిస్తున్నాయి కాబోలు

ఆరామ్‌గా నాలో చేరి

అవిరామంగా అది శయనిస్తోంది.

నన్ను నిద్ర పుచ్చుతోంది

కళ్ళు కమ్మేస్తోంది.

వాడి వేడి బాణసంచాలా

నాలో మంటలు రేపకుండా వుంటే

ఎంత బాగుంటుంది

ఎలా యీ ప్రవేశాన్నాపటం

మనసులో యీ మథనతో నేను ....... చేరాను

మా అమ్మ అప్పుడే – ఆరోజులలోనే వుండేవి గదా – నా పెళ్ళి

గోల మొదలెట్టింది – నేను ఒక స్వామీజీకి లెటర్స్ వ్రాస్తూ వుండేవాడిని. ఆయన జవాబిచ్చేవారు. నాప్రశ్నలు ఆయనకు చాల చిన్నవనిపించేవో, లేక వాటికి జవాబు దొరకటానికి నాకింకా మానసిక పరిణితి లేదనుకున్నారో – ఆయన ఒక మూట వ్రాసారు ! ...................................... అని. దానితో ఆయనతో ఉత్తర ప్రత్యుత్తరాలు మానేశాను. ఆ సమయంలో నాలో ఒక విచిత్రమైన ప్రశ్న ఉదయించింది –

నేనెవరో నాకు తెలియదు

'నాకు తెలియదు' అన్నదెవరు ?

నాలో వున్న ఎవరో ఒకరు

ఆ ఒకరు ఎవరు ?

ఎవరితో వున్నారు ?

ఏదో శక్తి ఏమో ?

దానిని తెలుసుకో

నేనెందుకు పుట్టితిని ?

పుట్టినది ఎవరు ?

అట్లయిన నేనెవరు?

నీవే చెప్పాలి –

యిలా ప్రశ్న – జవాబు ఒకదాని చుట్టూ ఒకటి తిరగటం మొదలు పెట్టాయి. –

ఈ సమయంలో స్వామీజీ సడెన్‌గా ఆపేసి

'రాజారాం గారూ మమ్మల్ని చాల యిబ్బంది పెడుతున్నానేమో – చాల టయిము తీసుకుంటున్నాను నా కథతో –' అన్నాడు వినయంగా

'ఫరవాలేదు యిటువంటి కథలు ఒక సారిగా వినాలి. లేకపోతే దాని నిజంగా అనుభవం రాదు – అయినా యిప్పుడే నేను వెళ్ళి, సాయంకాలం తిరిగివస్తాను. అన్నాడు రాజారాం –

'సాయంకాలం ప్రవచనం కోసం ఆశ్రమానికి వస్తారు. రేపు ఉదయం కలుద్దామా' –

అలాగేనని ఆనాటికి ముగించి మరునాడు రాజారాం స్వామీజీ ఆశ్రమానికి వెళ్ళాడు. అప్పుడు పావని కూడా వచ్చింది.

స్వామీజీ చాల సంతోషించి, తన కథ ప్రారంభించారు.

నేను ......పూర్తి చేసిన వేసవి సెలవుల్లో మా అమ్మ చనిపోయింది – దానితో ఆ కుటుంబంతో నా సంబంధం తెగిపోయినట్లనిపించింది – అప్పటికి నాలో కొన్ని ప్రశ్నలకి పూర్ణ రూపం వచ్చింది – నిజంగా నాకు తెలియవలసింది 'నేనెవరు' అన్నది – వివరంగా చెప్పాలంటే ఉపనిషత్తులు, వేదాలు, మన గ్రంధాలన్నీ ఈ ప్రశ్నలే సమాధానం వెతికి కొన్ని సమాధానాలు పొందుపరిచినట్లు నా భావన– నాకు తెలిసినంతవరకు వాటి సమగ్ర చర్చ, కొన్ని అద్భుత అనుభవాలు యివన్నీ గొప్ప కావ్య హృదయంతో, శబ్ద సౌందర్యంతో సంగ్రహంగా మహర్షులు –..................– వారి భాషణలు,సంభాషణలయిన ఉపనిషత్తుల్లో నిక్షిప్తం చేసి, విశదీకరించారు. మహా కావ్యాల్లో అంతా చెప్పారు. వారి యోగం అద్భుతం. వారి భావనలో సాధన యోగంలో వారిలా అనుకుని వుంటారు.

నా దేహమొక ప్రయోగ ప్రయోగశాల

నా యిల్లొక ప్రయోగశాల
ప్రతి క్షణం ప్రయోగమే
యోగమే ప్రతి నిముషం
ప్రతి మాట ప్రతి కదలికా
ప్రతి చూపు, ప్రతి అడుగు
యోగంలో నడకే
ప్రయోగానికి అందాలే
ప్రతి పవనం, ప్రతి శబ్దం
ఒక కవనానికి ముందు మాట
యోగానికి ముందడుగే
ప్రతి భావం సత్యానికి
దరిదాపుల లోనిదే –

నేను చిన్మయ మిషన్‌లో ఒక బ్రహ్మచారిగా చేరాను – అప్పుడది నా అనుమానాల జీవితానికి ఒక స్పష్టమైన, బలమైన, నిర్దిష్టమైన ముందడుగు.

అక్కడ నన్ను తీర్చి దిద్దారు. ఉపనిషత్తులు వేదాలు– వీటిలో తర్కబద్ధమయిన వివరణలతో చక్కగా బోధన చేశారు. కాని నాకు ఏ విధమయిన అనుభవం స్పష్టంగా కలగలేదు. కాని నాకు వివరంగా తెలిసిందేమిటంటే అన్నిటికీ అడ్డం మనసూ, అన్నిటినీ వివరించి, సమస్యలు తీర్చేదీ మనస్సే – ఆ మనస్సును అధీనంలోకి తెచ్చుకోటానికి ఎంతో సాధన కావాలి. దానికి ఎంతో దృఢ సంకల్పం కావాలి – మనో నిగ్రహం కావాలి. మరో విషయం తెలిసింది – నిత్యం ఒక గొప్ప అనుభవంకాని తత్త్వ చర్చకందేది కాదని తెలిసింది –

అనుభవం మనస్సుకతీతమయింది – తర్కానికి అతీతమయింది. మనస్సుకు తర్క బాధ వున్నది – అయినా దానిని వాడుకునేదానికి దానికి దాటాలి !

అనుభవం అద్వైతం
మనుగడలో ద్వైతం
కాలం దేశం ఏకం ఒక క్షణం
అదే క్షణం రెండుగా విడివిడిగా
కాలం కాలూనింది ద్వైతంలో
దేశం నిలిచింది తోడుగా
జరుగునా యిది మనసుండీ
కాదు కాదు – జరగదు.
నీవే దేవుడు – ప్రతివాడూ దేవుడే
నీవు పరమాత్మ ఒకటే – అలా మహా కావ్యాలు చెపుతాయి.

ఆత్మ – నీవు ఒకటే, అయితేనేం నేనే అయిన ఆత్మ నాకు అనంత దూరంలో వున్నట్లు నేను దానిని చేరటానికి అనంతకాలం పడుతుంది. నీకు నా ఆత్మకు అనంత దూరం. వాసనలూ, కర్మ, జీవితం, జన్మ, మరణం యివన్నీ మన సాధన ద్వారా అర్థం చేసుకొని అధిగమించాలి. ఇదంతా ఒక విచిత్రమయిన చిక్కుముడి.

మసిబారిన అద్దంలో
వెన్నెల ముఖాలు వెట్టిగా, ఎట్టగా
ఏడుస్తూ, మందంగా, మురికిగా
కోపంగా, ముడతలుగా
మురికిగా, కుళ్ళుగా
కనిపిస్తయి, ఝడిపిస్తయి
మురిపిస్తయి, ధూళిని బట్టి
చూసే కంటిని బట్టి
తలచే మనసును బట్టి
తెలిసిన ఛాయలబట్టి, రంగుల బట్టి
ఏది నిజం ? వెన్నెలా ?

వేర్వేరు రంగుతో
యిది తెలిస్తే, చిక్కుముడి విడినట్లే
మనసు విషయమైన బాధయిది –

సాధన చేస్తున్నప్పుడు, యీ వేదాంతం ఒంటబట్టినప్పుడు, ఒక విచిత్రమైన స్థితి వస్తుంది.

లేని ప్రపంచంలో
ఉన్నదనుకుని బ్రతకాలి
ఎలా ?
అనుకోవడమెలాగో అలా ?
అనుకోవడం అంటే ఆలోచన
ఆలోచన – లోచనముంటేనే ఆలోచన
లోచనేది – ఎక్కడ
ఎలా వుంటుంది
అదే – లేని ప్రపంచం వున్నదంటోంది ?
తమాషా ఏమిటంటే –
భావనకు పేరుపెట్టి
మనస్సు మనల్ని బంధించి
కలవరపెట్టి కలవరంలో ముంచుతుంది
దానిని కాలాని కందిస్తుంది
కాలం మనసుకు కళ్ళెం వేసి
తనతో లాక్కెళుతుంది
బందీలమై మనం, బంధనాల వలయంలో
ఖులాసాగా గడపాలని తలచి
మత్తులో మునిగిపోతాం
మత్తులో కాలం మనల్ని
మనసు మంత్రాన్ని

మ్రింగేసి దానిని పనిచేయనీయదు
మత్తుకు మందు వెతుకుతూ
తిరిగి తిరిగి వేసారి
తేలలేక తన్నుకుంటాం
హతవిథీ – యిది మానవుని విధి
మరొక ముడి – మనసు వేసే ముడి
సత్యం నిత్యం
అసత్యం అనిత్యం
యీ ప్రపంచం నిత్యమయిన అసత్యం
సత్యానికి నిత్యాహార్యం
అందుకే ప్రపంచం నిత్యం
అందుకే
ప్రపంచం పరమం పరమేశ్వరం
అందుకే చూడాలి
ప్రపంచంలో పరమేశ్వరం
ఇది కావాలి ప్రగాఢ విశ్వాసం
జ్ఞానానికి ఆవరణ అజ్ఞానం
అందుకే ప్రపంచం అజ్ఞాన సత్యం
అసత్యమని తెలిసి నడిస్తే
ప్రపంచమే పరమేశ్వరం

ఇదంతా యీ స్వామీజీ ఎందుకు చెపుతున్నాడని మీరు అనుకోవచ్చు. ఇదంతా చెపితే కాని నాలోని విపుల, విస్తారమయిన వూగిసలాట, యిప్పటికీ పూర్తి వూగిసలాట అర్థం కాలేదు – అర్థమయితేనే కాని నేను మిమ్మల్ని ఎందుకు అడుగుతున్నానో తెలియదు.

నిజానికి అన్నీ ఆలోచించి బేరీజు వేస్తే మనకు మన సాధనలో ప్రధానంగా ఎదురయ్యేవి, ఒకటి మనసు, రెండు వాసనలు, తరువాత అన్నింటినీ ప్రభావితం

చేసే కాలం. మన చుట్టూవున్న మనసు పిడికిటిలో మన బ్రతుకులున్నాయి. ప్రపంచం చాల వింత బ్రతుకు.మనసుకు మన మీద ఎందుకో యింత గట్టి పట్టు.

బహుశా మనం మనుష్యులమన్నది యీ మనసునుంచే వచ్చిందేమో
మనిషిగా మన ప్రపంచంలో
నడుస్తున్నది కొంచెం
నడిచి గడిచి పోయింది
స్మృతులలో నిలచింది కొంత
నడవబోయేది స్వప్నాల్లో
ఊహల్లో కోరికల్లో కొంత
అన్నిటినీ కూర్చేటిది
మణిమాలగా చేసేటిది
మనసులో అంతా
యిదే మన చిన్న ప్రపంచం
మనుషులమనుకున్న
మనం తిరుగాడే
మనల్ని చోదించే
మనల్ని నియమించే
మన చిన్న ప్రపంచం
ఇక వాసనలు
యీ వాసనల్లో ఆత్మ తరుక్కుపోతుంది –
నిజంగా వాసనల గురించి చెప్పుకోవాలంటే చాల వుంది –

మనకు తెలియకుండా వాసనలు మనల్ని మరుగున పడేస్తాయి. ఇది పెద్ద ప్రమాదం. ఈ వాసనలే జన్మలకు కారణం.

మనచుట్టూ వాసనలు
నాలుకల్లా చాచుకుంటాయి

దాహం దాహం అంటూ
దహించుతూ ఆడుతూవుంటాయి
చీమా, దోమా, పురుగూ
ఏదయినా, ఏమయినా
కనిపిస్తే కసుక్కున
కాటేసి లాగేసుకోవాలని
అల్లల్లాడిస్తూ ఆడుకుంటయి
అలుపు లేకుండా అలవాటుగా
మనలో కదలాడించే నాగుల్లా
వాసనలు మన చుట్టూ తిరుగుతయి
కనిపించిందంతా నాకేసి
మనలోకి పంపాలని ఆశగా
అదిరదిరి పడతాయి
మనల్ని మభ్యపెట్టి
దురదలా,గరగరల్లా
మనమేనిన మనసున
మరమరలాడతాయి
విదిలించి వదిలించుకోడం ఎలా
శరీరం నీరసిస్తుంది
మనసంటుంది నీరసం రసమేనని
యిక ఎలా వాసనలను వదిలించుకోటం
అన్నిటినీ మించింది కాలం – దీనినే మరణమూ
జన్మలూ అన్నిటికి ప్రతినిధి అనుకోవచ్చు –
విచిత్రమయింది కాలం
కాలం కదుల్తూ
కొలిమిలా కాల్చేస్తుందా

వనంలో దారిలో
పూలు పరచి నడిపిస్తుందా
కాగడాలు వెలిగించి
వెసులుగా దారిని వెలువరిస్తుందా
ఏదయినా, ఏ దారయినా
చేయి కలిపి నడిచినా
ఒకటి మాత్రం నిజం
అంతా ఆ పరమావధి వైపే
అంతా పరంధామం లోనే
యీ నిశ్చయస్థితి మనకు గొప్ప వూపునిస్తుంది
కాని కాలం ఒక విశిష్ట పాత్ర గలది
కాలం కదలిపోతోంది
అది దాని లక్షణం
ఎవరికీ కనపడని కాలం
ఎవరికీ అందని కాలం
సూక్ష్మాతి సూక్ష్మ కాలం
అందరినీ చూసి ఆవహిస్తుంది
అయితే –
ఆ కాలం మనలో వుందా ?
మనం కాలంలో వున్నామా
మనలో కాలం వుంటే
మనం మాధవులం
మనం కాలంలో వుంటే
మనం మనుష్యులం
కాలానికి గొళ్ళెం వేస్తే
మనం మాధవులం

కాలానికి కళ్ళెం వేస్తే
మనం మంచి మానవులం
కాలం వెనక్కి మళ్ళి
మనలో నిలిస్తే స్మృతి
మనల్ని దాటేస్తే
అది భవిష్య స్వప్నం
తమాషా
స్మృతులూ, స్వప్నాలూ
మన మనస్సుల్లో దాగుంటాయి
తలపులనే వాటిని ముందుకు తోసి
తన ఉనికిని తెలుపుకుంటుంది మనస్సు
కలలూ, స్వప్నాలూ, స్మృతులూ, క్షణాలూ
అన్నీ కలబోసి బ్రతుకుదాం మనం
కాలం తలపులూ, మనసూ
అహం, ఆత్మా, పరమాత్మా
ఈ వరసన సాగితే పరమాత్మ, పరంధామం
కాకపోతే తిరుగు ప్రయాణం
జన్మలూ,వాసనలూ,మరణాలూ,మమతలూ
మళ్ళీ నీవూ నేనూ యీ ప్రపంచం
యిదీ కాలరీతి –
ఇది తెలిస్తే
అంతా మందస్మితమే
మధురమే మధురాలాపమే –
కాని యీ రహస్యఛేదన ఎలా –
సాధన చేయాలి
సాగాలి సాధన

సంభ్రమాశ్చర్యాల
సంతోష ప్రస్థానంగా
మన పంకం లోంచి
పంకజాల పరంపరగా
ప్రశ్నలు పంకంలోనే
ఆగిపోయి అంతం కాక
ఆటలా సాధన సాగాలి
ఆనందంతో, సంతోషంతో
అంచెలంచెల సంధానంగా
సాధన సాగాలి
సాధన బాధల బాటలేకూడదు
ఏదో చేరలేదని, తనకది చెందలేదని
కుంగుతూ, కుంగుతూ
వుండే సాధన వద్దు, నిషేధమది
సంతోషంతో సాగే సాధన కావాలి
సమరంలా కాక
గురువుల ఒద్దిక పెంపకంలో
పసిపాపల ఉత్సాహపు
వురకల చూపుల్లా
సంతోష సమాహారంలా
సాగాలి సాధన.

అని హాయిగా నవ్వాడు స్వామీజీ

కాని ఎప్పుడూ ఒకటే మనలులో వుంచుకుంటే సాధన సాఫీగా సాగుతుంది. ఇదంతా భగవానుడి లీల.

ఆత్మలూ పరమాత్మ శరీరంలో
పాతుకుపోయాడు

శరీరం పరిసరాల్లో మునిగిపోయింది
ఆత్మా కాలంలో, ప్రతిక్షణంలో
మగ్గిపోయి మురుస్తోంది
పరిసరాలను కాలం పరిగెత్తిస్తోంది.
యీ మాయా నాదేనని
ముసి ముసి నవ్వులు
చిందకుండా, పెదవి మెదపకుండా
తనలోనే వుంచుకునే
భగవానుణ్ణేమనాలి
మగ్గుతున్నది నేనా
మురుస్తున్నది నేనా
యిరుక్కున్నది నేనా
నరుక్కున్నది నేనా
ఇక నీ కెందుకు బాధ
నీ వెవరివని బాధ
నీవేం లేదు
సున్నావు నీవు
వృత్తాని వనుకున్నా
పెద్ద సున్నావు నీవు
అయితేనేం, సున్నాగానే వుంటేనే
పెద్ద సున్నా నేనున్నాను
పెద్ద సున్నా నేను
చిన్న చిన్న సున్నాలవుతుంటే
కలిగేదే సుఖమయిన బాధ
బాధ నీది సుఖం నాది
నీవు సుఖపడితే

నాకు మిగిలేది బాధ
యిలా మనమిద్దరం ఆడే నాటకమే
రసరమ్య రాసక్రీడ
అప్పుడప్పుడు రతిక్రీడ
కొత్త సున్నాల కేసం ఆడే క్రీడ
అంతా రసమే
ఇదే సున్నాల లీల –
క్షమించండి – మీకు ధోరణిగా చాల చెప్పాను.

నేనెప్పుడూ యింతగా ప్రభావితమై బయటికి పొక్కలేదు. యిదంతా నా స్థితి, నా శిష్యులనబడే వారితో కూడిన యీ ఆశ్రమానికి పీఠిక. అందుకనే అంతగా చెప్పాను –

ఇక నా విన్నపం మీద మీ అభిప్రాయం
ఏమిటో ఆలోచించుకుని చెప్పండి –

అని ఆగి నవ్వుతూ – చిన్న రిక్వెస్టు

ఇంతగా మిమ్మల్ని ఆయాసం నుండి తెలిక పరచటానికి మా ఆశ్రమ ఆతిధ్యం స్వీకరించండి – భోజనం చేసి వెళ్ళండి –

"అయ్యో అంతగా చెప్పాలా – మీరు మాట్లాడుతుంటే ప్రవచనంతా విన్నాం – మీ ప్రవచనాలు ఎందుకు ప్రఖ్యాతి చెందినయ్యో తెలిసింది – భోజనం చేసి వెళతాం –

భోజనం చేసి తిరిగి తోటకు వెళ్ళారు.

## 20

వారం రోజుల తర్వాత రాజారాం స్వామీజీ ఆశ్రమానికి వెళ్ళాడు– తమ నిర్ణయం చెప్పటానికి.

స్వామీజీ – మీరు మామీద వుంచిన నమ్మకానికి చాల కృతజ్ఞతలు. కాని

రెండు విధాలుగా మేము ఈ భారాన్ని స్వీకరించటానికి అర్హులం కాదు. ఒకటి, మా యిద్దరికీ వయసు మీద పడుతోంది – ఇప్పుడున్న హాస్పిటల్ బాధ్యతనే ఎవరికయినా అప్పగిద్దామని సరియైన వారికోసం వెతుకుతున్నాం. రెండు – ఈ రకమైన ఆధ్యాత్మిక పరిణతి మాకు లేదు.

మేము ఒక విధంగా  సేవాభావంతో మాకు తెలియకుండా మాకు సంక్రమించిన కొన్ని గుణాలను అనుసరించి నేను స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నా, కొంతకాలం రాజకీయ ప్రస్థానం చేసినా, తరువాత హాస్పిటల్‌లో కార్యక్రమాలు నడిపినా యింతవరకు సర్దుకురాగలిగాం. సేవాభావమనండి, సంఘస్ఫూర్తి అనండి, మానవత్వం అనండి అంతవరకే మా ఆధ్యాత్మిక స్తరం– ఇకపైన సాధనలూ, నేనెవరూ అన్న వాటిని గురించిన ఆసక్తి మా యిద్దరిలో ఎవరికీ లేదు. మా అమ్మా, నాన్నలు మా మీద చూపించిన ప్రేమానురాగాలు, వాళ్ళు చేసిన సంఘసేవలు, నిస్వార్ధ నడవడిక, మా ప్రవర్తనకూ, నడవడికకు పునాదులు. అంతే – వాళ్ళూ అంతగా అకాలిక దేశాల్లోకి అడుగుపెట్టనివ్వలేదు. పెట్టినా అది సాంప్రదాయం కోరినంతవరకే  – అందువల్ల ఒక్క సేవాభావంతో యిలాంటి మహత్తర ఆధ్యాత్మిక కేంద్రాన్ని నడపటం సాధ్యమయ్యే పనికాదు. మాకు తెలిసింది ఒక్కటే –

వీలయినంతవరకు, మనస్సును సుఖంగా,సంతోషంగా వుంచుకుని, ఆనాటికి ఏదో మంచిపని చేసామని తృప్తిగా బ్రతకడం మాత్రమే – నిజానికి నేనెవరు’ అన్న ప్రశ్న మాకెప్పుడూ తీవ్ర ప్రశ్నగా మాలో ఉదయించలేదు.కాని అది మీ ఆధ్యాత్మిక జీవనానికి ప్రధమ తీర్మానం. అప్పుడు ‘ఏమిటి యీ జీవితం’ అన్న ప్రశ్న  వుదయించినా దానికి సమాధానం వెదుక్కునేంత సమయం మా కర్మాచరణ మార్గంలో దొరకలేదు. మీ మాటల్లో చెప్పాలంటే మనసెప్పుడూ తెల్లగా తంపుం మరకల్లేకుండా హిమ బిందువులా మెరుస్తూ, తొలి ఉషస్సు తెలిహాసంలా వెన్నెల మింగినట్లు ధవళకాంతుల నిండివుండాలి.

అంతవరకే మా యత్నం.

ఒక విధంగా మేము యీ ప్రపంచానికి , దానికి అధిదేవత అయిన

విశ్వమూర్తి భక్తులం.

దేవుడంటే విశ్వం అన్నది మా నరాల్లో యింకిపోయిందేమో
దేవుడంటే విశ్వం
కృష్ణుడు విశ్వం
రాముడు విశ్వం
విశ్వమంటే ప్రేమ
వారే విశ్వమయి తమలో
తామేమగ్నమయినారు.
విశ్వం వారిలో ఒదిగి నిలిచింది
విశ్వం వారికి
నిత్య ఆనంద స్వప్నం
వారి మనసంతా విశ్వమే
విశ్వం గీతమయి వారిలో గానం చేస్తుంది
విశ్వం తలచేదే
వారు తలచేది

మాలో సేవాభావాన్ని యీ విధంగా అర్థం చేసుకోటం క్రిందటి వారం మీ భాషణయే –

అలా సాగిన జీవితం తృప్తినిచ్చింది. ఏనాడూ ఏదో లోపం జరిగిందని అనుకోలేదు. మేము మాకు సేవ చేసుకున్నట్లుగానే అనిపించింది. ఇదంతా మానవ సంఘానికి, ఆ సంఘంలోని మానవుల యెడ కలిగిల స్పందనే – వారి అసలు రూపమేమిటో మేము నిజంగా ఎవరో ఎప్పుడూ ఆలోచించలేదు. అలాగే జీవితం అలా గడిచింది –

ఒక్కొక్కసారి అనిపించేది – కాని ఒక్క క్షణం మాత్రం
నా జీవితం నాదేనా
నాదనుకునే జీవితం
నిజంగా నాదికాదా

నాదయితే నేననుకున్నట్లు లేదే
నేను సంకల్పించినట్లు లేదు
సంతోషం కోరితే శోకం
మంచి కోరితే చెడు
పదవి కోరితే భంగపాటు
ధనం కోరితే దారిద్ర్యం
ఏమిటీ విపర్యయాల విపరీతం
ఇదే అయితే ఆ జీవితం
నాదేలా అవుతుంది
మరి నా సంకల్పం –
సంకల్పం సాకారం కాకపోతే
ఇక సంకల్పానికి అర్థమేమిటి ?
సఫలం కాని సంకల్పాలను
ఎందుకు మనసు సంకల్పిస్తుంది
అలా చేసే మనసు నాదెలా అవుతుంది
అయితే ఏది నాది
ఏది నేను
మనసు కాదు – జీవితం లేదు
శరీరం అసలే కాదు
మరి ఏది ?

యిలాంటి సందేహం వచ్చినా అది ఎక్కువ కాలం నిలవదు – యింత వరకే మా ఆధ్యాత్మిక చర్చ–

పెద్దతనం పేదవాడి ఆశలా
పరుగెత్తుకుంటూ వచ్చి
శరీరం మీద వాలిపోయింది
మరణం జఠరాగ్ని లేచి ఎప్పుడు చల్లారుతుందో

ఎప్పుడు మంటలు రేపుతుందో

తెలియని స్థితి–

కాని అది రణంలా, వ్రణంలా తెలియకుండా వెంట వుంటూనే వుంది.

ఇందులో నిరాశా భావం ఏమీలేదు. కాబోయే నిజస్థితిని గమనించి మెలగటం అంతే – ఇక సేవా భావమంటారా – దానిని ఉన్నత కవితా భావంతో చెప్పాలంటే అది సానుభూతి.

సానుభూతి ఎందుకంటే – అది అంతే

ప్రపంచంలో అందరూ అంతటా అందరిలో నేనేవున్నాననిపిస్తుంది.

నా లాంటి వారే అందరూ

నా కోరిక, నా ఉనికి

నా వూరూ, నా ఆశ

నా బాధా, నా గాధా

అందరిలాంటిదే అనిపిస్తుంది

అందుకేనేమో

ఏది చూచినా స్పందన కలుగుతుంది –

ఇది సేవాభావాన్ని మాలో కలిగిన సేవాభావానికి మీ మాటల్లో నా వ్యక్తీకరణ.

మేము తమ ఆఫర్‌ను స్వీకరించలేక పోయినా, ఒక సజెషన్ చేయగలను.

విష్ణుమూర్తి గారని, ఒక రిటైర్డ్ ఛీఫ్ యింజనీరు వున్నారు. ఆయనకు ఆధ్యాత్మిక స్పృహ ఎక్కువ – వారితో చెపుతాను తమరిని చూడమని, మీరు సమ్మతిస్తే –

తప్పకుండా – వారి టెలిఫోన్ నెంబరు యిస్తే నేనే వారిని యిక్కడికి ఆహ్వానిస్తాను–

వెళ్ళేముందు ఒక చిన్న కోరిక నాలో లేచినది మీ స్ఫూర్తి వలన –దానిని మీకు మా కవితా రూపంలో చెప్పి వెళతాను.

కాలం, పరిధీ నన్ను

కాటేసి కలుషితం చేసినా
ఆ కాలుష్యం నాలో కరిగినా
రేకులకు పూయాలి
బంగారు పూలు
నన్ను మురిపిస్తూ మాయ
ఆటలాడుకోవాలి
అయినా మరువనీయదీ మాయ నన్ను
గుర్తు చేయాలి నేను
చైతన్యాన్నని
జీవితంలో మా పద్ధతిలో
గెలుపు ఓటమిలో
మిమ్మేది వరించిందో
మాకు తెలియదు
అయినా ఒకటి తెలుసు నాకు
మా జీవితాల్ని మేము సంపన్నం చేసుకున్నాం
అయితే దాని అర్థం పూర్తిగా తెలియదు
ఆనందం - కాదు సంతోషం
మమల్ని యింతవరకూ వరించింది
మేము సమ్మతించాము
అంతే అదే మా కెఋక
అంటే మమ్మల్ని వరించింది
గెలుపా, ఓటమియా
రాజారాం లేస్తుంటే స్వామీజీ అన్నారు-
'ఆ భావనే మీలో ప్రత్యేకత
మీరెంచుకున్న పథం
దేవుడి చేరికలో వున్నది.

అందేదే చాలు
జీవితం పండటానికి
అందుకే నేను మిమ్మల్ని
యిక్కడికి ఆహ్వానించి
అర్థించాను – !
రాజారాం స్వామీజీకి నమస్కరించి
లేచాడు –

## 21

స్వామీజీ ఆహ్వానం మీద విష్ణుమూర్తి, సుమతి వారి ఆశ్రమానికి వెళ్ళారు. వారిని సాదరంగా ఆహ్వానించి ఆసీనులయిన తర్వాత స్వామీజీ అన్నాడు.

'మీరు తరచూ తత్త్వ జిజ్ఞాస చేస్తూవుంటారని విన్నాను. నిజంగా అది విశేషమయిన గుణం – చేయవలసిన ఉత్తమ కార్యం. ఒక విధంగా సాధన.

'అంతగా చెప్పుకోవలసింది లేదు. కాని రిటైర్ అయిన తర్వాత ఎందుకో నాలో తీవ్రమయిన తపన మొదలయింది.

ఈ సృష్టి, యీ ప్రపంచం, మనిషి, మనస్సు, మరణం, జన్మలూ – యివన్నీ ప్రవచనాలు విశదీకరిస్తయి. కాని నిజానికి యిదంతా ఏమిటి ? అని ఒక జిజ్ఞాస నాలో తలెత్తింది – కాలం మనకందనిది కాని మనల్ని ఎంతో ప్రభావితం చేస్తుంది – ఏమిటిదంతా ? ఎవరికోసం ? ఎవరు దీనికి ఆద్యం ? అన్న జిజ్ఞాస నాలో తీవ్రంగా వచ్చి యిబ్బంది పడుతున్నాను. బహుశా యిదంతా నాకు మరణం చివరి మాట అన్న లోపలి భయం వల్లనేమో. ప్రవచనాల్లో చెప్పినవన్నీ మనం అనుభవం లోకితెచ్చుకోటం అసాధ్యమనిపిస్తుంది –ఇదంతా ఒక అయోమయస్థితికి దారి తీసింది.

అయోమయం అగమ్యగోచరం
ఈ జీవితం

చలనం ఒక మహా సంచలనం
ఎటు తిరిగినా, ఏ మలుపు తిరిగినా
ఎక్కడ చూచినా అడ్డు గోడలే
గమ్యమని దగ్గరికెళితే
అది ఎండమావిగా మారుతోంది
దూరమని వూరుకుంటే
దగ్గరని వూరిస్తుంది
అంతా అగమ్యగోచరం
అయోమయం
కనపడ్డది నిజమని నమ్మితే
లేదది భ్రమరా బాబూ అంటోంది
అసలు గమ్యమనేదున్నదా ?
వుంటే తెలియదేం
ఈ గమ్యం నిజమని పరుగునవెళితే
అది కాదు నీ గమ్యం అంటోంది !
ఏమో ఏది గమ్యమో
ఎలా తెలియటం
ఎలా తెలియటం

ప్రవచనాలు విన్న తరువాత గమ్యమేమిటో తెలిసినట్లుంది. కాని దానివైపు గమనమెలాగో గోచరం కావటం లేదు. బహుశా అది దుస్సాధ్యమేమో

స్వామీజీ' –మీరన్నది నిజం – దీనినే జిజ్ఞాస అంటారు. సృష్టి రహస్యం చాల గంభీరమయినది – దానికై సాధన కూడ చాల కష్టం – చాల ప్రయత్నం చేసి చెపుతున్నానని కాబట్టి మీరు దీనిని నమ్మవచ్చు.

నాకు మరో సందేహం వస్తుంది –
అసలు తెలుసుకోవలసిన అవసరం ఏమిటి ?
తెలుసుకోకుండా జీవితం గడపలేమా ?

అన్న ప్రశ్నలు తలెత్తుతాయి. కుంకుమ పురుగుల్లా

యీ సందేహాలు మనసులో పాతుకుంటాయి.

హాయిగా, మా సుమతిలా ఎప్పుడూ నవ్వుతూ బ్రతకగలిగితే సరిపోతుందనిపిస్తుంది.' అని సుమతి వైపు చూశాడు. సుమతి తన సహజ మయిన నవ్వు , ఆ వజ్రాల ద్దిద్దుల్లో మెరుస్తుంటే ఫక్కున నవ్వింది –

'అమ్మాజీది చాల ప్రసన్నమైన నవ్వు– అంత సహజంగా చాల తక్కువ మందిలో వుంటుంది. అమ్మాజీ మీరు చాల అదృష్టవంతులు–' అని విష్ణుమూర్తి వైపు తిరిగి అన్నాడు.

'అంత తేలికగా మనసు మనల్ని వదిలేయదు– ప్రశ్నలు వస్తూనే వుంటుంది. సుఖం, దుఃఖం అన్న బేధం సృష్టిస్తూనే వుంటుంది. ఇదంతా ఎడతెగని యానం– జన్మలు, మరణాలు, జీవితాలు–యీ పరంపర ఆగాలంటే దానికి కొన్ని జన్మల సాధన కావాలి–

'అని నేను ప్రవచనాలు విని తెలుసుకున్నాను. నమ్మదగినంతగా వుంటుంది ప్రవచనాలు–

బహుశా ఏమతానికో మత తత్త్వంలో నిష్ణాతులుంటారు– ఒక విధంగా క్రిష్టియన్లు, ముస్లింలు–యిలాంటి వూగిసలాట నుండి బయటపడ్డారేమో– వాళ్ళమన్నిది ఒకే జన్మ అని వాళ్ళ నమ్మకం గదా– బహుశా యిదంతా కలిపి చేయవలసిన సత్యశోధన 'నేనెవర్ని' అనే ప్రశ్న మీద అనిపిస్తుంది–'

'అంత తేలికయింది కాదు–' అన్నాడు స్వామీజీ– యింతకాలం యింత చదువుకున్న ఉపనిషత్తులు పఠించినా ఆ అనుభవం చేజారిపోతున్నది– ఇది నా అనుభవం కాని 'నేనెవరు' అన్న ప్రశ్న చాల comprehensive question- అందువలననే కాబోలు మహాకావ్యాలు యీ ప్రశ్నకు జవాబు అయినయి– ఇదంతా మౌనంగా వింటున్నది 'అమ్మాజీ' సుమతి–

'అందుకనే కాబోలు రమణ మహర్షి తన వద్దకు వచ్చిన వారిని ఆ ప్రశ్నకు సమాధానం కనుక్కోమని చెపుతారు– అన్నాడు విష్ణుమూర్తి– ఒకచోట చదివాను రమణ మహర్షి సలహా క్లుప్తంగా చెప్పాలంటే

'నేనెవరో నాకు తెలియదు'

అలాగా–

'నాకు తెలియదు' అన్నదెవరు–

నాలో వున్న ఎవరో ఒకరు

అయితే

ఆ ఒకరు ఎవరు?

ఏదో శక్తి ఏమో–

దానిని తెలుసుకో

నేనెందుకు పుట్టితిని

పుట్టినది ఎవరు?

అట్లయిన నేనెవరు ?

నీవే తెలుసుకో –

అంతా సింపుల్ గా వుంది–

ఫక్కున నవ్వింది అమ్మాజీ–

'అమ్మాజీ మీరు ఎందుకు నవ్వారు– అని' స్వామీజీ సరళంగా నవ్వు మొఖంతో అడిగారు–

'స్వామీజీ, నాకు తెలిసినంత వరకు కొన్ని ప్రశ్నలకు మాలాంటివాళ్ళు జవాబు చెప్పలేరు– వాటిని అడుగుతూ వుండవచ్చు, దానికి జవాబు చెప్పగలవారిని– కాని మనకే ఆ జవాబు అవగతమై, జవాబు రావాలని అనుకుంటే చాలసార్లు దెబ్బతింటాం–ప్రశ్నలు వేయాలి కాని జవాబుకు ఓపికతో వేచివుండాలి– చేయగలిగితే సాధన చేయాలి. వూరికే ప్రశ్నలు సంచీలో వేసుకుని తిరిగితే లాభం ఏమిటి ?

అందరూ ఫక్కున నవ్వారు–

'అమ్మాజీ చాల ప్రాక్టికల్–' అని నా సమస్యకు సరియైన సమాధానం చెప్పగలవారే దొరికారనిపిస్తోంది– నేను నా ఆశ్రమ ట్రస్టుకు ఛైర్మన్ వుండగలవారి కోసం వెతుకుతున్నాను. మీరు దొరికారనిపిస్తున్నది–

స్వామీజీ మాటలకు జవాబివ్వటానికి విష్ణుమూర్తి కొంచం టైము తీసుకున్నాడు. ఈ లోపల టీ, టిఫిన్ తెచ్చి వారిముందుంచారు.

'వయసు మీద పడుతున్నది– కాలం చాల తొందరగా మీదికి వస్తున్నది– నేనంత భారం వహించగలనా అని ఆలోచిస్తున్నాను.'

'అందుకనే నేను వుండగానే ఎవరికైనా యీ ట్రస్టును అప్పగించి వారికి సహాయంగా నేనుందామని నిశ్చయించుకున్నాను. ఎవరికైనా కొత్తభారం యీ వయసులో తీసుకోటం కష్టమే !

కాని యీ ట్రస్టు నిర్వహించటం అంత కష్టం కాకుండా మీకు నేను వుంటాను. ఏమీ భయపడకండి. అసలు మీకు తగిన మీ సతీమణి అమ్మాజీ వున్నారుగా– ఆమె తన కుటుంబాన్ని నిర్వహించినంత తేలికగా, యీ ట్రస్టు నిర్వహించటంలో కూడ మీకు సహాయం చేయగలను. అవునా అమ్మాజీ' –

స్వామీజీ మాటలకు సుమతి నవ్వింది–

ఈ సంభాషణ జరిగిన రెండు రోజులకు కొందరు శిష్యులు స్వామీజీ దగ్గరకు వచ్చారు–

'స్వామీ, మీరు ట్రస్టును ఎవరికో అప్పగించాలని చూస్తున్నారని విన్నాము–'

'అవును, ట్రస్టు ఎవరైనా నిర్వహిస్తూ, రోజువారీ బాధ్యతలు, డబ్బు విషయాలూ చూసుకుంటే మీకు ఏ విధమయిన యిబ్బంది లేకుండా మీ సాధన చేసుకోవచ్చు– సాధనకు ఏకాగ్రత ఏకోన్ముఖత అవసరం'

'మీ గృహస్థ శిష్యులెవరికైనా ఒప్పగించవచ్చు కదా !

'ఒక విధంగా ఛీఫ్ యింజనీర్ గారు కూడ గృహస్థ శిష్యుడే – ఆయనలో ఆధ్యాత్మిక స్రుహ చాల వుంది– తన స్వార్ధ చింతన లేదు. దానికి ఆయన జీవితానికి చాలినంత పుష్కలమయిన ధనం ఆయనవద్ద వున్నది–'

ఎక్కువగా యీ సమస్యను వివాదాస్పదం చేయకుండా వాళ్ళు వెళ్ళిపోయారు.

విష్ణుమూర్తి మీద స్వామీజీకి వున్న నమ్మకం వమ్ముచేయకుండా

విష్ణుమూర్తి, సుమతి కలిసి చాలచక్కగా ఆశ్రమ నిర్వహణ చేశారు– స్వామీజీ పైపైన ఎప్పుడు అంతా గమనిస్తూ వారికి సలహా యిస్తూ ట్రస్టు నడవటం జరిగింది.

విశేషమేమిటంటే– యీ ఆశ్రమ నిర్వహణలో, సుమతి పండగలు, అన్నదానాలు చాల చక్కగా నిర్వహిస్తూ, కార్యక్రమాన్ని నడుపుతూ, చాల తోడుగా వుంటోంది– ఆశ్రమంలో ఎన్నో పండగల పూజలూ, అన్నదానాల అన్నిటికీ అమ్మాజీ 'టాగ్' మొదలైంది. అన్నదానాన్ని 'అమ్మాజీ అన్నదానాలనీ' పిలవటం మొదలెట్టారు. ఆమె తన ప్రసన్నమయిన నవ్వుతో, అందరూ మురిపెంగా పనిచేయటం మొదలెట్టారు. విరాళాలు సేకరించటం, వచ్చిన డబ్బును సరిగా వినియోగించటం అంతా పకడ్బందీగా, ఎక్కడా దుర్వినియోగం కాకుండా చూడటం విష్ణుమూర్తి, స్వామీజీ కలిసి చేసుకుంటూవుంటే పండగలకు, అన్నదానాలను సుమతి 'అమ్మాజీ' నిర్వహిస్తున్నది–

చాలా కాలానికి కురుపుల్లా వేధించే ఆధ్యాత్మిక సమస్యలు 'నేనెవరు' లాంటివి ఒక గాటిలో పడ్డట్టుగా అతనికి అనిపించింది– తృప్తిగా పనిచేస్తున్నాడు. ఇందులో భాస్కర్, అతని భార్య కూడ యిష్టంగా శ్రీ శ్రీ నేర్పిన సేవాభావంతో పాల్గొంటున్నారు.

కాలం భారం కాకుండా గడచిపోతున్నది– విష్ణుమూర్తికి
తృప్తిగావున్నది– లోగడ ఎన్నోసార్లు యీ జీవితం ఏమిటి ?
యీ జీవితం నిజంగా నాదేనా
యీ జీవితం నాకోసమే అయితే
అసలు జీవితం అనవసరం
లేక యిది నన్ను చేసినవాడికోసమే అయితే
అది అతడి యిష్టం, అవసరం
అతడికేది అవసరమో అదినాకనవసరం
అతని యిష్టమే అయితే
పని లేదుకద నా యిష్టముతో
అంటె

నా జీవితం నాకు పనిలేదు
నా పని అక్కడ జీవించటం
బాధలూ,బోధలూ,నివాళులూ
న్యమాలూ, నిష్ఠూర్యాలు
అన్నీ ఎవరి యిష్టం వారివే
అని అనుకేగల శక్తియే అవసరం నాకు
అప్పుడిక నేనంటా లేనేలేనుగా !

ఇలా పరస్పర విరుద్ధమయిన భావాలు, విశ్లేషణలూ మనసులో కలగటం లేదు.

కలవరం సర్దుకుంది– మళ్ళీ విష్ణుమూర్తి పనిలో నిమగ్నమై పోతున్నాడు. ఇది ఒక రకంగా విముక్తిపథమనిపించింది. స్వామీజీ ప్రవచనాలు వినటం అలవాటు అయిపోయింది– స్వామీజీ, ప్రవచనాల, ఆశ్రమట్రస్టు వ్యవహారాలు, అమ్మాజీ అన్నదానాలు, పండగలు– ఇలా జీవితం గడిచిపోతున్నది. ఒక రకమయిన దృఢవిశ్వాసం కలిగింది– వేదాంత పరిభాషలో చెప్పాలంటే అతడి ధీమా యిలా చెప్పాలి–

చైతన్యం దేవుడు
కాలం, విస్తారం
నేను అయినప్పుడు
నేను దేశంలో నిలుస్తూ
దేవుడిలో ఒదిగి
కాలంతో నడుస్తా
బ్రతికేస్తా ధీరుడిలా –
అన్న ధోరణఇలో అతని జీవితం నడుస్తున్నది –

## 22

పావని హాస్పిటల్ భవిష్యత్తు యిప్పుడు రాజారాం, పావనిలకు ప్రధాన సమస్య అయింది–

11–10–16 విజయదశమి, ఈ విషయం గురించి ఆలోచించటమే పావని, రాజారాం లకి ఎవరో, ఎక్కడో తమ గుండెల్ని పొడిచినట్లనిపించటం మొదలెట్టింది. ఏ

సమస్యకయినా పరిష్కారం కావాలంటే నిజానికి సమస్యనే అడగాలి– అసలది సమస్య అవునో కాదో నిర్ణయాత్మకంగా నిర్ధారణ కావాలి– లోగడ స్వామీజీకి కలిగిన సమస్యే తమకు కూడ ఎదురవుతున్నది. ఆయన కొంతవరకు నిష్కామంగా ఆ పని చేయగలిగారు. మరి తాము కూడ అలాగే చేయటానికి ప్రయత్నించాలి. ఈ విషయంలో అతడి పద్ధతి నచ్చకపోయినా, శివరాం దృక్పథం సమస్యను తేలిక చేస్తుందనిపించింది.

శివరాంను పిలిచి అడిగాడు రాజారాం–

'శివరాం, యీ హాస్పిటల్‌ని ఏం చేద్దాం?– ఎలా దీనిని నడుపుదాం !–

'అమ్మేయకూడదా బావా ? శివరాం నిర్మోహమాటంగా అడిగేశాడు.

'ఎవరైనా కొంటారా ? కొన్నవాళ్ళు దానిని మన ధ్యేయాలతో నడుపుతారా? ' పావని ప్రశ్నించింది.

'ఆ రెండో మాటకు అర్థం లేదు– కొన్నవాళ్ళు వాళ్ళ పద్ధతిలో హాస్పిటల్ నడుపుతారు– దీనికి మనం అంగీకరించాలి – శివరాం ఖచ్చితంగా చెప్పాడు.

ఒక్కసారిగా అలా చేయటం కంటే క్రమక్రమంగా దీనిని మరొకరి చేతిలోకి చేర్చటం మంచిదేమో–' పావని అన్నది.

ప్రభావతి అందుకున్నది.

'అలా చేస్తే మంచిది– మనం కూడ దాని మీద మనకున్న మమతను క్రమక్రమంగా వదులుకోవటానికి అవకాశం కలుగుతుంది.'

'ఇది బాగుందనిపిస్తున్నది – శివరాం, దీనికి ఒక మార్గం ఆలోచించు–' అన్నాడు రాజారాం. పావని ముభావంగా వుండిపోయింది. ఎందుకో ఆమె మనసు దీనికి పూర్తి అంగీకారం చూపించడం లేదు. కాని ఏదో ఒక మార్గంలో యీ బాధ్యతను మరొకరికి అప్పగించాలి. లేకపోతే అంతా నాశనమవుతుంది – ఇన్ని సంవత్సరాలుగా పెంచి పోషించిన ఒక సంస్థ తమవల్లనే దీనస్థితికి వస్తుంది– మనిషి జీవితానికి సంస్థజీవితానికి పెద్ద బేధం లేదు.

ఇలా ఆలోచనలు చేసుంతన్న రోజుల్లో ఒక రోజు పావని హాస్పిటల్ రౌండ్స్‌లో ఉండగా అక్కడ ఒక గదిలో వరలక్ష్మి, ఆనందమూర్తి కనిపించారు. వరలక్ష్మి కొలొన్ కాన్సర్‌తో కొన్నాళ్ళుగా బాధపడుతోంది ! అందువల్ల తరచు ఆస్పత్రికి రావడం, అప్పుడప్పుడు ఆస్పత్రిలో చేరటం – యివన్నీ సామాన్యంగా జరుగుతున్నాయి. ఆనందమూర్తికి ఆమె

పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది– అన్నిటికంటే ప్రధానంగా, ఏదయినా జరిగి ఆమె తనకు లేకుండాపోతే ఎలా– ఆమెకు అనారోగ్యంగా వున్నా, ఆమె వుండటం వల్ల యిల్లు నడుస్తున్నది– ఆమె లేకపోతే ఎలా– మొదటికే మోసం వస్తుందన్న భయం. కొత్తగా తను మరో జీవితం ప్రారంభించవలసి వస్తుంది – అదీకాక అతనిలో ఏదో భయం– అప్పుడు తన మీద వచ్చిన ఫిర్యాదు .............రావటం– అతనికి వాళ్ళ చైర్మన్ ఎంతగా ధైర్యం చెప్పినా ఏమో? ఏమవుతుందో నన్న భయం లోపల అతన్ని ఒంటరివాణ్ణి చేస్తున్నది–

పావని అక్కడ వున్నప్పుడే ఆనందమూర్తి కంపెనీ చైర్మన్ కూడ వరలక్ష్మిని చూసి పరామర్శించటానికి వచ్చాడు– ఆనందమూర్తికి చాల సంతోషం కలిగింది –

తనమీద తనకు మరోసారి నమ్మకం కలిగి, తనకు చాల సపోర్టు వున్నట్లనిపించింది. పావనిని చైర్మన్‌కి పరిచయం చేసాడు–

'ఈమెగారు డాక్టర్ పావని–'

'ఆమెను గురించి, పావని హాస్పిటల్‌ని గురించి విన్నాను– చాల పేరున్న ఆస్పత్రి' అన్నాడు చైర్మన్.

అని పావనితో

'ఇంత చక్కటి హాస్పిటల్ యింతబాగా నడుపుతున్నందుకు మీకు ధన్యవాదాలు చెప్పవలసిందే!

పావని నవ్వింది–

'యిటువంటి సేవ చేయటం చాల కష్టం– మీరు నలుగురికీ ఆనందం కలిగేటట్లు నడుపుతున్నారు– మీకు నేనేమైనా సహాయం చేయగలనా?

'ఆస్పత్రి నడపటం కొంచం కష్టంగానేవుంది. నేనూ పెద్దదాన్నవుతున్నాను– ఈ ఆస్పత్రి భవిష్యత్తు ఎలా వుందో? తనలో తను అనుకుంటున్నట్లు అన్నది–

'మీరేం ఆందోళన చెందకండి– మీకు సహాయంగా వుండటానికి నేనెప్పుడూ రెడీ– మీకు సమ్మతమయితే నేనే వచ్చి మీతో మాట్లాడతాను. నాకూ మనసులో ఒక చక్కటి హాస్పిటల్ ప్రారంభించి నడపాలని వుంది. అదీ యిదీ ఎందుకు– మనమిద్దరం కలిసి యీ ఆస్పత్రి నడుపుదాం. నాదగ్గర డబ్బుంది, మీ దగ్గర ప్రావీణ్యత వుంది– దీన్ని నడపటం నాకు వదిలేసి మీరు పేషెంట్లను చూసుకోండి–'

చైర్మన్ మాటలకు పావని ఖంగుతిన్నది– 'ఇదేమిటి, ఈయన యింతగా ముందుకు

వస్తున్నాడు– అంతా నిజమేనా ? నమ్మడం కుదరలేదు–

'యీ విషయంలో ఆనందమూర్తి మీతో మాట్లాడతాడు– నేను అంతా అతడితో డిస్కస్ చేస్తాను.' అని నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

తరువాత పావనితో ఆనందమూర్తి అన్నాడు.

'ఆయన తరహాయే అంతే– మనసులో తనకు నచ్చినది ఏదయినా వుంటే వెంటనే దానికి రూపమివ్వటానికి ప్రయత్నిస్తాడు. ఇక మీతో భాగస్వామ్యం కలుపుతాడు– మిమ్మల్ని మోసం చేయదు'.

## 23

ఆనందమూర్తి ప్రయత్నించి చైర్మన్ ఘూరిలాల్‌తో పావని హాస్పిటల్‌లో భాగస్వామ్యం ఖరారు చేశాడు. కాని పావని మనసులో మరొక మొలక మొలిచింది. ఒక రోజున నలుగురు సీనియర్ డాక్టర్లని తన ఫామ్‌హౌస్‌కు పిలిచింది– రాజారావు కూడ అక్కడే వునానడు. వాళ్ళతో అన్నది– అందరికంటే పెద్దవాడు డాక్టర్ స్వామి–

'డా ॥ స్వామీ, అండ్ ఫ్రండ్స్ – మిమ్మల్నందర్నీ యిక్కడికి పిలిచి యిబ్బంది పెట్టటానికి కారణం వుంది– నేనూ, రాజు పెద్దవాళ్ళమయినాము. ఇంక ఎన్నో రోజులుగాని, సంవత్సరాలుగనీ, యీ హాస్పిటల్‌ని స్వయంగా స్వంతంగా నడపగల శక్తి వుండదు– శక్తి, సహనం అన్నీ తగ్గిపోతున్నాయి. మా యీ పరిస్థితి వల్ల పావని హాస్పిటల్ పేరు ప్రఖ్యాతులకు గాని, లొసుగుల్లేకుండా నడపటానికి గాని ఆటంకం రాకూడదు. అందుకు తగిన విధంగా పావని హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌ని మార్చవలసిన అసరం వుంది.

నా అభిప్రాయం ఏమిటంటే, యింతకాలం మనమందరం కలిసి పనిచేశాం. చక్కని ఫలితాలు రావటమే కాకుండా, ఆస్పత్రి పేరు ప్రతిష్ఠలు కూడ రోజురోజుకీ వృద్ధిచెందుతూ మూడుపూలు, ఆరుకాయలుగా వుంది. అదే పరిస్థితి కొనసాగాలంటే మనమందరం కలిసి యీ ఆస్పత్రిని నడపాలి. అందుకోసం డాక్టర్స్ కో ఆపరేటివ్ ఏర్పాటు చేసుకుని ఆస్పత్రిని నడుపుదామని నా ఆలోచన. దీనికి మీ అంగీకారం, అభిప్రాయం ఏమిటో తెలపండి–' అని తన మనసులోని అభిప్రాయాన్ని వెలువరించింది.

దీనికి డా॥ స్వామి స్పందిస్తూ 'మీరు చెప్పింది అక్షరాల నిజం, యిన్నాళ్ళుగా ఆస్పత్రికి పనిచేసి, దానికి ఒక స్థాయిని తీసుకువచ్చి, యిప్పుడది యింకొకళ్ళ చేతిలో పెట్టటం తేలికయినా, అంతగా సరియైనదికాదని నా అభిప్రాయం కూడాను. ఈ ప్రపోజల్‌ని అందరూ కాకపోయినా, మన సీనియర్ డాక్టర్లందరి దగ్గరా ప్రస్తావించి ఒక ఫైనల్

తీర్మానం చేసుకుందాం– ఒక వారం రోజుల్లో యీ సమావేశం ఏర్పాటు చేసి క్షుణ్ణంగా యీ కోఆపరేటివ్ ప్రపోజల్‌ని చర్చిద్దాం.

అందరూ దానికి సరే' అన్నారు.

ఇలా కొన్ని మంతనాల తర్వాత డాక్టర్స్ కోఆపరేటివ్ పావని ఆస్పత్రిని నడపటానికి నిశ్చయమయింది– దానికి తగినట్లుగా ఒక కంపెనీ స్థాపించి, పావని, రాజారాంలకు తగినన్ని షేర్లు భాగస్వామ్యం యిచ్చి ఒక సీనియర్ డాక్టర్ కోఆపరేటివ్ చైర్మన్‌గా ఎన్నుకుని, రాజారాం పావనిలకు దాన్లో సీనియర్ మెంబర్లుగా చేర్చుకుని ఆస్పత్రి నడపటానికి నిశ్చయించారు.

కాని ఒక్క విషయంలో మాత్రం డాక్టర్లు సమ్మతిగా అభిప్రాయానికి రాలేకపోయారు– బీదలకోసం వున్న డివిజన్‌ని ఏం చెయ్యాలా అన్నది పాలుపోలేదు. దానికి భూరెలాల్ ట్రస్టు ముందుకు వచ్చినాడు. ఈ భాగాన్ని తీసుకుని ఛారిటబుల్ హాస్పిటల్‌గా నడుపుతామని అన్నారు. ఈ ఏర్పాటు సర్వసమ్మతమయింది. ఒక విధంగా పావని రాజారావులు దీనికి లాభపడ్డా, రెండూ సవ్యంగా నడుస్తయి కదా అని సర్దుకున్నారు–

ఇదంతా జరగటానికి ఆరునెలలు పట్టింది. దీనికి శివరాం. ప్రభావతి కూడ అంగీకరించారు– కుమారికి ఆ పేదల విభాగంలో సంబంధముండటం వల్ల చాల లాభపడ్డది. కాని అన్నీ సవ్యంగానే జరుగుతున్నాయని మనసుకు చెప్పుకుంది– తాను మాత్రం ఆ ఆస్పత్రికి ఎప్పటిలాగే పూలు యివ్వటం చేయాలని నిశ్చయించుకుంది–

భూరీలాల్ (ఆనందమూర్తి కంపెనీ చైర్మన్) అతని విభాగాన్ని 'ఆనందమూర్తికి అప్పగించి చక్కగా చూసుకోండి. కావలసిన సొమ్ము ట్రస్టు నుండి వస్తుంది' అని చెప్పాడు.

ఇదంతా – యీ పరిష్కారం ఏర్పాటు తతంగమంతా తన అధ్వర్యంలో, పర్యవేక్షణలో జరిగినా, పానని మనసులో ఏదో పోగొట్టుకున్నానన్న భావన పోలేదు. నిజానికి అది ఆమెను ఆవరించి లోలోపల క్రుంగదీస్తూనేవుంది. రాజారావు మాత్రం యిదంతా సామాన్యం, మనిషి జీవితానికి, ఒక సంస్థ జీవితానికీ చాల పోలికలున్నాయి కాబట్టి మనసుకు ఆ విధంగా సర్దిచెప్పుకుంటూ పోయాడు– ఏమయినా వాళ్ళిద్దరి జీవితంలో యిప్పుడు పెద్ద మలుపే తిరిగింది. ఒక రకమయిన ఒంటరితనం వాళ్ళని ఆవహించింది. తాము యింతకాలం నివసించి, పెంచుకున్న తోట వాతావరణం, ఆ ఏకాంతాన్ని ఆ లొసుగుని చెదరగొట్టటానికి సరిపోలేదు. అంతటి ఆ కొలను, ఆ పూలు, ఆ చెట్లు, అన్నీ ఏదో నిశ్శబ్దాన్ని పరిచి పంచుతున్నట్లుగా అనిపిస్తోంది. లోగడ జరిపిన నిత్య కృత్యాలన్నీ యీనాడవి

నిర్వీర్యంగా, రొటీన్‌గా అనిపిస్తున్నాయి. పెద్దరికంలో వచ్చే శారీరక సమస్యలు అప్పుడు సామాన్యంగా అనిపించి పెద్దగా యిబ్బంది పెట్టనివి, యిప్పుడు చాల బాధ పెడుతున్నాయి. జరిగిపోయిన జీవితమంతా ఒక స్వప్నంలా తోస్తున్నది– ఇద్దరికీ సామాన్యంగా జరిగే సంభాషణలు కూడ యిప్పుడు ముభావంతో గడచిపోతున్నాయి.

'ఇవన్నీ మామూలే– ఒక్కసారిగ వృద్ధాప్యం పైబడినట్లు అనిపిస్తున్నది. కాలం భారమవుతున్నది. తోట నడుపుతూ నలుగురిలో వున్నా ఏకాంతంలో వున్నట్లుంది !

లోగడ కొలను పక్కన కూర్చొంటే ఆ కొలనులో వెన్నెల, తారలతో నిండిన ఆకాశం అన్నీ తనని పలకరిస్తున్నట్లు ఎంతకాలమయినా అలా కొలను వైపు చూస్తూవుండేవాడు– ఇప్పుడది మరోవిధంగా తోస్తున్నది. ఆకాశం నుండి ఒక తార రాలి నీటిలో మునిగి, కొలనులో ఆకాశాన్నంటామని తనతో మాట్లాడుతున్నట్లనిపిస్తుంది. తార తన ఏకాంతాన్ని గురించి తనతో మొరపెట్టుకున్నట్లనిపిస్తోంది. ఏవాస్తం కొలనులో వృక్షాలు, పూలమొక్కలు అన్నీ తారతో పాటు కనిపిస్తున్నాయి.

ఏకాన్తం –
నా చుట్టూ వనవృక్షాల వసంతశోభ
ప్రకృతి విలాసహేల
అంతా నా కళ్ళలోకి మాత్రమే
నా వీనులకి నిశ్శబ్దం
(కొలనులో) ఒకరాయి చిత్రం
నా కళ్ళలోకి ప్రవేశించింది.
నా లోని ఏకాంతాన్ని
ప్రశాంతంగా పలకరిస్తూ
అందంగా ఆహ్వానించినట్లుంది
ఒక్కసారిగా –
నా లోని ఏకాన్తం
పెళుసుగా, ఫెళ్ళుమంటూ
అగ్నిపర్వతంలా మండుకుంటూ

నా మనసుకు నిప్పురవ్వలు
మతాబులా, చిచ్చుబుడ్డిలా
పైకి ఎగిరి రవ్వలు చిమ్మింది
రవ్వలు చెదిరి అన్నిటా విస్తరించినయి
నా లోని ఏకాన్తం, నన్ను మోసుకుపోయినట్లయి
నా చుట్టూ పరుచుకున్న విస్తారంలోకి
వెదజల్లినట్లయింది
అదిపూలూ, నిప్పురవ్వలూ
ఏకాంతపు విస్తారాలూ
నా మనస్సులో సృష్టిస్థితిలయలు
ఒక్కుమ్మడిగా, ఒక్కసారిగా ప్రభవించి
ప్రస్తారమయినట్లుంది
కాలం యిక జాలువారి జారిపోయింది.
నేనేమయినాను
నా ఏకాంతం ఏమయింది ?
నా ఏకాన్తం నన్ను
ఎన్నిటిగానో విదిలించి
అంతా చల్లినట్లయింది
ధ్వనిలేని రాగంలా
ప్రసరించని ప్రస్తారంలా
తాళం లేని లయలా
ఏమిటీ కలవరం
ఏకాంతంలో కలవరం
కాలంలోకి దూరాననుకున్న
నేను అక్కడే వున్నాను

కొలను, వెన్నెల, తారలు,

వృక్షాలూ,పూలూ,

అన్నీ అక్కడే వున్నాయి.

రాజారావు మనఃస్థితికి తగ్గట్టుగానే పావని స్థితి– కాకపోతే తను రోజూ ఆస్పత్రికి వెళ్ళిరావటం వల్ల కొంత విడుమర–

ఈ స్థితి ఎక్కువ కాలం వుండకూడదని యిద్దరూ అనుకుని, ప్రభావతి, శివరాంల దగ్గర కొంతకాలం వుందామని అమెరికా ప్రయాణం ప్లాన్ చేశారు.

## 24

పావని, రాజారాంలు యిలా ఫీలవుతుంటే, కుమారి విషయం మరో విధంగా వుంది– తను రోజూ రెండు ఆస్పత్రులకి పూలు యిస్తూనే వుంది. కాని ఒకటే భేదం. అప్పుడు తనే పూల అలంకరణ చేసేది. ఇప్పుడు ఎవరో అలంకరణ చేస్తున్నారు. తను పూలు యిస్తున్నది– అంతే– దీనిలో కొంత అసంతృప్తిగా వున్నా, తనకూ యీ ఆస్పత్రికీ సంబంధం – పావని రాజారావు గార్లద్వారానే, వాళ్లే యిది మనది కాదని అనుకున్నప్పుడు తనెందుకు బాధపడాలి– తను పూలు పెంచుతున్నది. తనకు యిష్టమయినట్లుగా కొత్త కొత్త రవాలు సృష్టిస్తున్నది – ఆనందంగా వుంది.నవీన్ మాకు యిందులో సహకరిస్తున్నాడు. ఒక్కసారి నవీన్ అన్నాడు, ‘మనం పూల వ్యాపారం చేద్దామా అని.

బాబుగారు ఒప్పుకుంటే అలాగే చెయ్యచ్చు. ఏదయినా జరిగిన తన కాలం జరగనీ’ అని సర్దిచెప్పుకునీ ఎప్పటిలాగే తన పూలు పండించటంలో మునిగిపోతున్నది.

అలా గడుస్తున్న రోజుల్లో ఒకరోజు సాయంత్రం రాజారావు కొంచం ముందుగా ఆస్పత్రినుండి వచ్చాడు. పావని యింకా రాలేదు. బహుశా రాదు అనుకొని, పనిపడివుంటుంది– కాని కొంచం భయం వేసింది. పెద్దతనం పైబడుతోంది– అనుకునేంతలోనే వాకిట కారాగింది– పావని లోపలికొచ్చింది.

ఎందుకింత ఆలస్యమయింది ? ఆదుర్దాగా అడిగాడు.

ఒక కేసు డిస్కస్ చేస్తుంటే ఆలస్యమయింది– నీవు భోజనం చేశావా –

‘నీవు రాకుండానా’ !

‘త్వరగా బట్టలు మార్చుకు వస్తాను’ – అని పావని లోపలికి వెళ్ళిపోయింది– కుమారి డిన్నర్‌కి పిలిచింది– ఎందుకో ఆ రోజు డిన్నర్ చేయాలనిపించలేదు.

అంతా నిశ్శబ్దంగా వున్నది– అక్కడక్కడా వెలుగుతున్న దీపాలు– పైన ఆకాశంలో తారలు– మేఘాలు మెల్లిగా కదుల్తున్నాయి. అప్పుడప్పుడు నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, ఒక ధ్వని రైలుదో కారుదో–

పావని వచ్చికూర్చుంది పక్కన– కుమారి ఎడంగా నిల్చున్నది– ఎవరిలోకంలో వాళ్ళున్నారు. కాని రాజారాంకు వినిపిస్తున్నది ఏదో గుర్తు తెలియని గుస – ఇది ఆకుల్లో కదిలే గాలి గుసలా– పట్టణమంతా కదుల్తున్న ధ్వనులు, ఘోషలో తన చుట్టూ గుసగుసల్లా వినిపిస్తున్నాయి. అంటే యీ గుస గుస – కాదు ఘోష నగరంలో అన్నిచోట్ల జరుగుతున్న ఎడతెగని కార్యాల ఘోషసమన్వయం–

గుసగుసలో యిన్ని ఘోషలున్నాయా

బహుశా ఒకటి చాల అవటం, చాల ఒకటి అవటం అంటే యిదేనేమో ! తన చుట్టూ తిరుగుతున్న గుసలో ఎన్నో ధ్వనులున్నాయి, ఘోషలున్నాయి, పాటలున్నాయి, పద్యాలున్నాయి, పటాకులు పోరాటాలు అగ్ని భటభటల, రాళ్ళపగుళ్ళ ధ్వనులున్నాయి. కాని అవన్నీ దేనికది పైకి లేచి, అన్నీ ఒకటిగా కూడుకుని గుసగా ప్రపంచంలో పరుచుకుంటుంది. అది ఒకరకమయిన ఏకాంతం– వినపడుతూ వున్న యితమిత్థంగా ఏదీ అని తెలియదు. మనలో సవ్వడితో కలిసిపోతే అది ఏకాంతం. ధ్వని రహిత ఏకాంతమనిపిస్తుంది. లేకపోతే ఏకాంతాన్ని భంగం చేస్తుంది. కొందరికి ఆ గుస అంటే భయం– ఏదో వెన్నంటి, చుట్టుముట్టినట్లుంది. తట్టుకోలేక తడబడతారు.

ఇక్కడ రాజారాంలో ఆ గుస ఏ చలనాన్నీ కలిగించకుండా తాకుతోంది– వీనుల్లో నిలిచిపోతున్నది– ఎవరో పాడుకుంటున్నారు– దగ్గర్లోనేలా వుంది. స్పష్టంగా వినిపిస్తోంది–

నేను నేనంటావు

ఎవరి నేనును నీవు

నా వారు నా వారు

నా వారు అంటావు

ఎవరు నా వారు

నీవు నేనంటావు

ఎవరు ఆ నీవు

నాది నాది అంటావు

ఏ నాది నీదిరా

బతుకు బతుకంటావు

ఏమిటా బతుకు

ఎటువంటిదా బతుకు

ఎందుకా బతుకు

నా బతుకు నా బతుకు అంటావు

ఏమిటా బతుకు

ఎవరిదా బతుకు

ఎక్కడున్నది

బతుకు బరువైపోయె

ఇంకేంటి బతుకు

ఇంకేంటి నేను

ఇంకేంటి నీవు–

రాజారాం ఒక్క క్షణం నివ్వెరపోయాడు. ఓ గొంతులో నుంచి వస్తున్నదో యింత వేదాంతం– బయటికి నడిచాడు– అక్కడ చింకి గుడ్డల బడుగు బిచ్చగాడు, తన ఏకతారా మీటుతూ యీ పాట పాడుతున్నాడు– ఆ పాటలో మునిగినట్లనిపించాడు. రాజారాం నీడ అతని మీద పడగానే పాట ఆపి–

'ఎవరది' అన్నాడు

ఇంత వేదాంతం నీ ఏకతారాలో వుంది.

వస్తూంటే వింటున్నాను. లోపలికి రా! మా వరండాలో కూర్చుందువుగాని, ఇంకా పాటలు వచ్చా–

పిచ్చి పిచ్చి పాటలు పాడుతూ తిరుగుతుంటాను– వచ్చిందాంతో కాలం గడిపేస్తాను–

'భోజనం చేసావా'

'యింకాలేదు' సామీ ! ఏ హొటల్ దగ్గరకో పోవాల, అక్కడ మిగిలింది పంచుతారు, అది తినేస్తా–

'రా లోపలికి నీకు భోజనం పెట్టిస్తా'

మాట్లాడకుండా తన సంచీ సర్దుకుని రాజారాం వెంట వచ్చాడు.

భోజనం చేస్తుండగా అతని సాటివాడు పిలిచాడు–

'ఒరేయ్, యీరన్నా గుడికాడికెల్దాం పదరా'

అక్కడ యిప్పుడు సంబరం జరుగుతోంది.

ఫలహారాలు పెడుతూంటారు– తెచ్చుకుందాం, ఆలస్యం చేస్తే మన చోటుపోతుంది–'

'యియ్యాల్టికి భోజనం దొరికిందిగా, నీవు వెళ్ళు– నే వస్తాలే

'నీ చోటు ఎవరైనా తీసుకుంటారు. మళ్ళీ దొరకటం కష్టం– ఆ కాంట్రాక్టరు గాడు ఎవర్కైనా యిచ్చేస్తాడు–

యిచ్చుకోనీ ! మరోచోట దొరుకుద్దిలే–

యీ సంభాషణ వింటుంటే రాజారాం, పావని, కుమారిలకు ఆశ్చర్యం వేసింది–

'చోటేమిటి ? కంట్రాక్టరేమిటి' రాజారాం అడిగాడు–

'అయ్యా, గుడిమెట్ల మీద చోటు ఓ కంట్రాక్టరు మాకు అమ్ముతాడు, మేం అడుక్కుంటే వచ్చే డబ్బులో వాడికి సగం యివ్వాల. లేకపోతే మమ్మల్ని తన్ని తరిమేస్తాడు. అందుకని నేను ఎక్కువగా గుళ్ళ దగ్గరికి వెళ్ళను. వీధుల్లోనే అడుక్కుంటాను– దానికీ అప్పుడప్పుడు పోటీ వుంటుంది– యిలాగే వుంటుంది సార్– పేవ్‌మెంటు మీద పడుకునే చోటు కూడ అట్లాంటివాళ్ళే అమ్ముతారు– ఏమిటో సామి, మామీద బ్రతకాలనుకునేవాడు వాడెంతటివాడు. అయినా అంతే– ఎక్కడయినా వుద్యోగానికి కుదురుకోటానికి ఏ పనీ రాదు. వచ్చినా మళ్ళీ యిదే తంటా– రోజులెలాగో వెళ్ళదీయటమే– మీ లాంటి వాళ్ళ పంచన బతుకదామంటే వాళ్ళకు మేమంటే భయం– మా తాత నాకొక పాట నేర్పాడు–

'పాడు'– పావని అడిగింది.

నీలోని దానికి దూరమయ్యావురా

బిడ్డ, దూరమయినావు

దుఃఖమే మరి నీకు

దూరమయితేను

దగ్గరవ్వాలిరా బిడ్డా

దగ్గరవ్వాలి

నీలోని దానికి దగ్గరవ్వాలి

ఎరుక లేదుర నీకు

ఎరుకతో ఎదగాలి

ఎరుకలో నడవాలి

ఎదిగి నడవాలి

తగ్గాలి దూరము

నీకు నీలోని దానికి

నీలోని దానికి దగ్గరవ్వాలి–

ఆ నిశ్శబ్దంలో ఆ వేదాంతం– చిన్న మాటల్లో పెద్ద వేదాంతం ఏకతారా తీగెపై నడుస్తూ బిచ్చగాడి గొంతులో నుంచి వస్తున్నట్లుంది– ఆ క్షణంలో అతడొక మహర్షిలా తోచాడు.

బిచ్చగాడు వెళ్ళిపోటానికి లేవబోయాడు.

పావని అన్నది–

'వెళ్ళకు యీ రోజు యిక్కడే పడుకో'

అమ్మా, నేనంటే మీకు భయం వేయట్లేదా, నేను దొంగనేమో అనిపించటం లేదా–

అక్కడున్న వాళ్ళకు నోట మాటరాలేదు.

'లేదు' పడుకో అన్నాడు రాజారాం–

## 25

ప్రస్తుతం తమ రిటైర్‌మెంట్‌కి రాజారాం, పావని అలవాటు పడవలసివస్తోంది– మరునాడు నిద్రలేచి, కాలకృత్యాలు తీర్చుకుని వరండాలోకి వచ్చేటప్పటికి వీరన్న బయలుదేరి వెళ్ళిపోయాడు. ఇంతలో కుమారి కాఫీ తెచ్చియిచ్చింది. నవీన్ తన ఫుడ్ సెంటర్ నుండి టిఫిన్ తెచ్చిపెట్టాడు.

ఒక గంట తరువాత వీరన్న తిరిగి వచ్చాడు. వస్తూనే–

'సామీ, ఏదన్నా పెట్టించు సామీ – ఆకలేస్తోంది' అని అడిగాడు.

'ఎక్కడికెళ్ళావు–'

'రోజూ అక్కడ ఆశ్రమంలో ఓ అమ్మాజీ ప్రొద్దుటే మా లాంటి వాళ్ళకు అన్నం పెడుతుంది.

దాన్ని మేం 'అమ్మాజీ టిఫిన్' అంటాం. ఆ వరసలో చోటు దొరకటం కోసం ప్రొద్దుటే వెళ్ళాను. కాని అక్కడికి యేళకి వెళ్ళలేక పోయాను. దోవలో ఏదో పెద్దజనం కూడి వున్నారు. ఆయనెవరో 'అన్నం తిననని' భీష్మించుకున్నాడట. అని మా గుత్తేదారు చెప్పిండు.

'ఆయనడిగాడు ఏరా, యీ మధ్య నీవు గూటికి రావటం లేదే–'

'లేదు సామీ ఎక్కడో తిని అక్కడే పడుకుంటున్నా'–

'మరి నా సంగతేంటి ?

'నీకేం సామీ అందరూ సంపాదించి పెడతన్నరుకదా – నేను లేకపోతే ఏం ?

'అందరూ అట్లా అనుకుంటే ఎట్లారా – రా తిరిగి

ఎక్కడో తిని, ఎక్కడో పడుకోటం దేనికి?

'సామీ, నేనవతలకి వెళ్ళాల ఎట్లా – యిక్కడేం జరుగుతుండాది ?

'ఒక పెద్దాయన, ఆయనతో పాటు కొందరు లీడర్లు, అన్నం తినమని కూర్చున్నారు.

'వాళ్ళకేం కావాల'

'అందరూ బావుండాలి – అంతే '

అంటే మాలాంటోళ్ళ కోసం ఆయన అన్నం మానేసాడు. మంచోడే – అయినా ఆయన అన్నం మానేస్తే మాకు మంచి ఎట్టా జరుగుద్ది.–'

అదంతా అంతేలే –నా కెందుకీ గోల– అటు తిరిగి ఫో– యిటు వీల్లేదు, ఇంతలో ఒక పోలీసాయన వచ్చాడు

ఏంటి బాబు యిక్కడ– వెళ్ళు – వెళ్ళు – లీడర్ల మధ్య నీ వెందుకు ? అంటూ నన్ను వెనక్కి తోశాడు.

అప్పటికే అక్కడ అమ్మాజీ టిఫిన్ వరస నిండిపోయి వుంటుందని తిరిగి యీడకే

వచ్చేస్తా' – ఆకలవుతోంది. –

ఆకలవుతోంది –

నవీన్ మూడు యిడ్లీలు, పచ్చడి తెచ్చి యిస్తే దాన్ని అబగా తిన్నాడు. తరువాత అడిగాడు.

'సామీ, అన్నం తినకుండా ఆయన ఎంతకాలం వుంటాడు. అలావుంటే ఎవరికి లాభం.

ఎవరికీ కాదు, వాళ్ళకే లాభం – ప్రభుత్వాన్ని బెదిరించటానికి అదొక పద్ధతి– అన్నాడు రాజారాం.

అరధం కాలా – అన్నం తినకుండా హఠం చేస్తున్నాడన్నమాట' అని నవ్వాడు. అందరూ నవ్వారు.

ఇదంతా చూస్తున్న నవీన్‌కి ఒక ఐడియా వచ్చింది –

'యీరన్న – నీకు కూరగాయలిస్తే అమ్ముకు వస్తావా –'

'ఎందుకమ్మనూ – తత్వాలు పాడుకుంటూ అమ్ముతా –

'అయితే వుండు' రాజారాంని చూస్తూ,

'మన తోటలో కొన్ని కూరగాయలిద్దాం, బండి నేనిస్తాను. బండిమీద పెట్టుకుని మా హొటల్ ముందు కూచుని అమ్ముకుంటాడు.'

'మంచి ఐడియా, అలాగే చెయ్యి' అన్నారు రాజారాం – పాపం యీ కుర్రవాడిలో యింకా ఎవరికయినా ఏదయినా చెయ్యాలన్న నక్సల్‌దళ స్వభావం పోలా – హొటల్లో నాన్నగారితోపాటు శ్రమపడి డబ్బు సంపాదిస్తున్న నలుగురికీ సహాయంగా వుండాలన్న భావన తనలో మొగ్గ తొడుగుతూనే వుంది –

ఆమాటే వీరన్నతో అంటే

'నాకేమి చేతవుతుంది సామీ – డబ్బులు ధరలు వీటి విషయం నాకేం తెలుస్తుంది–'

'ఫరవాలేదు – నేర్చుకోవచ్చు – నేను ఒక వారం రోజుల తరువాత బండి, తోపుడు బండి చేయించి ఇస్తాను.

కొద్దిరోజులు దాని మీద కూరలు, వీలయితే పూలు పెట్టుకుని తోట బయటగానీ, మా హొటల్ బయటగానీ పెట్టుకుని అమ్ము, లాభనష్టాలు కొంతకాలం మేం భరిస్తాం– ప్రయత్నించి చూడు–

సరే, స్వామీ కాని నాకు మంచిబట్టలయినా లేవే– కొట్టుకాడ బట్టకూచుంటే ఎవరయినా చూస్తే, ఎవరయినా నేనీ కూరలు ఎత్తుకొచ్చాననుకుంటారు–

'నీకు ఒక జత మంచి బట్టలు యిస్తాను' అన్నాడు నవీన్–

అలా సాగిన సంభాషణ కార్యరూపం దాల్చేటప్పటికి ఒక వారం రోజులు పట్టింది –

ఈ లోగా యీరన్న తన బిచ్చగాడి వుద్యోగానికి వెళుతున్నాడు. మరునాడు మళ్ళీ 'అమ్మాజీ' భోజనానికి వెళుతూన్నప్పుడు క్రిందటిరోజు తంతే–

అక్కడవున్నవాళ్ళ నడిగాడు

'ఎన్నిరోజులు స్వామీ, యీ అన్నం తినకుండా వుండటం– అక్కడున్న వాలంటీర్ అన్నాడు–

ఇంకా కొన్నాళ్ళుంటుంది–'

'మరి ఆయన కేమయినా అయితే !

వాలంటీరు నవ్వాడు – తరువాత అడిగాడు.

'ఒరేయ్, యివ్వాళ మేము వూళ్ళో తిరిగుతున్నాం–

నీవు కూడ జెండా పట్టుకు తిరుగుతావా – నీకేదో ముట్టజెపుతాం– అన్నం పెడతాం – నా పని అల్లా జెండా పట్టుకుని మేం అనమన్నది అరుస్తూ వుండటం–

బాగానేవుంది అనుకున్నాడు యీరన్న.

ఆ రోజంతా అలా తిండితో పాటు ఒక వంద రూపాయల నోటు కూడా అందింది. ఆనోటు తీసుకుని సంతోషంగా తోటకు తిరిగి వస్తూండగా, మధ్య ఒక గున్న గుత్తేదారు అడ్డుకుని, అందులో సగం మాదిరా–' అని తీసుకోబోయాడు.

'అదేంటి సామీ– తిరిగింది నేను, అరిచింది నేను– నీ కెందుకివ్వాల' అంటే వాడు నవ్వాడు.

'వీడికిదంతా కొత్తలా వుంది– రేపు కూడ రా, యిలాగే తిరిగి, అరిచి డబ్బు పట్టుకుపోదు గానివి అన్నాడు.

తోటకొచ్చింతరువాత ఆ డబ్బు రాజారాం చేతిలో పెట్టి–

దీన్ని దాచండి స్వామీ– ఎప్పటికయినా పని, డబ్బు దొరకనప్పుడు పనికి వస్తుంది– అని.

స్వామి – ఏమిటిదంతా – అడిగాడు.

రాజారాంకి తన రాజకీయ జీవితం గుర్తు వచ్చింది – నవ్వుతూ

ఆడబ్బు తీసుకుని

'వీరన్నా – ఇదంతా చూస్తే నీకేమనిపించింది ?'

'ఏముంది సామీ, ఎక్కడబుట్టినా, ఒకళ్ళమీద పడి యింకొకళ్ళు తినటం మామూలయిపోయింది – ఇదంతా మీ మంచికోసమే' అన్నాడొకాయన, అక్కడ వుపన్యాసం యిచ్చినాయన– పాపం మా కోసం తిండి మానేసాడట– అదెలా సామీ –'

'అంతా రాజకీయం – నాకెలా తెలుస్తుంది ?'

'దొంగనాకొడుకులు– వాళ్ళ మంచికోసం వాళ్ళు చేస్తూ అందరికోసం అంటున్నారవన్నమాట.

ఏమో సామీ, మంచి అంటే ఏమిటి ?–

మా తాత ఒక తత్త్వం పాడుతుండేవాడు' అని పాడటం మొదలెట్టాడు.

ఆ ఏకతంత్రీనాదంతో అంతా నిశ్శబ్దమయింది –

మంచివాడని నన్ను మెచ్చుకున్నావు

మంచిదిర అల్లుడా, మంచివాడివి నీవు

అయినా –

మంచి మంచంటారు నా చిన్ని నాన్న

మంచంటె ఏమిరా నా చిన్ని నాన్న

మంచి ఏమోగాని, మంచి ఏదోగాని

అది నాకు మామో – అది తెల్వదు నాకు

కాని –

మంచిగా వుంటేను బతుకు మంచేను

ఆ మాట మంచిదిర నా చిన్ని అల్లుడా

కావాల మాట మంచిది గాను

కావాల నోరు మంచిదిగాను

నవ్వుతూ తిట్టినా మంచిగా వున్నట్టే

అయితే

మంచిదంటే ఏమిరా నాన్న

మంచిగా వుంటే అందరికీ బాగు

అయితే –

మంచంటే ఏమిరా నా చిన్ని నాన్న

నాకు తెలవదు మామ – ఒక్కటే తెలుసు

మంచిగా వుండాలి – అంతె తెలుసును నాకు

అయితే –

దేవుడు మంచేనా – మంచివాడేనా

తప్పకుండా –

దేవుడు మంచే – మంచిగా వుండాల

అంతే ఓ మామ–

వరండాలో పడుకుని యీ తత్త్వం వింటున్న రాజారాంకి 'గొప్ప కూడ అనిపించింది. తన జీవితం సినిమా రీలులా మనసులో గిర్రున తిరిగింది – తన జీవితం కూడ యీ మంచి చుట్టూనే తిరిగిందా –

పావని కూడ అక్కడికి వచ్చి ఒక కుర్చీలో కూర్చుంది –

'పావనీ వీరయ్య తత్త్వం విన్నావా –'

'విన్నాను'

'మన జీవితం ఆ మంచి చుట్టూనే తిరిగింది కదూ– నిజానికి మంచికి మనమిచ్చిన అర్థం ఏమిటి ?

'నాకు యిదమిత్థంగా తెలియదు– అంతగా ఎప్పుడూ దానిని గురించి ఆలోచించలేదు.

మంచిగా వుండటం, యితరులకు సహాయంగా, సేవాభావంతో పనిచేయటం, వాళ్ళకు సంతోషం కలిగితే, మనకు తృప్తిగా వుండటం– యిదే జీవితంలో ప్రతిక్షణం అనుభవంగా మన జీవితం గడిచింది– దాని వలన మనకింత వరకూ ఏ విధమయిన యిబ్బందులూ కలగకపోవటం వలన 'మంచి అంటే ఏమిటిని ఆలోచించలేదనుకుంటాను'

ఒక విషయం మాత్రం నిజం– మంచిగా వుంటే మనకు మనతో వున్న వాళ్ళకు, మన వాతావరణం లోకి వచ్చిన వారికి, అందరికీ తెలియని ఒక సంతోషమూ, తృప్తి యిస్తున్నాయన్నది నిజం–

'కాని మంచిగా వుండటం, సేవాభావం తృప్తినిచ్చినా, ఒక్కొక్కసారి తిప్పుకోలేని దెబ్బకొట్టటం జరగవచ్చు– నా విషయంలో నా కలాంటి దెబ్బ తగులుతున్నప్పుడు, నిజానికి తగిలినప్పుడు, నన్ను కాపాడి బతికించింది – అమ్మ, నీవూ– మీరిద్దరూ లేకపోతే రాజకీయజీవితంలో నా 'మంచి' ప్రవర్తన వల్ల తగిలిన దెబ్బవల్ల నుండి కోలుకోలేకపోయి, ఒంటరివాడినయి, తిరిగి ఎక్కడ జీవితం మొదలుపెట్టాలో అనే సందిగ్ధత నన్ను ముంచేసేది.

'అలాగని ఎందుకనుకోవాలి. నీ మంచితనం వల్లే మా ప్రేమను అంది పుచ్చుకోగలిగావేమో–

పెద్ద తత్త్వంగా చెప్పలేనుగానీ, మామూలు పరిస్థితుల్లో మంచిగా వుండటం, ఒక విన్–విన్ పరిస్థితిని కల్పిస్తుంది–

'కావచ్చు, బహుశా మంచితనానికి, మనిషిలో మంచితనానికి పునాది అతడిలోని సంతోషం మీద, సేవమీద, తన తృప్తిమీద ఆధారపడి వున్నదేమో – ఇవి పునాది కాకపోతే మంచిగా వున్నాననుకుని అది సరియైన మానసిక స్థితిని కల్పించనప్పుడు – అది విషమించి స్వార్థం, ద్వేషం, పగ యిలాంటి వాటికి దారితీయవచ్చు – బహుశా యిదేనేమో యీనాటి రాజకీయ, సాంఘిక శక్తుల నడిపిస్తున్న మానసిక స్థితి– అందుకే అంతా అస్థిరంగా,ద్వేష పూరితంగా, పోటీగా, అధికారవాదంగా తయారయినారనుకుంటాను – అవునా–'

'ఏమో, బహుశా నీవన్నది నిజమేనేమో– అందువల్లనే నేమో, మన ఆస్పత్రిలో అప్పుడే ముఠాతత్త్వం ప్రవేశిస్తోంది– అది ఎటు తీసుకుపోతుందో–'

కుమారి యిద్దరికీ పాలు తీసుకువచ్చి అలా నిలబడి వింటున్నది.

'బహుశా అది ఒక విధంగా బ్రతుకుమీద ఆశ కూడ కల్పిస్తుందేమో– నాలాంటి వారు కేవలం మంచిగా వుండాలనుకుని, ఏం చెయ్యగలరూ, స్వార్థంతో అందరికీ కావలసినదాన్ని చేసి తద్వారా తృప్తినీ, సంతోషాన్నీ, బ్రతుకునీ పెంచుకోవాలనుకుంటారు– మంచిగా వుండటం తప్పకుండా వుంటేగాని, ఆ వ్యక్తిగత ప్రయోజనత్వం కూడ వర్ధిల్లదేమో– ఎక్కువగా మాట్లాడానా బాబుగారు – అమ్మ –' అన్నది కుమారి –

'లేదమ్మా, నీవు చెప్పినదాంట్లో చాల అర్థమున్నది–' ఇంతలో మరో తత్త్వం వినిపించింది–

వీరన్న పాడుతున్నాడు –

'మంచిగా వుండరు రన్నా
మంచిగా వుండరోరన్నా
మంచిగా వుండి మించిపోదామన్న

మించిపోయినావు
చల్లగా బతకరా–
మంచిగా వుండరోరన్నా –
మంచితో మించితే
మనసు బాగుంటుంది
నీకు నాకూ అనక అందరికి
మంచి జరుగును బిడ్డ
మంచిగా వుండరోరన్నా
మంచిగా బ్రతుకుతూ
మించిపోరా అన్న మించిపోరా'
నిద్ర వచ్చినట్టుంది, ఏకతారా ఆగిపోయింది –

## 26

మరునాడు రాత్రి యీరన్న చాల సంతోషంగా కొలను పక్కన కూర్చున్న రాజారాం దగ్గరకు వచ్చి

'ఇదిగో సామీ, యీ 50 రూపాయలు నాదిగా నీదగ్గర వుంచు. కావలసినప్పుడు తీసుకుంటా– నా దగ్గరవుంటే ఎవడో ఒకడు కొట్టేస్తాడు. మళ్ళీ ఆ గుత్తేదారు నా వెంటపడ్డాడు. నన్నూ తన గుంపులోకి రమ్మని బలవంతం చేస్తూండాడు. ఆణ్ణి తప్పించుకుని బయటపడ్డా' అని అక్కడే కూర్చున్నాడు–

'యీ డబ్బు నీ కెక్కడిది ? అడుక్కుంటే నోట్లు రావు కదా' రాజారాం ఆశ్చర్యంగానే ప్రశ్నించాడు.

'నిజమే సామీ, రావు. దీన్ని నేను దొంగతనం చేయలేదు. అది నా ఇంటా వంటా లేదు. అడుక్కుంటే వచ్చిందంతే– అంతా అట్టా రావాల్సిందే. యియ్యాల ఒక యిసిత్రం జరిగింది. నేను అమ్మాజీ భోజనానికి వెళుతుంటే నిన్నలాగే ఆ నిరాహారగుంపు అడ్డం తగిలింది. ఏవేవో అరుస్తున్నారు. నన్నుకూడ అరవమని నాకు జెండా కూడయిచ్చారు. ముందు అన్నం కావాల– ఆ తరువాతే ఏమయినా అన్నా– అన్నం మేమే పెడతాం అని ఒక పొట్లాం తెచ్చిచ్చారు. దాంట్లోది తిని రోజంతా అరిచానా – మధ్యలో మళ్ళీ భోజనం పెట్టారు. లారీలో తీసుకెళ్ళి వూరంతా తిప్పారు. అరుస్తూనే వున్నా– ఆకలేసినప్పుడు మంచి నీళ్ళిచ్చారు. తరువాత నా చేతిలో వంద రూపాయలనోటు పెట్టి మళ్ళీ రేపు రమ్మన్నారు.

మరొకడొచ్చి వందరూపాయల నోటు లాక్కుని యీ 50 రూ. నోటు నాచేతిలో పెట్టాడు. ఎందుకు తీసుకున్నావు అన్నా.

అది మా భాగం–

మీరెవరంటే చెప్పలా– ఏమయితేనేం– పోనీలే 50 రూ.దొరికినయ్యిగా, అని సంతోషంగా వచ్చా – మళ్ళీ రేపెళతా – నాలాంటి వాళ్ళు చాలమందిని తెచ్చారు. సామీ యిందువల్ల వాళ్ళకేమి వస్తుంది. ఆయనెవరో అన్నం తినకుండా పెజాసేవ చేస్తాడట. ఇదంతా పెజాసేవ కోసమే – ఆయన అన్నం తినకపోతే పెజలకేం ఒరిగింది – వూళ్ళో కేకలేస్తూ, మాచేత కేకలేయిస్తూ తిరిగితే పెజాసేవ ఎట్టవుద్ది– అంతాగోలగా వుంది–

ఒక్కసారి ఫక్కున నవ్వాడు రాజారాం.

ఆ నాయకుడు గవర్నమెంటుని తను చెప్పింది చేయకపోతే అన్నం తినకుండా చచ్చిపోతా అని బెదిరిస్తున్నాడు. ఆయనతో సాటివారే ఆయనచుట్టూ చేరినవాళ్ళు. ఆయన గవర్నమెంటుని అడుగుతున్నాడు. 'ప్రజలకు ఏదయినా చేయమని' గవర్నమెంటుని అడుగుతున్నాడు. అని నవ్వాడు.

'మీరంతా ఆయనకు రేపు ఎలక్షన్లో ఓటు వేస్తారని ఆయన నమ్మకం– మీరు ఓటు వేస్తే ఆయన గవర్నమెంటులో చేరి మీకు మంచి చేస్తాడు– ఇదంతా ప్రజల కోసమే కదా !

'నా కేందో అర్థంకాలా– రేపు కూడ ఎల్తా 50 రూ. వస్తయి–' అని తన మూలకి వెళ్ళిపోయాడు.

ప్రజాసేవ – ప్రజాసేవ– తన జీవితం గిర్రున అతని మనసులో రీలు తిరిగింది. అప్పుడే పావని అక్కడికి వచ్చింది.

'ఏమిటి గాఢంగా ఆలోచనలో పడ్డావ్ రాజా'

'యిప్పుడే వీరన్న వచ్చాడు. ప్రజాసేవ చేసి వచ్చాడు. అంటే ఎవరో నిరాహారదీక్ష చేస్తుంటే దానికి మద్ధతుగా స్లోగన్స్ అరిచి, అలిసిపోయి వచ్చాడు. ఎందుకిలా అని వాళ్ళనడిగితే అంతా ప్రజాసేవ అని చెప్పి ఒక వంద రూపాయలిస్తే, ఆ 100 లో 50 ఎవడో కంట్రాక్టరు కొట్టేసి 50 తిరిగి యిచ్చాడట. అది నా దగ్గర వుంచమని వీరన్న నా చేతికిచ్చాడు.

నవ్వు రావటంలా – ప్రజాసేవ అంటే యింతేనా– అని నాకూ అనిపిస్తోంది–'

యింతలో యీరన్న తత్త్వం పాడుకుంటూ వినిపిస్తున్నది–

సేయకురా మోసం సేయకురా నాయనా

పెజలు పెజలంటావు
పెజలంటెవరురా – నీవునేనుగాక
నీ చుట్టు నా చుట్టు వున్నవారందరూ
అందరూ పెజలేగా – నరుడా
చేయకురా మోసము – చెడిపోతావు
అందరుంటేకాని నీవూ నేనూ లేము
యిది తెలుసుకో నీవు – చేయకుర మోసము
అది నీకు తగులునురా
..........కపోతే నీకే మోసమురా
చేయకురా మోసము చెడిపోతావు–
నీవు తినక అందరికి తినిపించేదని
గొప్పోడివా నీవు నరుడా–
చేయకురా మోసము చెడిపోతావు
తత్త్వం ఆగిపోయింది అలసిపోయి యీరన్న నిద్రపోయినట్లున్నాడు.
రాజారాం, పావని అలాగే వాళ్ళ కుర్చీలో అలుపు తీరారు–

## 27

మరునాడు వీరన్న మధ్యాహ్నం 2 గంటలకు వచ్చి,

'అమ్మా, కొంచం అన్నం పెట్టు అని కుమారిని అడిగాడు. కుమారి కూరమళ్ళలోనూ, పూలమళ్ళలోనూ తిరుగుతున్నది– అప్పుడే నవీన్ కూడ అక్కడికి వచ్చాడు– వీరన్న అన్నం అడగటం చూసి–

'ఉండు, మా హెూటల్ దగ్గరకురా – అక్కడ నీకు అన్నీ పెట్టిస్తాను' అని వీరన్నను తీసుకుపోయాడు. అక్కడ భోజనం చేసి లోపలికి వస్తుంటే రాజారాం కనిపించి అడిగాడు.

'ఏం వీరన్నా యివాళ త్వరగా యింటికి వచ్చినట్టున్నావ్ – కులాసాగా విన్నావా?

వున్నాను సామీ, – పొద్దుటి నుండి ఒకపని మీద వుండాల్సివచ్చింది– పొద్దుటే చెఱకు పొడిని విత్తినా – అన్నదొక ఆడకూతురు చెర్లోకి దూకబోతోంది – వెంటనే వెళ్ళి బయటికి తోసేసినా – ఆ అమ్మాయి గట్టుమీద పడిపోయింది – అట్ట తోసేటప్పటికి నాచేతులు విరిగినవయ్యనుకో– ఆ అమ్మాయి తప్పించుకోకుండా పట్టుకోటానికి ప్రయత్నం చేశా– మొత్తానికి ఆ అమ్మాయిని బయటకూర్చోబెట్టగలిగా –

‘ఏందమ్మా యిది’ అంటే

‘ఏం చెయ్యమంటావయ్యా – యిక నేను యింట్లో బాధభరించలేనయ్యా – చనిపోతే నాపీడ నాకూ, మా వాళ్ళకీ వదిలిపోతుంది –

‘అందుకని పానాలు తీసుకుంటావా – పానాలు పోతేరావు – నీ కిష్టం లేని కుటుంబంతో బతకమా, ఏదో పని చేసుకు బతుకు –

ఇలా మాటలు జరుగుతుంటే వాళ్ళ వాళ్ళిద్దరు వచ్చారు –

పద ఇంటికి – కోపం వస్తే ప్రాణాలు తీసుకుంటావా’ అని పట్టుకుని వెళ్ళిపోయారు.

వాళ్ళకు నేనక్కడ వున్నానన్న గమనం కూడ లేదల్లేవుంది – ఆయమ్మాయి మాత్రం నాకు దణ్ణం పెట్టి వెళ్ళింది – ఏమిటో సామీ – యీ ఆత్మహత్యలేమిటో, నేను చూడు ఎంత బీదగా వున్నా ఎప్పుడూ బతుకు మీద ఆశ పోలా ! అని తనలో తను అనుకున్నట్లుగా అని తన చోటికి నడిచివెళ్ళాడు. –

ఆ రాత్రి చీకటి మోసుకొచ్చింది, అతడి తత్వాన్ని – అప్పటిదాకా నిద్రపోయినాడు వో చోట–

చస్త చస్త అంటూ బిడ్డ
బేహద్దు ఏడవకు
సామి అనుమతి లేక
చావటం కాదులే– బిడ్డ చావటం కాదులే –
చస్త చస్తా అనకు బయంతో బిడ్డా
మోయాలి యీ గూడు
సావు సెలవన్నదాకా
చివరిదాకా సావు సెలవన్నదాకా –
తెలుసునా బిడ్డా
చావు తేలికయి నంతటా
బతకరెవ్వరు బిడ్డా
యీ బాధ పడరు –
ఎందుకూ బ్రతకటం
అంటే తెలియదు మనకు
బాధలెందుకు అంటే
సామి అంటాడు

నవ్వులెందుకు నీకు
బాధలూ అందుకే
అంటాడు నా సామి – అందరికి సామి
చావు తేలికయితే
బతకరెవ్వరు– వుండరెవ్వరు బతికి
ప్రతిరోజూ చస్తారు గుంపులు గుంపులుగా
బతకవే తల్లీ నా బిడ్డా
బతకాలి సామి ఆనతి మీద
ఏడుకో సామినీ, బతుకు తీపిని చెయ్యి
అని ఏడుకో సామిని –
చెయ్యగలిగిందంతే
తెలుసుకో బిడ్డా
చస్త చస్తా అంటూ బేహద్దు ఏడవకు
ఏడిస్తే పోయేది కన్నీళ్ళు మాత్రమే
పానాలు కాదుగా బిడ్డ పానాలు కాదు –

యీ తత్త్వం గాలిలో కదిలి వచ్చి వీనుల్లో మిగిలినప్పుడు రాజారావుకి ఏదో గీతా భాష్యం వింటున్నట్లనిపించింది.

మానవుడెంత నిస్సహాయుడు– ?

పెదవుల మీద భారంగా చిరునవ్వు వెలిసింది.

యీ జీర్ణ దేహంలో యింత జ్ఞానం వుందా ? మరునాడు ఉదయం వీరన్న బయటికి వెళుతుంటే తన నిత్య ప్రసాదం కోసం వెళుతుంటేవ అడిగాడు.

'ఎంత పెద్ద వేదాంతం పాడావు నిన్న'

అది అలా  వచ్చింది సామీ – మా తాత కూడ యిలాగే పాడుతుండేవాడు అని ముందుకు  సాగిపోయాడు. –

అలసిపోయాడేమో బాగా నిద్రపోయి లేచేటప్పటికి చీకటి పడ్డది. అతను కూర్చున్నచోట వరండాలో దీపం వెలుగు పడుతున్నది. అలానే కూర్చుండిపోయాడు– ఒక్క క్షణం అనిపించింది, తనకూ ఒక యిల్లూ, నిత్యభోజనం, ఒక కుటుంబం వుంటే బాగుండునని– తనలోనుంచి పెదిమెల మీదికి నవ్వు వచ్చింది. అవన్నీ తనకు ఎంతో దూరం వున్నట్లనిపించింది– కొంప, రొట్టె, బట్ట యివన్నీ అందరికీ కావాల మరి –

కొంప వద్దా నీకు – ఏకతారా మీద చెయ్యి మీటటం మొదలుపెట్టాడు.

కొంప వద్దా నీకు
కోరికే రాదా–
అంటే
అది ఎట్లా సామీ
ఏమి సేయాల
కోరినా వచ్చునా
కోరికే మిగులునా
ఏమో – మరి
తిండి వద్దా నీకు
తీరైన తిండి
తిండి పెట్టేవారు
మీరంతా వుంటే
వూరంతా వుంటే
యింకేమి కోరాల
చెప్పునా సామీ
యివరముగ చెప్పు
బట్ట కావాల నీకు
రమ్జయిన బట్ట
కావాల కానీ
నాకెవ్వరిస్తారు
సెప్పు నా సామీ
ఏమి సెపుతవులే
సామి, నీ వయిన నాకు
కాని వాటిని కోరి
కళ్ళు కండా కరిగిపోవుటేగాని
ఏమి కోరాల
ఎట్ట కోరాల

దేవుడా యియ్యాల నీవె
కొంప, బట్టా, రొట్టె
అందుకే మీరు
మాకు దేవుళ్ళు ..........
అయినా సామీ
కోరేది నిన్ను, యిచ్చేది నీవు
ఎక్కడైనా గాని యింపెగా సామీ

అతడికి తను ఒంటరి వాడినైనట్లు అనిపించిందేమో లేచి వరండా దగ్గరకు వచ్చాడు. అక్కడెవ్వరూ లేరు

అలాగే ముందుకు నడిచాడు. ఎదురుగా వున్న నవీన్ హోటల్ మూసివుంది. ఒక్కసారిగా ఒంటరితనం– ఎక్కడికెళ్ళాలి , యీ వంటరితనం పోవటానికి తన గుంపు దగ్గరకు –

యాడికో బోబాకు
యీడనా వొల్లతా
అంటావు నరుడా
యాడికెల్లిన గాని
వుండేది నీతోవడె
నీకునీవెగాని
వేరెవరు వల్లరు
యాడికో బోయినా
యీడనున్న గాని
నీకుండే దొక్కడే
నీవెగదరా నాకు
నీకు తప్పదురా
నీ వునికి నీవేరా
నీకు తప్పదురా
తప్పుకోలేవు
నీ నుండి నీవు

నాన
తప్పుకోలేవురా
నీ నుండి నీవు-

## 28

మరునాడు సాయంకాలం దేవుడి గుడి దగ్గరకు బిచ్చం కోసం వెళితే అక్కడ తమ మెట్టు మీద ఎవరో కూర్చున్నారు.

వాడన్నాడు -

“ఇది నా సీటు. కంటాక్టరుకు డబ్బిచ్చా -' పోట్లాడటం యిష్టంలేక మెట్లకు దూరంగా భక్తులు తిరిగిపోయేదారికి ప్రక్కగా కూచుని తన బట్ట పరిచాడు. తన ఏక్ తార తీసి పాడటం మొదలు పెట్టాడు-

గుడిలోన నీవు
గుడి బయట నేను
నిన్నెట్లు చేరెదను లోకాల తల్లి
చెప్పు నా తల్లి
చెప్పు నాకమ్మా
కొంప, బట్టా, రొట్టె
అన్ని యిచ్చే తల్లి లోకాలతల్లి
నిన్నెట్లు చేరెదను
చెప్పు నా తల్లి లోకాల తల్లి
నీవు అయినది లేదు
నీవు కానిది లేదు
గుడిలోన వున్నా
గుడి బయట వున్నా
అన్నీ నీవి కానీ లోకాల తల్లి
నేను నీవూ ఒకటే లోకాలతల్లీ
అందువలనా తల్లి
కొండ బట్టా రొట్టె
నాకిచ్చి నీవుండు

నాలోన తల్లీ లోకాల తల్లి

యీడన్నా చుట్టూ జనం పోగయినారు – 'ఎంత మంచి గొంతు', 'ఎంత వేదాంతం', వీడేంటిరా యింత వేదాంతం చెపుతున్నాడు?' యిలా నలుగురు నాలుగు వింటూ అతని చుట్టూ చేరి తత్త్వం వింటున్నారు. యీరన్న ఆపగానే కొందరు డబ్బులు విసిరి వెళ్ళారు. ఒక పోలీసు కూడా అక్కడికి వచ్చాడు. మంచి బట్టలు వేసుకున్న ఒకామె తన దగ్గర వున్న కొబ్బరి చిప్పలు, పళ్ళూ, పూలూ అతని బట్ట మీద వేసి, కొంత డబ్బు కూడా యిచ్చింది – ఒకతను కెమెరాలో ఇవన్నీ బంధిస్తున్నాడు – ఇవ్వాళ కావలసినదంతా వచ్చిందనుకుని యీరన్న బట్ట మూటగా కట్టి (డబ్బు తీసిన తరువాత) లేచి మూట తీసుకుని బయల్దేరబోతుంటే పోలీసు ముందుకొచ్చి –

"ఏరా ఎంతొచ్చింది' అని లాఠీ ఝుళిపిస్తూ అడిగాడు.

'లెక్కపెట్టలేదు సామీ' – అని

'యిది తీసుకో సామీ యివాల్టికి – నీ దగ్గర అడుక్కుంటా నేమిటి సామీ – అని అతని చేతిలో కొంచెం పైసలుంచి బయల్దేరబోతుంటే ఫొటోగ్రాఫ తీసినతను ముందుకు వచ్చి,

'నాతో రండి – మీరెక్కడికి వెళ్ళాలంటే అక్కడ నా కార్లో దింపుతా' అన్నాడు.

యీరన్నకు నవ్వొచ్చింది –

'నన్ను కారెక్కమంటున్నారా – ఇదేమిటి సామీ'

'రండి! నేను దింపుతాను మీచోట' అని చేయిపట్టుకుని కారెక్కించాడు –

కారు నడుస్తున్నప్పుడు యీరన్న అడిగాడు –

'ఏంది సామీ, నన్నెందుకు కారులో దింపుతానన్నావ్' కొంచెం భయంగా అడిగాడు. ఎక్కేటప్పుడున్నంత సంతోషం ఇప్పుడు లేదు. ఏమో ఎక్కడికి తీసుకు వెడుతున్నాడో –

'నాతో నీకేం పని సామీ – నేను దొంగను కాదు – దొంగ సాక్ష్యాలు చెప్పను –' అన్నాడు భయంగా.

ఫొటోగ్రాఫర్ పేరు కౌశల్. నవ్వుతూ అన్నాడు –

'నేను మిమ్మల్ని మీ యింటి దగ్గర దింపుతాను – భయపడకండి. నేను మీ పాటలు రికార్డు చేసుకుంటాను.

అంతే – దాంతో ఆల్బమ్ తయారు చేసి మీ పాటలు అందరికీ వినిపిస్తాను – అంతే – వేరే మిమ్మల్ని యిబ్బంది పెట్టను –'

ఇంతలో రాజారాం తోట వచ్చింది –

“యిదే సామీ నేనుండే చోట. యీ తోట’ సారు చాల మంచోడు – వుండటానికి నాకింత చోటిచ్చినాడు –

‘మీరు దిగచ్చు. నేను కూడా మీరుండే చోటు చూసి రేపు మధ్యాహ్నం వస్తాను’ అని లోపలికి వీరన్నతో నడిచాడు. ఆ చోటు చూసిన తరువాత వెళ్ళిపోయాడు – వెళ్ళిపోతూ అన్నాడు –

‘మీ పాటలు రికార్డు చేయనిచ్చినందుకు మీకు డబ్బు యిస్తాను – ఎంతో చెప్పండి’.

యీరన్నకు ఆశ్చర్యం వేసింది. నా పాటలు వినడానికి డబ్బిస్తాడా – అవును తను ఎన్నడు డబ్బులు తీసుకోలేదు. యిప్పుడు చాలమంది పాటలకు డబ్బిచ్చి పాడించుకుంటున్నారట – కాని నీ పాటల్లో యీయన కేం కనిపించింది – నావి పాటలు కాదు తత్త్వాలు – ఏమో – ఏమిటోయిదంతా –

ఆ రాత్రి అతడిని ఆశ్చర్యం పాటగా బయటికి వచ్చింది –

సిత్రం యీ సిత్రం మహా యిసిత్రం
నా పాట నానోట యిని యిస్తాడంట
కాసులిస్తాడంట యిస్తాడు కాసులు
సిత్రం యిసిత్రం మహాయిసిత్రం
తెలియదేడున్నాడో కాని వున్నాడు
ఆ దేవుడున్నాడు వున్నాడు పైవాడు
వున్నాడు వెంటనే నా ఎంట వున్నాడు
సిత్రం యిసిత్రం మహాయిసిత్రం
నా కళ్ళు రాల్చినయి ఆడి, దయనామీద
యింక – దేవుడా!
పొట్టనిండా తిండి
ఒంటినిండా బట్ట
గిన్నెనిండా డబ్బు
సిత్రం యిసిత్రం – మహాయిసిత్రం
యిక లేదు కొరత
బట్ట కొట్టి గూడు
నీకేమి కొరతరా
పడ్డాది పై వాడి

చూపు నీ మీద

నీకేమి కొరత యిక మీద నీకు

యివ్వాల ఏదయినా

పైనాడె యివ్వాల

సిత్రం యిసిత్రం మహా యిసిత్రం

ఆ ఆశ్చర్యంతోనే నిద్రపోయాడు. అతడికంటె

ఏ భవనాలు మిగినయ్యో ఎవరికీ తెలియదు –

ఆ మరునాడు – 'అమ్మ భోజనానికి' వెళ్తే ముందే కౌశక వచ్చాడు. వస్తూ యీరన్నకు ఫలహారం తెచ్చాడు –

'నాకు తిండి తెచ్చావా – మంచోడివి'

అంటూ ఆ ఫలహారం తిన్నాడు –

అప్పుడు కౌశల్ అడిగాడు

'మీరిప్పుడు పాడగలరా–'

'ఎప్పుడయినా పాడగలను – నన్ను మీరు అనకు బాబూ, పెద్దోడివి – పెద్దోళ&ళ బిడ్డలా వున్నావు– యీరన్న ఆ బాలుని అన్నాడు.

కౌశల్ రికార్డింగ్ సెట్ అమర్చి, యీరన్నను పాడమన్నాడు– అలా ఒక వారం జరిగింది– మరోవారం రోజుల తరువాత తిరిగి వచ్చి ..........పెట్టి వీరన్నకు అతని పాటలు వినిపించాడు–

ఆశ్చర్యపడ్డాడు వీరన్న. తనగొంతు యింత బాగుంటుందా – తను పాడే పాటలు యింత బాగుంటయ్యా – వింటుంటే కళ్ళలో నీళ్ళు తిరిగినయ్. కౌశల్‌కు నమస్కారం చేశాడు–

రాజారాం, పావని, అప్పుడే అక్కడకు వచ్చి ఆ కాసెట్ వింటూ చాల ఆనందపడ్డారు. కౌశల్ తన్ను తాను పరిచయం చేసుకుని అన్నాడు.

'యీరన్న గారిలో యింత టాలెంట్ వున్నది– నేను యీ ఆల్బమ్‌ని నెట్‌లో పెట్టి ప్రచారం చేస్తాను. చాల పాప్యులర్ అవుతుందని నా అభిప్రాయం –

*****

ఒక నెల తరువాత ఆ ఆల్బమ్‌ని నెట్‌లో విన్నారు రాజారాం, పావని – బయటి కుర్రాళ్ళలో చాల పాప్యులర్ అయింది – వాళ్ళిద్దరికీ చాల నచ్చింది. ఇక నీ భవిష్యత్తు కేమీ ఫరవాలేదు వీరన్నా' అన్నారు. కానీ అనుకున్నట్లుగా కాక వీరన్న పూర్వ స్థితిలోనే వున్నాడు.

తాను తన భవిష్యత్తుని గురించి ఏమనుకున్నాడో తెలియదు కానీ, ఎప్పటిలాగే తన భిక్షుక వృత్తి చేసుకుంటున్నాడు. కౌశల్ యిచ్చిన పారితోషికం రాజారాం దగ్గర దాచి పెట్టుకున్నాడు.

'అదేమిటి, హాయిగా కొత్త బట్టలు కొనుక్కొ, మంచి పాక వేసుకో– బిచ్చమెత్తకుండా ఏదో పని చేసుకో –' అని రాజారాం చెప్పినప్పుడు పెద్దగా నవ్వాడు.

'సామీ, మీకు నామీద చాల నమ్మకముంది– నాకూ వుంది– కాని యీనాటికి ఎన్నడౌనా అదురుష్టం మారే పని జరుగలేదు. ఆకాశంలో నక్షత్రంలా అప్పుడప్పుడూ మెరుస్తూవుంటుంది నా బోగం. అంటే నా వృత్తి నాదే–

నా పాట నాకే – అలా జరిగితే చాలు సామీ –

అతనిది సంతృప్తా, అనుభవం అనుభవం నేర్పిన పాఠమో, రాజారాం కి తెలియలేదు – కొంత సేపయిన తరువాతగాని మోసల కొచ్చింది

కంటి చూపున పడును
ఎన్ని నచ్చత్రాలో–నరుడా
ఎన్ని నచ్చత్రాలో నరుడా
కాని
ఒక్కటీ అందదురా
ఎన్నటికి నీకు–నరుడ ఎప్పటికి నీకు
ఉండనీ చూపులో, కంటిలో వాటిని
ఆకాశమే నీకు సొంతమైనట్లు
బతకరా నీవు అది మేలు నీకు–
నరుడ అది మేలు నీకు–

ఆ గాలి మోసుకొచ్చింది ఒక పెద్ద నవ్వును–

రాజారాం, అక్కడికి వచ్చిన పావని– యిద్దరూ మనస్సుల్లో ఏదో కలుక్కుమన్నది– మనమూ అంతేనా –

మరునాడు సాయంత్రం టౌనుహాలులో పావనికి సన్మానం. హైదరాబాద్ మెడికల్ ఎసోసియేషన్ ఆమెకు లైఫ్ టైమ్  ఎఛీవ్‌మెంట్ ఎవార్డు యిచ్చారు. అందరూ ఆమెను గురించి ఎంతగానో పొగిడారు. ముమ్మరంగా మెడలో దండలు పడ్డాయి. నిశ్చయంగా డా॥ పావని మీద చాలమందికి అభిమానము, గౌరవమూ వున్నాయి. ఫంక్షన్ అయిపోయిన తర్వాత ఆమె వెంట ఎసోసియేషన్ కార్యదర్శి వెంటవచ్చి, ఆమెను తోట నివాసంలో దింపారు. అందరూ వెళ్ళిపోయిన తరువాత పావని సోఫాలో కూలిపోయి విశ్రాంతిగా

కూర్చున్నది– రాజారాం వచ్చి మరో సోఫాలో కూర్చున్నాడు నవ్వుతూ –

'పావని డాక్టరుకి పదివేల పుష్పాలు' అన్నాడు నవ్వుతూ–

'ఫంక్షన్‌కి వెళ్ళేటప్పుడు ఎంతో ఉత్సాహంతో వెళ్ళాదు. నీవు వెంటరాలేదని కొంచం వెలితి తోచిందనుకో– అయినా తిరిగి వచ్చేటప్పుడు  ఏదో తెలియని వెలితి– ఏమిటది రాజూ –'

నిజానికి నాకూ తెలియదు కానీ– బహుశా యిటువంటి పురస్కారాలు, మన వయస్సులో మన భవిష్యత్తుకు అయోమయంగా కనిపించేటట్లు చేస్తయ్యనుకుంటాను.

ఇంతలో వీరన్న వస్తూ వాళ్ళ దగ్గర ఆగి, ఆ పూలదండలు చూసి

'అమ్మో, యిన్ని దండలే – ఎవరికమ్మా యివి?

'నాకే వేశారు వీరన్నా– నేను గొప్పదాన్నట. ఎంతో మందికి ఎన్నో చేశానట– 50 ఏళ్ళుగా నేను డాక్టర్ని – ఎంతో మందికి మందులిచ్చాను – వారందరికి నేనంటే ప్రేమట. అందుకే ఇన్ని దండలు –

'అంతా నిజం కాకపోతే ఎందుకేస్తారమ్మా –' అని నవ్వాడు.

కళ్ళు మిల మిల లాడినయి.

'ఒక్క పాటేపాడు'–

'అలాగే నమ్మా' – తన సంచి గట్టుమీద పెట్టి ఏకతారా తీసుకుని–

'ఏం పాడమంటారు –

'నీ మనసుకు నచ్చింది, వచ్చింది పాడు – నీవు పాడితే అన్నీ బాగానే వుంటాయి.

'వందనాలమ్మా  అమ్మా

డాక్టరమ్మా నీకు వంద వందనాలు'

పావని ఆపింది –

వాళ్ళు చెప్పిందే నీవు చెపితే ఎలా–

ఒక తత్త్వం పాడు –

కొంచం ఆగి 'మా తాత సెప్పిన తత్త్వం పాడతా !

ఏమనుకోకు  తత్త్వం నీకు నచ్చకపోవచ్చు –

నచ్చుతుందిలే పాడు–

మొదలెట్టాడు.

'వయసు మళ్ళిందంటు

వగచి వాపోకు

కళ్ళు వాచును గాని
మేలేమి వుండదులే నా చిన్ని నాన
వయసు మళ్ళిన గాని
ఎవరికీ తెలియదు
నీవేమి చేశావో
మీ మనమేమి చేశామో
 మనకు మాత్రము తెలుసు
మనమేమి చేశామో – వయసు మళ్ళిన గాని
వయసు మళ్ళిన నాడు
ఎన్నిపొగిడిననేమి
యికమీద ఏమిరా
బడుగైన దేహమూ
మరుగైన తెలివైన తలపులూ
మనమేమి సేయగా
వీలుపడనీయవు – వయసు మళ్ళినగాని
అంతేనని నీవు
తృప్తిగా మనసున
నింపుకోరా నవ్వు
నవ్వుకోరా నీవు తృప్తిగా
వయసు మళ్ళిన
ఎప్పుడో గొప్పోడిది
ఎప్పుడూ అంతే
అప్పుడూ యిప్పుడూ
ఎప్పుడూ అంతే ! వయసు మళ్ళిందంటూ !
కాని
అంతా మరుగైన రోజుల్లో
ముందున్న రోజుల్లో
ఏమి సేయద నీకు వల్లకాదంటే ! వయసు మళ్ళిన!
మధనపడటమే కాని

యీ తీరం అంతే
అది జీవితపు తీరు ! వయసు మళ్ళీ !
పావని, రాజారాం చప్పట్లు కొట్టారు –
'వీరన్నా, యింత తెలివిని, తత్త్వాన్ని , ఎలా, ఎక్కడ దాచుకున్నావ్–
పాట నాలో నుంచి
వెల్లువై వస్తుంది
తత్త్వమో , తాపమో
నాకు తెలియదు స్వామి
యిక వెళ్ళేదా –
భోజనం చేశావా – ..........
యీరోజు మా ఇంట్లో భోజనం' అన్నది పావని.
నవ్వుతూ అక్కడే కూలబడ్డాడు వీరన్న.

## 29

కొన్నాళ్ళ తరువాత కౌశల్ వచ్చి ఒక సి.డి. వీరన్న కిచ్చాడు.–

'ఇందులో నీ పాటలన్నీ వున్నాయి. ఫేస్‌బుక్‌లో యివి చాల పాప్యులర్ అయినవి. గొప్పవాడివి వీరన్నా– నీకు చాల భవిష్యత్తు వుంది.'

'యిందులో పాటలున్నయ్యా, యింత చిన్నగా వున్నది రికార్డు– అన్నీ వీటిలో వున్నాయ్యా '

'వున్నయి'

నేనెట్లా వినేది –

'నీకు నా లాప్‌టాప్‌లో వినిపిస్తాను–'

'అది నా దగ్గర లేదే'

'నాదగ్గర వుందిలే వీరన్నా – కావాలన్నప్పుడు వినిపిస్తా –

సిడి ని ప్లే చేస్తుండగా రాగిణి అక్కడికి వచ్చింది– పరిచయాలయిన తర్వాత పాటలు విన్నారు. కౌశల్ వెళ్ళిపోయాడు. రాగిణి, పావని, రాజారాం అలా కూర్చుండిపోయారు – రాగిణికి అనిపించింది.

'యీ బడుగు దేహంలో యింత కళ వుందా ? తను కూడ యీ కళను వుపయోగించి ఆ కళను బయటికి తూసుకురావాలి.

వీరన్న కనిపించింది– యీ మనిషి, యీ కౌశల్ యిక రాడా ! ఏదో డబ్బిచ్చి పోయాడు – అంతేనా '

ఎందుకో అంతా నీరసమనిపించింది– సంతోషంతో పాటు నీరసం– ఏమిటో యిదంతా– ఆలోచనకందలేదు.

మరునాడు మామూలుగా 'అమ్మభోజనానికి వెళుతూవుంటే నవీన్ వచ్చాడు.

యీరన్నా, ఆగు నాతో రా ! ఇక నీవు భోజనానికి ఎక్కడికీ వెళ్ళవద్దు. నాకు కూరలమ్మిపెట్టు– అన్నాడు– మాటసాగిస్తూ–

రాజారావుగారి తోటలో కూరలు మంచివి ఏరి యిస్తుంది కుమారి, బండి మీద పెట్టుకుని ఆ కూరలమ్మి డబ్బు నాకివ్వు. ఆ బండి మా హొటల్ ముందు పెట్టుకో ! నీకు భోజనం నేను పెడతాను, తరువాత అమ్మినందుకు వచ్చిన లాభంలో భాగమిస్తాను, బాగుందా, సరేనా'

'అమ్మటం నాకెట్టసేతవుద్ది. అన్నీ తూచి యివ్వాలి. నాకు తూచటం సరిగారాదే, డబ్బులు లెక్కెట్టి చిల్లరివ్వాలి– నీకు నష్టం తెస్తానేమో'– సందేహంగా అన్నాడు వీరన్న–

'ఫరవాలేదు, మొదట్లో కొంచం బిడియంగా వుంటుంది. మెల్లగాఅంతా అలవాటవుతుంది. నీవు చెయ్యగలవు.

నవీన్ మాటలకు కొంచం ధైర్యం వచ్చింది వీరన్నకు.

'అయినా నాకెందుకు సామీ యీకొత్త అలవాట్లు– బిచ్చమెత్తటం నాకుతెల్సు– తత్వాలు పాడుకోగలను– యీ బాబుగారు చిన్న చోటిచ్చారు. ఇలాగే వెళ్ళనీ బాబూ, నవీన్ బాబూ–' అంటూండగా రాగిణి అక్కడికి వచ్చింది–

'వీరన్నా, నీ తత్వాలతో ఒక డాన్స్ కంపోజ్ చేస్తాను, ఒప్పుకుంటావా–' అని అడిగింది.

అంటే ఏంటమ్మా – ఆ కెమెరా ఆయన చేసిందేనా –?

'కాదు నీవు ఎప్పుడూ డాన్స్ చూడలేదుకదా–

చూశాను, మా వాళ్ళు కలిసినప్పుడు ఆడి పాడుతుంటారు. నా తత్వాలు నేను కూడ పాడతాను'–

'అదే పెద్దస్టేజిమీద చేస్తాను. నీకు అమ్మవారి మీద ఏదయినా తత్వం వచ్చా'

'ఎందుకురాదు, నిన్ననే నాకొకఆమె దేవి బొమ్మ చూపించింది– ఆ బొమ్మచూచి పాడాను. వినిపించేదా–

‘అమ్మ బొమ్మను చూడగానే నాకు నవ్వు వచ్చింది.’
‘యిన్ని సేతులు నీకు
ఎందుకే తల్లీ
బండి చక్రపు టాకుల్ల వున్నాయి
యిన్ని సేతులు నీకు
ఎందుకే తల్లీ
యీ మాటకు అమ్మకు నవ్వొచ్చినట్లనిపించి
అన్నా–
‘నామాట తల్లీ నీ నోట నవ్వు పుట్టించెనా
నవ్వవే తల్లీ
మణులన్నీ నీ నోట రాలిపోతున్నాయి
నవ్వవే తల్లీ –
నవ్వకుండా చెప్పు
యిన్ని సేతులు నీకు ఎందుకే తల్లి
సెపుతా యినుకోరా
మీరందరూ నాకు కన్నబిడ్డలురా
తెలుసుగా యిది నీకు
బిడ్డల్లా వుంటారు
దుర్మార్గులుంటారు
సన్మార్గులుంటారు
నిలవనీయరుకొందరెవ్వరినీ
వారికి
ఎదురు నిలువగలేరు
కొందరు బిడ్డలూ
అందుకేరా వారి రక్షించాలినేను
పట్టుకున్నానేను, అందుకేనాకు
కత్తి డాలా,విల్లు గొడ్డలి

ఒక వైపునుంచీ
మంచివాడిని రక్షిస్తనేను
మడి చేతిబట్టితిని
అన్నపూర్ణలాగ అన్నమెట్టేరీతి
యిందరికి పెట్టాలంటే
ఎన్ని సేతులు కావలెనురా
ఆమాటకు నాకు ఆశ్చర్యమేసింది
మంచితల్లివి నీవు
మనసున్న తల్లివి
నీ చేతనున్నది ముద్దగాదమ్మా
ముద్దగట్టిన ప్రేమ
ముద్దగాదమ్మా
మా పొట్ట ఆకలికి
ముద్దగట్టిగనుండు
మంచి తల్లివి నీవు
నీవు పెట్టిన ముద్ద
కలకండ మాకు
మా పొట్ట గమనించి
పెట్టు నీ ముద్ద
అపుడు నిండును కళ్ళు
మా కళ్ళు తల్లి
నీళ్ళ చెరువులాగ
మా కళ్ళు తల్లి నిండిపోయాయి
ఎట్టకలిగెను తల్లి
నీకింత ప్రేమ
నీ చేతి ముద్దకి

యింత తీపెట్లా
నీ చేయి పెద్దదీ
ప్రేమ నిండిన చేయి
అందరికీ పెట్టాలె
ఒక్కసారిగ నీవు
అందుకే నీకిన్ని సేతులు తల్లి
మంచి తల్లివి నీవు
మనసున్న తల్లివి
అలా సాగిపోయిందమ్మా
రాగిణి కళ్ళు చెమర్చినయి–
'నీ పేరేమిటో గాని– మహా కవివయ్యానీవు
ఇది నేను డాన్సుగా మారుస్తాను. సరేనా
'సరే– నేనేం సేయాల సెప్పు

'అయితే యీరన్నా కూరలమ్మవా' అన్నాడు. నవీన్ నవ్వుతూ– నీచేత ఎలా అమ్మిస్తానో చూడు'

'నవ్వుతూ వీరన్న తన చోటికి వెళ్ళిపోయాడు.

## 30

వీరన్న తత్త్వాలతో డాన్స్ కంపోజ్ చేయటానికి రాగిణికి నెల రోజులు పట్టింది. ఈ యత్నంలో ఆమెకు ఒకటర్థమయింది. మానవ వయస్సు వుత్సాహాన్ని ప్రోత్సహించటం లేదు. ముద్రలు, భంగిమలు, దృశ్యాలు అన్నీ కంపోజ్ చేయటం అంత చురుకుగా సాగిపోవటం లేదు. దీనిలో ప్రధాన నృత్యకారిణి కుమారి.ఆమెకు కూడ డాన్స్ కొత్త. అయితేనేం చెప్పింది చేస్తుంది. స్వయంగా ప్రతిభ కల పిల్ల. తనంటే గౌరవం.

రాగిణి మనస్సు శరీరాన్ని ప్రోత్సహిస్తోంది. అప్పుడప్పుడు ఆమెకు అనిపించేది. ఈ మాటే ఒకరోజు వీరన్నతో అన్నది.

వీరన్న- పెద్దదాన్నయి పోయినట్లుంది. పనులు మెల్లగా జరుగుతున్నాయి. నేననుకున్నట్లు నీ తత్త్వాలతో ఒక నాట్యం తయారుచేయగలనా అని అప్పుడప్పుడనిపిస్తున్నది-

'ఆపేయండమ్మా - ఎందుకంత శ్రమ-

'అలా వీల్లేదు,చూడు ఎలా తయారుచేస్తానో-

'మా తాత యిలాగే నాతో అనేవాడమ్మా, యీరిగా, ముసలివాళ్ళు బిచ్చం కూడఎత్తలేర్రా- ఏదో ఒకచోటికిపోయి అడుక్కోవాలంటే అంత తేలిక కాదురా  అని యిలా పాడేవాడు.

యాడబోయినదోరి నా చిన్నతనము
ఆ నాటి నాచిన్నతనము
యిరికి పోయినదేమో
యీనీటికా ముసలి నగ్గుల్లో కాన
యాడబోయినదోరి నా చిన్నతనము
యిరికిపోయినదేమో
నా మనసులో బొమ్మగా
ఆనాటి నా చిన్నతనము
ఆవిరైపోనాయి ఆనాటి ఆనలు
మిగిలిపోనాయి ఆశలే ఆశలు
మెండుగా కోరికలు యీనాడు నాలో
యాడబోయినదోరి నా చిన్నతనము
కళ్ళు, కాళ్ళు, కీళ్ళు
ఎముక, బొమికె, కండ
అన్ని సళ్ళిచ్చి యాడకో బోయినయి
యాడబోయినదోరి నా చిన్నతనము
ఏమాయె నీనాడు ఆనాటి కలలు
ఆనాటి నేను యీనాటి నేను

యిద్దరం ఒకటేనా, సెప్పరా కన్నా
యీ యివరమెవరు సెప్పాల
వాడె నేనేమో
యాడబోయినదోరి నా చిన్నతనము–
చాల బాగ పాడేవాడు–
అఇఁతేనమ్మా,ఏమనుకునీ ఏ ప్రయోజనమూ లేదు.
మనమంతా కాలంతో కలిసిపోవాలి–
యిదేంటమ్మా, మీకు నేను చెపుతున్నాను.– అని వెళ్ళిపోయేవాడు.
చాలసార్లు యిలా జరిగింది–

మొత్తానికి కష్టపడి డాన్స్ కంపోజ్ చేసింది రాగిణి– అది ఎక్కడ, ఎవరికోసం చేయాలి, ఆడియన్స్ ఎవరు– చాల చోట్ల ఆలిష్కరణ జరగవచ్చు. కాని తనకనువయినచోట తోటలోని తన రంగశాలే –అందుకే అక్కడే ఏర్పాటు చేసింది– మొదటి ప్రదర్శన, యీ ప్రదర్శన కోసం ప్రత్యేకంగా వీరన్న యీ తత్త్వం పలికాడు–

యిన్ని సేతులు నాకు
ఎందుకో సెపుతాను
యినుకోర నా చిట్టితండ్రి
నా సృష్టిలో నీవు
ఒక్కడివి కాదురా
లెక్కబెట్టగలేని
లెక్కకందని
వారెందరో వున్నారు
వున్నారురా నీవంటి వారెందరో
తెలుసునా నీకు
ఆకసంలో తారలెన్నున్నాయి
లెక్కలేనన్ని ఆకసానవున్నాయి

అన్నింట వున్నాయి
ఎన్ని తారలో నీకు లెక్కకందవురా
అన్నింట వున్నవారందరూ నావారె
నా వారె నాబిడ్డలే నాన్న
నా బిడ్డలేరా–
అందరికి పెట్టాలె
అన్నిమొట్టాలె
భిక్షువులె నీలాగె
అందరూ నావద్ద
బిచ్చమెత్తేవారె
వారు కోరినవన్ని
యివ్వాలి నేనంటే
ఎట్ల యివ్వాలిరా
ఎన్ని సేతులు సరిపోవురా నాన్న
అందరికి పెట్టాలి అంటే నాచిన్నినాన్న
అందుకే గదర
బండి చక్రములోని ఆకుల్లా వున్న
యీ సేతులన్నీ
అదిగాక బిడ్డా
తెలుసునా నీకు
నీలాంటి వారందరిలో
వున్నారు
మంచి వాళ్ళున్నారు
చెడ్డవాళ్ళున్నారు
అందరికి తిండి అందించలేరా
అందించి అందరినీ అదుపులో పెట్టాలె

అందుకేరా నాకు అన్ని అస్త్రాలు

నాన్న అందుకేరా నాకు అన్ని సేతులు బిడ్డ.

తోటలోని రంగమంటపంలో యీ నాట్యం ఏర్పాటు చేసినా, ఎందరో రాగిణి పరిచయస్తులూ, వారి పరిచయస్తులూ దాదాపు వందమందిదాకా వచ్చారు. ఇక్కడ ఏదో జరుగుతుందని దారినపోయేవాళ్ళు కొందరక్కడ ఆగి పోయారు. ఒక గంట సేపు గడిచిన నృత్యం అందరి మెప్పూ పొందింది. ప్రదర్శన చివరిలో రాగిణి  వీరన్నను పరిచయం చేసింది. అందరికీ ఆశ్చర్యమేసింది. అందులో చాలమంది ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట బిచ్చమెత్తుకుంటున్న  వీరన్నను చూసినవారే– 'ఇతనా' అని ఆశ్చర్యపోతూ–

'ప్రతిభకు ఒక చోటంటూలేదు. ఎక్కడైనా వుండచ్చు. కొందరు పైకి వెళతారు. నలుగురి కంటాపడి పైపైకి వెళ్ళి ప్రఖ్యాతులవుతారు. కొందరు మూలనే వుండిపోతారు. ఇది లోకరీతి–

మరునాడు అలవాటు ప్రకారం 'అమ్మాజీ' భోజనానికి వెళ్ళాడు. అక్కడ సుమతి గుర్తుపట్టి–

'ఏంటీ ఇక్కడున్నావ్– నిన్న అంత మంచి నాట్యానికి పాట రాశావు– యింకా బిచ్చమెత్తుకుంటున్నావా?' ఆశ్చర్యంగా అడిగింది.

'అమ్మా, యిది నా వృత్తి. ఇంక నాకేపని చేతకాదు. పాటలకెవరు డబ్బిస్తారు. పాటలతో బతకగలనా– నా వృత్తిని నేను మానుకోను.

ఇంతలో స్వామీజీ అక్కడికి వచ్చారు. వీరన్నను చూపించి అన్నది సుమతి (అమ్మాజీ).

ఇతనే స్వామీ, నిన్న నాట్యానికి ఎంతో అందమయిన తత్త్వాన్ని పాడాడు.

'అయితే నాకుకూడ ఆ తత్త్వాన్ని వినిపించగలవా?

స్వామీజీ అడిగినందుకు సంతోషం వేసింది. అన్నదానం అయిన తరువాత వీరన్నను లోపలికి పిలిస్తే స్వామీజీ దగ్గరకు తీసుకెళ్ళారు. అక్కడ వీరన్న దేవి మీద తత్త్వాన్ని పాడాడు. స్వామీజీ చాల సంతోషించి –

'చాల బాగుంది. ఇది నీకు ఎవరు నేర్పారు–' అని అడిగారు.

'నాకే తోచిందిస్వామీ – అదే పాడాను.'

'నిజంగానా' ఆశ్చర్యంగా అడిగాడు స్వామీజీ. మంచి అవగాహన ఉన్నది. పాట మార్చి పాడావు. అని చేతిలో కొంత డబ్బు పెట్టాడు.

'ఎందుకు స్వామీ యిది. రోజూ మీదగ్గర భోజనం చేస్తూనే వున్నాగా ! అని ఆ డబ్బు తీసుకోకుండా–

స్వామీ, ఒకప్రశ్న అడుగుతాను, మీరేమీ అనుకోరు కదా–

'ఏమీ అనుకోను–' అడుగు.

స్వామీ, మీరు సన్యాసులు కదా– అన్నీ వదిలేసారు. మరి యీ జంజాటమంతా ఎందుకు సామీ' ?

ఫక్కున నవ్వాడు స్వామీజీ.

'నాకూ తెలియదు, నీకు తెలిస్తే చెప్పు'

తెలియదనేగా అడిగింది. మా తాత కూడ యిలాగే కొంచం సన్యాసే. కొంచం తత్త్వం పాడుతుండేవాడు'–

'ఏమని పాడేవాడు'

'బాగా గుర్తులేదు. గుర్తున్నవరకు పాడుతాను'– అని ఏకతారా తీసాడు. గొంతు సర్దుకుని యిలా పాడాడు.

పండులా వున్నట్టి సన్నాసి సామీ
అన్నిటిని వదిలేసి
అందరిని వదిలేసి
అన్నీ వున్నోడవు
యీ వేసమేమి,
యీలాగు మాలాగ
చెట్టుకిందున్నావు మాలాగ నీవు
మా లాగ బొచ్చెలో
భోజనం నీకేల
తిరిగి, తిరిగి

యీా తిరిపమేల
మాలాగ బతకనీ
కెందుకీ కోరిక
సెప్పు యివరముగ
డబ్బులంటే నీకు
ఎందుకీ సీదర
యిందు భోజనమంటే
ఎందుకీ సీదర
సెప్పు యివరముగ
సెప్పు ఓ సామి తెలియంగ మాకు
సెపుతాను బిడ్డ
యినుకో నాబిడ్డ
అన్నివున్నా నీకు
ఏమి లేనట్టే
కావాలె నాకు, తెలియాలె నాకు
తెలుసుకోవాలె
నేనెవరు అన్నది
అందుకే తపన
అందుకే వదిలేసా
అయితే ఓ సామి
అన్ని వదిలేస్తే
నీ వెవరో తెలియాలనా
అందుకేరా బిడ్డా
అన్ని వదిలేసినా
అయితే ఓ సామి
అతడేడవున్నాడు

నీవు వెతికేవాడు
వాడేరా దేవుడు
తెలుసుకున్నానురా
అతడు నేనేనని
అందటల్లేదు ఆనేను నాకు
నాకు వానికి, అంటే ఆదేవుడతనికి
నడుమనున్నది
నాకు వానికి నడుమ
అగ్గి మేఘము లాంటి
బహుగట్టి పొర ఒకటి
సన్నదేకాని, పొరలాంటిదేగాని
బహుగట్టి పొరరా
ఆమె వెనుక వున్నాడురా దాగి
ఆ దేవుడను వాడు నేనే అయినోడు
తెర తీయటానికి
నీ తపన తపనంతా
దీని నంటారురా
గ్యానయ జనం అని
కోరికలు, మనసు
యీ మురికి, మకిలి
ఊడిసేయాల
అందుకేరా నా తపన అంతా
ఎవరో వూదినయట్లు
మనసు, మసి ఎగిరిపోవాల
నిగ్గ తేలాల మనసు
నిగ్గ తేలాల

బస్మమై పోవాల
కోరికలు మనసు
మోసుకెళ్ళాలిగా
ఎవరో వూదిలయట్లు
పైకి దూకిన అగ్గి
మోసుకెళ్ళాలి ఆ బుగ్గినంతా
మనసు మారాలిరా
వెలుగులా వెలగాలి
వెలుగులో మెరవాల
అసలు నేనైన నేను
తపనరా తపన
దేవుణ్ణి సూడాలి
నేను సూడాలిరా నన్నుయివరమున
నా తపనలో నేను
కాలిపోవాల
కాలి మిగలాలిరా
బంగారు రంగున
అసలైన నేను
నేనైన నేను
దీని నంటారురా
పెద్దలంటారు
తపనని అంటారు
యిది చాల కష్టమురా
ఒక జలములో లేదు
యేల జలముల మాట
అందుకే అన్నిటిని వదిలేసినాను.

ఇది విన్న స్వామీజీ, సుమతి వాళ్ళ కళ్ళు నీళ్ళతో నిండినయి. స్వామీజీ లేచి వీరన్నను కౌగలించుకుని–

'నీవురా నిజమైన సన్యాసివి' అన్నాడు.

వీరన్నకది అర్థంకాక నివ్వెరపోయాడు.

31

ఒకనాడు సాయంత్రం గుడిదగ్గర తన బట్ట పరుచుకుని అడుక్కోటానికి కూర్చున్న వీరన్న మామూలుగా తన తత్త్వాలు పాడుతుంటే కొందరు యువకులు చాల మాడరన్‌గా వున్నవారు అతని చుట్టూచేరి వింటూ నిల్చున్నారు. తత్త్వం అయిపోయిన తరువాత అందులో ఒకడడిగాడు.

'నీ పేరేమిటో' ?

'యీరన్నండీ'

యీరన్నా మాకోసం ఒక పాట పాడు– చక్కగా డాన్స్ చేసుకుంటాం– 'ఆకతాయి మూక ఆకతాయిగా అడిగినదానికి వెంటనే స్పందిస్తూ 'అలాగే' అని పాట మొదలెట్టాడు.

ఎప్పుడూ పిల్లోడినన్నా

నీ వెప్పుడూ పిల్లోడినన్నా

నేనెప్పుడూ పిల్లోడినన్నా

యీ వరస అందుకుని ఆకతాయి మూక వీరన్న చుట్టూ చక్రంలా తిరుగుతూ డాన్స్ చేయటం మొదలెట్టారు. ఆ పల్లవి అందుకుని–

నేనెప్పుడూ పిల్లోళ్ళమన్నా

అంటూ వీరన్నను అనుసరిస్తుంటే వీరన్న యింకా సంబరంగా గొంతు విప్పాడు.

ఆడుతూ పాడుతూ

తుళ్ళుతూ నవ్వుతూ

ఎప్పుడూ పిల్లోళ్ళు మీరు

నన్నెవరాపలేరన్నా

నిన్నెవరాపలేరన్నా
ఎప్పుడూ పిల్లోడినన్నా
చెప్పన్నా వయసుకూ
నా మీద దూకకనీ
చెప్పన్న వయసుకు
నీ వెప్పుడూ పిల్లోడినన్న
వయసెప్పుడైన
నా మీద దూకితే
మా మీద దూకితే
తట్టి తోసేస్తాము
వయసుకు చెప్పరన్నా
నా మీద చూపకు
నన్ను చుట్టేయకు
అని చెప్పు వయసుకూ
చెప్పు యీరన్నా

అంటూ చెమటలు ఓడేవరకూ డాన్స్ చేసి వీరన్న బట్టమీద డబ్బులు విసిరి వెళ్ళిపోయారు.

ఆనాటికి చాల్లే అని వీరన్న తోటకు తిరిగి వచ్చేసాడు–

ఆరోజు పడుకునేటప్పుడు వీరన్నకు సందేహం వచ్చింది, తను యిలా పాటలెలా పాడకలుగుతున్నాడని– ఇందార గుడిదగ్గర వున్నప్పుడు ఒక సాములోరు వుపన్యాసం యిస్తున్నాడు– మనం చేసేవాటన్నిటికి మనమే కారణం – మనకు తెలియని రెండున్నాయి. మనస్సు, కాలం. – ఈ రెండూ మనకు తెలియకుండా వున్నా అవి మనల్ని నడిపిస్తున్నాయి. ఈ మాటలు గుర్తుకు రాగానే వీరన్న గొంతులో యీ తత్త్వం పలికింది.

మనసాడవున్నది
కాలమేడున్నది

ఎఱుకున్నదా బిడ్డ
ఎఱుకలేని కాలమెఱుకలేని మనసు
ఈ రెంటిలో మనము
ఎట్లావున్నాముర్రా
వున్నాముర్రా మనము
కరిగి కాలములోన
మునిగి మనసులోన
ఎఱుకలేని మనసు
ఎఱుకలేని కలమేడవున్నాయిరా–

వీరన్నకు నవ్వు వచ్చింది– తనలోనుండి తత్త్వాలు వస్తున్నట్లు– తమాషా అలాగే .............పట్టింది.

వీరన్నను చూస్తే స్వామీజీకి ముచ్చటేసి తన శిష్యులతో చెప్పాడు– వీరన్న వస్తే తన దగ్గరకు తీసుకురమ్మని–

నాలుగు రోజుల తర్వాత వీరన్న అమ్మాజీ భోజనానికి వెళ్ళినపుడు స్వామీజీ శిష్యులొచ్చి 'స్వామీజీ రమ్మంటున్నారు' అని తీసుకెళ్ళారు.

'కూచో వీరన్నా– రావటం లేదుట–'

'అవును సామీ, కూరలమ్మే పని నేర్చుకుంటున్నా'

'అలాగా'– చెయ్యగలుగుతున్నావా? – ఏంటి !

'ఎందుకు చేయలేను సామీ, కాని అలవాటు లేక యిబ్బందిగా వుంది.

అయితే యిక్కడేవుండి ఏదో పని చేస్తూ భోజనం చెయ్యి– కాలం వెళ్ళదీయొచ్చు. నీ పాటలు పాడుకోవచ్చు.

'ఏమో సామీ, నేనేం చేయగలను'–

'చేయగలిగిందే చెయ్యి.–

'అట్లాగే సామీ, మరి వస్తా–

'కూర్చో ఒక తత్త్వం పాడి వెళ్ళు– ఒకమాట చెప్పు– దేవుడున్నాడా, నీకు నమ్మకమేనా–'

అదేంటి సామీ, దేవుడు లేకపోవడమేంటి?
వున్నాడు సామీ
దేవుడే లేకుంటే
మనమెట్లావున్నాము
సామి దేవుడున్నాడు
దేవుడిలో వున్నాడు
బతుకు దేవుడిలోన
దేవుడుంటేగదా సామీ
మన బతుకు సామీ'
'అంత నమ్మకమా, స్వామీజీ నవ్వుతూ-
'ఎక్కడున్నాడు' అని రెట్టించాడు.
అన్ని చోటా అన్నిటా
దేవుడా వున్నావు నీవు
దేవుడా
నీవున్న చోటే
అది చోటు దేవా
నీవున్న చోటనే
నేను వుండాల
తెలుసునా దేవుడా
నీవు నేను వున్నచోటక్కటే
అవును దేవుడా నీవున్నచోట
ఈకాల మాకాల మన్నికాలములోన
నీవుండే ఆ కాలమే దేవుడా నీవు
ఇది నిజము దేవుడా
ఇది నిజము సామీ.
నిజమంటే ఏమిటో

చెప్పమంటావా

నిజమంటే నీవే

దేవుడా నిజమంటే నీవే

పాట ఆపేసాడు–

స్వామీజీ నివ్వెరపోయాడు.

'ఎంత వేదాంతం' నీ కెలా అబ్బింది.'

'ఏమో సామీ– నాలో అలా వస్తది పాడేస్తా–

ఎందుకో స్వామీజీ మౌనంగా వుండిపోయారు. వీరన్న లేచి బయటికి వచ్చాడు.

## 32

వీరన్నతో మాట్లాడిన రోజున కలిగిన మౌనం కొన్నిరోజులు స్వామీజీని ఆవరించింది. వదలలేదు. మనసులో చాల మథన కలిగింది– ఈ బడుగు దేహంలో యింత వేదాంతమా– అతడెవరో సహజ వేదాంతిలా వున్నాడు. తెరలు తెరలుగా తన జీవితం ఆయన ముందుకు వస్తున్నది. వచ్చి వదలటం లేదు– తన మీద తనకే ఏదో తెలియని కోపం వస్తున్నది. ఎందుకో అర్థం కావటం లేదు. తను సన్యాసం ఎందుకు తీసుకున్నట్లు– తన మనసు తనమీద రాళ్ళు రువ్వుతోంది–

తను సహజ సంతోషిననుకునేవాడు. అయినా సన్యాసం తీసుకున్నాడు. ఎందుకూ– మనసు వేస్తున్న రాళ్ళతో మనసే చిట్లి పోతున్నది.

రాళ్ళ వేగానికి సంతోషం చిట్లిపోతున్నది– తను యిప్పుడు ఎవరిని చూడటానికి, మాట్లాడటానికి, యిష్టపడటం లేదు. బహుశా

రక్తంలో రాళ్ళు కరిగి

ప్రవహిస్తున్నట్లున్నాయి నాలో

యిష్టమయిన సంతోషం

కష్టంగా మారుతోంది

కష్టం సహజం కాదుకదా

యీ కష్టంతో నేను కుళ్ళిపోకుండా

సంతోషం తగిలి రాళ్ళు చిట్లిపోకూడదూ–

మళ్ళీ ఆ బిచ్చగాడు వీరన్నతో మాట్లాడాలి– వీరన్నను పిలిపించాడు. రెండు రోజుల తరువాత గాని వీరన్న అమ్మ భోజనానికి రాలేదు. వచ్చినప్పుడు స్వామీజీ దగ్గరకు వచ్చి–

సామీ వచ్చినా– తమరు రమ్మన్నారట'

'అవును వీరన్నా – కూర్చో

'వద్దులే, సామీ తమరి దగ్గర నేను కూచోడమేమిటి?

వీడికి వినయం కూడా వున్నది, అనుకున్నాడు స్వామీజీ

'మంచి తత్త్వం ఒకటి పాడు'

'ఏం పాడేది సామీ– అని నవ్వుతూ–

యీ మధ్యనే నాగొంతులో తిరుగుతున్నది–

అది వినిపిస్తా, అని ఏకతారా తీసుకుని–

నాది నాదంటావు

ఏ నాది నీదిరా

నీదైన నాది

నీలోనే వున్నదిరా

దోబుచులాడుతూ

నీలోనే వున్నదిర

అరిచి .....లేనావు

లేనే లేవురా

నీవున్నవంటే

అది నీకు లేదురా–

స్వామీజీ నవ్వుతూ

వీరన్న యింత తత్త్వం నీకెలా అబ్బింది.

ఏమో సామీ– మరొకటినిపిస్తా– మొన్న నేను పడుకొని ఆకాశం వైపు చూస్తుంటే పలికింది తత్త్వం–

తారలెన్నో రామ
ఆకాశమంతటా అలుముకున్నాయి
రామ అలుముకున్నాయి
ఆకాశమా బరువుకూ
కుంగిపోలేదూ రామ, కుంగిపోలేదూ
ఏమి సిత్రమె రామ
ఏమి సిత్రమె యిది
ఆకాశమంతటా
మేఘాలు నిండినయి
ఆ బరువుతో కుంగి
ఒక్క తీరున రామ
ఆకాశము కారుస్తోంది
నీళ్ళు కారుస్తోంది
యీా తారకేమో,
ఆకాశమేమో రామ
ఎటికయినను రామ
ఎటికాయెనా రామ
ఎటికనాకు ఆకాశమునకు
తన వయసు ఏమో
తానేమో రామ
తారలన్నీ కలిసి
ఆకాశమున మెరసి
చూపు దారిన వచ్చి
కళ్ళలో యిరికినయి

యిరికినయి రామ

యిది ఏమి సిత్రమో

రామ నీ కెటికయేనా

రామ నీ కెటికయేనా–

పిచ్చిపాటలు స్వామీ మీకు నచ్చుతున్నాయి–

'కాదు వీరన్నా, నీవు గొప్ప సహజకవివి– నీలో ఎంతో జ్ఞానమున్నది.

'ఏమో స్వామీ– ఇంతకీ నన్నెందుకు పిలిచారు చెప్పలేదు–

'నీకింత జ్ఞానం ఎలా వచ్చింది

మా తాత నాకుచాల నేర్పించాడు సామి–

'మీ తాత దగ్గర పెరిగావా– ఇప్పుడు మీ తాత వున్నాడా?

'ఏనాడో పోయినాడు– ఆయన వుంటే బాగుండును అనిపిస్తోంది–

'మీ తాత ఏం చేసేవాడు.

ఆయన నా లాగే బిచ్చమెత్తుకునేవాడు. అనేవాడు– బిడ్డా వూరికే బిచ్చం తీసుకోకూడదురా– మనకు తెలిసిన పాటలు వినిపించాల6 వాళ్ళిచ్చిందానికి సంతోషించాల–

'గొప్ప సూత్రం' మీ అమ్మా నాన్న ఏం చేసేవారు?

నాకు తెలియదు స్వామీ– మా తాత చెప్పేవాడు, పొట్ట చేతపట్టుకుని యాడికో పోయారు. నిన్ను నా దగ్గర వదిలేసిపోయారురా– వాళ్ళ మీద కోపం పెంచుకోకు. నేనున్నాగా నీకు– నీకు కావలసింది చెయ్యి, నీకు చదువు కావాలా? పని కావాలా' ఏదయినా నేర్చుకుని నీకు కావలసినంత డబ్బు వస్తుంది. ఎక్కడయినా కూలీకి కుదురుకుంటానంటే కుదురుకో–

ఎంతమందో వచ్చేవాళ్ళు, మా అనాథ ఆశ్రమంలో వుండండి– అని చెప్పేవాళ్ళేగాని తిరిగి వచ్చేవాళ్ళు కాదు. మా తాత అనేవాడు వీళ్ళని నమ్మటానికి యీల్లేదురా, ఆళ్ళ మాటల్లో నిలకడ లేదురా– నీకు కావాలంటే వెళ్ళు– కాని నా కాడవుంటే నాతోవుండు– బువ్వెట్టి బట్టలిస్తా– యిట్టాగే చెట్ల క్రింద, అరుగుల మీద బతకాల– యిట్టమా అని అడిగేవాడు. నా కంతా

తెలియదు. నీవేడవుంటే నేను ఆడేవుంటా– అని ఆయనతో వుండిపోయా! మా తాత చాల మంచోడు. ఎంతమందికో డబ్బులిచ్చి అన్నం పెట్టించేవాడు– దేవుడంటే పిచ్చి– ఎక్కువగా గుళ్ళదగ్గరే అడుక్కునేవాళ్ళం,ఒకరోజు అడిగాను–

తాతా దేవుడు దేవుడంటావు– యేడవున్నాడు దేవుడు– అంటే
ఏడవకురా బిడ్డా
అన్నిటా అన్నిచోటలా
చెట్లలో,పుట్టలో
యీడికొచ్చేవారందరిలో
వున్నాడు బిడ్డ
వున్నాడు ఒక్కడే
అతడే దేవుడురా
అయితే తాత మనమూ దేవుళ్ళమేగా–
అవునురా బిడ్డ
మనము దేవుళ్ళమే
యీడకొచ్చేవారు
ఆడతిరిగేవారు
అందరూ దేవుళ్ళే
అదియేర మహిమ
దేవుడీ మహిమ
మహిమ వేరే లేదు
యిదియేర మహిమ
కాని తెలియక మనము
మనము వీళ్ళు అందరమూ
యిడియిడిగ బతుకుతూ
కష్టపడతాము
అంతేరా బిడ్డ

యిది నాకు తెలిసినది

నేర్చుకో బిడ్డ–

అయితే తాతా– అందరమూ ఆయనే అయితే, యీ గొడవలూ, యిడియిడిగా వుండడం, పోట్లాటలు,యివన్నీ అవసరమా!

అది నాకు తెలియదు బిడ్డ– అంతా ఆ దేవుడి మాయ, ఆయన్ను మనమేం అడుగుతాం– సెప్పినా మనకెట్లా తెలుస్తదిరా–

ఒకరోజు అడుక్కుని వస్తున్నం–

'ఇక నడవలేనురా' అని అక్కడే వున్న రాతిబెంచీ మీద కూలబడ్డాడు. నాదగ్గరున్న సీసాలోనీళ్ళు తాతకిచ్చినా, అప్పుడు నాతో చెప్పినాడు.

'ఎన్నాళ్ళకిందట ఇది' స్వామీజీ అడిగాడు–

'సరిగా గుర్తులేదు కానీ, తాత చెప్పిన మాట గుర్తుంది.

'యీరిగా, నేనెక్కువ కాలం వుండను. నారోజు వచ్చినట్లుంది. నీ వొక్కడివే తత్త్వాలు– దేవుడున్నాడు. నీకే యిబ్బంది వుండదు. రెండు మాటలు గుర్తుంచుకో.

దేవుడున్నాడని, అంతా దేవుడని, అన్ని చోట్లా దేవుడున్నాడని మరసిబోకు. ఇంకోటి ఎవరి మీద కోపం తెచ్చుకోకు, మాట తూలకు–

బిడ్డా, యీ తత్త్వం యినుకో

పెదవి దాటిన మాట

పదునైన కత్తిరా

మండించు గుండెను

ఎదుటి మనసు ముంచు

కలవరములో బిడ్డ

పలుకు పదునైన కత్తిరా

మాట పుట్టుక నీకు

ఎఱిక కావాల

మనసులో పుట్టి

గుండెలో పండును
గుండెలో పండి
గొంతులో పలుకును
పలుకు పెదవిని దాటి
మెఱుపులా దూకురా
పెదవి దాటిన మాట
పదునైన కత్తిరా
ఎదుటి మనసుకు తాకి
ఆ గుండెలో పండి
కలకలము సృష్టించు
పెదవి దాటిన మాట
మెత్తగా తాకితే
ఎదుటి గొంతులో
నవ్వుగా మారును
నవ్వు తేలును కళ్ళలో మిలమిలగా
పెదవి దాటిన మాట
ఎదుటి పెదవుల మీద
నవ్వుగా మారాలి
బిడ్డ యిది నిజము బిడ్డా
పెదవి దాటిన మాట
పదునైన కత్తిరా

అలా అంటూనే నా చేతుల్లోనే వాలిపోయాడు. అంతే అప్పటినుండి మా తాత నా తత్త్వాల్లో మిగిలిపోయాడు–

స్వామీజీ యిది విని మురిసిపోయి తనలో తను అనుకున్నట్లు అన్నాడు.

'గొప్ప తాత, గొప్ప మనవడు' కాసేపయిన తరువాత వీరన్న అడిగాడు.

'సామీ, యింతకీ చెప్పలేదు నన్నెందుకు పిలిపించారు?

నీ తత్త్వాలు వినటానికి– అంతే'

'అయితే వెళ్ళేదా సామీ'

'భోజనం చేసి వెళ్ళు– ఉండు ఇక్కడికే తెప్పిస్తా–

వద్దుస్వామీ, నేనే వెళ్ళి అడుక్కుంటాను అని లేచి వెళ్ళిపోయాడు.

స్వామీజీ తిరిగి మౌనంలోకి వెళ్ళిపోయాడు.

మనసంతా సుళ్ళు తిరుగుతున్నది.

తను సన్యాసి.కాషాయగుడ్డలు కట్టుకున్నాడు. ఆశ్రమం పెట్టాడు. నలుగురూ వస్తున్నారు. శిష్యులంటూ చేరారు. వాళ్ళకు వేదాంతగ్రంథాలు విడమరచి అర్థాలు చెప్పుతున్నాను. వాళ్ళ దృష్టిలో నేనొక పెద్ద తపస్విని.దైవ సన్నిధి తెలిసినవాణ్ణి– కాని నా కన్ని తపనలు, ఆవేశాలు వున్నాయి. ఉన్నది మాట పొందిక. తెలివిగా, అందరికీ తెలిసేటట్లు మహర్షులు వ్రాసిన దాన్ని విడమరచి చెప్పగలను. నా వుపన్యాసాలకు జనం విపరీతంగా వస్తున్నారు, నేనేదో వాళ్ళ సమస్యలు తీర్చగలనన్న భ్రమలో వున్నారు. నిజంగా వాళ్ళకు దేవుడి మీద వున్న నమ్మకమే వాళ్ళను కాపాడుతున్నది– నిజానికి నాకూ వారి స్థితే – కాకపోతే ఎప్పుడూ సాధనకు అవకాశం కల్పించుకున్నాను. ప్రజలు నిజానికి నా సాధనను మోస్తున్నారు. వీరన్న తత్త్వాల్లో చెప్పాలంటే –

ఆనాడు ఈనాడు

వెళ్ళిపోయిననాడు

జరిగిపోయిననాడు

ముందున్ననాడూ–

ఏమిటీ నాడులో

సామీ, ఏమిటీ నాడులూ

ఆచోట యీచోట

అన్నిచోటుల బాబు

యింకెన్ని చోటులో

యింకెన్ని నాడులో

అన్నిటా వున్నట్టే
అన్నిటావున్నదేదయినా వున్నదా
వున్నట్టుగా లేదు
లేనట్టుగా లేదు
మాటకందవు సామి
చేతకందవు సామి
కనుచూపుకందవు
యేడనున్నది సామి
అన్నిటా వున్నది
మనసులో వున్నాయిరా
మంచి నా బిడ్డా
మనసేడవున్నది, మంచి మానాయనా
అన్నిటా వున్నదిరా
యివరముగ చూస్తే
యివరముగ అంటే
ఎట్టసూడాలి
చూస్తు చూస్తువుంటే
అదే నీకు చూపును
యివరమంతా నీకు య్వ్వరముగ బిడ్డా
దేవుడా నిను చూస్తే
నవ్వు పొంగుకు వచ్చె
నీకు తెలిసినదేదో
నాకు సెప్పగలేవు
నాకు తెలిసినదేదో
నాకు సరిపోదు
యిది ఏమి సిత్రముురా

కనపడక, యినపడక

వున్నావా లేవా

దేవుడా వున్నావా లేవా–

అంత కలవరములోనూ,స్వామీజీకి నవ్వు వచ్చింది. కొంచం పరిచయంతో తాను వీరన్న అయినాడు. బహుశా యిదేనేమో గురుశిష్యబంధం అంటే– అంటే వీరన్న యోగిలా నాకు గురువైనాడా– ఆశ్చర్యం వేసింది స్వామీజీకి యీ తలంపుతో–

బహుశా వీరన్న పరిచయం............వెలితి చూపించటానికే వచ్చిందేమో– మలుపు తిప్పటానికే వచ్చిందేమో– అంటే ఆ తలంపు స్వామీజీలో కలవరం తగ్గించింది. ఒక నిర్ణయానికి వచ్చాడు స్వామీజీ. ఈ ఆశ్రమంగురువు– యివన్నీ వదిలి మళ్ళీ ప్రపంచంలోకి వెళ్ళి సాధన సాగించాలి. జీవితంలో జీవితాన్ని జీవించి రహస్యాన్ని సాధించాలి– జీవితంలో యోగంలా జీవించాలి. మనస్సులో నిర్ణయం దృఢమైంది.

రెండురోజుల తర్వాత స్వామీజీ గది తలుపులు తెరచి వుండటం చూసి ముఖ్య శిష్యుడు లోపలికి వచ్చాడు. అక్కడ టేబిల్ మీద అతనికి రెండు కాగితాలు కనిపించాయి. అది తీసు చదివాడు. ఒకదాని మీద వ్రాసి వుంది.

నేను ప్రపంచంలోకి వెళుతున్నాను. జీవిత రహస్యాన్ని జీవితాన్ని వెతుక్కుంటాను. మీ అందరికీ నా కృతజ్ఞతలు. మీకు నేను చేసింది కొంచమే అయినా నా యందు మీరెంతో ఆదరాభిమానాలు,దయ చూపించారు.మీ ఆశ్రమం నడుపుకుంటారో, లేదో నీ యిష్టం. ఇందులో వున్న రెండో వుత్తరాన్ని బిచ్చగాడుగా మన భోజనానికి వచ్చే వీరన్న కివ్వండి. ఆ ప్రధాన శిష్యుడు ఆశ్రమంలో అందరినీ పిలిచి యీ సందేశం చదివి వినిపించాడు, అప్పుడే అమ్మ భోజనానికి వచ్చిన వీరన్నను పిలిచి స్వామీజీ వుత్తరం యిచ్చాడు.

'ఉత్తరం మీరే చదవండి. నాకు చదువురాదు' ఆయన చదివాడు.

'బిక్షగాడుగా పిలవబడే బిక్షువు యోగి వీరన్నకు నా నమస్కారాలు.నీ దగ్గర నేర్చుకున్నానెంతో– దాన్ని అనుసరించడానికే వెళ్ళిపోతున్నాను. శిష్యుడు

ఆ వుత్తరాన్ని వీరన్నకిచ్చాడు. వీరన్న కొయ్యబారిపోయాడు.

33

ఆ కాగితం మీద స్వామీజీ రాసిన దాని అర్థం ఏమిటో వీరన్నకు అర్థం కాలేదు. వీరన్నలో వున్న సహజ ప్రసన్నత సంతోషం, సంతృప్తి స్వామీజీ పదాలకు అర్థం చెప్పుకోలేక పోయినయి. అవగాహన కోసం అక్కడున్న శిష్యుల్ని అడిగాడు. వాళ్ళకీ స్వామీజీ వ్రాసినది అర్థం కాలేదు. వాళ్ళు స్వామీజీ పాండిత్యాన్ని. సన్యాస ఆశ్రమాన్ని, ఆయన ఉపన్యాస చాతుర్యాన్ని అభిమానించి, ఆకర్షింపబడ్డవాళ్ళు.

'స్వామీజీకి యీ బిచ్చగాడిలో వున్నదేది నచ్చింది. అందరు బిచ్చగాళు ళ్ళ యోగుల్లానే కనబడతారు.' అని వీరన్నని అడిగాడు.

'వీరన్నా, నీవు పాడే పాటలకు అంటే నీ తత్త్వాలకు అర్థం తెలుసా ?

'తెలియకేం సామీ– అంతా ఎఱికే– చాల మటుకు నేను చేసిన తత్త్వాలే అవి. –

'నీ వేమయినా సాధన చేస్తావా' అని మరో శిష్యుడడిగాడు.

'సాధన అంటే ఏమిటో నాకు తెలవదు సామి.'

ఏమీ తెలియకుండా అంతటి తత్త్వాలెలా పాడుతున్నావ్ !

'అవి అలాగే వస్తవి నాలోనుండి–'

'స్వామీజీ లాంటి వారు చెప్పిన వాక్యాలు విని నీవు వాటిని పాటలుగా పాడుతావనుకుంటాను' అని మరో శిష్యుడన్నాడు.

'స్వామీజీ గొప్పోడు. ఆయన మాటలు నాకెలా అర్థమవుతాయి సామీ! వీరన్న యిచ్చిన యీ సమాధానం శిష్యులకర్థం కాలేదు. సహజంగా కొందరు సాధకులు వేదాంతులవుతారన్నది వారికి తెలియదు. మరో శిష్యుడన్నాడు.

వీరన్నది పూర్వజన్మ సుకృతం–

ఏదో ఒక ఘోరమైన పాపం చేసి యీ జన్మలో బిచ్చగాడయినాడు. గొప్ప భక్తుడయివుంటాడు. కుచేలుడి విషయం మనకందరికీ తెలుసుకదా!

ఏమయితేనేం వీరన్న మనసుకు వారి మాటలకు సమాధానం

దొరకలేదు.

'అయ్యో, ఆశ్రమం ఒక్కసారిగా దిక్కులేనిదిగా అయిందే' అని బాధ పడుతూ, సందేహంతో సతమతమవుతూ తోటకు తిరిగి వస్తున్నాడు. ప్రక్కనే వున్నదేదీ గమనంలో లేదు. అలా నడుస్తున్నప్పుడు ఒక సైకిలు వచ్చి తగిలితే కిందపడ్డాడు. సైకిలు తొక్కుతున్న మనిషి దిగి వీరన్నను పైకి లేపాడు–

'ఫరవాలేదయ్యా, నీవు వెళ్ళు, నాదారిన నేపోతా– నీకు దెబ్బలేం తగల్లేదు కదా'–

నవీన్ హెూటల్ దగ్గర తను రోజూ అమ్ముతున్న కూరలతో బండి వున్నది. ప్రక్కనే నవీన్ వుండి అడిగాడు.

'వీరన్న ఏమిటి యివ్వాళ యింత ఆలస్యం చేశావ్'

'ఏదో బాబు ఆలస్యమైంది– ఇక నేనుకూరలమ్ముతా నువ్వెళ్ళు.' అని తన గోనె పక్కన పెట్టి బండి వెనకాల కూర్చున్నాడు. కూర్చున్నాడే కాని మనసు కూరలమీద కాని, బండి మీద కాని లేదు. స్వామీజీ నుండి యింకా అతడి మనస్సు మళ్ళలేదు. ఒక అకతాయి పిల్లవాడు వచ్చి రెండు వంకాయలు పట్టుకు పరుగెత్తుకుపోయిన సంగతి అతడి గమనంలో లేదు. యంత్రంలా కూరలమ్మి ఆ రోజుకు పని గడిపేశాడు. కూరలమ్మిన డబ్బు నవీన్ చేతిలో పెడితే, నవీన్ అన్నాడు.

'ఇదేమిటి వీరన్నా, మన కూరలకు రావలసిన దాంట్లో పది రూపాయలు తక్కువయినయి. కూరలకు డబ్బు సరిగా వసూలు చేశావా–

'చేశాను కానీ, యివాళ కొంచం మనసు తప్పినట్టయయింది బాబూ నాకు రోజూ యిచ్చేదాంట్లో దాన్ని తీసేసుకో'–

దానికి నవీన్ బాధపడుతూ–

వీరన్నా, నీ ద్వారా డబ్బు సంపాదించాలని నేనీ కూరల బేరం మొదలెట్టలేదు. నీ బండిలాగే మరో పదిబళ్ళు నీ లాంటి నీ స్నేహితులకెందు కిచ్చాననుకున్నావ్ ! మీ అందరికి ఏదో పని కల్పించి మీ బతుకులు మీరు బతకటానికని– పది రూపాయలు తక్కువైందన్న బాధ నాకులేదు. రా, భోజనం

యిస్తాను తిని తోటకు వెళ్ళు–

మాటాడకుండా భోజనం చేసి వీరన్న తోటకి వెళ్ళాడు. అతని మనసులో ఆనాటి వుదయం జరిగినదే తిరుగుతోంది. తన గూటిలోకి వెళ్ళి పడుకుని ఆలోచనలో పడ్డాడు– కునుకు పట్టింది. లేచేటప్పటికి సాయంకాలం అయింది. తారలు అప్పుడప్పుడే బయటికి వస్తున్నాయి. మనసులో మాటలు మెదుల్తున్నాయి.

'యీ తారలు మినుకు మినుకు మంటున్నాయి. ఎన్నాళ్ళనుంచి వున్నాయో అవి ఆకాశంలో– ఎప్పుడు పుట్టినయ్యో, ఎప్పుడు గిట్టుతయ్యో, వాటికి పోషణ ఎలాగో, అవి ఎలా నిలుస్తున్నయ్యో– ఎవరికైనా తెలుసా– తెలిసే వుంటుంది. సదువుకున్నోళ్ళకి తెలియకుండా వుంటుందా– వాటికి మనలా ఆకలిదప్పులు వుంటయ్యా'

నవ్వుకున్నాడు.

'వాటికి అకలి దప్పులేమిటి– అవి దేవతలుండే చోట్లు అని మొన్న ఎవరో చెప్పారుగా !

## 34

అలా తెల్లవారుఝామున ఆశ్రమం వదిలి వెళ్ళిన స్వామీజీ ఆశ్రమం పక్కనే వున్న పొలాలు, బీడుల మీదుగా నడుచుకుంటూ ఒక పురాతనకాల మంటపం చేరుకున్నాడు. అప్పటికి సూర్యుడు బాగా చుర్రుమనిపిస్తున్నాడు. మెల్లగా మూడు కిలోమీటర్లు నడిచేటప్పటికి స్వామీజీకి చాల సమయం పట్టింది. ఒంటికి చెమటలు పట్టాయి. రోజూ చేసే నిత్యకృత్యాలు లేవు. గొంతులో నీటి చుక్క కూడ పడలేదు. ముసలితనం మీద పడుతున్న స్వామీజీకి అలుపు వచ్చింది. కాలు ముందుకు సాగలేదు. అక్కడే ఆ నాలుగు కాళ్ళ శిథిల మంటపంలో నడుం వాల్చాడు. అక్కడే గొర్రెలు కాచుకుంటున్న ఒక గొర్రెల కాపరి స్వామీజీని చూసి పరిస్థితి అంచనా వేసుకుని, ఒక చెంబులో నీళ్ళు తీసుకు వెళ్ళాడు. స్వామీజీ కళ్ళు మూసుకుని వున్నాడు.

'సామీ, యివిగో మంచినీళ్ళు, తాగండి దప్పిక తీరుతుంది–

స్వామీజీ కళ్ళు తెరిచాడు– మెల్లగా లేవటానికి ప్రయత్నించాడు. పిల్లవాడు ఆయనకు సాయం చేసాడు.

సామీ ముట్టుకున్నాను. ఏమనుకోవద్దు.'

స్వామీజీ చిరునవ్వు నవ్వాడు.

'సామీ యీ నీళ్ళు మీరు తాగొచ్చునో లేదో !

స్వామీజీ జవాబు చెప్పకుండా చెంబు తీసుకుని నీళ్ళు తాగాడు. కాస్త బలం వచ్చినట్లుంది. ఇంతలో మరొక యిద్దరు అక్కడికి వచ్చారు. అందులో ఒకడు ఆశ్చర్యంగా అన్నాడు.

'స్వామీ మీరు యీపక్క ఆశ్రమంలో వుంటారుకదూ– మీ వుపన్యాసం ఒకటి రెండు సార్లు నేను విన్నాను. ఇదేమిటి ఇలా వచ్చారు ?

స్వామీజీ ఏమీ మాట్లాడలేదు.

'ఎందుకు వచ్చారో ఏమో– ఎక్కడికి వెళుతున్నారో– కాని యీ స్థితిలో మీరు ముందుకు వెళ్ళలేరు. రండి, నా బండిలో మిమ్మల్ని మీ ఆశ్రమంలో విడిచిపెడతాను. అన్నారు.దానికి స్వామీజీ అవునని, కాదనీ బదులివ్వలేదు. ఆ మనిషి వెళ్ళి తన రెండెడ్లబండి తీసుకువచ్చి తక్కినవాళ్ళ సాయంతో స్వామీజీని బండిలో ఎక్కించాడు. సరాసరి ఆశ్రమానికి బండి తోలుకెళ్ళాడు.

ఆశ్రమం చేరగానే, బండిలో స్వామీజీని చూసి శిష్యులు చాల సంతోషించి స్వామీజీని లోపలికి తీసుకువెళ్లారు. అలా తీసుకువచ్చిన ఆయనకు ఎన్నో నమస్కారాలు చెప్పారు.

'మీరు మా గురువుగారిని మాకు తిరిగి తీసుకువచ్చి ఎంతో మేలు చేసారు. ఇప్పటి వరకు ఏం చేయాలో తోచక చాల మథన పడుతున్నాము. గురువుగారిని ఎక్కడ వెతకాలో తెలియక విచారిస్తున్నాం.

ఆ బండి అతడు తనకు స్వామీజీ కనపడిన స్థితిని వర్ణిస్తూ అంతా చెప్పాడు. భోజనం చేయమన్నా చేయకుండా వెళ్ళిపోయాడు. ఇంతసేపూ స్వామీజీ నోరు విప్పలేదు. శిష్యులు సంతోషంగా స్వామీజీని ఆయన కుటీరానికి తీసుకువెళ్ళి అన్ని వుపచారాలు చేసారు. భోజనం కూడ అయినతరువాత

స్వామీజీ ఆదేశించారు.

'వీరన్న బిచ్చగాడిని పిలిపించండి.'

'అతనెక్కడ వుంటాడో తెలియదు స్వామీ, ప్రయత్నం చేస్తాం'.

అనుకోకుండా వీరన్న అక్కడికి వచ్చాడు. స్వామీజీ సమాచారం ఏమయినా తెలిసిందేమోనన్న ఆశతో అక్కడికి వచ్చాడు. జరిగిందంతా అతన్ని మనసులో పెద్ద అలజడి లేపింది. దాన్ని ఎలా తట్టుకోవాలో అర్థంకాని స్థితిలో అతడు ఆశ్రమ పరిసరాల్లో ఆ సాయంత్రం తిరుగుతూ వున్నాడు. ఆ తరువాత తన బిచ్చమెత్తే స్థానం దేవాలయానికి వెళ్దామన్న వుద్దేశ్యం.

స్వామీజీ శిష్యులు అతన్ని చూడగానే సంతోషించి దగ్గరకు వచ్చి చెప్పారు.

'నీ పేరు వీరన్నేగా – స్వామీజీ వచ్చారు, నిన్ను పిలుస్తున్నారు– నీ వెవరో గాని చాల అదృష్టవంతుడివి.

వీరన్నకు చాల సంతోషం వేసింది. స్వామీజీ ఆశ్రమం వదిలి వెళ్ళటానికి తను కారణమన్న బాధ అతన్ని వేధిస్తున్నది.

శిష్యులు అతణ్ణి స్వామీజీ కుటీరానికి తీసుకువెళ్ళి ద్వారం దగ్గర నిలబెట్టారు. స్వామీజీ మాట్లాడకుండా కళ్ళతోనే అతన్ని లోపలికి తీసుకురమ్మని చెప్పారు.

స్వామీ, నా కాళ్ళుబాగా లేవు.' కడుక్కుని వస్తా– స్వామీజీ సన్నగా నవ్వి రా' అని సైగ చేసారు. అయినా శిష్యులిచ్చిన నీటితో కాళ్ళు కడుక్కొని వీరన్న స్వామీజీ దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. స్వామీజీ సైగ చేస్తూ తన పక్కన మంచం మీద కూర్చోమని సైగచేసారు. భయం, భయంగా వీరన్న మంచం పట్టెమీద కూర్చున్నాడు.

సరిగా కూర్చో అని సైగ చేసారు స్వామీజీ– తరువాత శిష్యులను వెళ్ళమని సైగ చేసారు. శిష్యులకిదంతా చాల ఆశ్చర్యంగావుంది– ఏముంది యీ బిచ్చ గాడిలో, స్వామీజీ అంతగా అభిమానించటానికి. అతడికి సరిగా మాట్లాడటం కూడ చేతకాదు. ఏవో కొన్ని తత్వాలు పాడతాడు. ఇతనితో స్వామీజీ అంతటి ఉద్దండ పండితుడు, మహాసాధకుడు యింతగా మన్నించటానికి. వాళ్ళు వెళ్లి

పోయిన తరువాత స్వామీజీ వీరన్న నడిగారు.

'వీరన్నా ఏదయినా తత్త్వం పాడు.'

పాడతాను కాని సామీ, ఎందుకిలా చేసారు. భయంగా అడిగాడు.

'నీలాంటి జీవితం, నా కుటుంబంతో జీవితం తిరిగి జీవితం ప్రారంభించి నీ పాటలో చెప్పినట్లు జీవితంలో జీవిస్తూ నన్నునేను తెలుసుకుందామన్న ఆశతో కొత్త జీవితం మొదలుపెడదామని వెళ్ళాను.

'సామీ, నాకంత తెలియదు కానీ, ఎవరి జీవితం వారిది. ఒకరిలా ఒకరిది వుండదు. నా జీవితం నాకు, నాచిన్నతనం నుంచి అలవాటు. నాకు వేరేమీ తెలవదు– ఏమయినా నేను చాల భయపడ్డాను సామీ, పాటలు పాడి తప్పు చేసానా అనిపించి గుండెల్లో గుబులు బయలుదేరింది. నాకెప్పుడూ గుబులంటే తెలవదు. తమరు తిరిగి వచ్చారు. ఆశ్రమం తిరిగి సంతోషంగా వుంది– అని కొంచం సేపాగి ఏం పాడమంటారు సామీ'

'నీకు వచ్చింది పాడు'

వీరన్న ఏకతారా బయటకు తీసి పాడటం మొదలెట్టాడు. అప్పుడు స్వామీజీ అన్నారు.

వీరన్నా, జీవించటమంటే దేవుణ్ణి వెతకటమే కదూ– అలాంటి పాట పాడు–

దేవుడున్నాడో
యాడవున్నాడంటూ
వెతికి లాభం లేదు రామ, లాభమూ లేదు
దేవుడెవరోకాదు
మనమేర రామ
రామ ఆడలేడని కాదు
ఈడ లేడని కాదు
రామ
అన్నిటా వున్నాడు రామ

అన్నిచోటల రామ
నిండుగా వున్నాడు రామ
అపుడు లేదని కాదు
ఇపుడు లేదనికాదు
ఎప్పుడూ వున్నాడు రామ ఎప్పుడూ వున్నాడు
అన్నికాలాలలో
అన్ని సమయాలలో
ఎప్పుడూ వున్నాడు రామ
దేవుడెప్పుడూ వున్నాడు రామ
అసలు ఓ రామ
దేముడంటే ఎవరు
రామ దేవుడంటే ఎవరు
నీవు నేనేనురా రామ
నీవు నేనేనురా రామ
రాక్షసులు, దేవతలు
అందరూ అతడిలో
ప్రేమతో వున్నారు
రామ ప్రేమతో వున్నారు
అందరూ అతడిలో
వున్నారు ప్రేమతో
ఒకరినొకరు చూచి
నవ్వుకుంటున్నారు
నీవు నేనూ అంటూ
వేటాడుకుంటున్నారు వొకరినొకరు
కలిసిపోతున్నారు
రామ తిరిగి కలిసిపోతున్నారు

ఒకరిలోనొకరున్నారు
విడివిడిగ విడివడినప్పుడే
తన్నుకుంటున్నారు రామ
తన్నుకుంటారు
దేవుడున్నాడు
అందరిలో వున్నాడు
అటాడుకుంటూ
అందరిలో వున్నాడు
ఇది నిజము రామ
మంచి చాటున
ముసుగులో మెలిగేది
చెడుకాక ఏదిరా రామ
చెడుచెంగు చాటున
నవ్వుతూ ముసిరేది
మంచిరా రామ
విడివిడిగ విడిపోయి
చెదురుమదురుగ
చేరిచూపు కందని
రామ
చెడు మంచీలు
రామ
చెడు మంచీలురా

స్వామీజీ యీ తత్త్వాన్ని ఆనందిస్తున్నారన్నది ఆయన కళ్ళవెంట కారే నీరు చెప్పింది–

వీరన్నా, వెళ్ళి భోజనం చేసిరా– వద్దు యిక్కడికే తెప్పిస్తా, మా శిష్యుణ్ణి పిలు–

శిష్యుడు రాగానే  స్వామీజీ అన్నారు.

'వీరన్న యీ రోజు నాతోనే భోంచేస్తాడు.

'ఇద్దరికీ ఏర్పాటు చేయండి.'

శిష్యులు వెళ్ళి యిద్దరికీ భోజనం తెచ్చారు.

స్వామీజీ లేచి ప్రక్కన కుర్చీలో కూర్చున్నారు. ఎదుట టేబిల్ మీద స్వామీజీ భోజనం ఏర్పాటయింది. ఆ రోజు స్వామీజీ క్రింద కూర్చోలేక పోయారు.

అలాగే వీరన్న కూడ టేబిల్ ఏర్పాటు చేయబోతుంటే వీరన్న అన్నాడు.

'సామీ, నేనట్లా భోజనం చేయలేను. క్రిందనేకూకుంటా' అతడికి క్రిందనే భోజనం వడ్డించారు.

భోజనం అయిన తరువాత వీరన్న తిరిగి వెళ్ళబోతూంటే, వీరన్నా, నీవు యీరోజు యిక్కడే పడుకో! నాతో పాటు పాటలు పాడుతూ పడుకో !

వీరన్న కాదనలేక పోయాడు. అక్కడే తన గుడ్డ పరిచి దానిమీద కూర్చున్నాడు. స్వామీజీ మంచం మీద నడుం వాల్చాడు. ఒక గంట తరువాత – అప్పటికి బాగా చీకటి పడింది. ఆశ్రమం సద్దుమణిగింది– స్వామీజీ అడిగాడు.

'వీరన్న మరో తత్త్వం పాడు'  ఆ గొంతులో ఏదో అపూర్వమైన తృప్తి కనిపించింది–

మళ్ళీ వింటానో లేదో– మంచి తత్త్వం పాడు. ఇందాకటి లాంటిదే పాడు–

వీరన్నకేదో అపశ్రుతి వినిపించింది స్వామీజీ గొంతులో– యీస్వామి యిలా అంటున్నారేమిటి? ఏమో తనకేం తెలుసు– ఏకతారా తీసుకుని గొంతెత్తి పాడసాగాడు– బహుశా ఆ ఆశ్రమ నిశ్శబ్దంలో ఆ తత్త్వం అంతటా పరుచుకుపోయి వుంటుంది. చాలమంది శిష్యులు కూడి మేలుకొని వింటున్నారేమో– పాట సాగించాడు.

మరణమొక మలపురా

మలుపులెన్నో తిరిగి

వెలుగు మలుపున
నిలుచురా జీవుడు
జిలుగు వెలుగులు
నీలోనే అంతఃపాతమై
నిలుచురా దేవుడై
రామ నిలుచురా దేవుడై
అందుకేరా రామ
అన్ని దేవుడురా
చెట్టు, చేమా,పిట్ట పుట్టా
అన్ని దేవుడేరా రామ
అన్ని దేవుడేరా
నిజము సత్యములన్ని
నమ్మి నమ్మకముగా రామ
రామ కరిగిపోరా
వెలుగులో కరిగిపోరా
అదియే దేవుడురా
రామ
అదియే దేవుడురా–

స్వామీజీ నిద్ర పోయినట్లు గమనించి వీరన్న తత్వాన్ని ఆపేసి తను కూడ నడుం వాల్చాడు.

తెల్లవారు ఝామున స్వామీజీని లేపటానికి శిష్యులు వచ్చారు. వెంటనే వీరన్న లేచి తన గుడ్డను తీసుకుని బయటకు వచ్చాడు. శిష్యులు స్వామీజీని కొంతసేపు లేపినా ఆయన లేవలేదు. సామాన్యంగా మొదటి పిలుపుకి లేచే స్వామి యీ రోజు ఎందుకింత నిద్ర పోతున్నారు ! ధైర్యం చేసి ఆయనకు పరిచర్యలు చేసే శిష్యుడు లైటు వేసి చూసాడు. అనుమానం వచ్చి తట్టి లేపాడు. లేవలేదు. శ్వాస కూడ ఆడుతున్నట్టు లేదు. భయం వేసి మరో యిద్దరు శిష్యుల్ని పిలిచాడు. అంతా కలిసి నిర్ధారించారు.

స్వామీజీ సమాధి చెందారు.

తృటిలో ఆ సమాచారం అందరికీ అంది, అందరూ గుమికూడారు. వీరన్న ఆ సమూహానికి బయటగా నిల్చున్నాడు. అతనిని ఎవరూ పట్టించుకోలేదు భారంగా అడుగు వేసుకుంటూ వీరన్న ఆశ్రమం బయటకు వచ్చాడు. అతని మనసు ఎప్పుడూ యింతగా ఆందోళన చెందలేదు. నిజానికి అతడి మనసు స్తంభించిందనే చెప్పాలి. అలా తోటవైపు నడుచుకుంటూ వెళుతున్నాడు. రోడ్డు మీద ఎవరున్నారో, ఏ వాహనాలు వస్తున్నయ్యో గమనించే స్థితిలో అతడు లేడు. అలా నడుస్తుంటే వేగంగా ఒక మోటారుసైకిలు వచ్చి అతణ్ణి వెనకనించి గుద్దేసింది. అంతే ! అతడు ఎగిరి కొన్ని అడుగుల అవతల పడ్డాడు. బడుగు దేహమేమో, వెంటనే ప్రాణాలు పోయినయి. ఆశ్రమంలో భోజనానికి వెళ్తున్న బిచ్చగాళ్ళు అది చూసి వీరన్న దగ్గరకు వెళ్ళి–

‘ఒరే వీడు మన వీరన్నరా పోయాడు !

తరువాత అతని మృతదేహాన్ని వాళ్ళే నలుగుర్ని డబ్బులు అడుక్కుని ఖననం చేసారు. అందులో ఒకడు వీరన్నతో జోలెలోవున్న కాగితాన్ని తన దగ్గర వుంచుకున్నాడు. వెళ్లి వీరన్న వుండే తోట యజమానికి యివ్వాలని అతని వుద్దేశ్యం. అలాగే ఆ సాయంత్రం దానిని తీసుకువెళ్ళి తోటలో కూర్చున్న రాజారాంకి యిస్తూ చెప్పాడు.

‘యీరిగాడు పోయాడు బాబు. ఒక మోటారుసైకిలు వెనకనించి వచ్చి కొట్టేసింది. వాడి ప్రాణాలు అక్కడికక్కడే పోయాయి. డబ్బులేసుకుని వాణ్ణి పాతిపెట్టేసాం. ఈ కాగితం వాడి జోలెలో దొరికింది. అది మీకు యిస్తున్నాను.

అది స్వామీజీ వీరన్నకు యిచ్చిన లేఖ. రాజారాం దాన్ని చదివాడు.

బిచ్చగాడుగా పిలవబడే భిక్షువు యోగి వీరన్నకు నా నమస్కారాలు. నీ దగ్గర నేనెంతో నేర్చుకున్నాను. దాన్ని అనుసరించటానికే వెళ్ళిపోతున్నాను.

ఇది రాజారాం యిదివరకు చదివిన పత్రమే– అతని చేతిలో ఆ పత్రం రెపరెపలాడింది.

## 35

ఆ తరువాత నవీన్ రాజారాం వస్తే అతనికి చెప్పాడు రాజారాం –

'వీరన్న యాక్సిడెంట్‌లో పోయినాడని యిప్పుడే తెలిసింది–'

'అవునా – ఎందుకు రాలేదా – కూతల బండి దగ్గరకు ఎందుకు రాలేదా అని ఆలోచిస్తున్నాను. అతనితో ఆరంభించి మరల వ్యాపారం బిచ్చగాళ్ళ చేయించి, వాళ్ళను బిచ్చమెత్తుకోవలసిన అవసరం లేకుండా చేద్దామనుకున్నాను. ఆదిలో హంస పాదయింది– మంచివాడు వీరన్న, నిజాయితీ పరుడు. ఎంతో పైకివెళ్ళవలసినవాడు. ఇంతలో యిలా పైకి వెళ్ళాడు. భారంగా అన్నాడు నవీన్.

ఇద్దరూ కొంచం సేపు మౌనంగా వుండిపోయారు.

'వీరన్న జీవితం చాల సామాన్యంగా, సాఫీగా అట్టడుగు రీతిలో జరిగిపోయింది. అయినా అతడికి ఏ విధమయిన అసంతృప్తి వున్నట్టు లేదు– తనకు వచ్చిన, తెలిసిన తత్త్వాలు పాడుకుంటూ కాలం గడిపేసాడు. అతను నా దగ్గర వుంచిన డబ్బు వెయ్యిరూపాయలకు చేరింది – దానిని ఏమయినా చెయ్యాలి. తనకు ఎవరైనా మంచి స్నేహితులు వుంటే వాళ్ళకివ్వరాదూ–' అన్నాడు రాజారాం.

అలాగే– నా దగ్గరకు యీ కూరల వ్యాపారం కోసమని కొందరు వస్తున్నారు. వాళ్ళకి తోపుడుబండ్లు చేయించి యిచ్చి కూరలమ్మిద్దామను కుంటున్నాను. వాళ్ళలో ఎవరికైనా అవసరమైనప్పుడు యివ్వటానికి దీనిని మూలధనంగా, తరువాత వచ్చే విరాళాలతో పెంచి ఆ బళ్ళవాళ్ళకు సంక్షేమనిధిగా చేస్తాను.'

కొంచంసేపాగి రాజారాం అన్నాడు.

'మనిషిలో, అంటే కొందరిలో, యీ సేవ చేయాలనే భావన ఎందుకు వస్తుందో– నీవు దానికోసం నక్సల్ వుద్యమంలో కూడ చేరావు–

వాళ్ళది తీవ్ర విధం– సేవ చేయటానికి, మంచి జరిగించటానికి మనుషుల ప్రాణాలు తీయనక్కరలేదు.

వ్యవస్థలు మారాలంటే చాల కష్టం'

అప్పుడే అక్కడికి పావని కూడ వచ్చింది–

హాస్పిటల్‌కి అప్పుడప్పుడూ వెళుతూవుంటుంది – యిప్పుడు పావని హాస్పిటల్‌ని డాక్టర్ల కోఆపరేటివ్ నడుపుతోంది– వాళ్ళ పద్ధతిని ఆమె ఆమోదించలేకపోయింది– ఎంతసేపూ జమా,ఖర్చులు, లాభాలు యిలా ఆలోచిస్తుంటే సేవాభావం కొరవడిపోతుంది – ఏమయినా తను, రాజారాం యీ వయస్సులో యింత పెద్ద ఆస్పత్రిని నడపగల శక్తి, తమ ఆశయాలకు, భావాలకు అనుగుణంగా నడపగల శక్తిని కోల్పోయినట్లే. ఇక యీ ఆస్పత్రి మూలపడకుండా నిలబడి యితోధికంగా వృద్ధిలోకి రావటానికి డాక్టర్ల కోఆపరేటివ్ ఒక మార్గం. అందుకే ఆ కోఆపరేటివ్‌కే ఆస్పత్రిని అప్పగించటం జరిగింది. ఆఖరిసారిగా ఆ రోజు వచ్చింది – పాపం వరలక్ష్మి గారు కాన్సరుతో బాధపడుతోంది– ఈ ఆస్పత్రిని వాళ్ళాయన ఒక ఎడ్మినేస్ట్రేటర్ చూస్తున్నా, ఆమెకు మాత్రం తగినంత సహాయం అందడం లేదు. ఆమె చాల బాధపడ్డది.

'పావనిగారూ, మీకాలం నాటికి, యిప్పటికీ యీ ఆస్పత్రిలో ఎంత బేధమున్నదో – ఇక్కడ ఎవ్వరూ రోగుల్ని పట్టించుకోటంలేదు. డాక్టర్లు డ్యూటీగా చేసుకుపోతున్నారు – మా అబ్బాయి భాస్కర్ యీ హాస్పిటల్ కొనాలనుకుంటున్నాడట– వాడి దగ్గర కోట్ల డబ్బుంది. డాక్టరుగా అమెరికాలో చాల డబ్బు సంపాదించాడు. ఆస్పత్రిని కొనేయాలన్న ధ్యాసలో నన్ను అసలు పట్టించుకోవట్లేదు. పోనీ కోడలు కాస్త ఓదార్పుగా వుంటుందేమో అనుకుంటే ఆ అమ్మాయి అమెరికాలోనే వుండిపోయి వాడికి విడాకులిచ్చేసింది. ఇదేమి ప్రపంచమో– మన రోజులకీ యిప్పటికీ ఎంతో బేధముంది. ఒకళ్ళకుఒకళు ్ళ కారు. అంతా ఎవరికి వారై డబ్బు మీద పడ్డారు. ఏం సుఖమో అమ్మా, మిమ్మల్ని చాలసేపు నిలబెట్టేసాను. ! అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంటే, యిది తన ఆఖరిరోజని, యిక ఆస్పత్రికి రానని ఆమెకు చెప్పాలనిపించలేదు.

'అన్ని రోజులు ఒకలా వుండవు. మీరు చాల గొప్పరోజులు చూశారు. అవిమళ్ళీ తిరిగి వస్తయి'–

'చివరి రోజులని నాకు తెలుసు డాక్టరూ– నాకు అంత ఆశ లేదు–' అని మెల్లగా నవ్వింది వరలక్ష్మి.

పావని బయటికి వస్తూంటే సాగనంపటానికి ఎవరూ రాలేదు– మెట్లు దిగుతుంటే నిహాల్‌సింగ్ వచ్చి ఎదురుగా నిల్చున్నాడు. నీహాల్‌సింగ్ అక్కడ వాచ్‌మెన్. వచ్చి ఆమెకు నమస్కారం చేసి, అమ్మా నిలుచోండి, ఒక్క ఫోటో తీసుకుంటాను. మా అమ్మ మీ ఫోటో పంపమని అడిగింది. మీరంటే ఆమెకు చాల యిష్టం. ఒక విధంగా దైవభావం'– అని తన మొబైల్‌లో ఫోటో తీసి, తను ఆమెతో ఓ సెల్ఫీ తీసుకున్నాడు. పావని కళ్ళలో నీళ్ళు తిరిగింది– కారులో కూర్చున్న పావని మెదడులో గత చరిత్రంతా రీలు తిరిగింది–

తోటలోకి వచ్చి తను కూడ రాజారాం,నవీనలతో పాటు కూర్చున్నది. రాజారాం చెప్పాడు.

తెలుసా పావనీ, వీరన్న యాక్సిడెంట్‌లో పోయాడట– యీ కాగితం తీసుకువచ్చి అతని స్నేహితులు నీకిచ్చారు. స్వామీజీకి ఎంత దగ్గరయ్యాడు. స్వామీజీ వ్రాసినట్లు వీరన్న భ్రష్టయోగి అనుకుంటాను'–

'అతనితో మొదలుపెట్టి ఒక పెద్ద కూరగాయల విక్రయసంస్థ బిచ్చగాళ్ళ అందరికోసం ఏర్పాటు చేద్దామనుకున్నాను' అన్నాడు నవీన్'

'అదృష్టవంతుడు, ఏ అనుభవాలూ, ఏ ఆశలూ, ఏ జ్ఞాపకాలు లేకుండా వెళ్ళిపోయాడు'– అన్నది పావని బరువుగా.

అందరూ ఆశ్చర్యపోయినారు. అలా కూర్చుండిపోయారు.

ఏ జీవితానికయినా ఆది, అంతం వుంటాయి. ఏ జీవి అయినా సరే, ఆది – అంతం లేనిది ఆ భగవంతుడనబడే వాడి వొక్కడిదే– ఆయనే యీ సృష్టి కంతటికి కారకుడయితే తన లక్షణం, తన సృష్టికి కూడ ఎందుకు రానివ్వలేదు. నిజానికి సృష్టికి ఆది అంతం లేదు.సృష్టింపబడినవాటి సముదాయానికే ఆది అంతం. బహుశా వీరన్న తన తత్త్వాల్లో పాడినట్లు–

మరణమొక మలుపురా

మలుపులెన్నో తిరిగి

వెలుగు మలుపున
నిలుచురా జీవుడు
నిలుచురా దేవుడై –

ఏమయినా యీ విషయంలో తేలికగా మనసుకందనిది– ఇదే భావం అక్కడున్న అందరిలో వివిధ రకాలుగా మనసులో మెదిలింది–

అప్పుడే టెలిఫోన్ మ్రోగితే పావని లోపలికి వెళ్ళింది–

రాజారాం నిశ్శబ్దాన్ని బద్దలు కొడుతూ నవీన్‌ని అడిగాడు.

'నవీన్ నీ పెళ్ళెపుడు' ?

'మా అమ్మ కుమారిని కోడలుగా ఒప్పుకున్నపుడు'

'అంటే అంతులేని కథగా మారినా మారచ్చునంటావు !

'కాదు, త్వరలోనే మా అమ్మను ఒప్పిస్తాను'

'పోనీ, మీ అమ్మకు, నాన్నకు సమ్మతమయిన పిల్లనే చేసుకోవచ్చుగా'

నిజమే కాని, నేను కోరిన దానికి వాళ్ళు సర్దుకుని ఒప్పుకోవచ్చుగా– నవీన్ మాటలకు రాజారాం నవ్వాడు.

'నిజమే– కాని నవీన్, యింకా చిన్నవాడివి–

మనం చేసే పనులకు పర్యవసానాలు మనం అనుకునే దానినిబట్టే వుండవు. కాని అనుకున్నది, నచ్చినది చేయాలన్న భావన మనల్ని వదిలిపోదు. ఈ సంక్లిష్టత జీవితంలో, ప్రతివారి జీవితంలో ప్రతి అడుగునా కనిపిస్తుంది. సహనంతో, సంతోషభావనతో ఆ సంక్లిష్టతతో కలిసి నడవటమే జీవనయానం కావాలి.

ఈ మాటలు నవీన్‌కి కొంత అర్థమయ్యాయి. చిన్నతనం కాబట్టి అతనిలో ఒక భావన మెరిసింది–

'ఈ సంక్లిష్టత రాకుండా పెద్దలు మారవచ్చుగా'

ఏమో సర్, నాకింకా అంత సహనం రాలేదనుకుంటాను. అంతా నా యిష్టంగా,వీలయినంత వరకూ చేయాలని అలా జరగాలన్న భావన చాల బలంగా వున్నది.

'నీ ఆలోచనలకింకా పదును రాలేదు నవీన్– నీకు సంతోషంగా వున్నట్టే నడుచుకో, కాని సంతోషాన్ని వదులుకోవద్దు'–

రాజారాం లేచి లోపలికి వెళ్ళాడు. నవీన్ కూడ తన హోటల్ వైపు వెళ్ళాడు.

## 36

పావని లోపలికి వెళ్ళినపుడు వచ్చిన కాల్ అమెరికా నుంచి – మరదలు ప్రభావతి వాళ్ళ పిల్లలు ప్రవీణ్, ప్రతిమ, మరో వారం రోజుల్లో ఇండియా వస్తున్నారట. కొన్నాళ్ళు యిక్కడ గడపటం ఒకటి, రెండవది పిల్లలు ఇండియాలో తిరిగి, వాళ్ళకు ఇండియాను పరిచయం చేయటం మరొకటి. అందుకని ముగ్గురు ముందుగా వస్తున్నారు. శివరాం,పావని తమ్ముడు, వారం రోజుల తర్వాత వస్తారన్న కబురు తెలపటానికి ప్రభావతి ఫోన్ చేసింది.

ఆ ఫోన్ పావనికి ఏదో చల్లని రిలీఫ్ యిచ్చింది– అలా తోచింది. ఆ రోజు పావని హాస్పిటల్ నుంచి ఆఖరుసారిగా యింటికి వస్తునప్పుడు ఆమెలో ఎన్నోసార్లు ఆ ఆస్పత్రి ప్రారంభించి ఎంతో ఆసక్తితో నడిపిన రోజులు ముసురుకుంటూ మనసులో తిరిగినయి. ఆ ఆస్పత్రిలో ప్రతి యిటుకా తనని పలకరిస్తున్నట్లనిపించింది. ఏమిటిది అనుకుంది.

'రాజా, యిది పావని ఆస్పత్రిలో నా ఆఖరి రోజు, యి పేషెంట్లు, మందులు,వురుకులూ,పరుగులూ, నిర్వహణ అన్నీ ఆఖరు. యిక దాదాపు అంతా విరామమే– యీ విరామాన్ని నేను తట్టుకోగలనా – అనిపిస్తోంది.

'మన యింటి దగ్గరే కన్సల్టెన్సీ చెయ్యి'

'అదంతా మరో విషయం, ఎలాగూ కొందరు పాతవాళ్ళు, నమ్మకంతో నా దగ్గరకు వస్తూనేవుంటారు. కాని 'నాది' అనుకున్న ఆస్పత్రిలో తిరిగే అనుభవం రాదుగా– నీవుకూడ చాలకాలంగా ఆస్పత్రిని నడపటంలో చాల సహాయం చేశావుగా మరి నీ కేమనిపించలేదు, అక్కడినుండి వచ్చేసినప్పుడు'–

రాజారాం నవ్వుతూ అన్నాడు.

'నా జీవితం ఎన్నో మలుపులు తిరిగింది. ఆ మలుపుల్లో యీ ఆస్పత్రి

అనుభవం ఒకటి– ఒకటి మాత్రం నిజం, జ్ఞాపకాలు చాల బరువుగా వుంటాయి. నా స్నేహితుడొకరు రాశాడు,

'సృతి బరువుకు
మనసు ముద్దకట్టి పోతుంది
శరీరంలో కణాలు నిప్పులా
కణ కణ మంటాయి
కానీ
సృతిని మోయాల్సిందే
అది సంస్కృతి అని
మనల్ని మోసగించి
మనసును మురిపిస్తుంది'

నిజమే నీ స్నేహితుడెవరో గొప్ప ఫలాసఫర్'–

పావని ఎప్పుడూ సంభాషణ యింతగా చేయటం, ఆవేశాలన్నీ బయట పరచటం రాజారాం ఎరగడు– ఇప్పుడు నిజంగానే ఆమె బాధపడుతోంది– ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

'ప్రభావతి, పిల్లలు వచ్చి యిక్కడ కొన్నాళ్ళుంటారట'

సంతోషం, సరి అయిన సమయంలో వస్తున్నారు.

వాళ్ళు వస్తున్నారన్న వార్త పావనికి వూపిరి వూదినట్లయింది. తోటలోకి వెళ్ళి తిరగటం మొదలుపెట్టింది. ఆ పూవులు అన్నీ చాల శాంతంగా, సంతృప్తిగా తలలూపుతూ తనను పలకరిస్తున్నట్లు అనిపించింది. వాటి జ్ఞాపకాలు వుండవేమో– తనకు తను గడచిన వైద్యజీవితం తనలో ఒక తునకను తీసుకెళ్ళినట్లు అనిపించింది. ఆ వెలితి అప్పుడప్పుడు ఊయంకరమైన నిశ్శబ్దంగా మారి గుండెలు బ్రద్దలవుతయ్యేమో అనిపిస్తున్నది. ఈ బేలతనం తనకు సరి అయినది కాదు. తను ఎన్నో చిత్ర చిత్రమయిన బాధాకరమైన దృశ్యాలను తన పేషెంట్లద్వారా చూచింది, పాల్గొన్నది. అప్పుడు లేనిది యిప్పుడేమిటి ఈ బేలతనం. యింటి చుట్టూ తిరిగి వస్తుంటే అక్కడ వీరన్న

పాక కనిపించింది. వీరన్న తనే స్మృతిగా మిగిలిపోయాడు. స్మృతి కూడ మనిషిలో ఒక భాగంగా మరణించి తిరిగి రూపు దిద్దుకున్నట్లే, వరండాలోకి వచ్చేసింది.

4 రోజుల తరువాత ప్రభావతి, పిల్లలు ప్రణవ్, ప్రతిమ వచ్చారు. చాల ఆనందంగా వున్నది పావనికి, రాజారాంకి. పిల్లలిద్దరూ బాగా పొడుగెదిగారు. వాళ్ళ వ్యక్తిత్వం వాళ్ళకున్నట్లనిపిస్తున్నది. వాళ్ళు కూడా ఏదో ఒక అడ్వెంచర్ కోసం చూస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తున్నది. ఏదో కొత్త కొత్త అనుభవాలకోసం తహ తహలాడుతున్నట్లు, దేన్నిచూసినా 'యిదేమిటి' అని తెలుసుకోవాలన్న కుతూహలం శక్తివంతంగా వుంది. ఒకరోజు వుదయం వరండాలో కొలని గట్టున కూర్చున్నప్పుడు ప్రణవ్ అడిగాడు –

'తాతగారూ, రామాయణం, మహాభారతం యీ రెండూ కథలేనా, నిజంగా జరిగాయా–'ఇండియాలో వాటికింత ప్రచారానికి కారణం ఏమిటి ?

వాడి కుతూహలం చూసి రాజారాంకి చాల ముచ్చటేసింది–

'కథలో కాదో చెప్పటం కష్టం. చాలసార్లు ఒక చిన్న ఘటన, ఒక సంసారం కథ, జరిగినవి తీసుకుని ఎంతో ప్రతిభతో, వాటికి రంగులద్ది, ఒక కళాకృతిగా తీర్చి దిద్దటం ఒక సృజనకారుడి లక్షణం. కవి కూడ ఒక సృజనకారుడే– వ్యాస మహర్షి, వాల్మికి మహర్షి మంచి దార్శనికులు, కవితా ప్రతిభ పుష్కలంగా కలిగినవారు. ఏ సంఘటననయినా చాల అందంగా, ఆకట్టుకునేటట్లు చెప్పగల కవితాశిల్పం వారి స్వంతం–

'అంటే రామాయణం, భారతకథలు ఒరిజినల్‌గా చిన్నవేనంటారా?

'కావచ్చు– చరిత్రలో ఎందరో వీరులు, రాజ్యాలు వారి మధ్య యుద్ధాలు జరిగినయి. అవి నిజానికి అంత చెప్పుకోదగినది కాకపోయినా, ఒక గొప్ప కవి చేతిలో వాటికి ఎనలేని శోభ వస్తుంది. వారి మాటల్లో వినటానికి ఎంతో బాగుంటయి. ఈ నాటికీ అటువంటి కవులు చాలమంది వున్నారు. జ్ఞానపీఠ్ ఎవార్డు పొందినవారెందరో యీ కోవలోకి చెందినవారే– ఇక వ్యాస మహర్షి, వాల్మీకి మహర్షిలను గురించి చెప్పేదేముంది.

వారేది చెప్పినా, రాసినా నిజమనిపిస్తుంది– యిలాగే షేక్స్పియర్, కాళిదాసు అలాంటివారే– కాబట్టి యీ రెండు మహాగ్రంథాలు ఏదో ఒక ఆధారంతో వ్రాసినవని అనుకోటానికి ఏ యిబ్బందీ వుండదు. కాని వాళ్ళు రాసిన, యీనాడు మనకందిన లెవల్లో జరిగినయ్యో, లేదో చెప్పటం కష్టం. అసలు కథలో జరిగిన సంఘటనలో సరియైన వాటిని,తను చెప్పదలచిన సందేశానికి అనుగుణంగా ఏరుకుని కథగా అల్లడం మహాకవి లక్షణం. వాళు దార్శనికులు కూడాను. చెప్పేదాంట్లో, ప్రతి విషయంలో, ఘటనలో అది స్పష్టంగా,అందంగా తెలుస్తుంది. చదివేవాడికి తనే ఆ ఘటనల్లో భాగమనిపించే టంత రసాత్మకంగా వుంటుంది– అవి సామాన్యంగా ఒక సమాధి స్థితిలో, మనస్సు, బుద్ధి అన్నీ సమతుల్యంగా సమాధానంగా వున్నప్పుడే యిలాంటి రచనలు వస్తయి.

మహాభారతం జరిగి దాదాపు 6000 సంవత్సరాలైంది– కురుక్షేత్ర సంగ్రామం, మన ప్రపంచయుద్ధం 1,2,లాంటిది. కాని ఆ రోజుల్లో ప్రపంచమంటే ఎక్కువగా గంగా, సింధు, యమునా తీరాల్లో వున్న ప్రదేశాలల్లా కనిపిస్తయి. భారతంలో కనిపించని మానవావేశం అంటూ లేదు. ఎన్నో రకాల పాత్రలు, వివిధ రకాలయిన మనస్తత్వాలు, మొండితనం, పట్టుదల, అభిమానాలు, ఆదర్శాలు, ఎన్నో ప్రవచనాలు ఏది కోరితే అవి అందులో కనిపిస్తయి. గ్రంథకర్త వ్యాసమహర్షి కూడ అందులో ఒక పాత్ర– అందువల్ల భారతం ఆ రోజుల్లో జరుగుతున్న విపరీత, విద్వేష, వ్యామోహాలు, ధర్మం కోసం పాకులాటలు వీటన్నిటి విశ్లేషణగా భావించవచ్చు. నిజానికి ఆ రోజుల్లో జనాభా చాల తక్కువనే చెప్పాలి. రాజ్యాలు కూడ పెద్దవి కావు. కాని రాచరికం, రాజులు సంఘాన్ని నిలువరించే నిర్ధాయక శక్తులు. అలాగే గొప్ప వేదాంతులు. సృష్టిరహస్యాలను వెల్లడించటానికి కృషి చేసిన మహానుభావులు కూడ అలాగే సంఘంలో బహుళ ప్రచారంలో వున్న రోజులుగా కనిపిస్తుంది. కులవ్యవస్త కూడ చాల బలంగా వున్న రోజులుగా కనిపిస్తుంది. అధికారం క్షత్రియులది– వాళ్ళు ధార్మికులయిన బ్రాహ్మణుల సలహా తీసుకుంటున్నా వాళ్ళ ఆవేశాలే

రాజ్యాలమధ్య సంబంధాలను నిర్ణయిస్తుండేవి. నిజానికి యీ రోజుల్లో కూడ ఆ ఛాయలు కనిపిస్తయి. అందువల్లే మహాభారతం వీటన్నిటినీ ప్రతిబింబించే ఒక మహా కావ్యంగా యీనాటికీ ప్రచారంలో వున్నది. ప్రతి సంఘటనా మానవుల్లో, మానవ సమాజంలో జరిగే సంఘటనలనూ, అనుబంధాల తత్త్వాలనూ స్పష్టంగా ప్రతిఫలిస్తుంది.

మొదట్లే మహాభారతం గానరూపంలో నాటకబృందాలు గానం చేసేవట. లక్ష శ్లోకాలు వుండేవట. క్రమంగా అవి వ్రాతరూపంలోకి వచ్చి కుదింపబడింది– ఇది పరిశోధకులు చెప్పేమాట– వ్యాసమహర్షి యీ మదింపు చేశాడట. ఎంతవరకు నిజమన్నది చెప్పటం కష్టం. కాని ఒకవిషయం మాత్రం నిజంగా గొప్ప గ్రంథాలన్నిటి విషయంలోనూ యిది నిజం– ఈ నాడు మన సంఘంలో  భారతంలోని పాత్రలన్నీ కనిపిస్తయి. స్పష్టంగా విశదంగా కనిపిస్తయి.

'కృష్ణుడున్నాడంటారా? చాల కుతూహలంగా ఎంతో సీరియస్‌గా ప్రతిమ అడిగింది

'ఏం,  ఎందుకుండకూడదూ'

'ఆయన్ని దేవుడంటారు కదా ? ప్రవీణ్ అన్నాడు.

'అందులో ఆశ్చర్యపడటానికేముంది. ఆయన మహాత్ముల్లో మహాత్ముడు. ఒక మహాయోగి !

అయితే యుద్ధంలో ఎందుకంత సీరియస్‌గా పార్టిసిపేట్ చేశాడు ? ప్రవీణ్ చాల సీరియస్‌గా అడిగాడు.

'మనం ఒక సంఘంలో భాగమయినప్పుడు అందులో ఏదో ఒక విధంగా భాగం పంచుకుంటూ వుంటాం. సంఘంలో వున్నప్పుడు సంఘజీవిగా బ్రతకాలి. ఆయన నాయక లక్షణాలున్న మహామహుడు– సహజంగా ఆ సంఘంలో జరుగుతున్న ప్రముఖ సంఘటనల్లో పాలుపంచుకుని, ఆ సంఘటనలు మానవ సమాజాన్ని నాశనం చేయకుండా చూస్తాడు. స్టేడియంలో ఒక చోట కూర్చుని అందరూ తగవులాడుకుంటూ ఆ పోట్లాటను దూరం నుంచి చూసి ఆనందించే

కిరాతకం అటువంటి వారిలో వుండదు. వారూ అందులో పాలుపంచుకుని ఆ సంఘర్షణకు సమరసభావంతో సమాధానపరచటానికి ప్రయత్నించటం కృష్ణుడిలాంటి మహాత్ములకి సహజం–'

'ఆయన్ను దేవుడంటారు కదా' పిల్లలిద్దరూ ఒకేసారి అడిగారు.

'అందులో వున్న అభ్యంతరం ఏమిటి ?

ఆయన అన్నీ తెలిసినవాడు, సర్వజ్ఞుడు, సమభావంతో సృష్టినంతటినీ దర్శించగలవాడు. నిత్య సంతోషి. అందరికీ అన్నీ లభించి అందరూ ఆనందంగా వుండాలనుకుంటాడు. ఇవన్నీ భగవంతుడనబడేవాడి లక్షణాలే– మీరు ఎప్పుడూ వినే క్రీస్తు మహాశయుడూ, బుద్ధుడు. మహమ్మదు– వీళ్ళందరినీ ఒప్పుకోగలిగినప్పుడు, కృష్ణుణ్ణి సమ్మతించటంలో సందేహం దేనికి?

'మరి శ్రీకృష్ణుణ్ణి గురించి చెప్పే అద్భుతగాథల మాటేమిటి ?

(ఈ సంభాషణ అంతా యింగ్లీషులో జరిగింది.)

'దానికి రెండు విధాలుగా అర్థం చేసుకోవాలి. ఒకటి హిందూమతంలో గాని, మరేమతంలోనైనా గొప్ప వ్యక్తులకు కొన్ని అతీతశక్తులున్నాయని ప్రజలు నమ్ముతారు. గ్రుడ్డివాడికి దృష్టి యిచ్చాడట క్రీస్తు. అలాగే ఆయన చుట్టూ ఎన్నో అద్భుతాల కథలున్నాయి. ఏది ఎంతవరకు నిజమో చెప్పటం కష్టం. అలాగే కొందరికి దూరాన జరుగుతున్న దానిని చూడగల శక్తులుంటాయని అమెరికన్ యూనివర్శిటీ పరిశోధనలు చెపుతున్నాయి. మీలాంటి వారికి, పునర్జన్మ నమ్మేవారికి, అవతారాల మీద నమ్మకం వుంది– భగవద్గీతలో శ్రీ కృష్ణభగవానుడు చెపుతాడు తను అవసరమయినపుడు జన్మనెత్తి ప్రపంచంలో మంచిని, ధర్మాన్ని రక్షిస్తానని'–

'మరి మామూలు మనుష్యుల జీవితాల్లో కూడ యీ మిరకిల్స్ జరుగుతున్నాయని, అందుకే జనం దేవాలయాలకెళతారని చెపుతారు నిజమా ?

నీ అంతట నీవే నిర్ధారించుకో, కాశీవిశ్వేశ్వరాలయం, తిరుపతి వేంకటేశ్వరాలయం వెళ్ళి చూడు. అశేష జనవాహిని ఎందుకీ దేవాలయాలకు

వచ్చి, అవస్థలన్నీ భరించి వచ్చి ఎంతో పూరటపొందుతారు. నీవు వీటిని చూడవచ్చు. అందరూ మూర్ఖులని అనలేంగా– ఈ మతప్రవక్తలందరికీ మనుషుల మీద ఎందుకింత ప్రభావం ?

'మరి రామాయణం గురించి మీరేమంటారు ?

'అదొక మహాకావ్యం, ఒక మహాపురుషుడు భగవంతుడో, భగవత్సమానుడో నిజంగా అనుసరించి గౌరవించదగిన వ్యక్తి. ఆయన శ్రీకృష్ణుడు చూపించిన చమత్కాలేవీ చూపించలేదు. కానీ రామాయణం ప్రకారం ఆయన దర్శనభాగ్యం కోసం మహాఋషులు కూడ వేచివుండేవారు.

ఆయన నిజంగా వున్నాడా ?

'ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే కొన్ని మనమూ నమ్మాలి. కృష్ణుడి విషయంలో చెప్పినవి రాముడి విషయంలోనూ నిజమే !

'రామాయణగాథ ఎప్పుడు జరిగిందో'

'దీని జవాబు రకరకాలుగా చెబుతారు– ఇప్పుడు భూమి మీద 200 రామాయణాలున్నాయి. రామాయణం త్రేతాయుగంలో జరిగింది– ఈ యుగాల విషయంలో కూడ చాల అభిప్రాయాలున్నాయి. థియోసపిస్టులు, క్రియాయోగుల ప్రకారం, ఒక యుగం యొక్క మనుగడ 5000 సంవత్సరాలు, అలా చూస్తే, రామాయణం 10,000 సంవత్సరాలకు పూర్వం జరిగివుంటుంది. దానిని రచించిన వాల్మీకి ఆ కథనంతా తన మనోదర్పణం, దివ్యదృష్టితో చూసి రచించాడట. సామాన్యంగా ఏ కవి దేనిని రచించినా, సృష్టించిన కల్పన మనస్సులో జరిగితే దానిని పదాల్లో తిరిగి మారుస్తాడు.

'అయితే రాముడు వాల్మీకి సృష్టించిన పాత్ర అనుకోవాలా ?

'ఎందుకు అటువంటి ఒక మహాపురుషుడి జీవితగాథను కవి ఒక అద్భుత కావ్యంగా, తన మనోధర్మాన్ని జోడించి వ్రాసివుండవచ్చు కదా !

'ఇప్పటికీ రాముడంటే విపరీతమైన భక్తి వుందిగా ప్రజల్లో'

'అందువల్ల రాముని వునికిని శంకించకూడదు.'

'ఏమో, మీరు చెపుతూంటే నమ్మాలనిపిస్తుంది. కాని యిన్నివేల ఏళ్ళ

తర్వాత కూడ వారి మెమరీ యింత బలంగా వుండటం నమ్మలేని విషయం.

ప్రణవ్ సందేహం, ఆశ్చర్యం కలిసిన స్వరంతో అన్నాడు.

మనం మరో విషయాన్ని గుర్తుచేసుకోవాలి.

సంఘానికి ఒక చైతన్యం వుంటుంది. ఆ చైతన్యంలో చేరి ఎన్నో జ్ఞాపకాలు స్మృతులు, జీవితాలు, కలకాలం నిలిచి మనుషుల్ని ప్రభావితం చేస్తయి. రాజారాం చెపుతున్న యీ మాటల్నీ అక్కడున్న వారందరూ, పావని,ప్రభావతి, కుమారి, నవీన్ అందరూ ఏదో గొప్ప విజ్ఞానం తమ ముందువుంచబడినట్లు వింటున్నారు.

కొంచంసేపాగి రాజారాం అన్నాడు–

'ప్రతిమా, ప్రణవ్ మీరు యీ దేశం రావటం అనేదాన్ని అవకాశంగా తీసుకుని కొన్ని క్షేత్రాలను చూసిరండి.

ఇక్కడి ప్రజలు మూర్ఖంగా చాల విషయాలను నమ్ముతున్నారన్న భ్రమనుండి విడిపడతారు–

'ఎక్కడెక్కడికి వెళ్ళి రమ్మంటారు.'

'ఈ దేవ ప్రధాన సంస్కృతీ కేంద్రాలు ఎటునుంచి చూసినా, ఏ కోణం నుంచి పరిశీలించినా దేవాలయాలని అనిపిస్తుంది– ఈ దేశంలో ప్రతి మతానికీ ఒక సంస్కృతి కేంద్రమయివున్నది– శిల్పాలు, కథలు, సంగీత సాహిత్యాలు, నాగరికత, సంస్కృతి అనబడేవన్నీ యీ ఆలయాలు, వీటిలో ఆరాధించబడే దేవుళ్ళ, మహాపురుషుల చుట్టూ తిరుగుతూ వుంటుంది– ప్రముఖంగా తిరుపతి కాశీ, దక్షిణాదిన కొన్ని గొప్ప ఆలయాలు సందర్శిస్తే అర్థమవుతుంది.'

ఇలా కొంత సంభాషణ జరిగిన తరువాత ప్రవీణ్, ప్రతిమలు ఒక వారం పది రోజులు తంజావూరు, తిరుపతి, కాశీ తిరిగి రావాలని నిశ్చయమైంది–

'వీటికి మీరు కూడ మాతో రావాలి'

'తంజావూరు, తిరుపతికి మీ అమ్మతో వెళ్ళిరండి. కాశీకి నేనూ, పావనీ వస్తాం' రాజారాం చేసిన యీ సూచన అంగీకరించబడింది.

## 37

తంజావూరులో బృహదీశ్వరాలయం చూడగానే పిల్లలిద్దరూ ఆశ్చర్యానికి గురయ్యారు. ఇంతపెద్ద ఆలయమా– పిరమిడ్ సైజులో కట్టవలసిన అవసరమేమిటో, నిజానికి దేవాలయం కట్టవలసిన అవసరం ఏమిటి? – ప్రభావతి యీ ప్రశ్నకు జవాబిచ్చింది–

'నాకు తెలిసినంతవరకు దేవుడు అన్నిటావున్నా, ఒకచోట సంఘంలో అందరూ ఎల్లప్పుడూ ఒక రూపంలో దేవుణ్ణి గుర్తుచేసుకునేచోటు దేవాలయం– దేవాలయంలోనే దేవుడున్నాడా అని చాలమంది విచిత్రమైన ప్రశ్నవేస్తారు. కాని దేవాలయం ఒక నిర్ధిష్టమైన స్థలం– అక్కడికి ఎవరయినా వచ్చి, ఎప్పుడయినా వచ్చి స్మరించుకుని, ఆరాధించి, తమకు తోచిన విధంగా పూజ చేసి, వారికి యీ అపారసృష్టిని ప్రతిబింబించే దేవుణ్ణి కొలిచి, సేవించుకోవచ్చు. ఆ విధంగా వారికి సంఘానికి దేవాలయం ఒక ప్రముఖ ప్రదేశం. చాల గ్రామాల్లో దేవాలయం ఆ వూరిదైన సృహకు ఒక కేంద్రంగా ఆ వూరి గుండెకాయగా నిలవగల శక్తిగల ప్రదేశం– యీ నాటికి చాల వూళ్ళలో ప్రజలు దానిని ప్రముఖ సాంస్కృతీ కేంద్రంగా భావిస్తూవుంటారు.

రాజులు చాల దేవాలయాలు నిర్మించారు– అది ఒక అనవాయితీగా చాల సంవత్సరాలుగా, యీనాటికీ వస్తున్నది.

'అయితే, దానికి యింత పెద్ద ఆలయమెందుకు?' ప్రణవ్ అడిగాడు.

అది నిర్మించిన రాజు ఉద్దేశ్యాన్ని బట్టి వుంటుంది. చాల సమయాల్లో రాజులు తమ గొప్పదనాన్ని యీ విధంగా చాటుకునేవారు. ఈ రోజుల్లో మనం చూడటం లేదా– ఒకరిని మించి యింకొకరు ఎత్తయిన శిలా విగ్రహాలు పోటీపడి ప్రతిష్ఠ చేయటం చూస్తున్నాం కదా ! పదండి లోపలికి వెళదాం– అని ప్రభావతి అంటే –

నీవు వెళ్ళిరా– నేను యీ దేవాలయం రేఖాచిత్రాన్ని గీసుకుంటాను' అని ప్రతిమ తన డ్రాయింగ్ పరికరాలు బయటకు తీసింది.

ప్రణవ్ ఒక భావుకుడు. చాల విషయాలు తీసుకుని వాటికి

పద్యరూపమిచ్చాడు. అతడు యింగ్లీషులో మంచి స్పూర్తి కలవాడు. అతనికి బృహదీశ్వరాలయం చూడగానే ఆ ఆలయం తనతో మాట్లాడు తున్నట్లనిపించింది- అది ఒక స్వగతంలా వినిపించింది ప్రణవ్‌కి- అతనిలో ఆ ఆలయం తన స్మృతిని వివరిస్తోంది. అతనితో అంటోంది- (ఇదంతా యింగ్లీషులో కలిగి అది. దీనికి తెలుగు అనువాదం ప్రభావతి వ్రాసింది.)

బృహదీశ్వరుని
భవ్యాలయమిది అలాగా !
ఆలయం ఆశ్చర్యపడింది
ఆ పరమేశ్వరుడు వున్నదినాల్లో
అదేనా ఆ వృద్ధ బ్రాహ్మణుడంటున్నది
నేనంతటి దాననా
హర హర మహాదేవ
శంఖారావం పుంఖానుపుంఖాలుగా
నన్ను తాకుతోంది
మీ తాకిడికి నేను
ప్రిదిలి పోగైపోతానేమో !
పత్తిలా ఎగిరిపోతానేమో !
కాలేరు !
కాని నా రాతిదేహం పులకరిస్తోంది
పులకరించి పరవశిస్తోంది
పరవశించి ప్రకాశిస్తోంది !
అదే అంటున్నాడా బ్రాహ్మణుడు
'ఈ దేవాలయం ఎంత
తేజస్వంతంగా వుంది !
రాళ్ళు రంగులు తేలి
కాంతి విరజిమ్ముతున్నాయి

ఏమిటీ దైవమాయ !
దేవుడే కాంతిగా మారి
ఆలయంలో నుండి వెలికివస్తున్నాడేమో !
పాపం !
యీ బ్రాహ్మడికి ఏమీ తెలియదు
భక్తి తప్ప ఏమీ తెలియదు
నేను – ఆలయమనబడే నేను
స్వామి శరీరాన్ని
ఏదయినా నానుండే ప్రసరించాలి
నా శిఖరం సాగుతోంది
పైకి ఎదుగుతోందా
ఆకాశం పిలుస్తుంది కాబోలు
ఆకాశం వస్తోంది ముందుకు
నా శిఖరం నాసిగ
ఆ సిగలో ఆకాశం ముడుచుకుపోతోంది.
ఓం – ఓం
ప్రణవనాదం పైకి వస్తోంది
నా శిఖరం ఆకాశం
ప్రణవం అంతా ఒకటై
పరుచుకుంటున్నాయి
ప్రపంచం మీద
పరుచుకుంటున్నాయి
సంతోషం – సంతోషం
భక్తులెందరో నావైపే వస్తున్నారు
అందరూ నాలో యిమిడిపోతే
జ్ఞానం పులుముకుని

తిరిగి వెళతారు

లయగా వచ్చి లీలగా వెళిపోతారు

సృష్టి అంతా లీలేగా !

ప్రభావతి దైవదర్శనం చేసుకుని వచ్చి తట్టిలేపేదాకా ప్రణవ్ తనతోనే వున్నాడు. ప్రతిమ బొమ్మ గీస్తోంది – పిల్లల భావుకతకు ప్రభావతి ముగ్దురాలైంది.

ప్రణవ్ తన మూర్ఛనం నుంచి తేరుకుని అడిగాడు –

'అమ్మా యీ ఆలయం ఎప్పుడు కట్టారు' ?

వెయ్యేళ్ళ ఉత్సవం యీ మధ్యనే చేశారట.

రాజరాజచోళుడనే రాజు దీనిని నిర్మించాడట. నీవు చూసిన రాజభవనంలో కొన్ని భాగాలు ఆనాటివే అయ్యుంటాయి.

'అప్పుడీ సిటీ చాల యాక్టివ్‌గా వుండేదనుకుంటా'

'కావచ్చు, కాని ఆ రోజుల్లో జనాభా యింత వుండేది కాదు. అందువల్ల పట్టణాలు చిన్నగానే వుండేవి.'

ఇలా మాటాడుకుంటూ వుంటే ఆ రాత్రి గడిచిపోయింది.

ప్రతిమ తన రేఖాచిత్రంలో యీ భారీ దేవాలయంలో యింత చిన్న దేవుడు– ఇంత చిన్న దేవుడికి అంత భారీ దేవాలయం ఎందుకు కట్టారు. అమ్మనడిగితే చెప్పింది.

దేవుడు అణువులో అణువు, భారీ కంటే భారీ విశాలం కంటే విస్తారం. ఆ భావం చెప్పటానికే యింత పెద్ద దేవాలయం కట్టి వుండవచ్చు. భావాల్ని రేఖాచిత్రంలో ఎలా చూపించటం, తళుక్కుమని తట్టింది. దేవాలయం చిత్రం చుట్టూ వాటర్ మార్క్‌లా భారీ లింగాన్ని గీసింది–

## 38

మరునాడు తిరుపతికి బయలుదేరారు. తంజావూరులో కలిగిన అనుభవం తిరుపతిలో దిగేవరకూ వెంటాడుతూనే వుంది.

తిరుపతి స్టేషన్‌లో రైలు ఆగగానే ప్రభావతి, ప్రతిమ, ప్రణవ్ రైలు దిగారు. అంతా జనం, జనం. ఎటు తిరిగి చూసినా జనం, రైలు ఎక్కేవారు,

దిగేవారు – అక్కడ తంజావూరులో నిర్జనం. ఇక్కడ ఎక్కడ చూసినా జనం. ప్రతిమ. ప్రణవ్ యిద్దరూ అడిగారు.

'అమ్మా మనం తిరుపతికేనా వచ్చింది?'

అవును.

ఇంత జనం, యింత గోల'

'అందరూ ఆయన ఆ వెంకటేశ్వరుని కోసం వచ్చిన వారే– దర్శనం చేసుకోటానికి వచ్చినవారు కొందరు, దర్శనం కోసం వచ్చిన వారు కొందరు.

'అమెరికాలో వెంకటేశ్వరాలయాలు యిలా వుండవు'.

'అది అమెరికా,కొందరికే కావాలి స్వామి'

'అయితే టెంపుల్ ఎక్కడ వుంది–?

'ఏడు పర్వతాలు దాటి వెళ్ళాలి, అక్కడ వెంకటాద్రి మధ్యలో స్వామి దేవాలయం వుంది. అక్కడ ఆయన వేంచేసి వున్నారు. ప్రభావతి మాటలకు యిద్దరూ ఆశ్చర్యపోయినారు.

'ఇక్కడ స్వామి అందరికీ కావాలి. అక్కడ కొందరికే కావాలి. స్వామి యిక్కడి వారికి యిలవేల్పు' అంటే కుటుంబంలో ఒక మనిషి' ప్రభావతి సీరియస్‌గా చెప్పి కాఫీలు తెచ్చి యిచ్చింది.

కాఫీ త్రాగి పైకి బయలుదేరారు.

క్రిందనుంచి కొండవైపు చూస్తే కొండమీద రోడ్ల వంపులమీద కార్లు, బస్సులు, చీమల బారుల్లా వున్నాయి.

కారు కొండెక్కటం మొదలుపెడితే శబ్దంలోంచి నిశ్శబ్దం లోకి వెళ్ళినట్లుంది. ఒక పర్వతం దాటి మరో పర్వతం. లోయల నిండా గుబురు గుబురుగా దట్టమయిన అరణ్యాలు.

'ఈ చెట్లు మనవైపే చూస్తున్నట్లుంది' అన్నది ప్రతిమ.

'ఈ చెట్లన్నీ అనాదిగా వృక్షరూపం ధరించి తపస్సు చేసుకుంటున్న మహర్షులని యిక్కడివారి నమ్మకం. వీరి తపస్సే వేల సంవత్సరాలుగా యీ ఆలయానికి కలుగుతున్న ప్రఖ్యాతి, ఆకర్షణకు కారణమని ప్రముఖ ఆధ్యాత్మిక

వేత్తలు చెపుతారు. ప్రభావతి యిచ్చిన వివరం పిల్లలిద్దరినీ ఆశ్చర్యపరిచింది. వెంటనే వారి మనస్సులో వాతావరణ శాస్త్రం తలపుకొచ్చింది– కాబోలు అనుకున్నారు.

ప్రతిమకు ఒక సమస్య వచ్చింది. ఇలా శబ్దంలోనుంచి, నిశ్శబ్దంలోనికి, మళ్ళీ శబ్దంలోకి, యీ మునులనే అరణ్యాలు, యీ కొండలు, ఆ కొండల్లో దాగివున్న దేవుడు వీటన్నిటిని ఎలా గీతల్లో బంధించటం?

ప్రణవ్‌కి అనిపించింది. తన భావుకత యీ స్థితినంతా ఒక శరీరంతో పోల్చింది. పైన ఎక్కడో దాగివున్న దేవుడు హార్ట్ అయితే ప్రయాణీకులు సన్న రక్తనాళాల్లా వున్న కొండదారులు రక్తనాళాలు. అన్నీ ఆ వెంకటేశ్వరుడి గుండెల్లో ప్రవేశించి, ప్రక్షాళనమై కొత్త రక్తంలా ప్రపంచంలోకి తిరిగివస్తయి. కొన్ని రోజుల తర్వాత అంటే కొంతకాలం తరువాత ఆ ప్రపంచంలో తిరిగి చెడిపోయి ప్రక్షాళనకు మళ్ళీ దేవుణ్ణి చేరతాయి.

కారు పైకి వెళుతూ దేవాలయానికి దగ్గరవుతూంటే ఆత్మను వెతుక్కుంటూ దేహంలోకి వెళుతున్నట్లనిపించింది. దేవుడెక్కడున్నాడు– అతడి నిలయంలో, వెంకటాద్రి మీదవున్న ఆలయంలో, ఆ చిన్న ఆలయంలో వున్నాడు. నీ కోసమే వేచివున్నాడు.

నవ్వొచ్చింది ప్రణవ్‌కి, యీ భావప్రవాహానికి.

పైకి చేరుకోగానే ఏదో విస్ఫోటం జరిగి అంతా విశ్వరూపం దాల్చినట్లుంది.

గర్భగుడి చాల చిన్నది. ఆలయం కూడా చిన్నదే– కాని గర్భగుడి అంతా గంభీరమైన వెంకటేశ్వర విగ్రహమే, ఆభరణాలతో మెరుస్తోంది. శరీరమంతా మాలలే ! ఆ పుష్పమాలతో విగ్రహం పుష్పించి పరిమళాలు వెదజల్లుతున్నట్లుంది. అయిదు సెకన్లు మాత్రమే విగ్రహం ఎదుట నిల్చోనిచ్చారు. ఆ అయిదు సెకన్లలో అక్కడికి రావటానికి పడిన శ్రమనంతా పుష్పపరిమళం వూదేసినట్లయింది. తిరుచూర్ణం కప్పిన కళ్ళు భక్తుడి మెదడులోకి చూపు చాచినట్లుంది. ఆ కాసేపటి మైకం పదికాలాలపాటు పట్టుకునేటంతగావుంది.

ప్రభావతి,ప్రతిమ,ప్రణవ్ ముగ్గురూ వెనుతిరిగారు.

పాపాల ప్రక్షాళనకులు గుండె రక్తాన్ని శుభ్రపరిచింది. తిరిగి చెడిపోయే దాకా ఈ దర్శనానికి రానక్కరలేదు.

ప్రణవ్‌కి మళ్ళీ నవ్వొచ్చింది – ఏమిటా భావుకత–

ముగ్గురూ బయటికి వచ్చారు. ఇక అన్న ప్రసాదానికి వెళ్ళాలి. అక్కడా గుంపులే– జనం, జనం, జనం.

కనిపిస్తున్న జనం ఒక్కసారిగా ఆలయదర్శన ప్రభావాన్ని ముందుకు త్రోసింది.

అదొక విశ్వరూపం– ఆ దేవుడొక మహాజ్యోతి. ఆ జ్యోతి విరిసి మహా పుష్పమై రేకులు పరుచుకుంటూ ఆ పుష్పపత్రాలు యీ విశ్వరూపాన్ని అందలి ప్రజాసమూహాన్ని ఆవరించి ఆదరిస్తున్నట్లనిపించింది.

ఆ మహాజనం విరాట్ విశ్వరూపం

మానవ మహాజనరూపం

ఆ దేవుడు వారి ఆశల రూపం

ఆశలు పండిస్తాడన్న ఆశారూపం

అది ఒక తలల మైదానం–

ముగ్గురూ ఆ భావనకు దిగ్భ్రాంతులైనారు. అమెరికాలో ఎక్కడా వారికి యీ అపురూప దర్శనం జరగలేదు.

ప్రతిమలో ఒక ఆశ, ఒక అభ్యర్థన

ఒక విన్నపం, ఒక భావవిశ్వరూపం

భావం ప్రిదిని పొదుపుగా

అందరి తలలో యిరుక్కుంటోంది

కొందరు గుండెలు స్పందించి

నీళ్ళలోనీరుగాతెలుతోంది

అందరిలో విశ్వాసం నింపుతోంది

ఆ విశ్వరూపం పైన నిలిచిన వెలుగు

విశ్వరూపం మాట యిస్తోంది
నేను మీకు, నాలోవారైన మీకు
బాసటగా నిలుస్తా
కోలాహలం కన్నీళ్ళు
బాధలు తీరిన భావన
అంతా త్వమేవాహం

అన్న ప్రసాదం చోటికి ముగ్గురూ వెళ్ళారు. రోజుకి 50 వేలమంది భోజనం చేస్తారట– అంతా గ్రాండ్ స్కేల్.

ప్రతిమకు సమస్య– రేఖాచిత్రంలో యివన్నీ బయటికి తీసుకురావటం ఎలా? – రేఖాచిత్రం కాకుండా బహుశా యిది రంగుల చిత్రం కావాలి.

బృహదీశ్వరాలయంలో చిన్న లింగం ఒక విశాల విస్తార భారీ కట్టడం– ఒక్క చిన్నగుడి అయినా కొండల మీదినుండి తిరుపతిలోకి పరుచుకున్నట్లుంది!

## 39

హైదరాబాదు చేరేసరికి శివరాం కూడ వచ్చివున్నాడు. అక్క పావని,బావ రాజారాం చాల నీరసపడివున్నట్లు గమనించాడు. అక్కతో అన్నాడు.

'అక్క ఆస్పత్రిని డాక్టర్ల చేతిలోపెడితే వాళ్ళు బాగా చూసుకోగలరా? మనం దానిని ఒక మంచి కార్పొరేట్ ఆస్పత్రిగా మారిస్తే మనకూ అందరికీ బాగుండేదిగా–

అలాగే బావగారితో అన్నాడు. –

'బావా, యీతోట, దీనిచుట్టూవున్న పెద్ద స్థలంలో మనమొక మంచి బిల్డింగ్ కాంపెక్స్ కట్టవచ్చు. ఇలా లాండ్ వుపయోగం లేకుండా వుంచడం దేనికి ?

'అదే కానియ్యి – మేము వద్దన్నా నీవు వూరుకుంటావా– మా తరువాత అంతా నీ పెత్తనమేగా అంటూ నవీన్ కూడ అదే అంటున్నాడు. ఇప్పుడు తాను చేసే పూలవ్యాపారం, మన తోటలో పూలతోనే, కూరల వ్యాపారం మన తోటలో కూరలతోనే– దానికి కుమారి ఎంతో సహాయంగా వున్నది–

అన్నాడు రాజారాం.

ఇంతలో నవీన్, కుమారి వచ్చారు–

'మేం పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం– ఆ కోసంశీర్వదించండి' అన్నారు.

'మరి నాన్నగారు, అమ్మగారు ఒప్పుకున్నారా?

'వాళ్ళకంత యిష్టం లేదనుకోండి– ఎలాగో నా కోసం ఒప్పుకుంటారు. వాళ్ళూ పెద్దవాళ్ళవుతున్నారు.

నా హోటల్ వ్యాపారాన్ని పెద్దది చేయాలనుకుంటున్నాను. కుమారి తోడుగా వుంటుంది. శివరాం గారి సలహా తీసుకుంటాను.

ఒకనాటి నక్సలైట్– యీనాడు ఒక వ్యాపారవేత్త అని రాజారాం నవ్వాడు.

'నా సేవాభావంలో మార్పులేదు. సేవచేయటానికి అరణ్యాల్లో, తుపాకీ పట్టుకుతిరగనవసరం లేదు– అందరిలో వుంటూ, అందరికీ, మనకూ అనుగుణంగా వుండే వ్యాపారాలు చేసుకుంటూ నలుగురికీ వుపయోగంగా వుండవచ్చు– అన్నాడు నవీన్.

రాజారావు మనసులో మెదిలింది–

'ఎక్కడో పేదరికంలో పెరుగుతూ, అనుకోకుండా తమ అండలోకి వచ్చి, తమ అండగా అన్ని సేవలూచేస్తూ, తోటల పెంపకంలో మెళకువలు నేర్చుకుని పూల, కూరల వ్యాపారాలు నవీన్‌తో కలిసి పనిచేస్తున్నది. వ్యాపారాలు పెద్దవి చేసుకోవాలని నవీన్, కుమారి జంట చాల యాంబిషన్‌గా ఈ తోటనీ, స్థలాన్నీ, ఆస్పత్రినీ కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్ళాలనుకున్న శివరాంకి జత బాగానే కుదిరింది– కొత్తయుగం ప్రారంభమైంది– ఇక తనూ, పావనీ, పిల్లలకు ప్రామిస్ చేసినట్లు కాశీ వెళ్ళిరావచ్చు. జీవితం ఎలా మలుపు తిరుగుతుందో ఆ తరువాత' –

ప్రక్కనే అంతా వింటూ, ఏది పట్టని పావని కొలనులోకి చూస్తున్నది. ఆ కొలను చుట్టూవున్న అక్కడక్కడ పగుళ్ళు చూపుతున్నది. నీళ్ళు కారిపోతున్నయి. ఎందుకో దానిని మరమ్మత్తులు చేయించటం పడలేదు. కాని ఒకటి

జరుగుతున్నట్లు గమనించింది. ఆ కొలనులో నీళ్ళు క్రమంగా తగ్గుతున్నాయి. కొలనులో ఆకాశం చిన్నదవుతూ, కుచించుకుపోతున్నట్లనిపించింది. ఆమె పెదవుల మీద చిరునవ్వు తొలకరించింది–

బహుశా కాలం అన్నిటినీ కుదించగలదు– విస్తరించగలదు– రెండూ నిజమే–

ఒక్కసారిగా ఆమెకు మనస్సులో ఏదో తళుక్కుమంది– కుమారి తెచ్చిన కాఫీ అందుకుంటూ, ఆమె వంక పెద్దకళ్ళతో చూస్తూ కాఫీ గ్లాసు అందుకుంది–

ఆ రాత్రికే పావని, రాజారాం, ప్రతిమ, ప్రణవ్ కాశీ బయల్దేరి వెళ్ళారు.

## 40

నలుగురు కాశీ స్టేషన్‌లో దిగారు. పిల్లలిద్దరూ చాల ఆశ్చర్యపోయారు. తంజావూరులా ఏ హడావుడీ లేదు. తిరుపతిలో హడావుడి వున్నా చాల ఆర్గనైజ్‌డ్‌గా వుంది. తిరుపతిలా జనం విపరీతం.

కాశీలో జనం హడావుడి వున్నది. కాని అంతా గజిబిజిగా వున్నది. ఒక ప్రక్కన బళ్ళవాళ్ళు, మరొక వైపున పురోహితులూ (పండాలని అంటారట). కాశీ చాల ప్రసిద్ధక్షేత్రం, ప్రతి భారతీయుడూ, ప్రత్యేకించి ప్రతి హిందువూ కాశీని దర్శించి విశ్వేశ్వరాలయం చేరి విశ్వేశ్వరుణ్ణి దర్శించుకోవాలని చాల కోరుకుంటాడు.

ఒక పండాతో ఏర్పాటు చేసుకుని అక్కడి ఒక హోటల్ బస, తరువాత అతని ద్వారా దర్శనం. విశ్వేశ్వరాలయం చాల చిన్నది. గంగకు దగ్గరగా వున్నది– అంతా యిరుకు సందులగుండా చేరుకోవాలి. లోపలికి వెళితే లింగం కూడ చాల చిన్నది. పిల్లలిద్దరికీ అడుగడుగునా ఆశ్చర్యమే–

ఇంతకాలం యీ చిన్నగుడి యింత ప్రసిద్ధి చెందటానికి బలమయిన కారణం ఏమిటి?– ప్రణవ్‌లో వున్న భావుకత ఆశ్చర్యంగానే మిగిలిపోయింది. మొదటిరోజు సాయంకాలం వారు నలుగురూ గంగ ఒడ్డున నడుస్తుంటే ఒక చోట ఒక భవనం దగ్గర ఒకాయన చుట్టూ కొందరు చేరివున్నారు. ఆయన్ను

చూడగానే రాజారాం నమస్కారం చేసి

'రామదాసుగారూ, మీరుక్కడున్నారేమిటి?'

ఆయన చాల సంతోషంగా

'రాజారాంగారూ, పావనిగారూ, మీరు కాశీ ఎందుకు వచ్చారు? ఈ పిల్లలెవరు' చాల సంతోషంగా తన ప్రక్కనే చోటు చూపిస్తూ అడిగాడు.

'ముందు మీరు చెప్పండి. మీరు అమెరికాలో గదా వుంటున్నది– హేమ గారెక్కడ?'

'హేమ తన అద్భుతజీవితాన్ని ముగించుకుని వెళ్ళిపోయింది. ఒక గొప్ప శాస్త్రజ్ఞురాలు, దేనికయినా తన్ను తాను అంకితం చేసుకోగల మహామనిషి–తన పరిశోధనల ద్వారా యీ సమాజానికి ఎంతో సేవచేసింది– కాని ఎందుకో ఒక ప్రగాఢమయిన అసంతృప్తిని నా ద్వారా భరించాలని చూసింది. నాకు దాదాపు అంకితమయింది. దానిని డిప్రెషన్ అనటానికి వీల్లేదు– కాని ఏదో ఒక రూపుదిద్దుకోని తపన అంటే సరిగా వుంటుంది. కాలిఫోర్నియాలో మా యింటి ముందు యిద్దరం కూర్చుని వున్నాం. సముద్రంలో వెన్నెల రేఖలు రేఖలుగా ప్రసరిస్తూ తరళ తరళంగావుంది. ఆ వైపు చూస్తూ నా ఒడిలో పడుకుని సడెన్‌గా

'రామూ,అని తలవాల్చింది– అంతే ఆ తరువాత నేనక్కడ వుండలేక తనకు ప్రియమయిన యీ కాశీకి వచ్చి గంగ ఒడ్డున యీ యింట్లో వుంటున్నాను. నా మామూలు పరిశోధనలు చేసుకుంటూ, యీ కాశీ వాతావరణంలో యిమిడిపోయినట్లున్నాను. యిదీ నా కథ–మీరు చెప్పండి' అన్నాడు నవ్వుతూ–

మా విషయంలో అంతగా అంతర్లీనమయినదేదీ లేదు. పావని తన హాస్పిటల్ కొందరు డాక్టర్ల చేతికిచ్చి తన బదులు వారిని నడపమని తను తప్పుకున్నది. నేను హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఎప్పుడో తప్పుకున్నాను. తోటను సాకుతూ కాలం గడుపుతున్నాను. వీళ్ళు మా మేనకోడలు పిల్లలు. భారతదేశంలో కొన్ని ప్రాంతాలైనా చూద్దామని వచ్చారు. తంజావూరు, తిరుపతి

వెళ్ళివచ్చారు. ఇప్పుడు యీ ప్రసిద్ధ క్షేత్రాన్ని చూడాలన్న కుతూహలంతో వచ్చారు. వీళ్ళలో ప్రణవ్ కవి, ప్రతిమ చిత్రకారిణి. వీళ్ళ బుర్రలనిండా ప్రశ్నలు నిండివున్నాయి. మీరింకా అరవింద సాహిత్యాన్ని పరిశోధన చేస్తున్నారా ?

'అది తరగని వేదన– ఆ పరిశోధనకు ఒక అంతుండదు. ఆ మహా ఋషి, మదర్ యోగంలో అనుభవాలు, వారు వెల్లడించిన సాహిత్యం కొన్ని జన్మలు పరిశోధించినా చాలదు– అది నిరంతరం సాగుతూనే వుంటుంది. ఇంతకీ యీ పిల్లలిద్దర్నీ చూస్తే ముచ్చటేస్తున్నది– ఏం పిల్లలూ, యిదే మీకు మొదటి విజిటా?

'కాదు కాని యీసారి ఎందుకో యిదివరటికంటే ఎన్నో ప్రశ్నలు పుడుతున్నాయి.

'మీ బుద్ధి పరిణతి చెందుతోంది'

'యీ భారతదేశంలో ఎక్కడ చూసినా దేవాలయాలు, పండగలు, పూజలు, రకరకాలయిన గుళ్ళు, దేవతలు, సంప్రదాయాలు– విపరీతమయిన దారిద్ర్యం– అయినా వీళ్ళని వాళ్ళ నమ్మకం ముందుకు నడిపిస్తున్నట్లుంది. యీ చిత్రాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియటంలేదు.' అన్నాడు ప్రణవ్ సీరియస్‌గా–

కొంచం దూరంలో గంగాహారతి గీతం వినిపిస్తున్నది. ఆ హారతి కాంతులు గంగానది మీద పారుతూ పరుచుకుంటూ ప్రవహిస్తున్నది– పావని మెల్లగా ఘాటు మెట్లుదిగి గంగాహారతి దగ్గరగా చూడాలనుకున్నట్లుగా, దిగుతున్నది.

రామదాసు గారన్నారు.–

'నీవు చెప్పింది నిజం– ఈ దేశ సంస్కృతి ఒక మేఘాలు సతతం కురిసే జల్లు లాంటిది. అది మనుషుల మీద కురుస్తూ భూమిని తడుపుతున్నది. మనుషుల మనస్సులోకి తలలద్వారా దూరుతున్నదా అనిపిస్తుంది. ఎన్నో రకాలయిన సాంప్రదాయాలు, తరతరాలుగా మొలకలు దిగి యిక్కడి ప్రజలను ప్రభావితం చేస్తున్నది. అంత తేలికగా యీ స్థితిని ముడివిప్పటం కష్టం–అంతా నమ్మకం– ఈ బ్రతుక్కి, యీ సంఘానికి, ప్రపంచానికి అన్నిటిని అనుసంధానం

చేస్తూ యీ సంస్కృతి ప్రజలను నడిపిస్తున్నదేమో అనిపిస్తుంది.

ఒకటి మాత్రం నిజమని నాకనిపిస్తుంది.

ప్రపంచమంతా జీవితాన్ని నమ్మి దానిని సెలబ్రేట్ చేస్తుంది. ఏదో ఒకటి, ఎవరో ఒక ప్రవక్తను నమ్మి, తమ జీవితాలకు, తమకు అంతుపట్టని, తెలియని ఒక అలౌకిక శక్తితో అనుబంధం ఏర్పరుచుకు బ్రతకటం అలవాటు చేసుకున్నారు. ఎప్పుడూ అదే నిజమని తృప్తితో బ్రతుకుతున్నారు. కాని భారతదేశంలో అలాకాదు. దేవుడికి, అంటే యీ ప్రపంచ సృష్టికర్తకు పరిమితుల్లేవు. అతడు కాలంలో నిండివుంటాడు– ఎక్కడ పడితే అక్కడ అంతటా విస్తృత పరుచుకునివుంటాడు– అతడు అందరి మనిషి. కాని ఎవరికి చెందడు. ఈ ప్రపంచమంతా అతని కుటుంబం. ప్రకృతి అంతా అతడి పైమెరుగు. పురుషుడిగా అతడు సర్వవ్యాపి. ఈ భావం అందరికీ అర్థమయిందా అంటే చెప్పలేం– స్వార్థం, పదార్థం అంటూ మాటల్లో, మనస్సుల్లో ప్రతిదానిని ఆ మూల సూత్రంతో అనుసంధానం చేసుకుంటూ బ్రతుకుతారు. అందువలనే కావలసినంత అలజడి, సంఘంలో అలజడి, అయినా ఎవరి చోటు వారు చూసుకుని, సాంఘికాచారాలు, వ్యవస్థల మధ్య నిత్యసంఘర్షణలతో సమాధాన పడుతూ బ్రతుకుతారు. అంతా ఆయనే, ఆ దేవుడే–

ఇలా ఆయన చెపుతూంటే సడెన్‌గా నీళ్ళలోకి ఏదో పడ్డట్టు చప్పుడయింది.

ప్రణవ్, ప్రతిమ మెట్లక్రిందికి దిగి నీళ్ళలోకి ఒరుగుతున్న పావనిని పట్టుకున్నారు.

గంగాహారతి ముగిసినట్లు ఆ పాట ఆగిపోయింది. గంగానది మీద తరళరేఖలు ముగిసిపోయినయి. గంగా ప్రవాహం మీద ఎక్కడో ఆకాశంలో మినుకు మినుకు మంటున్న తారలు సరిగా ప్రతిఫలించటం లేదు.

రాజారాం చూపు ధ్వనివైపు తిరిగింది. చూపులో కాలం కుచించుకు పోయినట్లయింది.

******



S



P.N. Murthy